సాక్షి

సత్యమేవ జయతే

WWW.SAKSHI.COM

పేజీలు: 18+20 వెల: ₹ 5.00

సంపుటి: 10 సంచిక: 291

గురువారం 11-1-2018

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR| KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



‘రిలయన్స్ గ్యాస్ అందుబాటులోకి వస్తే మూడో పంటకు కూడా విద్యుత్ సరఫరా చేస్తాం. అప్పుడిక ప్రతి రైతు ఇంట రోజూ సంక్రాంతే’



సొసైటీలో ‘సోషల్’ క్రేజ్

ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న సోషల్ మీడియా వినియోగం - 5లో



షీ లీడర్

యూనిఫామ్‌కే వన్నెతెచ్చిన స్వాతి లక్రా ఐపీఎస్‌తో ఇంటర్వ్యూ... - ఫ్యామిలీలో

‘పెన్షన్’ ఇక నో టెన్షన్!



కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ రద్దుకు సీఎం మొగ్గు

ఉద్యోగులకు పాత పథకాన్నే వర్తింపజేయాలని యోచన	పదకొండో పీఆర్సీ ఏర్పాటుపై త్వరలోనే నిర్ణయం
ఆలస్యమైతే జూలై నుంచి ఉద్యోగులకు మధ్యంతర భృతి	25 నుంచి 30 శాతం ఐఆర్ ఇచ్చేందుకు కసరత్తు

రానున్న రాష్ట్ర బడ్జెట్‌లో ఉద్యోగులపై వరాల జల్లు

సాక్షి, హైదరాబాద్

ప్రభుత్వ ఉద్యోగులపై రాష్ట్ర ప్రభుత్వం మరోసారి వరాల జల్లు కురిపించనుంది. ఈ ఏడాదిలోనే మరో రెండు కీలక నిర్ణయాలు తీసుకునేందుకు కసరత్తు చేస్తోంది. పదకొండో వేతన సవరణ సంఘం ఏర్పాటుకు సన్నద్ధమవుతూనే మధ్యంతర భృతి ప్రకటించాలని యోచిస్తోంది. దీంతోపాటు కొత్త ఉద్యోగులకు సంబంధించిన కాంట్రిబ్యూటరీ పెన్షన్ పథకాన్ని(సీపీఎస్) రద్దు చేయాలని భావిస్తోంది. మరో రెండు నెలల్లో ప్రవేశపెట్టనున్న 2018–19 రాష్ట్ర వార్షిక బడ్జెట్‌లో ఈ అంశాలను పొందుపరిచే అవకాశాలున్నాయి.

గ్రాట్యుటీ వద్దు.. రద్దే ముద్దు

ఆర్థికంగా భారమైనప్పటికీ ఉద్యోగుల ప్రయోజనాల దృష్ట్యా సీపీఎస్ రద్దుకే సీఎం కేసీఆర్ మొగ్గుచూపుతున్నారు. సీపీఎస్‌ను రద్దు చేసి తమకు పాత పెన్షన్ విధానాన్ని వర్తింపజేయాలని ఉద్యోగులు, ఉపాధ్యాయులు కొంతకాలంగా ఆందోళన చేస్తున్నారు. 2004 సెప్టెంబర్ 1 తర్వాత ప్రభుత్వ ఉద్యోగంలో చేరిన వారందరికీ సీపీఎస్ వర్తిస్తోంది. రాష్ట్రంలో దాదాపు 1.20 లక్షల మంది ఉద్యోగులు దీని పరిధిలో ఉన్నారు. వీరిలో

మిగతా 5వ పేజీలో ▶



చెక్కుతోనే ‘పెట్టుబడి’

- నిర్ణయం వెలువరించిన మంత్రివర్గ ఉపసంఘం
- ఖరీఫ్ నుంచి ఎకరాకు రూ.4 వేల అందజేత

5 లో



ఆధార్‌కు భరోసా..!

- ఇక తాత్కాలిక ఆధార్ నంబర్
- సమాచార పరిరక్షణ, గోప్యతకు యూఐడీఏఐ నూతన విధానం
- ఆధార్ స్థానంలో 16 అంకెల వర్చువల్ నంబర్ ఇస్తే చాలు

11 లో

చర్లపల్లిలో రైల్వే టెర్మినల్

త్వరలోనే పనులు ప్రారంభం.. నాలుగేళ్లలో పూర్తి: దక్షిణ మధ్య రైల్వే జీఎం వెల్లడి

360 కోట్ల రూపాయలతో నగర శివార్లలో నిర్మాణం

6 ప్లాట్‌ఫామ్‌లతో ప్రారంభం

10 ప్లాట్‌ఫామ్‌లకు విస్తరణ



- రోజూ 150 రైళ్ల రాకపోకలకు వీలుగా నిర్మాణం
- వచ్చే బడ్జెట్‌కు ప్రతిపాదనలు స్వీకరించిన జీఎం
- పలు రైల్వే పనుల పురోగతిపై ఎంపీల అసంతృప్తి

సాక్షి, హైదరాబాద్

రైలు ప్రయాణికులకు మరింత ప్రయోజనకరంగా ఉండేందుకు, హైదరాబాద్‌లోని ప్రధాన రైల్వే స్టేషన్లపై ఒత్తిడి తగ్గించేందుకు శివార్లలోని చర్లపల్లిలో రైల్వే టెర్మినల్ ఏర్పాటుకు రంగం సిద్ధమవుతోంది. సుమారు 150 రైళ్ల రాకపోకలకు అనుగుణంగా ఆరు ప్లాట్‌ఫామ్‌లు, లైన్ల నిర్మాణంతోపాటు ఇతర సదుపాయాలు కల్పించనున్నారు. ఈ పనులను త్వరలోనే ప్రారంభిస్తామని, నాలుగేళ్లలోగా పూర్తి చేస్తామని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ (జీఎం) వినోద్‌కుమార్ యాదవ్ వెల్లడించారు. కేంద్ర బడ్జెట్ నేపథ్యంలో దక్షిణ మధ్య రైల్వే పరిధిలో ప్రతిపాదనలు స్వీకరించేందుకు రైల్వే అధికారులు బుధవారం హైదరాబాద్‌లోని రైల్ నిలయంలో ఎంపీలతో సమావేశం ఏర్పాటు చేశారు. పలువురు ఎంపీలు తమ ప్రతిపాదనలను రైల్వే జీఎం


మిగతా 2వ పేజీలో ▶

ఎఫ్‌డీఐ.. రయ్ రయ్



సింగిల్ బ్రాండ్ రిటైల్‌లో ఆటోమేటిక్ పద్ధతిలో 100% ఓకే

- విదేశీ పెట్టుబడులను మరింతగా ఆకర్షించే దిశగా బడ్జెట్‌కి ముందుగానే కేంద్రం మరిన్ని సంస్కరణలకు తెరతీసింది. ఎఫ్‌డీఐల విధానంలో కీలక సవరణలు చేసింది. సింగిల్ బ్రాండ్ రిటైల్, నిర్మాణ రంగం, విద్యుత్ ఎక్స్ఛేంజీల్లో ఎఫ్‌డీఐ నిబంధనలను సడలించింది. అలాగే రుణ సంక్షోభంలో కూరుకున్న ప్రభుత్వ రంగ విమానయాన దిగ్గజం ఎయిరిండియాలో 49 శాతం దాకా విదేశీ ఎయిర్‌లైన్స్ ఇన్వెస్ట్ చేసేందుకు అనుమతించింది. ప్రధాని మోదీ సారథ్యంలో సమావేశమైన కేంద్ర కేబినెట్ ఈ మేరకు నిర్ణయాలు తీసుకుంది. - 14లో



కాళేశ్వరం ఓ అద్భుతం

- ఇంత వేగమైన పనులు ఎక్కడా చూడలేదు.. కేంద్ర జల సంఘం బృందం కితాబు
- జూన్ నాటికి తొలి ఫలాలు అందుతాయని ఆశిస్తున్నాం

6 లో

ప్రాణంతీసిన ప్రేమోన్మాదం

ఉన్మాది ఘాతుకానికి మరో యువతి బలి

- మృతురాలు, నిందితుడు ఒకేచోట పనిచేస్తున్న వారే
- ప్రేమ పేరిట వేధింపులు, మందలించినా మారని తీరు
- బాధితురాలిని మరో బ్రాంచ్‌కు మార్చినా వేధింపులు
- ఇంట్లోనే గొంతు నులిమి.. కత్తితో పొడిచిన నిందితుడు



జానకి (ఫైల్)

హైదరాబాద్

ప్రేమోన్మాదం మరో యువతి ప్రాణాలు బలి తీసుకుంది. సంక్రాంతి పండుగ కోసం సొంతూరు వెళ్లేందుకు సెలవు పెట్టిన ఆమె.. కుటుంబ సభ్యులతో ఆనందంగా గడిపేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకుంది.. ఊరెళ్లేందుకు టికెట్లు తీసుకుని.. షాపింగ్ కూడా పూర్తి చేసింది.. ఎన్నో ఆశలతో ఇంటికి చేరుకున్న ఆమెను ఓ ప్రేమోన్మాది అత్యంత పాశవికంగా

మిగతా 2వ పేజీలో ▶



నిందితుడు అనంతప్ప



ఇస్రో చైర్మన్‌గా శివన్

- కేంద్ర కేబినెట్ నియామకాల కమిటీ నిర్ణయం
- 19న బాధ్యతల స్వీకరణ
- 18తో ముగియనున్న కిరణ్‌కుమార్ పదవీకాలం

11 లో

NECC NATIONAL EGG CO-ORDINATION COMMITTEE

Vencobb CHICKEN

Recommended Today's Eggs & Broiler Chicken Hyderabad Zone Rates

Eggs Retail Rate				
₹ 53 per dozen	Ex Farm Live Bird	88 kg	Dressed with Skin	160 kg
	Retail Live Bird	110 kg	Skin Less	182 kg

Conditions Apply

Issued in the interest of consumers





1984 అల్లర్లపై మరో సిట్

- మూసేసిన 186 కేసుల దర్యాప్తు పర్యవేక్షణ
- హైకోర్టు మాజీ న్యాయమూర్తి నేతృత్వం
- సుప్రీంకోర్టు ఆదేశాలు

11 లో



సివిల్స్ మెయిన్స్ ఫలితాలు విడుదల

- సివిల్ సర్వీస్–2017 మెయిన్స్ పరీక్ష ఫలితాలను బుధవారం విడుదల చేసినట్లు యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) తెలిపింది.

- వివరాలు 11లో

ఎంబీసీలోకి 86 కులాలు!

ప్రాథమిక నివేదిక రూపొందించిన బీసీ సంక్షేమ శాఖ

- ఒకట్రెండు రోజుల్లో ప్రభుత్వానికి నివేదిక
- సీఎం ఆమోదం తర్వాత ఉత్తర్వులు
- ఎంబీసీల కోసం ప్రత్యేక కార్యక్రమాలు
- ఉద్యోగ నియామకాల్లో బీసీల్లోనే కొనసాగింపు

2 లో





The offer is valid for sale until 31 January 2018 for outbound travel any time before 31 December 2018. Prices mentioned are sample prices and may vary due to currency fluctuations. For full terms and conditions visit ba.com

ఇంటర్ కాలేజీలకు 13 నుంచి సంక్రాంతి సెలవులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ఇంటర్ కాలేజీలకు ఈ నెల 13 నుంచి 15 వరకు ప్రభుత్వం సంక్రాంతి సెలవులు ప్రకటించింది. కాలేజీలను 16న పునఃప్రారంభించాలని సూచించింది. ఈ మేరకు కాలేజీ ప్రిన్సిపాళ్లు, యాజమాన్యాలకు ఇంటర్ బోర్డు కార్యదర్శి ఎ.అశోక్‌కుమార్ బుధవారం ఆదేశాలు జారీ చేశారు.

ఆదిలాబాద్‌లో 7 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో చలి తీవ్రత కొనసాగుతోంది. పలుచోట్ల సాధారణం కంటే 5 డిగ్రీల వరకు తక్కువగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. గడిచిన 24 గంటల్లో ఆదిలాబాద్‌లో 7 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. అలాగే భద్రాచలంలో 5 డిగ్రీలు తక్కువగా, మెదక్‌లో 2 డిగ్రీలు తక్కువగా 12 డిగ్రీల చొప్పున రాత్రి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఖమ్మం, రామగుండంలలో 13, హకీంపేట, హన్మకొండ, హైదరాబాద్‌లలో 15 డిగ్రీలు, నిజామాబాద్‌లో 16, మహబూబ్‌నగర్, నల్లగొండల్లో 17 డిగ్రీల చొప్పున రాత్రి ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి.

హార్వర్డ్ సదస్సుకు యార్లగడ్డ



సాక్షి, న్యూఢిల్లీ: అమెరికాలోని బోస్టన్ నగరంలో ఫిబ్రవరి 10, 11 తేదీల్లో జరిగే హార్వర్డ్ యూనివర్సిటీ ఇండియా సదస్సులో కేంద్రీయ హిందీ సమితి సభ్యుడు డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ పాల్గొననున్నారు. 'సమకాలీన భారతదేశంలో సాహిత్యం; భాష, గుర్తింపు, అవగాహన'అనే అంశంపై ఆయన ప్రసంగిస్తారు. హార్వర్డ్ బిజినెస్ స్కూల్, కెనెడీ స్కూల్, డిజైన్ స్కూల్, స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ సంస్థల విద్యార్థులు సంయుక్తంగా ఈ సదస్సును నిర్వహిస్తున్నారు.

నేడు హజ్ యాత్రికుల ఎంపిక

సాక్షి, హైదరాబాద్: హజ్ యాత్రికుల 2018 ఎంపికకు సంబంధించిన కంప్యూటరైజ్డ్ డ్రా పద్ధతిని ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ గురువారం నాంపల్లి హజ్ హౌస్‌లో ప్రారంభించనున్నట్లు హజ్ కమిటీ ప్రత్యేకాధికారి ఎస్‌ఏ షుకూర్ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా యాత్రకు 17,146 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. 70 ఏళ్లకు పైబడిన కేటగిరీలో దరఖాస్తు చేసుకున్న 508 మందిని నిబంధనల ప్రకారం డ్రా లేకుండా నేరుగా ఎంపిక చేశామని తెలిపారు. ఈ ఏడాది సౌదీ ప్రభుత్వం దేశ హజ్ కోటాలో 5 వేలు పెంచడంతో రాష్ట్ర కోటాలో 300 వరకు పెరిగే అవకాశం ఉందన్నారు. వరుసగా మూడేళ్లు యాత్రకు దరఖాస్తు చేసుకున్నా డ్రాలో ఎంపిక కానివారిని నాలుగోసారి నేరుగా ఎంపిక చేసే కేటగిరీని కేంద్ర హజ్ కమిటీ రద్దు చేసిందని తెలిపారు. దీంతో ఈ ఏడాది ఎక్కువ మందికి డ్రా ద్వారా యాత్రకు వెళ్లే అవకాశం దక్కనుందని పేర్కొన్నారు.

తెలంగాణ ప్రభుత్వం
సూపరింటెండింగ్ ఇంజినీర్ (R&B)
హెడ్ క్వార్టర్స్ సర్కిల్, హైదరాబాద్, ఖైరతాబాద్, హైదరాబాద్-500004
సవరణ
సవరణ నం. 1 తేది: 06-01-2018
NIT No. 35/T4/TS/SEHQC/HC/Staff Canteen/2017-18, తేది: 05-01-2018 కి పాక్షిక మార్పు చేస్తూ దిగువ తెలిపిన సవరణ జారీ చేయబడింది: వివరణ: 1) టెండర్ల స్వీకరణకు చివరి తేది మరియు సమయం: ఇప్పుడు చదువుకోవాల్సినది: 11-01-2018న మ. 12.30 గం. వరకు, 2) టెండర్లు తెరుచు తేది: ఇప్పుడు చదువుకోవాల్సినది: 11-01-2018న మ. 1.00 గం.కు ఇతర నిబంధనలలో ఎట్టి మార్పు లేదు. తదుపరి వివరాలను 08-01-2018న ఉ. 11.00 గం. నుండి https://tender.telangana.gov.in/ లో చూడవచ్చును.
సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్ (R&B) హెడ్ క్వార్టర్స్ సర్కిల్, హైదరాబాద్
DIPR RO.No. 2659/CL/Advt/1/1/2017-18, Dt: 10-01-18

తెలంగాణ ప్రభుత్వం
నిజామ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, హైదరాబాద్
ప్రకటన
ఫైల్ నం. Rc. No. SRC/AC-4/393/2016
నిజామ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (NIMS)కు మైక్రోబయాలజీ డిపార్ట్‌మెంట్‌లోని రిసెర్చ్ ప్రాజెక్ట్ కోసం సీనియర్ రిసెర్చ్ ఫెలో కావలెను. అభ్యర్థులు వివరాలను NIMS వెబ్‌సైట్: www.nims.edu.inలో చూడవలసిందిగా కోరబడుచున్నారు.
సం/- డైరెక్టర్, NIMS
DIPR RO. No. 2643/CL/ADVT/1/1/2017-18, Dt: 10-01-2018

హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ
సూపరింటెండింగ్ ఇంజినీర్-I కార్యాలయం
బ్లాక్ 'C', డిస్ట్రిక్ట్ కమర్షియల్ కాంప్లెక్స్, తార్నాక, హైదరాబాద్-500 007
టెలి-ఫ్యాక్స్: 040 27014060
ఇ-ప్రొక్యూర్‌మెంట్ సంక్షిప్త టెండరు ప్రకటన
NIT No. : HMDA/DEV/SE/05/2017-18(2వ పిలుపు) తేది: 09.01.2018
"లంగర్ హౌస్ లేక్‌లో మరియు చుట్టుప్రక్కల కాబుల్ స్టోన్ ఏర్పాటు చేయుట మరియు ప్రహరీగోడ మరియు కెర్బ్ నిర్మాణం" కోసం చెల్లుబాటగు నమోదిత కాంట్రాక్టర్ల నుంచి e-ప్రొక్యూర్‌మెంట్ పై టెండర్లు కోరబడుచున్నవి. బిడ్ దాఖలుకు ఆఖరు తేది: 24.01.2018న మ. 3.30 గంటల వరకు. తదుపరి వివరాలకు దర్శించండి www.eprocurement.gov.in
సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్-I, HMDA
DIPR RO No. 526PP/CL/Advt/1/1/2017-18, Dt: 10-01-18

తెలంగాణ ప్రభుత్వం
రహదార్లు మరియు భవనముల శాఖ, మహబూబ్‌నగర్
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
NIT No. 17/SE/TS/R&B/MBNR/2017-18 తేది: 02-01-2018
R&B సర్కిల్, మహబూబ్‌నగర్‌లో 2 BHK గ్రామీణ గృహాల నిర్మాణం చేపట్టడానికి దిగువ సంతకందారుచే టెండర్లు కోరబడుచున్నవి. 12 పనులకు మొత్తం అంచనా వ్యయం: రూ. 1512.00 లక్షలు. టెండర్ల స్వీకరణకు ఆఖరు తేది మరియు సమయం: 17-01-2018. ఫోన్ నం. 08542-222407. తదుపరి వివరాల కోసం దర్శించండి www.tender.telangana.gov.in
సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్ (R&B) సర్కిల్, మహబూబ్‌నగర్
DIPR Ro. No. 2647/CL/ADVT/1/1/2017-18, Dt: 10-01-2018

తెలంగాణ ప్రభుత్వం
అటవీ శాఖ
ఫారెస్ట్ డివిజినల్ ఆఫీసర్ కార్యాలయం, ఆమన్‌గల్, రంగారెడ్డి జిల్లా
e-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
Rc.No.1465/S4/2017 తేది: 08-01-2018
రంగారెడ్డి జిల్లాలో 2017-18 సంవత్సరంలో ఆమన్‌గల్ డివిజన్, ఇబ్రహీంపట్నం రేంజ్‌లోని గుర్రంగూడ RF-బ్లాక్ వద్ద 1.00 కి.మీ. రక్షణ గోడ నిర్మాణం. టెండరుదార్లు టెండరు డాక్యుమెంట్లను ఇ-మార్కెట్ ప్లేస్ (www.eprocurement.gov.in) నుండి చూడవచ్చును/డౌన్‌లోడ్ చేసుకోవచ్చును. బిడ్ దాఖలు ప్రారంభ తేది, సమయం : 09-01-2018న ఉ.10.30 గం. మరియు బిడ్ దాఖలు ముగింపు తేది & సమయం: 18.01.2018న మ.3.00 గం. మరియు అవి అదే రోజున మ. 3.30 గం.కు సర్కిల్ లెవల్ కమిటీచే లేదా అతనిచే అధికారం ఇవ్వబడిన ఏ ఇతర అధికారిచే అయినా తెరువబడును.
సం/- ఫారెస్ట్ డివిజినల్ ఆఫీసర్, ఆమన్‌గల్, రంగారెడ్డి జిల్లా
DIPR RO No. 2655/CL/Advt/1/1/2017-18, Dt: 10-01-18

TELANGANA STATE TECHNOLOGY SERVICES LIMITED
Tender call notice for "Procurement of Desktops and Laser Printers for Commerical Taxes Department, GoTS, Hyderabad"
Time schedule of various tender related events:

Bid calling date	11-01-2018
Last date/time for submission of Pre bid queries	17-01-2018 at 05:00 PM
Pre-bid Conference (Date, Time & Place)	18-01-2018 at 12:30 PM at TSTS
Bid Closing date and time	24-01-2018, 3:00 PM
Bid Document Fee	Rs. 10,000/-
TSTS Contact person	Manager (IIP & NW)
Email	rajakr-tsts@telangana.gov.in / srinivasarao.t@gov.in / mngdirector-tsts@telangana.gov.in
Reference No.	TSTS/IIP/060/CT-IT-PCPR/2017

For further details regarding detailed Tender Notification and specifications please visit http://www.tsts.telangana.gov.in/www.tender.telangana.gov.in contact Phone Nos.: (40) 23224289, 23223865, Fax : 23227458. Sd/- Managing Director, TSTS Ltd.

JAWAHAR NAVODAYA VIDYALAYA
HCU CAMPUS, GACHIBOWLI, NEAR GOPANPALLY VILLAGE, RANGA REDDY DISTRICT, HYDERABAD - 500107 (T.S)
Phone No: 040-29700559/29700558
Email: jnvrangareddy@gmail.com
F.No: 3-22/JNVRR/2017-18/340 Date: 10-01-2018
TENDER NOTICE
Sealed tenders are invited from reputed firms for the supply of Music Equipments ie, Rythm Pad, Key Board, Jazz Drum, Chinese Black, Mike Sets, Amplifer, Mess Equipments ie, Pulvarizer, Potato Pealer, Emergency lights, Vegetable cutting machine, Steam cookers, Automatic Chapati Making Machine,Other Equipments ie., Grass Cutting Machine, Submergible Pumps, Computers, 25 KVA Kirlosker Generator Set, Incinerators, Heavy Duty Xerox Machine, Ceiling Fans, LCD, Geyser, Iron Buckets, Hooters, Furniture items ie., Rennovation of office.
Tender Schedules can be obtained from the vidyalaya on any working day from 11-01-2018 to 30-01-2018 from 10.00 AM to 4.00 PM by payment of Rs, 500/- per item in Cash/Demand Draft. Sealed tenders will be accepted up to 31-01-2018 up to 1.00 PM in the Jawahar Navodaya Vidyalaya, Ranga Reddy District and **the same will be opened on 31-01-2018 at 3.00 PM at the O/o. the Principal, JNV Ranga Reddy District,** Near Gopanpally Village, Serilingampally Mandal, Telangana State in presence of the Purchase Advisory Committee Members & the tenders present in the meeting.
Sd/- (D.Rajeswara Rao)
Principal

కౌలు రైతుల కష్టాలు కనిపించవా?

58వ రోజు



10-01-2018, బుధవారం
గుండుపల్లి,
చిత్తూరు జిల్లా.

ఉదయం నడక ప్రారంభించే సమయానికి వాతావరణం చాలా చల్లగా అనిపించింది. అల్పపీడన ప్రభావం ఈ రోజు కూడా కొనసాగినట్లుంది. జెట్టివానిఒడ్డు సమీపంలో మోపిరెడ్డిపల్లెకు చెందిన కొందరు రైతులు వినతిపత్రంతో నా వద్దకు వచ్చి 'అన్నా.. మా పొలాల్లో బోరు వేసుకున్నాం. నీళ్లు పడ్డాయి. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసి, డబ్బులు కూడా చెల్లించి మూడేళ్లు దాటింది. ఇప్పటి వరకూ కరెంటు రాలేదు. పొలాలను బీడు పెట్టుకుంటున్నాం' అన్నారు. 'కరెంటు కనెక్షన్ల కోసం అధికారుల చుట్టూ చాలాసార్లు తిరిగాం. కలెక్టర్‌కు అర్జీలు ఇచ్చాం. మంత్రి గారికి కూడా మొరపెట్టుకున్నాం. వచ్చే నెల, ఇంకో నెల అంటూ తిప్పుకొంటున్నారు.. ఫలితం మాత్రం లేదు' అని వాపోయారు. ఈ పాదయాత్రలో ఇదే విషయాన్ని దాదాపు 40 నుంచి 50 మంది రైతులు నా వద్ద ప్రస్తావించారు. ఏమిటీ రైతుల దయనీయ పరిస్థితి? విత్తనాలు, ఎరువులు, నీళ్లు, రుణాలు, గిట్టుబాటు ధర.. అన్నీ సమస్యలే. ఈ ఇబ్బందులన్నీ తట్టుకుని ఏదో విధంగా కష్టపడి సేద్యం చేసుకుందామనుకుంటే.. కరెంటు కనెక్షన్లు ఇవ్వడంలేదట. ఏ ప్రభుత్వమైనా వ్యవసాయానికి పెద్దపీట వేయాలి. రైతుల వ్యవసాయ కనెక్షన్లకు ప్రాధాన్యత ఇవ్వాలి. విద్యుత్ కనెక్షన్ల మంజూరులో తాగునీటి వసతులు లేని, వర్షాధార ప్రాంతాలకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలి. కనెక్షన్ల కోసం డబ్బులు కట్టించుకుని, ఏళ్ల తరబడి మంజూరు చేయకపోవడం ఏమిటి? లక్షల్లో విద్యుత్ కనెక్షన్ల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయంటే ఈ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని ఏం చేయాలనుకుంటోంది? ఉచిత విద్యుత్ పథకం ఏమైంది? ఉచిత విద్యుత్ పథకాన్ని కూడా మిగతా పథకాల్లాగా నిర్వీర్యం చేయాలనుకుంటోందా?

సాయంత్రం శిబిరానికి చేరేముందు ఓ కౌలు రైతు నన్ను తన బెల్లం బట్టీ వద్దకు తీసుకెళ్లాడు. ఆయన పేరు ఆర్ముగం. ఆయన ఒక ఎకరం పొలం కౌలుకు తీసుకుని, రూ.50 వేలు అప్పుచేసి చెరకు వేశాడట. విత్తనం వేసిన మొదట్లో వర్షాల్లేక, ఆ తర్వాత పంటకు తెగులు సోకి.. ఈ సంవత్సరం దిగుబడి బాగా తగ్గిపోయిందట. నిరుడు ఎనిమిది బండ్లు దాకా అయిన దిగుబడి ఈసారి ఐదు బండ్ల కన్నా మించకపోవచ్చట. బెల్లం మీద ఆంక్షల వల్ల రేటు కూడా తగ్గిపోయిందట. లక్ష రూపాయలు కూడా ఆదాయం రాకపోవచ్చట. అందులో దాదాపు రూ.50 వేలు కౌలు చెల్లిస్తే.. ఇక అప్పు ఎలా తీర్చాలి? తామెలా బతకాలంటూ ఆవేదన వ్యక్తంచేశాడు. 'కష్టపడి వండిన బెల్లాన్ని అమ్ముకోడానికి లేకుండా ఆంక్షలు విధించడంతో, కొనేవాడు ముందుకు రాకపోవడంతో, వచ్చిన కాడికి తెగనమ్మి తీవ్రంగా నష్టపోయాను' అన్నాడు. 'ఈ కష్టాలన్నీ తెలిసి కూడా చెరకు ఎందుకు వేశావన్నా..' అని అడిగాను. 'ఏం చేయాలన్నా.. నేను కౌలు రైతునని ఏ బ్యాంకూ నాకు రుణం ఇవ్వలేదు. ప్రయివేటు వ్యక్తుల వద్ద ప్రయత్నం చేస్తే.. ఒక్క బెల్లం వ్యాపారి తప్ప వేరే ఎవ్వరూ అప్పు ఇవ్వడానికి ముందుకు రావడం లేదు. విధిలేని పరిస్థితుల్లో చెరకు పంట వేసుకోవాల్సి వచ్చింది' అన్నాడు. ఇది ఎంత అన్యాయం? ఈ రాష్ట్రంలో కొన్ని లక్షల మంది కౌలు రైతులు ఇదే రకంగా బ్యాంకు అప్పులు అందక, ప్రయివేటు వడ్డీ వ్యాపారుల వద్ద అప్పు చేసి, భూమి కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తే.. పండిన పంటకు గిట్టుబాటు ధరలేక అప్పుల పాలై.. అటు కౌలు కట్టలేక, ఇటు అప్పు తీర్చలేక నలిగిపోతున్నారు. కౌలు రైతుకు బ్యాంకు రుణం ఇప్పించాల్సిన బాధ్యత ఈ ప్రభుత్వానికి లేదా?

చివరిగా, ముఖ్యమంత్రి గారికి నాదో ప్రశ్న.. ప్రభుత్వ లెక్కల ప్రకారమే రాష్ట్రంలో కొన్ని లక్షల మంది కౌలు రైతులున్నారు. వారిలో కనీసం పదిశాతం మందికైనా బ్యాంకు రుణం ఇప్పించగలిగారా? అసలు కౌలు రైతుల సమస్యలు మీకు తెలుసా? తెలిసినా తెలియనట్టు నిద్ర నటిస్తున్నారా?

వై.యస్. జగన్.



గుండుపల్లి వద్ద బెల్లం వండుతూ చెరకు రైతుల సమస్యలు వింటున్న వైఎస్ జగన్

ఎంబీసీల్లోకి 86 కులాలు!

ప్రాథమిక నివేదిక రూపొందించిన బీసీ సంక్షేమ శాఖ

- ఒకట్రెండు రోజుల్లో ప్రభుత్వానికి నివేదిక
- సీఎం ఆమోదం తర్వాత ఉత్తర్వులు
- ఎంబీసీల కోసం ప్రత్యేక కార్యక్రమాలు
- ఉద్యోగ నియామకాల్లో బీసీల్లోనే కొనసాగింపు

సాక్షి, హైదరాబాద్: అత్యంత వెనుకబడిన కులాల(ఎంబీసీ) జాబితా త్వరలో ఖరారు కానుంది. ఈ మేరకు బీసీ సంక్షేమ శాఖ కసరత్తు చేస్తోంది. విద్య, సామాజిక, ఆర్థిక స్థితి తదితర అంశాల వారీగా కుల విభజన చేపడుతోంది. అధికారిక గణాంకాల ప్రకారం రాష్ట్రంలో 113 బీసీ కులాలున్నాయి. వీటిలో 86 కులాలను ఎంబీసీల్లోకి చేర్చాలన్న ప్రతిపాదనతో బీసీ సంక్షేమ శాఖ ప్రాథమిక నివేదిక రూపొందించింది. ఈ నివేదికను ఒకట్రెండు రోజుల్లో ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావుకు సమర్పించనున్నారు. ఆయన ఆమోదం తర్వాత ప్రభుత్వం ఎంబీసీ కులాలను ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేయనుంది.

ఖర్చు కాని కార్పొరేషన్ నిధులు

బీసీ జాబితాలో మెజార్టీ కులాలు విద్య, ఆర్థికంగా వెనుకబడి ఉన్నాయన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఎంబీసీ కార్పొరేషన్ ఏర్పాటు చేసింది. ఈ కార్పొరేషన్ ద్వారా ఎంబీసీ కులాలకు ఆర్థిక చేయూత కల్పించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా 2017-18 వార్షిక బడ్జెట్‌లో రూ.1,000 కోట్లను కేటాయించింది. కానీ వెనుకబడిన కులాలు ఏవీ అన్న అంశంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వకపోవడంతో అటు అధికారుల్లో.. ఇటు బీసీ కులాల్లో సైతం గందరగోళం నెలకొంది. ఫలితంగా ఎంబీసీ కార్పొరేషన్‌కు కేటాయించిన నిధులు సైతం ఖర్చుకాకుండా ఉండిపోయాయి. దీంతో ప్రభుత్వం ఎంబీసీ కులాల జాబితాను ప్రకటించేందుకు సమాయత్తమవుతోంది.

సంక్షేమ పథకాల కోసమే

బీసీ కులాల్లో అత్యంత వెనుకబడి ఉన్న కులాలను ప్రభుత్వం ఎంబీసీలుగా ప్రకటిస్తుంది. ఈ కులాల కోసం సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తుంది. అయితే ఎంబీసీలకు ఎలాంటి రిజర్వేషన్లు ఉండవని, ఉద్యోగ నియామకాలు తదితరాల్లో బీసీల్లోనే కొనసాగుతారని ఓ అధికారి 'సాక్షి'తో అన్నారు.

నివేదిక రెడీ..

రాష్ట్రంలోని 113 బీసీ కులాల్లో మెజార్టీ కులాలు అత్యంత వెనుకబడి ఉన్నాయి. విద్య, ఆరోగ్యం, సామాజిక, ఆర్థిక, ఉపాధి తదితర అంశాల్లో దాదాపు 86 కులాలకు తగిన ప్రాధాన్యం లేనట్లు అధికారుల సర్వేలో తేలింది. దీంతో ఆ కులాలను ఎంబీసీల్లో చేర్చాలని భావిస్తున్నారు. మరోవైపు బీసీ కులాల రిజర్వేషన్లపై బీఎస్ రాములు నేతృత్వంలో బీసీ కమిషన్ అధ్యయనం చేస్తోంది. ఇందులో భాగంగా అత్యంత వెనుకబడిన కులాల పరిశీలన సైతం నిర్వహించనుంది. అయితే ఈ నివేదిక వచ్చేందుకు మరింత సమయం పట్టనుంది. అందుకే బీసీ సంక్షేమ శాఖ అధికారులే ఎంబీసీల లెక్కలు తేల్చాలని నిర్ణయించినట్లు తెలిసింది. ఆర్థిక, సామాజికాంశాల్లో వెనుకబడిన కులాలపై అంచనాలు రూపొందించి నివేదిక రూపొందించారు.

2017లో 138 మంది పాక్ సైనికుల హతం

నిఘా వర్గాల వెల్లడి

న్యూఢిల్లీ: జమ్మూకశ్మీర్‌లో నియంత్రణ రేఖ వెంబడి 2017లో జరిగిన సీమాంతర కాల్పులు, వ్యూహాత్మక ఘటనల్లో 138 మంది పాకిస్తాన్ సైనికులను భారత సైన్యం మట్టుబెట్టిందని ప్రభుత్వ నిఘా వర్గాలు వెల్లడించాయి. 28 మంది భారత సైనికులు ప్రాణాలు కోల్పోయారని తెలిపాయి. 2017లో 860.. 2016లో 221 కాల్పుల విరమణ ఉల్లంఘనలు జరిగాయన్న నిఘా వర్గాలు.. 2017 డిసెంబర్ 25న ఎల్‌ఓసీ దాటి వెళ్లి ముగ్గురు పాక్ సైనికులను మట్టుబెట్టిన ఘటననూ అందులో పేర్కొన్నాయి. సాధారణంగా పాక్ సైనికుల మరణాలను అక్కడి ఆర్మీ ధ్రువీకరించదని, కొన్ని సందర్భాల్లో సైనికుల మరణాలను పౌరుల మరణాలుగా చూపిస్తుందని నిఘా వర్గాలు పేర్కొన్నాయి. కాగా, పాక్ కాల్పుల విరమణ ఉల్లంఘనలను భారత ఆర్మీ సమర్థంగా తిప్పికొడుతోందని ఆర్మీ ప్రతినిధి కల్నల్ అమన్ ఆనంద్ చెప్పారు.

కశ్మీర్‌లో వర్సిటీ: 'త్రీ ఇడియట్స్' వాంగ్‌చుక్



న్యూఢిల్లీ: త్రీ ఇడియట్స్ సినిమాలో ఆమిర్ ఖాన్ 'ఫున్‌సుక్ వాంగ్‌డూ'పాత్రకు స్ఫూర్తిగా నిలిచిన విద్యావేత్త, ఆవిష్కర్త సోనమ్ వాంగ్‌చుక్ మరో కీలక ప్రాజెక్టును చేపట్టారు. స్టూడెంట్స్ ఎడ్యుకేషనల్ అండ్ కల్చరల్ మూమెంట్ ఆఫ్ లడక్(ఎస్ఈసీఎంవోఎల్) పేరిట ఇప్పటికే లాభార్జన లేని ఓ పాఠశాలను ప్రారంభించిన సోనమ్.. తాజాగా యువత నైపుణ్యాన్ని పెంపొందించేందుకు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా జమ్మూకశ్మీర్‌లోని లడక్‌లోనే రూ.800 కోట్లతో దాదాపు 200 ఎకరాల్లో హిమాలయన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆల్టర్నేటివ్స్ విశ్వవిద్యాలయాన్ని స్థాపించనున్నట్లు సోనమ్ తెలిపారు. ఈ ప్రాజెక్టు పెట్టుబడి కోసం క్రౌడ్‌ఫండింగ్ ప్లాట్‌ఫామ్ 'మిలాప్'ను ఆశ్రయించనున్నట్లు వెల్లడించారు. 2018, మార్చి ఏప్రిల్ నాటికి ఈ ప్రాజెక్టు తొలిదశ ప్రారంభానికి రూ.14 కోట్లు అవసరమన్నారు. ఇందులో భాగంగా జనవరి మాసాంతానికి రూ.7 కోట్లను క్రౌడ్‌ఫండింగ్ ద్వారా, మిగిలిన మొత్తాన్ని కార్పొరేట్ సామాజిక బాధ్యత(సీఎస్ఆర్) నుంచి సేకరిస్తామన్నారు.

'పద్మావత్' విడుదలైతే ప్రజా కర్ఫ్యూ: రాజ్‌పుత్ వర్గం

న్యూఢిల్లీ: వివాదాస్పద 'పద్మావత్'చిత్రం విడుదలైతే థియేటర్లలో ప్రజా కర్ఫ్యూ చేపడతామని రాజ్‌పుత్ కర్ణిసేన బుధవారం మరోసారి హెచ్చరించింది. ఆ చిత్రంపై పూర్తిగా నిషేధం విధించాలని పునరుద్ఘాటించింది. చరిత్రను వక్రీకరించి ఈ సినిమా తీశారని, నిర్మాతలతో తాము రాజీపడబోమని ఆ సంస్థ నాయకుడు లోకేంద్ర సింగ్ కల్వి అన్నారు. 'పద్మావత్‌ను జనవరి 25న విడుదల చేయబోతున్నట్లు విన్నాం. అదే జరిగితే వీధుల వెంట ఆందోళనలు చేస్తాం. థియేటర్లలో పబ్లిక్ కర్ఫ్యూ నిర్వహించాలని యువతను కోరుతాం'అని కల్వి విలేకర్లతో చెప్పారు.

ప్రాణం తీసిన ప్రేమోన్మాదం

▶ మొదటి పేజీ తరువాయి

హత్య చేశాడు. మంగళవారం రాత్రి మూసాపేట హబీబ్‌నగర్‌లో ఈ దారుణం చోటుచేసుకుంది. మృతురాలిని శ్రీకాకుళం జిల్లావాసి బోను జానకి(24)గా, నిందితుడిని వికారాబాద్ జిల్లావాసి ఆనంద్ అలియాస్ అనంతప్ప(27)గా పోలీసులు గుర్తించారు. మృతురాలు, నిందితుడు ఇద్దరూ డీమార్ట్ సంస్థలో పనిచేస్తున్నారని తెలిపారు.

ప్రేమించాలంటూ వేధింపులు..

పోలీసుల కథనం ప్రకారం.. శ్రీకాకుళం జిల్లా గుయ్యానవలస గ్రామానికి చెందిన బోను జానకి(24) ఉపాధి కోసం మూడేళ్ల క్రితం నగరానికి వచ్చింది. సనత్‌నగర్‌లోని డీమార్ట్‌లో ఉద్యోగంలో చేరింది. అక్కడే పనిచేస్తున్న రూపావతితో కలసి మూసాపేట హబీబ్‌నగర్‌లో గది అద్దెకు తీసుకుని ఉంటోంది. వికారాబాద్ జిల్లా మర్పల్లికి చెందిన ఆనంద్ అలియాస్ అనంతప్ప(27) కూడా అదే సంస్థలో పనిచేస్తున్నాడు. ప్రగతినగర్‌లో నివాసముంటున్న ఆనంద్.. జానకితో పరిచయం పెంచుకున్నాడు. అదే చనువుగా తీసుకుని ప్రేమించాలంటూ ఒత్తిడి తీసుకురాగా.. ఆమె సున్నితంగా తిరస్కరించింది. అతడి వేధింపులు తీవ్రస్థాయికి చేరడంతో 15 రోజుల క్రితం డీమార్ట్ యాజమాన్యానికి, ఆనంద్ స్వగ్రామంలోని పెద్దలకు చెప్పటంతో అతడిని పిలిచి మందలించారు. ఇక నుంచి జానకితో మాట్లాడనని, మరిచిపోతానని ఆనంద్ చెప్పాడు. ఇద్దరూ ఒకేచోట పనిచేయటం ఇబ్బందిగా ఉంటుందని జానకిని కేపీహెచ్‌బీ కాలనీ నాలుగో ఫేజ్‌లోని డీమార్ట్ బ్రాంచ్‌కు బదిలీ చేశారు. అయినా జానకికి వేధింపులు తప్పలేదు. ఆనంద్ సనత్‌నగర్‌లో విధులు ముగించుకుని.. కేపీహెచ్‌బీ డీమార్ట్ వద్దకు వచ్చి తనను ప్రేమించాలంటూ మళ్లీ వేధింపులు మొదలెట్టాడు.

సొంతూరు వెళ్లేందుకు సిద్ధమవుతుండగా..

సంక్రాంతి పండుగ కోసం బుధవారం సొంతూరు వెళ్లాలనుకున్న జానకి.. మంగళవారం నుంచి సెలవు తీసుకుని షాపింగ్ పూర్తి చేసి రూమ్‌కి చేరుకుంది. రాత్రి ఏడు గంటల సమయంలో ఆమె గది దగ్గరకు వచ్చిన ఆనంద్.. గడియ తీసి ఉండటంతో లోపలికి వెళ్లాడు. తన ప్రేమను తిరస్కరించిందనే కసితో జానకి గొంతు నులిమి.. రూమ్‌లోని కూరగాయలు కోసే కత్తితో ఆమె కడుపులో పొడిచాడు. గది బయట గడియ వేసి పరారయ్యాడు. రూపావతి విధులు ముగించుకుని రూమ్‌కు రాగా.. రక్తపు మడుగులో కొట్టుమిట్టాడుతూ జానకి కనిపించడంతో కేకలు వేసింది. స్థానికులు గమనించి ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే ఆమె మృతిచెందినట్లు వైద్యులు ప్రకటించారు. రూపావతి ఫిర్యాదు మేరకు కూకట్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. జానకి మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. నిందితుడు పోలీసుల అదుపులో ఉన్నట్లు తెలిసింది.

చర్లపల్లిలో రైల్వే టెర్మినల్

▶ మొదటి పేజీ తరువాయి

వినోద్‌కుమార్ యాదవ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా వచ్చే ఆర్థిక సంవత్సరంలో చేపట్టనున్న పలు ప్రాజెక్టులను గురించి జీఎం వివరించారు. చర్లపల్లి మెగా టెర్మినల్ పనులను రెండు, మూడు నెలల్లో ప్రారంభించి నాలుగేళ్లలో పూర్తి చేస్తామన్నారు. ప్రస్తుతం రైల్వే పరిధిలో ఉన్న 50 ఎకరాలు, రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వనున్న 100 ఎకరాల విస్తీర్ణంలో టర్మినల్ చేపట్టనున్నామని, దీనికి సుమారు రూ.360 కోట్లు వ్యయమవుతుందని తెలిపారు.

హైదరాబాద్‌లో నాలుగోది..

ప్రస్తుతం గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో సికింద్రాబాద్, నాంపల్లి, కాచిగూడలలో ప్రధాన రైల్వేస్టేషన్లు ఉన్నాయి. నగరానికి రాకపోకలు భారీగా పెరుగుతుండటంతో వీటిలో రద్దీ తారస్థాయికి చేరుకుంది. రోజూ సుమారు 401 రైళ్లు ఈ మూడు స్టేషన్ల మీదుగా రాకపోకలు సాగిస్తున్నాయి. ప్రయాణికులు, వారి కోసం వచ్చేవారు కలిపి.. నాలుగైదు లక్షల మంది రోజూ ఈ స్టేషన్లకు వస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రయాణికులకు సౌకర్యవంతంగా ఉండటంతో పాటు, ప్రధాన స్టేషన్లలో రద్దీని తగ్గించేందుకు చర్లపల్లిలో మెగా టెర్మినల్ నిర్మాణాన్ని చేపట్టారు. ఔటర్ రింగ్ రోడ్డుకు ఆనుకుని ఉండడంతో చర్లపల్లిలో రైల్వే టెర్మినల్ అన్ని విధాలుగా అనుకూలంగా ఉంటుందని దీనిని ఎంపిక చేశారు. మొదట ఆరు ప్లాట్‌ఫారాలతో ప్రారంభించి.. తరువాత 10 ప్లాట్‌ఫారాల వరకు విస్తరించనున్నారు. పూర్తిగా పర్యావరణహితంగా ఈ స్టేషన్‌ను అభివృద్ధి చేస్తారు. ఢిల్లీ, విజయవాడ, విశాఖ, తిరుపతి, చెన్నై తదితర మార్గాల్లో రాకపోకలు సాగించే 150 రైళ్లను ఇక్కడి నుంచి నడిపేందుకు అవకాశం ఉంటుంది. అటు ముంబై వైపు నుంచి రైళ్ల ఒత్తిడిని తగ్గించేందుకు వట్టినాగులపల్లిలో మరో భారీ టెర్మినల్ నిర్మించే ప్రతిపాదనలు ఉన్నాయని జీఎం వినోద్‌కుమార్ యాదవ్ తెలిపారు. చర్లపల్లి పనులు ఒక దశకు చేరుకున్న తరువాత వట్టినాగులపల్లి టెర్మినల్ నిర్మాణం కూడా ప్రారంభించనున్నట్లు చెప్పారు.



బుధవారం రైల్ నిలయంలో జరిగిన ఎంపీల సమావేశంలో రైల్వే జీఎం వినోద్‌కుమార్ యాదవ్. చిత్రంలో రైల్వే అధికారులు

డిసెంబర్ నాటికి ఎంఎంటీఎస్ రెండో దశ

ఎంఎంటీఎస్ రెండో దశ పనులను ఈ ఏడాది డిసెంబర్ నాటికి పూర్తి చేసి.. పలు మార్గాల్లో రైళ్లను అందుబాటులోకి తేనున్నట్లు జీఎం వినోద్‌కుమార్ తెలిపారు. గత డిసెంబర్ నాటికే ఈ ప్రాజెక్టులో ఒకట్రెండు లైన్లను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నా.. నిధుల కొరత కారణంగా వాయిదా పడిందని చెప్పారు. ఈసారి ఎలాంటి జాప్యానికి తావు లేకుండా పూర్తి చేస్తామన్నారు. అలాగే అక్కన్నపేట-మెదక్, మనోహరాబాద్-కొత్తపల్లి, భద్రాచలం-కొత్తపల్లి, సికింద్రాబాద్-మహబూబ్‌నగర్, మంచిర్యాల-పెద్దపల్లి, కాజీపేట-బల్లార్షా తదితర రైల్వే లైన్లను వచ్చే రెండేళ్లలో పూర్తిచేయనున్నట్లు తెలిపారు. ఇక సికింద్రాబాద్ స్టేషన్‌పై ఒత్తిడిని తగ్గించేందుకు కొన్ని రైళ్లను లింగంపల్లి, వికారాబాద్ స్టేషన్ల వరకు పొడిగించనున్నట్లు వెల్లడించారు. ఆయా చోట్ల అవసరమైన అదనపు సదుపాయాలు ఏర్పాటు చేస్తామన్నారు.

పనుల తీరుపై నిలదీసిన ఎంపీలు

రాష్ట్రంలో పలు రైల్వే పనులు జరుగుతున్న తీరుపై ఎంపీలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. బుధవారం రైల్వే జీఎంతో జరిగిన సమావేశంలో ఎంపీలు బండారు దత్తాత్రేయ, మల్లారెడ్డి, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, బూర నర్సయ్య, ఎంపీ వినోద్, బాల్క సుమన్, గుత్తా సుఖేందర్‌రెడ్డి, నంది ఎల్లయ్య, కె.కేశవరావు, రాపోలు ఆనందభాస్కర్ తదితరులు పాల్గొన్నారు. కొన్ని ప్రాజెక్టుల పనులు దశాబ్దాలు గడిచినా ప్రారంభం కావడం లేదని ఈ సందర్భంగా మండిపడ్డారు. నల్లగొండ-మాచర్ల లైన్ కోసం 20 ఏళ్లుగా ప్రతిపాదనలు చేస్తున్నప్పటికీ ఒక్క అడుగు ముందుకు పడలేదని, ఇప్పుడా ప్రాజెక్టునే నిలిపేశారని గుత్తా ఆవేదన వ్యక్తం చేశారు. మణుగూరు-రామగుండం, ఆర్మూర్-ఆదిలాబాద్, పెద్దపల్లి-జగిత్యాల తదితర లైన్లను వేగంగా పూర్తి చేయాలని ఎంపీ వినోద్ కోరారు. స్టేషన్ ఘన్‌పూర్ నుంచి పాలకుర్తి మీదుగా సూర్యాపేట వరకు ప్రతిపాదించిన లైన్‌పై ఇప్పటికీ సర్వే పూర్తి చేయకపోవడం పట్ల రాపోలు ఆనందభాస్కర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. హైదరాబాద్-ఢిల్లీ వంటి దూర ప్రాంత రైళ్లకు డిమాండ్ తగ్గుతున్న నేపథ్యంలో అంతర్రాష్ట్ర సర్వీసులకు ప్రాధాన్యతనివ్వాలని కొండా విశ్వేశ్వర్‌రెడ్డి కోరారు. అన్ని ప్రధాన రైళ్లను భువనగిరి, జనగామలో ఆపేలా చర్యలు తీసుకోవాలని బూర నర్సయ్య కోరారు. పెద్దపల్లి, బెల్లంపల్లి, మంచిర్యాల, మందమర్రి తదితర స్టేషన్లను ఆధునీకరించాలని బాల్క సుమన్ విజ్ఞప్తి చేశారు.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును. టోల్ ఫ్రీ నం: 1800 270 1083

ఉదయమూ ఊదాల్సిందే!

మందుబాబులపై ట్రాఫిక్ పోలీసుల నజర్ • పగలు, సాయంత్రం వేళల్లోనూ ఆకస్మిక తనిఖీలు • మొదలైన కొత్త విధానం

సాక్షి, హైదరాబాద్

ఇప్పటి వరకు ఉదయం, సాయంత్రం వేళల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు లేకపోవడంతో మద్యం బాబులకు అదుపు లేకుండా పోయింది. ఇది పలు ప్రమాదాలకు దారితీస్తుండటంతో ఇలాంటి మందు బాబులకూ చెక్ పెట్టాలని ట్రాఫిక్ పోలీసులు నిర్ణయించారు. దీని కోసం ఏళ్లుగా అమలులో ఉన్న డ్రంక్ అండ్ డ్రైవ్ విధివిధానాల్లో మార్పులు చేస్తున్నారు. ఇందులో భాగంగానే నగరంలో పగలు, సాయంత్రం వేళల్లోనూ తనిఖీలు చేపట్టాలని నిర్ణయించారు. బుధవారం నుంచి అమలులోకి వచ్చిన ఈ విధానంలో ప్రధానంగా జంక్షన్లపై దృష్టి పెడుతున్నారు. ఈ మేరకు డీసీపీ ఎల్ఎస్ చౌహాన్ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు.



వాహనదారుల వ్యతిరేకతతో...

గతంలో అప్పుడప్పుడు పగటి పూట సైతం డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. దీంతో ట్రాఫిక్ జామ్స్ ఏర్పడటంతో పాటు రికార్డులకు ఎక్కని అనేక చిన్న చిన్న ప్రమాదాలూ చోటు చేసుకున్నాయి. వాహనదారుల నుంచి కొంత వరకు వ్యతిరేకత సైతం వ్యక్తమైంది. ఈ నేపథ్యంలో కొన్నాళ్ల క్రితం నగర ట్రాఫిక్ పోలీసులు పగటిపూట డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను ఉపసంహరించుకున్నారు.

జంక్షన్లలో సాయంత్రం వేళ...

నగర ట్రాఫిక్ విభాగం అధికారులు తాజాగా సాయంత్రం వేళల్లో ఈ డ్రైవ్స్ చేపట్టాలని నిర్ణయించారు. ప్రత్యేకంగా ఓ ప్రాంతంలో ఏర్పాటు చేయడం కాకుండా జంక్షన్ల వద్దే దృష్టి పెట్టారు. ఎంపిక చేసుకున్న చౌరస్తాల్లో రెండు మూడు బృందాలు ఈ తనిఖీలు చేపడతాయి. ప్రతి బృందానికీ సబ్ఇన్స్పెక్టర్ స్థాయి అధికారి, చెస్ట్ మౌంటెడ్ కెమెరా ధరించి నేతృత్వం వహిస్తారు. ఒకే ప్రాంతంలో ఎక్కువసేపు నిర్వహించకుండా ఓ జంక్షన్లో ఉండే నాలుగైదు మార్గాలతో పాటు నిర్ణీత సమయం తర్వాత ఆ జంక్షన్ను సైతం మారుస్తూ ఈ తనిఖీలు చేపట్టేలా ప్రణాళికలు సిద్ధమయ్యాయి. బుధవారం సాయంత్రం నుంచి వెస్ట్ డిస్ట్రిక్ట్ పరిధిలో ఈ కొత్త విధానం అవలంబిస్తున్నారు. ఈ తనిఖీలను ఏసీపీ స్థాయి అధికారి పర్యవేక్షిస్తారు.

ప్రమాదాలకు తావు లేకుండా...

ప్రమాదాలు జరిగే అవకాశం ఉండటంతో ట్రాఫిక్ చౌరస్తాలో ముందు వరుసలో ఆగిన వాహనదారులను తనిఖీ చేయవద్దని స్పష్టం చేశారు. స్టాప్లైన్ నుంచి కనీసం ఐదు మీటర్లు వదిలి అక్కడి వరుసల్లో ఉన్న వాహనాలను తనిఖీ చేస్తారు. ఎవరైనా మద్యం తాగినట్లు శ్వాసపరీక్ష యంత్రం గుర్తిస్తే వారిని వాహనంతో సహా పక్కకు తీసుకువచ్చి తదుపరి చర్యలు తీసుకుంటారు. ట్రాఫిక్ జామ్స్కు ఆస్కారం లేకుండా కేవలం సిగ్నల్లో రెడ్ లైట్ నుంచి గ్రీన్ లైట్ వచ్చే మధ్యలోనే ఈ తనిఖీలు చేపట్టనున్నారు.



జర్మన్ టెక్నాలజీతో నిర్మిస్తున్న రాయగిరి–ఆరెపల్లి నేషనల్ హైవే

రోడ్లు.. ఇక 30 ఏళ్లు గ్యారంటీ

- నేషనల్ హైవే పనుల్లో జర్మన్ టెక్నాలజీ
- పర్మనెంట్ క్వాలిటీ కాంక్రీట్ పద్ధతిలో నిర్మాణం
- రాష్ట్రంలో ప్రయోగాత్మకంగా తొలిసారి..

సాక్షి, జనగామ: ప్రస్తుతం రోడ్ల కాలపరిమితి ఎంత అంటే సరిగ్గా చెప్పలేం. ఓ రోడ్డు 6 నెలలకే దెబ్బతింటుంది. మరో రోడ్డు మహా అంటే ఏడాది.. అయితే, జాతీయ రహదారి 30 ఏళ్లపాటు చెక్కు చెదరకుండా ఉండే పద్ధతికి శ్రీకారం చుట్టారు. రాష్ట్రంలో తొలిసారిగా నేషనల్ హైవే నిర్మాణంలో జర్మన్ టెక్నాలజీని వినియోగిస్తోంది. యాదాద్రి జిల్లా రాయగిరి నుంచి వరంగల్ అర్బన్ జిల్లా ఆరెపల్లి వరకు నిర్మిస్తున్న 163 జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో ఈ టెక్నాలజీని వినియోగిస్తున్నారు. మొత్తం 99 కిలోమీటర్ల ఈ రోడ్డు కోసం కేంద్రం రూ.1,905 కోట్లు కేటాయించింది. పరిహారం పోగా రూ. కోట్లను రోడ్డు నిర్మాణానికి వెచ్చించనున్నారు. ఈ రోడ్డు నిర్మాణ సంస్థ ఎల్ అండ్ టీ జర్మన్ టెక్నాలజీతో రోడ్డు నిర్మాణం చేస్తోంది. పర్మనెంట్ క్వాలిటీ కాంక్రీట్ పద్దతో రాష్ట్రంలో తొలిసారిగా ఈ పనులు చేస్తున్నారు.

కాంక్రీట్ , సిమెంట్తో నిర్మాణం...

పర్మనెంట్ క్వాలిటీ కాంక్రీట్ నిర్మాణంతో చేపడుతున్న పనుల్లో కాంక్రీట్, సిమెంట్తోనే పనులు చేస్తున్నారు. ఆరు వరుసల్లో రోడ్డు చదును చేసి నిర్మాణం చేపడుతున్నారు. కింద వరుసలో మట్టితో రోలింగ్ చేసి చివరి దశలో కాంక్రీట్తో రోలింగ్ చేస్తున్నారు. ఫీట్ ఎత్తుతో 9 మీటర్ల వెడల్పుతో నిర్మిస్తున్నారు. ఇందుకోసం విట్జ్ పవర్ మిషన్ను వినియోగిస్తుండగా.. నాణ్యత తక్కువైతే ఈ మిషన్ పని చేయడం ఆగిపోతుంది. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తేనే పనులు ముందుకు సాగుతాయి. ఈ పద్దతిలో ఎక్కడైనా రోడ్డు పాడైతే సులువుగా మరమ్మతు చేసే వెసులుబాటు కూడా ఉంది. బిట్లు బిట్లుగా రోడ్డు వేస్తున్నందున ఏదైనా సందర్భంలో రోడ్డు ధ్వంసం అయితే, ఆ బిట్టు వరకే తొలగించి కొత్త బిట్ వేసే అవకాశం ఉంది.

మహా జాతరకు కొత్త లోగో

భూపాలపల్లి ఇన్చార్జి కలెక్టర్ కర్ణన్

ఎస్ఎస్ తాడ్వాయి: మేడారం సమ్మక్క–సారలమ్మ జాతరకు సంస్కృతి, వైభవం ఉట్టిపడేలా సరికొత్త లోగో తయారు చేసేందుకు జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఇన్చార్జి కలెక్టర్ కర్ణన్ శ్రీకారం చుట్టారు. బుధవారం మేడారం ఐటీడీఏ అతిథి గృహంలో ఆదివాసీల యువకులతో సమావేశమయ్యారు. వన దేవతలకు రూపం లేదనే విషయం దేశ వ్యాప్తంగా తెలిసేందుకు అమ్మవార్ల గద్దెలతో లోగో ఏర్పాటు చేయాలని కలెక్టర్కు వారు సూచించారు. కర్ణన్ మాట్లాడుతూ సమ్మక్క–సారలమ్మ గద్దెలతో పాటు లోగోలో ఏయే అంశాలు ఉండాలనే అంశంపై వాట్సాప్, ఫేస్బుక్ ఐడీలు క్రియేట్ చేస్తామన్నారు. వాటి ద్వారా జనవరి 15లోపు తమ అభిప్రాయాలు తెలపాలన్నారు. జాతరలో ఆదివాసీల నృత్యాలను అప్లోడ్ చేయాలని.. అత్యుత్తమ ఫొటోలు పంపిన వారికి జాతర తర్వాత బహుమతులు ప్రదానం చేస్తామన్నారు.

ఉపకార దరఖాస్తుకు మరో అవకాశం

11 నుంచి ఫిబ్రవరి 10 వరకు గడువు

సాక్షి, హైదరాబాద్: పోస్టుమెట్రిక్ విద్యార్థుల ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్మెంట్ దరఖాస్తులకు ప్రభుత్వం మరో అవకాశం ఇచ్చింది. ఈ–పాస్ వెబ్సైట్లో గురువారం(11న) నుంచి ఫిబ్రవరి 10 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని ఎస్సీ అభివృద్ధి శాఖ కార్యదర్శి జ్యోతి బుద్ధప్రకాశ్ తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకి సూచించారు.

కోర్టుకు హాజరైన యాంకర్ రవి



సాక్షి, హైదరాబాద్: టీవీ యాంకర్ రవి బుధవారం నాంపల్లి కోర్టుకు హాజరయ్యారు. 'రారండోయ్ వేడుక చూద్దాం' సినిమా కార్యక్రమంలో మహిళలను కించపరిచేలా వ్యాఖ్యలు చేశారన్న కేసులో విచారణ నిమిత్తం ఆయన కోర్టుకు హాజరయ్యారు. తదుపరి విచారణ వచ్చేనెల 7కి వాయిదా పడింది. ఆ సినిమా ఆడియో వేడుకలో సీనియర్ నటుడు చలపతిరావు మహిళలను ఉద్దేశించి చేసిన అనుచిత వ్యాఖ్యలపై రవి సమర్థిస్తూ మాట్లాడారంటూ ఆయనపై కూడా జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదైంది.

నేడు ఆలస్యంగా తెలంగాణ ఎక్స్ప్రెస్

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్–న్యూఢిల్లీ తెలంగాణ ఎక్స్ప్రెస్ గురువారం 2 గంటలు ఆలస్యంగా బయలుదేరనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో ఎం.ఉమాశంకర్కుమార్ బుధవారం తెలిపారు. హైదరాబాద్–న్యూఢిల్లీ(12723) రైలు నాంపల్లి నుంచి ఉదయం 6.25కు బదులు 8.25కు బయలుదేరనుంది.

ప్లాట్ఫామ్ టికెట్ ధర పెంపు..: రద్దీ కారణంగా నాంపల్లి రైల్వేస్టేషన్ ప్లాట్ఫామ్ టికెట్ను రూ.10 నుంచి రూ.20కి పెంచారు. పెరిగిన చార్జీలు ఈ నెల 11 నుంచి 17 వరకు అమలవుతాయని దక్షిణ మధ్య రైల్వే అధికారులు వెల్లడించారు. సికింద్రాబాద్, కాచిగూడ స్టేషన్లలో ప్లాట్ఫామ్ టికెట్ ధరలను ఇప్పటికే పెంచిన సంగతి తెలిసిందే.

వన జాతరలో సత్వర వైద్యం

- మేడారంలో మెరుగైన వైద్య సేవలకు వైద్య శాఖ ఏర్పాట్లు
- వెయ్యి మంది వైద్యుల బృందం.. 24 గంటలు వైద్య సేవలు

సాక్షి, హైదరాబాద్: దేశంలోనే అతి పెద్ద గిరిజన ఉత్సవంగా ప్రసిద్ధిగాంచిన మేడారం జాతరకు తరలి వచ్చే భక్తులకు మెరుగైన వైద్య సేవలు కల్పించేందుకు వైద్య ఆరోగ్య శాఖ ఏర్పాట్లు చేస్తోంది. జయశంకర్ భూపాలపల్లిలోని మేడారంలో జనవరి 31 నుంచి నాలుగు రోజులపాటు మేడారం జాతర జరగనుంది. జాతర సమయంలో కోటి మంది భక్తులు మేడారానికి వస్తారని ప్రభుత్వ అధికారులు అంచనా వేస్తున్నారు. భారీ సంఖ్యలో జనం వస్తుండటంతో పారిశుద్ధ్య నిర్వహణ ఇబ్బందులతో అనారోగ్య సమస్యలు పెరిగే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు అనారోగ్యానికి గురవుతుంటారు. వీరికి సత్వర వైద్య సేవలు అందించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రజారోగ్య విభాగం ఏర్పాట్లు చేస్తోంది. వరంగల్ ఉమ్మడి జిల్లాలోని వైద్యులను, పారా మెడికల్ సిబ్బందిని జాతర సమయంలో అక్కడికి పంపించాలని నిర్ణయించింది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో పని చేసే 220 మంది వైద్యులు, 780 మంది పారా మెడికల్ సిబ్బంది జాతర సమయంలో అక్కడ విధులు నిర్వహించేలా కసరత్తు పూర్తి చేసింది. వరంగల్ ఎంజీఎం, జీఎంహెచ్, సీకేఎం, ప్రాంతీయ కంటి ఆస్పత్రులకు చెందిన 20 మంది వైద్య నిపుణులు మేడారంలో సేవలందిస్తారు. జనరల్ ఫిజీషియన్, సాధారణ శస్త్రచికిత్స నిపుణులు, స్త్రీలు, చెవి, ముక్కు, గొంతు, రేడియాలజిస్ట్, దంత,



పిల్లల, కంటి, ఎముకల వైద్య నిపుణులు షిఫ్టుల వారీగా 24 గంటలు సేవలందిస్తారు. జయశంకర్ భూపాలపల్లి, వరంగల్ అర్బన్, వరంగల్ రూరల్, మహబూబాబాద్, జనగామ జిల్లాల నుంచి వైద్యులు, సిబ్బంది మేడారానికి వస్తారు.

50 పడకల తాత్కాలిక ఆస్పత్రి..

భారీగా వచ్చే భక్తులకు నిరంతరం వైద్య సేవలు అందించేందుకు జాతర ప్రాంతంలోనే 50 పడకల సామర్థ్యంతో తాత్కాలిక ఆస్పత్రిని ఏర్పాటు చేస్తోంది. మేడారం పరిసర ప్రాంతాలు, జాతరకు వచ్చే మార్గాల్లో సుమారు 70 కిలోమీటర్ల నుంచి ఎక్కడికక్కడ వైద్య సదుపాయాలు భక్తులకు కల్పించనున్నారు. జాతరకు వచ్చే భక్తులకు విరేచనాలు, జ్వరం, జలుబు, తల నొప్పి, ఇతర అత్యవసర సేవలు అవసరమైన రోగాలకు మందులను ఇస్తారు. వైద్య పరికరాలు, అల్ట్రాసౌండ్ స్కానింగ్, ఆక్సిజన్ లాంటి సౌకర్యాలను అందుబాటులో పెడతారు. వేగంగా వైద్య సేవలు అందించేందుకు వీలుగా మొత్తం 14 చోట్ల ప్రథమ చికిత్సా కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. రహదారుల వెంట మరో 40 శిబిరాల ఏర్పాటుకు ప్రణాళిక రూపొందించారు. 108 వాహనాలు 13, ఆర్బీఎస్కే వాహనాలు 5, 104 వాహనాలు 5, మొత్తం 26 అంబులెన్సులు ఏర్పాటు చేస్తున్నారు.

సికింద్రాబాద్–కాకినాడ మధ్య జనసాధారణ్ ఎక్స్ప్రెస్



సాక్షి, హైదరాబాద్: సంక్రాంతి పండుగ సందర్భంగా సికింద్రాబాద్–కాకినాడ మధ్య రెండు జనసాధారణ్ ఎక్స్ప్రెస్ రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో ఎం.ఉమాశంకర్కుమార్ బుధవారం తెలిపారు. సికింద్రాబాద్–కాకినాడ (07050) జనసాధారణ్ రైలు గురు, శుక్రవారాల్లో రాత్రి 11.10 గంటలకు సికింద్రాబాద్లో బయలుదేరి మర్నాడు ఉదయం 11 గంటలకు కాకినాడ చేరుకుంటుంది.

బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఏర్పాటు

సాక్షి, హైదరాబాద్: బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ను ఏర్పాటు చేస్తూ మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి జగదీశ్వర్ ఉత్తర్వులు జారీ చేశారు. కమిషన్ చైర్పర్సన్గా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మంత్రి, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, శాసనసభ స్పీకర్ ప్రతిపాదించిన ఇద్దరు వ్యక్తులు సభ్యులుగా కొనసాగుతారు.





సాక్షి

గురువారం, జనవరి, 11

అరకొర సంస్కరణలు

రాజకీయ పార్టీలకు ఎన్నికలలో ఖర్చు నిమిత్తం విరాళాలు ఇచ్చే పద్ధతిలో మార్పు తేవలసిన అవసరం ఉన్నదని ప్రధాని నరేంద్రమోదీ, ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ పలు సందర్భాలలో ఉద్ఘాటించారు. నిరుడు కేంద్ర బడ్జెట్ ప్రతిపాదనలను పార్లమెంటులో సమర్పించిన సందర్భంలో ఆర్థిక మంత్రి కొన్ని సూచనలు సైతం చేశారు. నగదు విరాళాలు రూ. 2,000 నుంచి రూ. 20,000లకు మించరాదనే నిబంధన విధించాలని ప్రతిపాదించారు. ఎలక్టొరల్ బాండ్లు జారీ చేసే విధానం ప్రవేశపెట్టాలని అనుకున్నట్టు కూడా చెప్పారు. ప్రస్తుతం రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రచారానికి చేస్తున్న ఖర్చుపైన ఎటువంటి పరిమితి లేదు. ఎన్నికలలో పోటీ చేస్తున్న అభ్యర్థి చేసే ఖర్చుపైన మాత్రం పరిమితి ఉంది. విరాళాలన్నీ నగదు రూపంలోనే రాజకీయ పార్టీలు స్వీకరిస్తున్నాయి. దాతల పేర్లు గుట్టుగానే ఉంచుతున్నాయి. పాలకులు రూపొందించే విధానాలను గమనిస్తే ఏ కార్పొరేట్ సంస్థ అధికార పార్టీకి అధికంగా విరాళం ఇచ్చిందో ఊహించుకోవడం కష్టం కాదు. కానీ ఆ విధానాన్ని చట్ట ప్రకారం ప్రశ్నించే అవకాశం లేదు. ప్రజాప్రాతినిధ్య చట్టాన్ని సవరించడం ద్వారా కొన్ని సంస్కరణలను ప్రవేశపెట్టినట్లయితే విరాళాల విషయంలో పారదర్శకత ఎంతో కొంత పెరిగే అవకాశం ఉంటుందనడంలో సందేహం లేదు.

ఏదైన వ్యవస్థను సంస్కరించే సమయంలో లోపాలు లేకుండా, తప్పుకునే అవకాశాలు లేకుండా పకడ్బందీగా చేయాలి. ఇప్పటి కంటే కొంత మెరుగైన విధానం ప్రవేశపెట్టాలని తలపోస్తున్నారే తప్ప ఆదర్శవంతమైన పక్కా విధానం రూపొందించే ప్రయత్నం జరగడం లేదు. జైట్లీ ప్రతిపాదిస్తున్న సంస్కరణల ప్రకారం 1934 నాటి రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా యాక్ట్‌ను సవరించి ఎలక్టొరల్‌బాండ్స్ జారీకి అవకాశం కల్పిస్తారు. కడచిన ఎన్నికలలో ఒక శాతం కంటే ఎక్కువ ఓట్లు సంపాదించిన పార్టీకి ఎలక్టొరల్‌బాండ్ ద్వారా విరాళాలు స్వీకరించే అర్హత ఉంటుంది. కార్పొరేట్ సంస్థలు ఈ బాండ్లను ప్రతి సంవత్సరం జనవరి, ఏప్రిల్, జులై, అక్టోబర్ మాసాలలో ప్రతి మాసంలోనూ పది రోజుల పాటు కొనుగోలు చేయవచ్చు. ప్రతి రాజకీయ పార్టీ ఒక బ్యాంకు అకౌంట్ వివరాలను ఎన్నికల కమిషన్‌కు తెలియజేయాలి. ఆ ఖాతాలో దాత ఇచ్చే ఎలక్టొరల్‌బాండ్‌ను సొమ్ము చేసుకోవచ్చు. ఇందుకు 15 రోజుల గడువు ఉంటుంది. స్వీకర్త పేరు బ్యాంకులో నమోదు అవుతుంది. దాత పేరు కూడా బ్యాంకుకు తెలుస్తుంది. ఇతరులకు మాత్రం తెలియదు. ఈ సంస్కరణలో ఉన్న ఇబ్బంది ఏమంటే ఎవరు ఎవరికి ఎంత విరాళం ఇస్తున్నారో బ్యాంకులకు, వాటి ద్వారా ప్రభుత్వానికి తెలిసే అవకాశం ఉంటుంది. మరో రకంగా చెప్పాలంటే ప్రతిపక్షాలకు ఏ కార్పొరేట్ సంస్థ ఎంత విరాళం ఇస్తున్నదో తెలుసుకునే అవకాశం అధికార పార్టీకి ఉంటుంది. అధికార పార్టీకి ఏ సంస్థ ఎంత విరాళం ఇస్తున్నదో తెలుసుకునే వీలు ప్రతిపక్షాలకు ఉండదు. అధికార పార్టీ తెలుసుకునే అవకాశం ఉన్నదనే ఎరుకే కార్పొరేట్ సంస్థలను ప్రతిపక్షాలకు దూరంగా ఉంచుతుంది. అధికార పార్టీకి వచ్చే విరాళాల కంటే ప్రతిపక్షాలకు చాలా తక్కువ వచ్చే అవకాశం ఉంది. మార్చి 9న పార్లమెంటు బడ్జెట్ సమావేశం ద్వితీయార్థం ఆరంభం అవుతుంది. అప్పుడు ఆర్థిక బిల్లుపైన చర్చ జరిగే క్రమంలో ఈ అంశాలు పరిశీలనకు వస్తాయి. అన్ని పక్షాలు అన్ని కోణాలనూ సాకల్యంగా పరిశీలించి ఎన్నికలలో ధన ప్రభావాన్ని తగ్గించేందుకు చర్యలు తీసుకుంటే ప్రజాస్వామ్యం బలపడుతుంది. సాధారణ పౌరులు సైతం ఎన్నికల బరిలో నిలబడి గెలిచే అవకాశం ఉంటుంది. ఎన్నికల సంస్కరణలపైన సుదీర్ఘమైన అధ్యయనం చేసిన దినేశ్ గోస్వామి కమిటీ, ఇంద్రజిత్‌గుప్తా కమిటీ సిఫార్సులను అమలు చేసే ప్రయత్నం ఎన్‌డీఏ సర్కార్ చేయడం లేదు. అభ్యర్థుల ఎన్నికల ఖర్చును ప్రభుత్వమే భరించాలని ఈ రెండు కమిటీలూ సిఫార్సు చేశాయి. అభ్యర్థులకు లేదా పార్టీలకూ ఉన్న ప్రజాదరణ ప్రకారం ఎన్నికల ఖర్చు కింద ఎంత మొత్తం ఇవ్వవచ్చునో నిర్ణయించేందుకు ఒక సూత్రాన్ని రూపొందించడం కష్టం కాదు. కార్పొరేట్ సంస్థలు సామాజిక బాధ్యత (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) కింద ఎన్నికల విరాళాలను ప్రభుత్వానికి అందజేయాలి. ఆ విధంగా జమ అయిన మొత్తానికి ప్రభుత్వ నిధులు జోడించి అభ్యర్థులకు ఎన్నికల ఖర్చుల కింద నిర్ణీత నిధిని అందించాలి. ఈ పద్ధతి జర్మనీలో అమలు చేస్తున్నారు.

జైట్లీ ప్రతిపాదించినవి అరకొర సంస్కరణలు. అవి సైతం నిజాయితీగా అమలు జరుగుతాయన్న భరోసా ప్రజలకు లేదు. అధికార, ప్రతిపక్షాలకు ఈ విషయంలో చిత్తశుద్ధి లేదని అనేక సందర్భాలలో రుజువైంది. విదేశాల నుంచి విరాళాల సేకరణకు సంబంధించిన (ఫారిన్ కంట్రిబ్యూషన్స్ రెగ్యులేషన్)యాక్ట్‌ను ఉల్లంఘించి బీజేపీ, కాంగ్రెస్‌లు బ్రిటన్‌కు చెందిన వేదాంత కార్పొరేషన్ నుంచి 2014 ఎన్నికలలో భారీ విరాళం అందుకున్నాయి. లోగడ కూడా రూ. 20,000కు మించి ఎన్నికల విరాళం ఇచ్చినట్లయితే ఎన్నికల కమిషన్‌కు తెలియజేయాలనే నిబంధన 1951 నాటి ప్రజాప్రాతినిధ్య చట్టంలోని 29 (సి) సెక్షన్‌లో ఉంది. ఎవరైనా లక్ష రూపాయల నగదు విరాళంగా ఇస్తే ఆ మొత్తానికి ఆరు రసీదులు ఇచ్చి ప్రతి రసీదులోనూ రూ. 20 వేల కంటే తక్కువ మొత్తం ముట్టినట్టు బొంకుతారు. సంస్కరణలు చేయడం, చట్టాలను సవరించడం, కొత్త చట్టాలు చేయడంతో సరిపోదు. వాటిని మనస్ఫూర్తిగా అమలు జరపాలి. ఫిరాయింపుల నిరోధక చట్టం ఎంత దివ్యంగా అమలు జరుగుతోందో చూస్తూనే ఉన్నాం. అరుణాచల్‌ప్రదేశ్ నుంచి ఆంధ్రప్రదేశ్ వరకూ ఈ చట్టాన్ని అన్ని పార్టీలూ కనికరం లేకుండా కుళ్ళ బొడుస్తుంటే అడిగే నాథుడు లేడు. చట్టాన్ని ఎవరు ఉల్లంఘించినా నిష్కర్షగా శిక్షించే వ్యవస్థ లేనంత వరకూ రాజకీయ పార్టీలు బుద్ధిగా వ్యవహరించవు. 'మీ కంటే మేము పవిత్రులం' అంటూ అతిశయానికి పోకుండా ఎన్నికలలో నల్లధనం పాత్రను అరికట్టేందుకు అన్ని పార్టీలూ, అందరు నాయకులూ కలసిరావాలంటూ నిరుడు ప్రధాని మోదీ పిలుపు ఇచ్చారు. ప్రధాని సహా రాజకీయ నేతలందరూ ఈ వాక్కును శిరసావహించి ఎన్నికలలో ధన ప్రభావాన్ని తగ్గించగలిగితే చరితార్థులవుతారు.




"పారదర్శకత అంటే సంస్థల పట్ల లోపించిన విశ్వాసాన్ని పునరుద్ధరించడం కాదు. విశ్వాస లేమిని తీవ్రంగా పట్టించుకుని తదనుగుణంగా వ్యవహరించడం."

– ఇవాన్ క్రాస్టెవ్
బల్గేరియన్ రాజకీయ శాస్త్రజ్ఞుడు

గ్రహం అనుగ్రహం

శ్రీ హేవిళంబి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు పుష్య మాసం, తిథి బ.దశమి రా.9.54 వరకు, తదుపరి ఏకాదశి, నక్షత్రం స్వాతి ఉ.8.21 వరకు, తదుపరి విశాఖ, వర్జ్యం ప.2.18 నుంచి 4.00 వరకు దుర్ముహూర్తం ఉ.10.16 నుంచి 11.01 వరకు, తదుపరి ప.2.41 నుంచి 3.25 వరకు, అమృతఘడియలు... రా.12.31 నుంచి 2.13 వరకు.

సూర్యోదయం : 6.38
సూర్యాస్తమయం : 5.39
రాహుకాలం : ప 1.30 నుంచి 3.00 వరకు
యమగండం : ఉ.6.00 నుంచి 7.30 వరకు



నమాజ్ వేళలు

ఫజర్ : 5.32
జొహర్ : 12.24
అసర్ : 4.23
మగ్రీబ్ : 5.59
ఇషా : 7.16

హైకోర్టు సీమ కనీస హక్కు



ఐవైఆర్ కృష్ణారావు

ఆంధ్రప్రదేశ్ హైకోర్టును రాయలసీమలో ఏర్పాటు చేయడం కేవలం ఆ ప్రాంతపు అంశం కాదు. ఇది వారి న్యాయబద్ధమైన హక్కు. రాజధాని కోసం కర్నూలును ఎంపిక చేసినప్పుడు, సహజంగానే గుంటూరుకు హైకోర్టు వచ్చింది. ఇందుకోసం ఎవరూ ప్రత్యేకంగా గళం విప్పవలసిన అవసరం రాలేదు కూడా. ఈనాడు హైకోర్టును రాయలసీమలో ఏర్పాటు చేసుకోవడమనేది ఒక ప్రాంతీయపరమైన అంశంగానో, కోస్తా ఆంధ్ర ప్రయోజనాలకు వ్యతిరేకమన్న ధోరణిలోనో ఆలోచించాల్సిన అవసరం లేదు.

ఎట్టకేలకు హైకోర్టు ఆంధ్రప్రదేశ్‌కు తరలిపోతున్నది. గత నాలుగు సంవత్సరాలుగా తరలించకుండా అపడానికి ప్రధాన కారణం అక్కడ సరైన భవనాలు లేకపోవడమే. కానీ ఈరోజు అకస్మాత్తుగా విజయవాడలో భవనాలు ఉద్భవించాయి. ప్రభుత్వం తాత్కాలికంగా గానీ, శాశ్వత ప్రాతిపదికపైన గానీ హైకోర్టు కోసం కొత్తగా భవనాలు నిర్మించలేదు. ఇందుకోసం నాలుగు సంవత్సరాలుగా వెతుకుతున్నా కనిపించని అనువైన భవనాలు ఒక్కసారిగా లభ్యమైనాయి. జూన్, జులై కల్లా హైకోర్టు బదిలీ ప్రక్రియ పూర్తిచేయడానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ముందడుగు వేస్తున్నది కూడా. దీనికి ప్రధాన కారణం –హైకోర్టు విభజనాంశం నాలుగేళ్లుగా ప్రభుత్వానికి ఇబ్బందికరంగా ఉంది. ఇప్పుడు అవసరంగా మారింది. 2019 లోపల హైకోర్టు తరలి రాకపోతే పరిస్థితులు ఎలా ఉంటాయో అంచనా వేయలేం. ఈ తరుణంలోనే రాయలసీమ మేల్కొనవలసి ఉంది. ఇప్పటికైనా అక్కడి నాయకత్వం కదలి హైకోర్టును సీమలో ఏర్పాటు చేయవలసిన సహేతుకమైన కోరికను వినిపించకపోతే భవిష్యత్తు తరాలవారు క్షమించరు. ఈ అంశాన్ని అవగాహన చేసుకోవడానికి ఒక్కసారి ఇందుకు సంబంధించిన చారిత్రక నేపథ్యాన్ని పరిశీలించాలి.



'శ్రీబాగ్' స్ఫూర్తి ఏమైనట్టు?

1920లో జరిగిన నాగ్‌పూర్ కాంగ్రెస్ భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు సూత్రప్రాయంగా అంగీకరించింది. దీనితోనే మద్రాస్ ప్రెసిడెన్సీలోని తెలుగు వారిలో ప్రత్యేక రాష్ట్ర ఆశలు చిగురించాయి. వెంటనే పరస్పర అపోహలు, అపనమ్మకాలు బయటపడ్డాయి కూడా. అంతవరకు చారిత్రకంగా ఒక ప్రత్యేక గుర్తింపు గలిగిన తాము, కొత్తగా ఏర్పడబోయే ఆంధ్రరాష్ట్రంలో అల్పసంఖ్యాకులుగా మిగిలిపోతామన్న అపనమ్మకం రాయలసీమ ప్రాంతీయులలో చోటు చేసుకున్నది. ఈ అపనమ్మకాలను రూపుమాపటానికి 16 నవంబర్ 1937న దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు నివాసం 'శ్రీబాగ్'(మద్రాస్)లో కోస్తా, రాయలసీమ పెద్దలు సమావేశమై ఒక ఒప్పందానికి వచ్చారు. ఈ ఒప్పందం మీద రాయలసీమ తరపున కడప కోటిరెడ్డి, కల్లూరి సుబ్బారావు, సుబ్బరామిరెడ్డి, పప్పూరి రామాచార్యులు సంతకాలు చేశారు. భోగరాజు పట్టాభిసీతారామయ్య, కొండా వెంకటప్పయ్య తదితరులు కోస్తా ఆంధ్ర తరపున సంతకాలు చేశారు. ఆంధ్ర రాష్ట్రం ఏర్పడినపుడు రాయలసీమలో రాజధాని, కోస్తా ఆంధ్ర ప్రాంతంలో హైకోర్టు ఏర్పాటు చేయాలని అంగీకారానికి వచ్చారు. అంతేకాదు, ప్రాంతీయ సమతౌల్యాన్ని పాటిస్తూ వివిధ ప్రభుత్వ కార్యక్రమాలను, సంస్థలను ఏర్పాటు చేసుకోవాలని కూడా అంగీకారానికి వచ్చారు. దాదాపు ఎనభై సంవత్సరాల తరువాత 2014లో శివరామకృష్ణన్ కమిటీ ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వ కార్యకలాపాలను, సంస్థలను వివిధ ప్రాంతాలకు వికేంద్రీకరించాలనే సూచించింది. ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని తాము సూచించిన రీతిలో ఏర్పాటుచేయలేదని సీమ వాసులు మద్రాస్ విశ్వవిద్యాలయంలో భాగంగా ఉండటానికి 1926 నాటికే మొగ్గ చూపిన సంగతిని విస్మరించలేం.

రాజధాని ఏర్పాటు- కొన్ని సత్యాలు

ఈ చారిత్రక నేపథ్యంలో 1953లో పొట్టి శ్రీరాములు బలిదానం తరువాత జవహర్‌లాల్ నెహ్రూ ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటుకు సూత్రప్రాయంగా అంగీకరించారు. రాజధాని విషయంలో ముందుగానే ఒక అంగీకారానికి రావాలని ఢిల్లీలో జరిగిన సమావేశంలో ప్రకాశం పంతులుకు సూచించారు కూడా. నెహ్రూ నుంచి ఈ రకమైన సూచన వెలువడడానికి ప్రత్యేకమైన కారణం ఉంది. భాషాప్రయుక్త రాష్ట్రాలను ఏర్పాటు చేయటం నెహ్రూకు ఇష్టంలేదు. ప్రప్రథమంగా ఆయన అంగీకరించిన భాషాప్రయుక్త రాష్ట్రం ఆంధ్రరాష్ట్రం. ఈ రాష్ట్రంలో ఉన్న వైవిధ్యంతో పాటు రాయలసీమ, కోస్తా ప్రాంతాల మధ్య ఉన్న విభేదాల గురించి కూడా ఆయనకు బాగా తెలుసు. రాష్ట్ర రాజధాని ఎక్కడ ఏర్పాటు చేసుకోవాలనే అంశాన్ని వీరు అంత సులభంగా పరిష్కరించుకోలేరని ఆయనకు పరిపూర్ణమైన నమ్మకం. ఒకవేళ నాయకులు రాజధాని ఏర్పాటు గురించి ఏకాభిప్రాయానికి రాలేకపోతే భాషాప్రయుక్తరాష్ట్రంగా ఆంధ్రరాష్ట్రం ఏర్పడడానికి అవరోధం ఏర్పడుతుంది. ఈ నేపథ్యంలో ప్రకాశం మద్రాసులో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేశారు. టంగుటూరి ప్రకాశం ఆత్మకథ 'నా జీవనయాత్ర'లో ఆనాటి పరిణామాలను తెన్నేటి విశ్వనాథం కన్నులకు కట్టినట్టు పొందుపరిచారు (ప్రకాశం ఆత్మకథ చివరి భాగాలను తెన్నేటి విశ్వనాథం పూర్తి చేశారు). మద్రాసులో ప్రకాశం ఏర్పాటు చేసిన సమావేశంలో కృషక్ పార్టీ నుంచి గౌతు లచ్చన్న, కమ్యూనిస్టు పార్టీ నుంచి నాగిరెడ్డి పాల్గొన్నారు. విశాఖపట్నాన్ని రాజధానిని చేయాలన్న తన ప్రతిపాదనను తెన్నేటి విశ్వనాథం ప్రకాశం సూచనతోనే విరమించుకున్నారు. గోదావరి జిల్లాల నుంచి ఎటువంటి ప్రతిపాదన రాలేదు. గుంటూరు, విజయవాడ ప్రాంతం కోసం కమ్యూనిస్టులు పట్టుబట్టారు. తిరుపతిలో రాజధానిని ఏర్పాటు చేయాలనీ, లేకపోతే చిత్తూరు జిల్లా మద్రాసు రాష్ట్రంలో ఉండిపోయే ప్రమాదం ఉందనీ గౌతు లచ్చన్న గట్టిగా అభిప్రాయపడ్డారు. కడపలోని భవనాల ఫోటోలు చూపి, కడప కోటిరెడ్డి కడపను రాజధానిని చేయాలని పట్టుబట్టారు. రాష్ట్ర ఏర్పాటులో ప్రధాన భూమికను పోషిస్తున్నందువల్ల ఏ ప్రాంతాన్ని అందుకు ప్రతిపాదించ వద్దని నీలం సంజీవరెడ్డిని ముందుగానే ప్రకాశం కోరారు. అన్నిటికీ మించి రాయలసీమ ప్రజాప్రతినిధులందరూ ఒక పిటిషన్ రాసి సంతకాలు చేసి తమ దగ్గర పెట్టుకున్నారు. దాని సారాంశం ఏమిటంటే; రాజధాని రాయలసీమలో పెట్టకపోతే తమ ప్రాంతాన్ని మద్రాసు రాష్ట్రంలోనే ఉంచాలని.

మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఏకాభిప్రాయానికి రాకపోవడంతో ఈ నిర్ణయాన్ని ప్రకాశం పంతులు గారికి వదిలేస్తూ అఖిలపక్షం తీర్మానించింది. ఆయన వారందర్నీ మధ్యాహ్నం 03.00 గంటలకు సమావేశమవుదామని చెప్పి, ఆ వేళకు తిరిగి సమావేశం కాగానే గౌతు లచ్చన్నను కాగితం, కలం తీసుకొని కర్నూలు పేరు రాయమని ఆదేశించారు. ఇట్లా ఆనాడు కర్నూలు రాజధానిగా నిర్ణయమైంది. ఆ నిర్ణయం జరుగకపోతే రాయలసీమ ప్రజాప్రతినిధులు మద్రాసు రాష్ట్రంలో ఉండటానికే మొగ్గుతారని ప్రకాశం గారికి తెలుసు. రాజధాని సమస్య చాలా జటిలమని తెలిసే నెహ్రూ మొదట ఆ అంశం తేల్చుకోవాలని ఆంధ్ర నాయకులకు సూచించారు. వాస్తవానికి రాయలసీమ వాసులు మద్రాసు రాష్ట్రంలో ఉండటానికే మొగ్గ చూపినట్టయితే భాషాప్రయుక్త రాష్ట్రాల విభజనకు పునాది లేకుండా పోతుంది. అది తెలిసిన ప్రకాశం దార్శనికతతో నిర్ణయం తీసుకొని స్వతంత్ర భారతంలో ఆంధ్రరాష్ట్రం తొలి భాషా ప్రయుక్త రాష్ట్రంగా అవతరించడానికి అవకాశం కల్పించారు. తరువాత గుంటూరులో హైకోర్టు ఏర్పాటయింది.

ఇప్పుడు అమరావతికి వద్దాం. ఆ నగర నిర్మాణం ఏ రకంగా జరిగిందో పరిశీలిద్దాం. నవ్యాంధ్ర రాజధాని ఏర్పాటు చేయడానికి తగిన సూచనలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం శివరామకృష్ణన్ కమిటీని ఏర్పాటు చేసింది. కానీ ఈ కమిటీ సూచనలు ఏమాత్రం పరిగణనలోకి తీసుకోకుండా ఏకపక్షంగా రాజధాని నిర్మాణ ప్రక్రియ జరిగిపోయింది. ఇంత చరిత్ర కలిగిన అంశాన్ని, చాలా తేలికగా, వ్యూహాత్మక సర్దుబాట్లతో, చర్చ కూడా లేకుండా ప్రస్తుత రాజకీయ నాయకత్వం అమరావతిలో రాజధానిని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ చర్య వల్ల కోస్తా ప్రాంతానికి కూడా పెద్ద ప్రయోజనం లేదు. ఒక వర్గ స్థిరాస్తి, వాణిజ్య ప్రయోజనాలకు కొమ్ముకాసే విధంగా ఈ రాజధాని నిర్మాణం సాగుతున్నది.

అదే మంచి సంప్రదాయం


మన దేశంలోనే ఇతర రాష్ట్రాలను పరిశీలించండి! అక్కడ కూడా రాజధాని, హైకోర్టు వేర్వేరు ప్రాంతాలలోనే కనిపిస్తాయి. దాదాపు తొమ్మిది రాష్ట్రాల వారు ఇలా రాజధానినీ, హైకోర్టునూ వేర్వేరు ప్రాంతాలలో నిర్మించుకున్న వాస్తవాన్ని గమనిస్తాం. భారతదేశ సెంట్రల్ ప్రావిన్స్ ప్రాంతంలోని కొన్ని సంస్థానాలను విలీనం చేయగా ఏర్పడినదే మధ్యప్రదేశ్ రాష్ట్రం. ఈ నేపథ్యాన్ని బట్టే ఆ రాష్ట్రాన్ని ఏర్పాటు చేయగానే ప్రాంతాల మధ్య సరైన అవగాహన కోసం రాజధానిని భోపాల్ నగరంలోను, హైకోర్టును జబల్‌పూర్‌లోను ఏర్పాటు చేసుకున్నారు. అదేవిధంగా ఉత్తరప్రదేశ్. ఆ రాష్ట్రానికి రాజధాని లక్నో. కాగా హైకోర్టును అలహాబాద్‌లో ఉంచారు. ఉత్తరాంచల్ రాష్ట్రంలో రాజధాని డెహ్రాడూన్‌లో, హైకోర్టు నైనిటాల్‌లో ఉన్నాయి. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో రాజధాని నయా రాయ్‌పూర్‌లో, హైకోర్టు బిలాస్‌పూర్‌లోను ఉన్నాయి. మద్రాసు ప్రెసిడెన్సీలోని మలయాళ భాష మాట్లాడే ప్రాంతాలు, ట్రావెన్కోర్ సంస్థానం విలీనం చేయగా ఏర్పడినదే కేరళ. ఈ చిన్న రాష్ట్రానికి రాజధాని తిరువనంతపురంలోను, హైకోర్టు కొచ్చిలోను ఉన్నాయి. సంస్థానాల ఏకీకరణ ద్వారా ఏర్పడిన రాజస్తాన్‌లో కూడా రాజధాని జైపూర్‌లో, హైకోర్టు జోధ్‌పూర్‌లోను ఉన్నాయి. గుజరాత్, ఒడిశా రాష్ట్రాలు తమ రాజధానులను ఎక్కడ ఏర్పాటు చేయాలో చాలాకాలం చర్చించాయి. గుజరాత్, ఒడిశాలకు రాజధానులు గాంధీనగర్, భువనేశ్వర్. వాటి హైకోర్టులు అహమ్మదాబాదు, కటక్‌లలో ఉన్నాయి.

ఇటువంటి చారిత్రక సత్యాలను విస్మరించి సంకుచిత దృష్టితో తీసుకోనే నిర్ణయాలు రాష్ట్ర ప్రజల మధ్య అగాధాలు సృష్టిస్తాయి. తరతరాలకు సరిపోయే తలనొప్పులను సృష్టించి పెడతాయి. ఆంధ్రప్రదేశ్ హైకోర్టును రాయలసీమలో ఏర్పాటు చేయడం కేవలం ఆ ప్రాంతపు అంశం కాదు. ఇది వారి న్యాయబద్ధమైన హక్కు. రాజధాని కోసం కర్నూలును ఎంపిక చేసినప్పుడు, సహజంగానే గుంటూరుకు హైకోర్టు వచ్చింది. ఇందుకోసం ఎవరూ ప్రత్యేకంగా గళం విప్పవలసిన అవసరం రాలేదు కూడా. ఈనాడు హైకోర్టును రాయలసీమలో ఏర్పాటు చేసుకోవడమనేది ఒక ప్రాంతీయపరమైన అంశంగానో, కోస్తా ఆంధ్ర ప్రయోజనాలకు వ్యతిరేకమన్న ధోరణిలోనో ఆలోచించాల్సిన అవసరం లేదు. సహజమైన, న్యాయబద్ధమైన (Bared on Equity Fairnerr) నిర్ణయంగానే స్వాగతించాలి. నాయకులలో ఇటువంటి దార్శనికత లోపిస్తే భవిష్యత్తంతా సమస్యలతో నిండిపోతుంది.

వ్యాసకర్త మాజీ ఐఏఎస్ అధికారి,
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి

"దుడుకుగల"

కీర్తి హెచ్చరిక. కీర్తి భయంకరమైన బాధ్యత. 24 గంటలూ కంటిమీద కునుకు లేకుండా కాపాడుకోవలసిన, దుర్మార్గమైన ఆస్తి. సజ్జనుడికి అది అలవోక. వ్యసనపరుడి మనసు ఏ మాత్రం బెసికినా– ఆమూలాగ్రం కబళించే వికృత శక్తి.



గొల్లపూడి మారుతీరావు

పుష్య బహుళ పంచమి. త్యాగరాజస్వామి నిర్యాణం. త్యాగరాజ ఆరాధనోత్సవాల ప్రారంభం. త్యాగరాజు ఒక అపూర్వమైన పంచరత్న కీర్తనని రచించారు–గౌళ రాగంలో –'దుడుకుగల నన్నే దొరకొడుకు బ్రోచురా' అంటూ. భక్తి పారవశ్యంతో దాదాపు 200 సంవత్సరాలు ప్రాణం పోసుకు నిలిచిన అపూర్వ సంగీత రత్నాలను సృష్టించిన వాగ్గేయకారుడు తనది 'దుడుకుగల' జీవనం అని చెప్పుకున్నాడు. దుడుకుతనానికి తననే ప్రధాన పాత్రని చేసుకుని– ఇవ్వాళ్టికీ కనిపించే దుడుకుతనానికి ప్రాణం పోశాడు. ఇదేమిటి? ఈ 'దొరకొడుకు' ఎవరు? అనిపించేది కీర్తన విన్నప్పుడల్లా. కల్లూరి వీరభద్ర శాస్త్రిగారు సమాధానం చెప్పారు. కోపంతోనో, నిస్పృహతోనో మాట్లాడినప్పుడు– 'నీ తాత కొడుకు ఎవడు తీరుస్తాడురా నీ ఇక్కట్లు' అనడం గ్రామీణ ప్రజల నానుడి.

సరే. ఈ 'దుడుకు' ఏమిటి? పరధన పరకాంతా చింతనతో పొద్దుపుచ్చుతూ చపలచిత్తుడై బతికాడట. 'సతులకు కొన్నాళ్లాస్తికై సుతులకు కొన్నాళ్ల ధన తతులకై' తిరిగాడట. తమిళంలో ఒక సామెత ఉంది: 'ఆస్తికి ఒరుప య్యన్ అరిమికి ఒరు పొణ్ణు' అని. ఆస్తిని కూడబెట్టి ఇవ్వడానికి కొడుకు, ప్రేమని పంచుకోడానికి కూతురు. త్యాగరాజు తిరువయ్యారులో రచన సాగించాడు కనుక తమిళ నానుడి వారి రచనలో తొంగి చూడటం ఆశ్చర్యం కాదు. దాదాపు 200 సంవత్సరాలు మానవ నైజంలో నిలదొక్కుకున్న జబ్బును– ఇవ్వాళ్టికి చెక్కు చెదరకుండా వర్తించేటట్టు ఆనాడే సూచించిన ద్రష్ట త్యాగబ్రహ్మం. 'భక్తి' ఆనాటి ఆలంబన.

సృష్టిలో, సమాజ పరిణామ శీలంలో విచిత్రం ఏమిటంటే త్యాగరాజు వెళ్లిపోయిన (1847) మరుసటి సంవత్సరమే ఒకాయన పుట్టాడు. ఆయన కందుకూరి వీరేశలింగం. మరో 14 ఏళ్లకి పుట్టిన మరో మహానుభావుడు గురజాడ. మరుసటి సంవత్సరమే మరో వ్యక్తి జన్మించాడు– గిడుగు రామమూర్తి. వీరు ముగ్గురూ భక్తికి దూరంగా జరిగి సమాజ హితానికి చెరగని ఉద్యమాలుగా నిలిచారు. గురజాడ 'కన్యాశుల్కం' ఇప్పటికీ సమాజ రుగ్మతకు అద్దం పట్టే కళాఖండంగా ప్రాణం పోసుకుంది. అటు త్యాగరాజూ చిరంజీవిగా ఈనాటికీ దక్షిణాది సంగీత ప్రపంచంలో విశ్వరూపం దాల్చాడు.

వీటి జీవ లక్షణానికి పెట్టుబడి 'సామాజికమైన రుగ్మత'ను ఎండగట్టడమే. ఒకాయన– త్యాగరాజు– ఆర్తిని కీర్తిని చేసుకున్నాడు. తర్వాతి తరంవారు మనిషి దుర్వ్యసనాలను ఎండగట్టడానికి అక్షర రూపం ఇచ్చారు.

అమెరికాలో ఒకావిడ కవితలు రాసింది. రాసిన ఏ కవితనూ ప్రచురించలేదు. ఆమె వెళ్లిపోయాక ఆమె సోదరి ఆ కవితల్ని చూసి ఆశ్చర్యపడి ప్రచురించింది. ఆ కవయిత్రి అమెరికాలో cult figure అయింది– ఎమిలీ డికిన్సన్.

ఆమె కవిత – Fame is a bee / It has a song / It has a sting/ Ah, it has a wing!

కీర్తి తేనెటీగ లాంటిది. అలరిస్తుంది. ఆదమరిస్తే కాటేస్తుంది. కాపాడుకోలేకపోతే రెక్కలు విదిలించి ఎగిరిపోతుంది.



జీవన కాలమ్

దాదాపు 55 సంవత్సరాల కిందటి చిత్రం 'ఎక్రాస్ ది బ్రిడ్జ్'. రాడ్ స్టీగర్ ముఖ్య పాత్ర. ఓ గొప్ప వ్యాపారి. ఓ గోడకి నిలువునా ఆయన చిత్రాన్ని పరిచయం చేశారు. ప్రజాధనాన్ని దోచుకున్నాడు. దేశం నుంచి పరారి అయ్యాడు. రైల్లో మరొకరి పాస్‌పోర్టుని దొంగిలించి, అతణ్ణి రైల్లోంచి తోసేశాడు. అతనికి ఓ కుక్క. రైలు ప్రయాణీకుడు నేరస్తుడు. ఒక దేశంలో మోసగాడు ఇప్పుడు ఈ దేశంలో నేరస్తుడయ్యాడు. కుక్కతోపాటు పుల్లి విస్తరాకుల్లో ఆహారం తిన్నాడు. కుక్కతో ఆత్మీయత పెరిగింది. ఇతన్ని పట్టుకోజూసిన తన దేశపు రక్షక భటులు– తమ దేశానికీ పొరుగు దేశానికీ మధ్య గల పొలిమేరకు కుక్కని దాటించే ప్రయత్నం చేశారు. కుక్క కోసం ఈ వ్యాపారి పరుగు తీశాడు. కుక్కతో పాటు స్వదేశపు పొలిమేర హద్దుమీద రక్షకభటుల కాల్పులకి ప్రాణం వదిలాడు. డబ్బుమీద వ్యామోహం ఒక నాడు తరిమింది. కుక్కమీద వ్యామోహం ఈనాడు కట్టిపడేసింది. హద్దుమీద 'కుక్కచావు' చచ్చాడు.

ఒకదేశంలో కీర్తికీ పొరుగు దేశంలో తనది కాని కుక్కతో పుల్లి విస్తరాకుల్లో తిండి తినడానికీ– ఇంతకంటే మానవ పతనానికీ నిదర్శనం లేదనుకుంటాను.

కీర్తి హెచ్చరిక. కీర్తి భయంకరమైన బాధ్యత. 24 గంటలూ కంటిమీద కునుకు లేకుండా కాపాడుకోవలసిన, దుర్మార్గమైన ఆస్తి. సజ్జనుడికి అది అలవోక. వ్యసనపరుడి మనసు ఏ మాత్రం బెసికినా– ఆమూలాగ్రం కబళించే వికృత శక్తి.

మరి మహాత్ముల, సత్పురుషుల మాట? కీర్తి వారి సత్ప్రవర్తన పరిమళం.

దుర్వ్యసన పరుడి కీర్తి కేవలం జిడ్డు. దాన్ని చిన్న తప్పటడుగు అవలీలగా చెరిపేస్తుంది. వెనక్కి తిరిగి చూసుకునేలోగా అధఃపాతాళానికి తొక్కేస్తుంది.

కీర్తి వరం– సత్పురుషులకి. కీర్తి కేవలం ఆర్జన– వ్యసనపరులకి.

అండా సెల్ నుంచి అమ్మకు..!



అమ్మా నాకోసం దుఃఖించకు

నువ్వు నన్ను చూడటానికి వచ్చినపుడు
ఫైబర్ గాజుకిటికీలో నుంచి
నీ ముఖం నేను చూడలేకపోయాను
నువ్వు నా వైకల్యం చెందిన దేహాన్ని
చూడగలిగి ఉంటే
నేనింకా బతికే ఉన్నానని
నువ్వు నిజంగా నమ్మి ఉండేదానివి

అమ్మా నేను నీ దగ్గర లేనందుకు
దుఃఖించకు

నేను ఇంట్లో ఉన్నప్పుడు
బయట ప్రపంచంలో
నాకు చాలామంది మిత్రులున్నారు

నేనీ జైల్లో అండా సెల్‌లో
బంధించబడినాక
విశ్వమంతా నాకింకెంతో మంది
నేస్తాలు లభించారు.

అమ్మా క్షీణిస్తున్న నా ఆరోగ్యం గురించి
దిగులుపడకు

నా బాల్యంలో నాకొక కప్పు పాలు కూడ
నువ్వు సమకూర్చలేనప్పుడు
నువ్వు నీ శక్తితో, ధైర్యంతో కూడిన
మాటలతో నన్ను కుడిపావు
ఇప్పుడీ బాధలో వేదనలో
నువ్విచ్చిన ఆశ్వాసంతోనే
నేను మరింత శక్తిమంతుణ్ణవుతున్నాను

అమ్మా నీ ఆశల్ని వదులుకోకు
జైలు నాకు మరణం కాదు
పునర్ జననం
అని నేను అర్థం చేసుకున్నాను

నేను ఇంటికి తిరిగి వస్తాను
నాకు ఆశను ధైర్యాన్ని ఇచ్చి
పోషించిన నీ ఒడిలోకి

అమ్మా
నా స్వేచ్ఛ గురించి భయపడకు

నేను పోగొట్టుకున్న స్వేచ్ఛ
ఎంతోమందిని పొందిన స్వేచ్ఛ
అభాగ్యజీవులకు అండగా
నాతోపాటు నిలబడటానికి వస్తున్న
ప్రతి ఒక్కరిలో
నేను నా స్వేచ్ఛను పొందుతున్నాను


(2017 నవంబర్ 14న ములాఖత్‌లో నువ్వు వచ్చి జైలు కిటికీ దగ్గర నిలబడి పోయాక)

నీకోసం ఇది ఎవరైనా అనువదిస్తారని ఆశిస్తాను. అమ్మా నువు అర్థం చేసుకోలేని విదేశీ భాషలో రాస్తున్నందుకు క్షమించు. నన్నేం చేయమంటావు? నా శిశుత్వంలో నీ ఒడిలో నాకు నువ్వు నేర్పిన తియ్యని భాషలో రాయడానికి నాకు ఇక్కడ అనుమతి లేదు.

ప్రేమతో నీ శిశువు,
జి.ఎన్. సాయిబాబా,
అండాసెల్, కేంద్ర కారాగారం,
నాగపూర్

– తెలుగు సేత: వరవరరావు


ధర్మ సాధం



పూర్వం ఇద్దరు రాజులు యుద్ధానికి దిగారు. ఓడిన రాజు తన రాజ్యాన్ని వీడి, అడవుల్లోకి పారిపోయాడు. అక్కడే ఆధ్యాత్మిక చింతనతో కాలం గడుపుతున్నాడు. గెలిచిన రాజు ఆ ఉత్సాహంతో యజ్ఞం తలపెట్టాడు. అనుకోకుండా, అక్కడ యాగధేనువు మరణించింది. యజ్ఞాన్ని ఎలా పూర్తిచేయాలో తెలియక ఆ రాజు తికమక పడ్డాడు. నగర పురోహితుల్ని సంప్రదిస్తే– ఆ ధర్మ సూక్ష్మం తెలిసినవాడు ఓడిపోయిన రాజేనని తేలింది.

గెలిచిన రాజు ఏమాత్రం సందేహించకుండా ఓడిన రాజు వద్దకు వెళ్లి, యజ్ఞాన్ని పరిపూర్తి చేయాలని అర్థించాడు. ఆయనా ఏ శషభిషలకూ తావు లేకుండా ధర్మనిర్ణయం కోసం ముందుకొచ్చాడు. శత్రువుకు సహకరించాడు. ఆ ఇద్దరు రాజులూ ఆర్ష ధర్మ నిర్వహణలో అహంకారాల్ని త్యజించారు. వారి కథే– శ్రీకృష్ణదేవరాయల 'ఆముక్తమాల్యద'లోని 'ఖాండిక్య కేశిధ్వజోపాఖ్యానం' సారాంశం. ఈ కథలో ఓడిన రాజు ఖాండిక్యుడు; గెలిచినవాడు కేశిధ్వజుడు. కథ చివర గొప్ప మలుపు ఒకటుంది.

తన యజ్ఞ సంపూర్తికి సహకరించిన ఖాండిక్యుడికి గురుదక్షిణగా ఏది కావాలన్నా ఇస్తానని కేశిధ్వజుడు ప్రకటిస్తాడు. ఈ అవకాశాన్ని చేజిక్కించుకున్న ఖాండిక్యుడు తాను కోల్పోయిన రాజ్యం తిరిగి గురుదక్షిణగా కావాలన్నా ఇచ్చేయడానికి కేశిధ్వజుడు సిద్ధపడతాడు. కానీ రాజ్యసంపద అయాచితంగా వచ్చిపడుతున్నా ఖాండిక్యుడు కాదంటాడు! తనకు బ్రహ్మజ్ఞానాన్ని బోధించాలని, అదే కేశిధ్వజుడి నుంచి తాను కోరుకునే గురుదక్షిణ అని ప్రకటిస్తాడు.



జ్యోతిర్మయం

ఖాండిక్యుడి నిర్ణయం కేశిధ్వజుణ్ని విస్మయానికి గురిచేస్తుంది. అప్పుడు ఖాండిక్యుడు అంటాడు– 'రాజ్యభోగాలు కేవలం భౌతిక సంపదలు. వాటిని కష్టంతో, శారీరక శ్రమతో సాధించుకోవాలి. అంతేగాని, నా కంటే బలవంతుడి చేతిలో ఓడిపోయాను. తిరిగి పుంజుకొని ధర్మమార్గంలో, క్షాత్రంతో నా రాజ్యాన్ని నేను తిరిగి చేజిక్కించుకుంటేనే అది ఒప్పుతుంది' అని బదులిస్తాడు ఖాండిక్యుడు!

ఇలాంటి కథల్ని పిల్లలకు పాఠ్యాంశాలుగా నిర్ణయిస్తే, వారి బాల్యాన్ని అవి ధార్మిక పథంలోకి నడిపిస్తాయి. వ్యక్తిత్వ వికాసానికి దోహదం చేస్తాయి. ఉచితాల కోసం తాపత్రయపడకుండా ఆపుతాయి.

ఆముక్తమాల్యదలోని ఖాండిక్య కేశిధ్వజోపాఖ్యానం– ఆ కావ్యానికి గుండెకాయ వంటిదని ప్రశస్తి రావడానికి ముఖ్య కారణాలేమిటి? ఆ కథలోని ధార్మిక నేపథ్యం, ప్రబోధ గుణం. గెలుపు ఓటముల విషయంలో, కర్తవ్య నిర్వహణలో, అయాచిత అవకాశాల తిరస్కరణలో ప్రతిఫలించిన ధర్మస్వరూపమే– భారతీయతకు వన్నెలద్దుతూ వచ్చింది.

– ఎస్.ఎస్. మూర్తి

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును. టోల్ ఫ్రీ నం: 1800 270 1083

సొసైటీలో 'సోషల్' క్రేజ్

- ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న సోషల్ మీడియా వినియోగం
- మాస్, క్లాస్ తేడా లేకుండా అందరికీ వేదికవుతున్న 'మాధ్యమం'
- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నుంచి క్రిటిక్ కత్తి మహేశ్ దాకా
- సెలబ్రిటీల నుంచి కార్పొరేట్ల వరకు అంతా హల్‌చల్



సాక్షి, హైదరాబాద్: ప్రచారానికైనా.. నిరసనకైనా.. పొగడ్తలకైనా.. తెగడ్తలకైనా ఇప్పుడంతా సోషల్ మీడియానే. కయ్యానికి కాలుదువ్వాలన్నా, దూసిన కయ్యానికి పదును పెరగాలన్నా.. నిర్ణయాలు తీసుకోవాలన్నా, తీసుకున్న నిర్ణయాలు వ్యతిరేకించాలన్నా.. వ్యాపార ప్రకటనలకైనా, కీర్తిప్రతిష్టలకైనా ఆయుధం, అస్త్రం సామాజిక మాధ్యమమే. మనోభావాలను పంచుకోవడం, సమకాలీన పరిస్థితులపై గళం విప్పడం, నవీన ఆవిష్కరణలకు నాంది పలకడం, సామాజిక సేవకు సంసిద్ధులవడం.. అన్నింటికీ సోషల్ మీడియా వేదికవుతోంది. కీలక నిర్ణయాలు, ఘాటైన వ్యాఖ్యలతో సోషల్ మీడియాలో రాజకీయ నేతలు, సెలబ్రిటీలు హల్‌చల్ చేస్తున్నారు.

ట్రంప్, కిమ్ ట్వీట్ వార్

అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. ఇటు పాకిస్తాన్, అటు ఉత్తర కొరియాపై కొన్ని నెలలుగా తన నిర్ణయాలను ట్వీటర్‌లో వెలువరిస్తున్నారు. పాక్‌కు భద్రత సహాయం వెనక్కి తీసుకోవడం నుంచి ఆర్థిక సహాయం వరకూ ట్వీటర్‌లోనే తెలిపారు. ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ నిర్ణయాలను వ్యతిరేకించడంతో పాటు అణుయుద్ధానికి ఢీ అంటే ఢీ రీతిలో స్పందించి ప్రపంచమంతా తన నిర్ణయాలపై చర్చించుకునేలా చేశారు.

నో మాస్, నో క్లాస్..

భారత్‌లోనే కాదు ప్రపంచవ్యాప్తంగా సోషల్ మీడియాలో ట్వీటర్ హవా అంతా ఇంతా కాదు. అమెరికా అధినేత ట్రంప్ నుంచి సినీ విమర్శకుడు కత్తి మహేశ్ వరకు ట్వీటర్ వేదికగా చెలరేగుతున్నారు. ఎవరు ఎక్కడి నుంచి ట్వీట్ చేసినా క్షణాల్లో స్పందించడం, ప్రతి ట్వీట్ చేయడం జరుగుతోంది. మరోవైపు ట్వీటర్‌కు ఏమాత్రం తగ్గకుండా ఫేస్‌బుక్ కూడా సామాజిక పోస్టింగ్ వార్‌లో తనదైన ముద్ర వేస్తోంది. మాస్, క్లాస్ తేడా లేకుండా ప్రతి ఒక్కరూ ఖాతా తెరుస్తున్నారు. అభిప్రాయాలు తెలియజేస్తున్నారు. సోషల్ మీడియా వార్‌లో ట్వీటర్, ఫేస్‌బుక్ ప్రధాన ఆయుధాలుగా నిలుస్తున్నాయని అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

ప్రతి రోజూ టాప్ ట్రెండింగ్

దేశంలో ఎక్కువగా ఏ విషయానికి ట్వీటర్‌ను వాడారో ప్రతిక్షణం అందులో ట్రెండ్ అవుతుంది. బాలీవుడ్ స్టార్ హీరో హృతిక్‌రోషన్ పుట్టినరోజు సందర్భంగా కోట్ల మంది శుభాకాంక్షలు తెలిపారు. 100 శాతం ఎఫ్‌డీఐలపైనా ట్వీటర్‌లో భారీ చర్చే జరిగింది. మొబైల్ ఫోన్ ఆఫర్లపై ట్వీట్లకూ భారీ డిమాండ్ కనిపించింది.

పొలిటికల్ ట్వీట్ వార్

రాష్ట్రంలో రాజకీయపరంగా ట్వీటర్ ఖాతా వినియోగంలో మంత్రి కేటీఆర్ అందరికన్నా ముందున్నారు. తన నిర్ణయాలు, అభిప్రాయాలను మంత్రి ట్వీటర్‌లో వెల్లడిస్తున్నారు. తమ సమస్యలనూ ప్రజలు ట్వీటర్‌లోనే తెలపడం, నిర్ణయాన్నీ అక్కడే వెలువరించడం జరుగుతోంది. తెలంగాణలో సంచలనం రేపిన డ్రగ్స్ కేసుపై ట్వీటర్‌లో దుమారం రేగింది. డ్రగ్స్ కేసు వెలుగులోకి వచ్చినపుడు మంత్రి కేటీఆర్‌పై కాంగ్రెస్ సీనియర్ నేత దిగ్విజయ్ చేసిన ట్వీట్ రాజకీయ ప్రకంపనలు సృష్టించింది. కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉత్తర్ ప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ మధ్య రగులుతున్న హిందూ రగడ దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. సెలబ్రిటీలు కంగనా రనౌత్, హీరో హృతిక్ రోషన్ మధ్య వేధింపుల వ్యవహారమూ ట్వీటర్ వేదికగా బాలీవుడ్ ఇండస్ట్రీలో వేడి రగిల్చింది. తాజాగా జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌పై టాలీవుడ్ సినీ విమర్శకుడు కత్తి మహేశ్ ట్వీట్లు తెలుగు రాష్ట్రాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. ఇదే వ్యవహారంలో హీరోయిన్ పూనమ్‌కౌర్ ట్వీట్లూ వేడి రగిల్చాయి. అలాగే అమాయక యువతను తెలంగాణ పోలీస్ ఉగ్రవాదం పేరుమోపి వేధిస్తోందని డిగ్గీరాజా చేసిన వ్యాఖ్యలను ట్వీటర్‌లోనే పోలీస్ శాఖ తిప్పికొట్టింది.

కంపెనీలు సైతం..

ట్వీటర్‌లో పలు కంపెనీలకు మంచి క్రేజ్ ఉంది. బ్యాంకుల్లో ఎస్ బ్యాంకు, ఎస్‌బీఐ, ఆర్‌ఐడీఎల్‌ఆర్‌తో పాటు మొబైల్ కంపెనీల్లో రియలన్స్, ఎయిర్‌టెల్, ఫ్లిప్‌కార్ట్, బీఎండబ్ల్యూ, సామ్‌సంగ్, కేరళ టూరిజం, ఎఫ్1 రేస్, జాతీయ మీడియా చానళ్లు, ఇండియన్ ప్రీమియర్ లీగ్, మ్యూజిక్ చానళ్లున్నాయి.

కోట్లలో ఫాలోవర్స్

ప్రధాని నరేంద్రమోదీ తన అధికార నిర్ణయాలు, అభిప్రాయాలు అధికారిక ట్వీటర్ ఖాతా ద్వారా పంచుకుంటున్నారు. ఆయనకు దాదాపు 3.9 కోట్ల మంది ఫాలోవర్స్ ఉన్నారు. రాహుల్‌గాంధీ ట్వీట్లకూ మంచి రెస్పాన్స్ వస్తోంది. ప్రస్తుతం రాహుల్‌కు 55 లక్షల మంది ఫాలోవర్స్ ఉన్నట్టు తెలిసింది. కాంగ్రెస్ కురువృద్ధుడు దిగ్విజయ్‌సింగ్ చేసే ట్వీట్లు హాట్ టాపిగ్గా మారుతుంటాయి. ప్రధానిపై వాడివేడిగా ట్వీట్లు చేస్తుంటారు. కోట్ల మంది ఫాలోవర్స్ ఉన్న సెలబ్రిటీల్లో అమితాబ్‌బచ్చన్, షారుక్‌ఖాన్, అమీర్‌ఖాన్, సల్మాన్‌ఖాన్, రజనీకాంత్, దీపికా పదుకోన్, హృతిక్‌రోషన్, ప్రియాంకాచోప్రా, అక్షయ్‌కుమార్, ఏఆర్ రెహమాన్, సచిన్ టెండూల్కర్, విరాట్ కోహ్లీ, కరణ్ జోహార్, అభిషేక్‌బచ్చన్, సోనమ్‌కపూర్, షాహిద్‌కపూర్, ఆలియాభట్, అనుష్కశర్మ ఉన్నారు. రాజకీయరంగానికొస్తే ప్రధాని మోదీతోపాటు అరవింద్ కేజ్రీవాల్, శశి థరూర్, సుష్మాస్వరాజ్, ఒమర్ అబ్దుల్లా, ఎస్‌ఎం కృష్ణ, దిరిక్ ఓబ్రియాన్, సల్మాన్ అనీజ్, కేడీ సింగ్, రాజీవ్ చంద్రశేఖర్, ప్రియాదత్, సంజయ్ నిరుపమ్, స్మృతీ ఇరానీ, అఖిలేశ్‌యాదవ్, అరుణ్‌జైట్లీ, నితిన్ గడ్కరీ తదితరులున్నారు. టాలీవుడ్‌లో నాగార్జున, పవన్‌కళ్యాణ్, మహేశ్‌బాబు, జూనియర్ ఎన్టీఆర్, రామ్‌చరణ్, అల్లు అర్జున్, రానా, నితిన్, అఖిల్, సమంత, రకుల్‌ప్రీత్‌సింగ్, తదితరులున్నారు.

రేపటిలోగా వేతనాలు చెల్లించండి

రేయాన్స్ ఫ్యాక్టరీకి మంత్రుల ఆదేశం


సాక్షి, హైదరాబాద్: భూపాలపల్లి జిల్లా కమలాపూర్ రేయాన్స్ ఫ్యాక్టరీ కార్మికులకు శుక్రవారంలోగా ఒక నెల వేతనం చెల్లించాలని ఆ ఫ్యాక్టరీ సీఈవో నిహార్ అగర్వాల్‌ను ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి, హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి, గిరిజన శాఖ మంత్రి చందూలాల్, ఎంపీ సీతారాంనాయక్ ఆదేశించారు. ఫ్యాక్టరీ మూతపడడంతో 32 నెలలుగా వేతనాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, కంపెనీ తమ గోడును పట్టించుకోవడం లేదని కార్మికులు మంత్రులకు మొరపెట్టుకున్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 2న ఫ్యాక్టరీ ప్రతినిధులు, కార్మిక శాఖ అధికారులు, కార్మిక యూనియన్ నేతలతో కడియం, నాయిని, చందూలాల్ సమావేశమై చర్చించారు. 12లోపు వేతనాలు చెల్లించి, ఫిబ్రవరిలో ఫ్యాక్టరీ భవితవ్యాన్ని తేల్చాలన్నారు. ఇటీవల పేపర్ పల్ప్‌కు ధర పెరగడంతో పేపర్ పల్ప్ ఫ్యాక్టరీగా మార్చి నడిపించే ప్రతిపాదనలను పరిశీలించాలని కంపెనీ ప్రతినిధులకు మంత్రులు సూచించారు. ఫ్యాక్టరీని మూసివేయాలనుకుంటే కార్మికులకు రావాల్సిన బకాయిలు చెల్లించాలన్నారు. దీనికి సంబంధించి ఫిబ్రవరి 14న కంపెనీ బోర్డ్ మీటింగ్ లో చర్చించి నిర్ణయం తీసుకుంటామని ఫ్యాక్టరీ సీఈవో చెప్పారు. ఈసారి తుదినిర్ణయం తీసుకోవాలని, లేకపోతే మేనేజ్‌మెంట్ పట్ల ఎలాంటి చర్యలు తీసుకోవాలో ప్రభుత్వం నిర్ణయించాల్సి వస్తుందన్నారు. ఫిబ్రవరి మూడోవారంలో మరోసారి సచివాలయంలో సమావేశం కావాలని నిర్ణయించారు.

మూడు నెలల్లో 'కేటీపీఎస్' విద్యుత్

మార్చి నుంచి ఉత్పత్తి ప్రారంభం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రానికి వెలుగులదించేందుకు మరో భారీ విద్యుత్‌ప్లాంట్ సిద్ధమవుతోంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలో నిర్మిస్తున్న 800 మెగావాట్ల కొత్తగూడెం సూపర్ క్రిటికల్ థర్మల్ విద్యుత్కేంద్రం(కేటీపీఎస్) 7వ దశ ప్లాంట్ పనులు 90 శాతం పూర్తయ్యాయి. కీలకమైన 940 ఎంవీఏ సామర్థ్యం జనరేటర్‌ను బుధవారం విజయవంతంగా అమర్చారు. తెలంగాణ విద్యుదుత్పత్తి సంస్థ(జెన్‌కో) సీఎండీ డి.ప్రభాకర్‌రావు ఈ ప్రక్రియను విద్యుత్‌సౌధ నుంచి ఆన్‌లైన్ ద్వారా పర్యవేక్షించారు. 480 టన్నుల బరువున్న జనరేటర్‌ను హరిద్వార్‌లోని బీహెచ్‌ఈఎల్ నిర్మించింది. దీన్ని పాల్వంచకు తరలించడానికి 288 చక్రాల భారీ వాహనాన్ని వాడారు. జనరేటర్ బిగింపుతో 90 శాతం పనులు పూర్తయ్యాయని జెన్‌కో వర్గాలు తెలిపాయి. మార్చి నుంచి విద్యుదుత్పత్తి ప్రారంభించేందుకు జెన్‌కో సన్నాహాలు చేస్తోంది. ప్లాంట్ నిర్మాణానికి గతంలో సగటున 8 ఏళ్లు పట్టగా, దీన్ని మూడేళ్లలో పూర్తి చేయాలని యుద్ధప్రాతిపదికన పనులు నిర్వహిస్తోంది. రూ.5,,548 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన పనులు 2015 జనవరి 1 నుంచి ప్రారంభమయ్యాయి.

బీసీల సమగ్రాభివృద్ధే లక్ష్యం: మంత్రి జోగు



సాక్షి, హైదరాబాద్: వెనుకబడిన కులాల సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని బీసీ సంక్షేమ శాఖ మంత్రి జోగురామన్న పేర్కొన్నారు. బీసీ సంక్షేమ శాఖ రూపొందించిన బీసీ సహకార సమాఖ్యల వెబ్‌సైట్‌ను బుధవారం సచివాలయంలో ఆయన ఆవిష్కరించారు. http://tsbcwd.cgg.gov.in వెబ్‌సైట్‌లో సమాఖ్య ద్వా రా అందే సంక్షేమ పథకాలకు అర్హులు పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంబీసీ కార్పొరేషన్ చైర్మ న్ తాడూరి శ్రీనివాస్, ఎమ్మెల్యేలు బాపురావు, విఠల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నగర పంచాయతీగా బాన్సువాడ

మరో రెండ్రోజుల్లో ఉత్తర్వులు..

సాక్షి, హైదరాబాద్: కామారెడ్డి జిల్లా బాన్సువాడ గ్రామ పంచాయతీకి త్వరలో నగర పంచాయతీ హోదా లభించనుంది. బాన్సువాడ నగర పంచాయతీ స్థాయికి హోదా పెంపునకు సంబంధించిన అధికారిక లాంఛనాలన్నీ పూర్తయ్యాయి. గ్రామ పంచాయతీ హోదాను ఉపసంహరిస్తూ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఒక ట్రెండు రోజుల్లో ఉత్తర్వులు జారీ చేయనుండగా...అదే రోజు నగర పంచాయతీ హోదా కల్పిస్తూ పురపాలక శాఖ మరో ఉత్తర్వు జారీ చేయనుంది.

మంద కృష్ణ అరెస్టు అన్యాయం: ఆర్.కృష్ణయ్య



సాక్షి, హైదరాబాద్: రాజ్యాంగ హక్కులకు విరుద్ధంగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగను అరెస్టు చేయడం అన్యాయమని బీసీ సంక్షేమ సంఘం నేత, టీడీపీ ఎమ్మెల్యే ఆర్. కృష్ణయ్య అన్నారు. బుధవారం చంచల్‌గూడ జైలులో కృష్ణయ్య నేతృత్వంలోని బృందం మంద కృష్ణను కలిసి పరామర్శించింది. కార్యక్రమంలో గుజ్జ కృష్ణ, భూపేశ్ సాగర్, కోట్ల శ్రీనివాస్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

యూనిట్‌కు 50 గొర్రెలు ఇవ్వాలి

రాష్ట్ర గొర్రెలు, మేకల పెంపకం వృత్తిదారుల సంఘం డిమాండ్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేస్తున్న గొర్రెల యూనిట్లలో జీవాల సంఖ్యను 20 నుంచి 50కి పెంచాలని రాష్ట్ర గొర్రెల, మేకల పెంపకం వృత్తిదారుల సంఘం డిమాండ్ చేసింది. వృత్తిదారుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించింది. బుధవారం హైదరాబాద్‌లోని సంఘం కార్యాలయంలో రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. గొర్రెల పంపిణీ పథకంలో కోట్ల రూపాయల అవినీతి జరిగిందని వృత్తి సంఘాల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపాముల వెంకట్రాములు ఆరోపించారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 4 లక్షల గొర్రెలు చనిపోయాయని, ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించలేదని, దీంతో పెంపకం దారులు తీవ్రంగా నష్టపోయారని సంఘం అధ్యక్షుడు నర్సయ్యయాదవ్ అన్నారు.

డీడీ ఎక్కడండి.. ఎక్కడో పోయిందండి!

పురావస్తు శాఖలో డీడీలు మాయం

కార్యాలయాల చుట్టూ కాంట్రాక్టర్ల ప్రదక్షిణ

సాక్షి, హైదరాబాద్

పురావస్తు శాఖలో పెద్ద సంఖ్యలో డిమాండ్ డ్రాఫ్టులు గల్లంతయ్యాయి. అవి ఏ పని కోసం సంబంధించినవో వివరించే కొన్ని ఫైళ్లు కూడా మాయమయ్యాయి. అందులో కాంట్రాక్టర్లకు తిరిగి చెల్లించాల్సిన మొత్తానికి సంబంధించిన వివరాలు ఉన్నాయి. వీటికి సంబంధించిన కాంట్రాక్టర్లు వారి డీడీల కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. కేంద్రం 12వ ఆర్థిక సంఘం, 13వ ఆర్థిక సంఘం నుంచి పురావస్తు శాఖకు భారీ మొత్తాన్ని కేటాయించింది. ఆ శాఖ పరిధిలోని చారిత్రక నేపథ్యం ఉన్న ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు వీటిని ఖర్చు చేయాలి. దాదాపు రూ.70 కోట్ల వరకు ఈ రూపంలో, కొన్ని రాష్ట్ర ప్రభుత్వ నిధులతో పనులు చేపట్టారు. పనుల టెండర్లు పిలిచినప్పుడు కాంట్రాక్టర్లు ఎర్నెస్ట్ మనీ డిపాజిట్ (ఈఎండీ) దాఖలు చేయాల్సి ఉంటుంది. దీన్ని డీడీ, చెక్కులు, బ్యాంకు గ్యారంటీ రూపంలో చెల్లిస్తారు. ఆ పని విలువలో రెండున్నరశాతం వరకు ఈ మొత్తం చెల్లించాల్సి ఉంటుంది. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్‌కు మాత్రం నిర్ధారిత కాలం తర్వాత తిరిగి చెల్లిస్తారు. ఇలా 12, 13వ ఆర్థిక సంఘాలు, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో చేపట్టిన పనులకు సంబంధించిన టెండర్లతో పాటు కాంట్రాక్టర్లు ఈఎండీని డీడీల రూపంలో చెల్లించారు. ఇదంతా రాష్ట్ర విభజనకు ముందు జరిగింది.



బ్యాంకులో వేయక ఏం చేసినట్లు..

సాధారణంగా ఈఎండీ తాలూకు మొత్తాన్ని బ్యాంకులో డిపాజిట్ చేస్తారు. ఆ మొత్తం, దానిపై వచ్చే వడ్డీని కూడా ఆయా శాఖలు ఖర్చు చేసుకుంటాయి. అవసరం వచ్చినప్పుడు కాంట్రాక్టర్లకు నిర్ధారిత మొత్తాన్ని తిరిగి చెల్లిస్తాయి. కానీ పురావస్తు శాఖలో మాత్రం ఆ ఈఎండీ మొత్తాన్ని బ్యాంకుల్లో డిపాజిట్ చేయలేదని తెలుస్తోంది. ఆ డీడీలను అలాగే ఫైళ్లలో ఉంచేశారని, ఇప్పుడు ఆ ఫైళ్లతో పాటు అవి కనిపించటం లేదని తెలుస్తోంది. పనులు పూర్తి కావటంతో కాంట్రాక్టర్లు ఈఎండీ మొత్తాన్ని తిరిగి చెల్లించాలని కోరడంతో అసలు విషయం బయట పడింది. అప్పుడు కాని గల్లంతైన సంగతిని గుర్తించలేదు. ఈ డీడీల విలువ ఎంతో కూడా తెలియకుండా అధికారులు గుట్టుగా ఉంచుతున్నారు. ఈ మొత్తం తిరిగి చెల్లించాలని తెలంగాణ, ఆంధ్ర పురావస్తు కార్యాలయాల చుట్టూ కాంట్రాక్టర్లు తిరుగుతున్నారు. కాంట్రాక్టర్ల ఒత్తిడి పెరుగుతుండటంతో ఏపీ అధికారులు.. తెలంగాణ అధికారులను ప్రశ్నిస్తున్నారు. 'ఈ ఫైళ్లను మాకు ఇవ్వలేదు, అవి తెలంగాణ కార్యాలయంలోనే ఉన్నాయి. ఇవ్వాలని కోరినా ఇప్పటి వరకు ఇవ్వలేదు'అని ఏపీకి చెందిన ఓ అధికారి 'సాక్షి'తో చెప్పారు.

'పెన్షన్' ఇక నో టెన్షన్!

▶ మొదటి పేజీ తరువాయి

పదవీ విరమణ చేసినవారికి పింఛన్ అందకపోగా.. చనిపోయిన కుటుంబాలకు కనీస ఆర్థిక సాయం కూడా అందడం లేదు. అందుకే కొత్త పెన్షన్ స్కీంను రద్దు చేసి వారిని పాత పెన్షన్ పథకంలో చేర్చాలని ప్రభుత్వం భావిస్తోంది. అయితే ఇది ఆర్థిక భారమని పేర్కొంటూ ఆర్థిక శాఖ ఇప్పటికే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లింది. కేంద్రంతో పాటు పలు రాష్ట్రాలు చెల్లిస్తున్నట్లుగా సీపీఎస్ ఉద్యోగులకు గ్రాట్యుటీ చెల్లింపులను సిఫారసు చేసింది. కానీ భవిష్యత్ ప్రయోజనాల దృష్ట్యా ఉద్యోగులు కోరినట్లుగానే పాత పెన్షన్ విధానంలో చేర్చేందుకు తగిన చర్యలు చేపట్టాలని, సాధ్యాసాధ్యాలపై నివేదిక అందించాలని సీఎం అధికారులను ఆదేశించినట్లు సమాచారం.

జూన్‌తో ముగియనున్న పీఆర్సీ గడువు

పీఆర్సీకి సంబంధించి ఆర్థిక శాఖ పంపించిన ఫైలు ఇప్పటికే ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు పరిశీలనలో ఉంది. ఇటీవలే అధికారులతో సీఎం ఈ విషయంపై చర్చించారు. ఈ సందర్భంగా పీఆర్సీ ఏర్పాటుతోపాటు మధ్యంతర భృతి (ఇంటీరియమ్ రిలీఫ్) ఇచ్చే అంశం చర్చకు వచ్చినట్లు తెలిసింది. ఉమ్మడి రాష్ట్రంలో ఏర్పాటైన పదో పీఆర్సీ సిఫారసులే కొత్త రాష్ట్రం ఏర్పడ్డాక ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది. 1998 నుంచి అమల్లో ఉన్న ఆనవాయితీ ప్రకారం అయిదేళ్లకోసారి ప్రభుత్వ ఉద్యోగుల వేతనాన్ని సవరిస్తారు. దీని ప్రకారం పదో పీఆర్సీ గడువు ఈ ఏడాది జూన్ 30తో ముగియనుంది. జూలై ఒకటో తేదీ నుంచి పదకొండో వేతన సవరణ అమల్లోకి రావాల్సి ఉంటుంది. సాధారణంగా ఆర్నెల్ల ముందే పీఆర్సీని ఏర్పాటు చేసి ఉద్యోగులకు సంబంధించిన సర్వీసు వ్యవహారాలు, జీతభత్యాలు, పెన్షన్, గ్రాట్యుటీ ప్రయోజనాలన్నింటిపై సిఫారసులు స్వీకరించాల్సి ఉంటుంది. దీంతో కొత్త పీఆర్సీ ఎప్పుడు ఏర్పాటవుతుంది.. వేతన సవరణ ఏ మేరకు ఉంటుంది? అని ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగులు ఆశగా ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో వీలైనంత త్వరలోనే పీఆర్సీని ఏర్పాటు చేసేందుకు సీఎం సానుకూలత వ్యక్తం చేసినట్లు తెలిసింది.

జూలై నుంచే మధ్యంతర భృతి

పీఆర్సీ ఆలస్యమైతే ప్రభుత్వం ముందస్తుగా మధ్యంతర భృతిని చెల్లిస్తుంది. పీఆర్సీ అమల్లోకి వచ్చిన తర్వాత ఇచ్చే ఫిట్‌మెంట్ (వేతన సవరణ) నుంచి ఇంటీరియమ్ రిలీఫ్‌ను సర్దుబాటు చేసుకుంటుంది. కొత్త పీఆర్సీ సిఫారసులు ఎప్పుడు అమల్లోకి వచ్చినా ఈ ఏడాది జూలై నుంచి ఉద్యోగులకు వేతన సవరణ చేయాల్సి ఉంటుంది. అందుకే జూలై నుంచే 25 శాతం నుంచి 30 శాతం వరకు మధ్యంతర భృతి ఇచ్చే ప్రత్యామ్నాయాలను పరిశీలించాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించినట్లు తెలిసింది. దాదాపు 5 లక్షల మంది ఉద్యోగులతో ముడిపడిన అంశమైనందున ప్రభుత్వంపై ఎంత భారం పడుతుంది? బడ్జెట్‌లో ఎంత మేర నిధులు కేటాయించాలన్న అంశాలపై నివేదిక రూపొందించాలని ఆర్థిక శాఖను ఆదేశించినట్లు సమాచారం.

14.67 లక్షల ఎకరాల్లో రబీ

సాక్షి, హైదరాబాద్: రబీలో పంటల సాగు నిరాశాజనకంగా ఉంది. సాధారణంగా రబీ సాగు విస్తీర్ణం 31.92 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు కేవలం 14.67 లక్షల (46%) ఎకరాల్లోనే సాగైందని వ్యవసాయశాఖ బుధవారం విడుదల చేసిన నివేదికలో తెలిపింది. గతేడాది ఇదే సమయానికి 15.40 లక్షల ఎకరాలుండటం గమనార్హం. రబీ వరి సాధారణ సాగు 15.37 లక్షల ఎకరాలు కాగా, 4.75 లక్షల (31%) ఎకరా ల్లోనే నాట్లు పడ్డాయి. పప్పుధాన్యాల సాధారణ సాగు 2.83 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 2.70 లక్షల(83%) ఎకరాల్లో సాగయ్యాయి.

ఒకేసారి పెరిగి.. అంతలోనే పడి..

రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ ఒడిదుడుకులు

- పగలు 9,300 మెగావాట్లు.. రాత్రి 6 వేలకు పతనం
- క్లిష్టంగా గ్రిడ్ నిర్వహణ.. తప్పని బ్యాక్ డౌన్లు
- నిరంతరం సమీక్షిస్తున్న ట్రాన్స్‌కో సీఎండీ ప్రభాకర్ రావు



సాక్షి, హైదరాబాద్:రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ ఒడిదుడుకులకు లోనవుతోంది. వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ ప్రారంభించిన నాటి నుంచి పగటి వేళల్లో పెరుగుతూ రాత్రి పూట పతనమవుతోంది. రాష్ట్రంలోని 23 లక్షలకు పైగా వ్యవసాయ పంపుసెట్లను పగటి పూటే వినియోగిస్తుండటంతో పగలు సగటున 9,300 మెగావాట్లు డిమాండ్ నమోదవుతూ రాత్రి 6 వేల మెగావాట్లకు పడిపోతోంది. ఈ హెచ్చుతగ్గుల పరిణామాల నేపథ్యంలో అసలే క్లిష్టమైన విద్యుత్ గ్రిడ్ నిర్వహణ.. మరింత కష్టతరంగా మారుతోంది.

ట్రాన్స్‌కో అప్రమత్తం..

విద్యుత్ సరఫరా వ్యవస్థలో క్లిష్టమైన పనుల్లో విద్యుత్ గ్రిడ్ నిర్వహణ ఒకటి. క్షణక్షణం మారే డిమాండ్‌కు సమానంగా గ్రిడ్‌కు విద్యుత్ సరఫరా చేసి సరఫరా వ్యవస్థను కాపాడేందుకు ట్రాన్స్‌కో లోడ్ డిస్పాచ్ సెంటర్ (ఎల్డీసీ) నిరంతరం పని చేస్తూ ఉంటుంది. హెచ్చుతగ్గులతో విద్యుత్ సరఫరా చేస్తే గ్రిడ్ అకస్మాత్తుగా కుప్పకూలి రాష్ట్రంతోపాటు దక్షిణాది రాష్ట్రాల్లో సైతం విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. గ్రిడ్ కూలితే సరఫరా పునరుద్ధరణకు 24 గంటలకు మించి పడుతుంది. అయితే వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ సరఫరాతో డిమాండ్ ఒడిదుడుగులకు గురవుతూ గ్రిడ్ నిర్వహణ మరింత క్లిష్టంగా మారింది. దీంతో గ్రిడ్ పరిరక్షణపై ట్రాన్స్‌కో మరింత అప్రమత్తతతో వ్యవహరిస్తోంది. గ్రిడ్ నిర్వహణపై అధికారులలో రోజూ గంటపాటు ట్రాన్స్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు పరిస్థితులను సమీక్షిస్తున్నారు.

బ్యాకింగ్ డౌన్ తీవ్రం

తెలంగాణ విద్యుదుత్పత్తి సంస్థ (జెన్‌కో) ప్లాంట్ల నుంచి 2,882 మెగావాట్లు, సింగరేణి ప్లాంట్ల నుంచి 1,200, కేంద్ర విద్యుత్ కేంద్రాల నుంచి 2,300, ఛత్తీస్‌గఢ్ నుంచి 1,000, థర్మల్ పవర్‌టెక్ నుంచి 840, సౌర విద్యుత్ ద్వారా 3,100, పవన విద్యుత్ ద్వారా 108 మెగావాట్లు రాష్ట్రానికి సరఫరా అవుతోంది. వీటి నుంచి డిమాండ్‌కు తగ్గట్లు పగటి వేళల్లో గరిష్టంగా 9,300 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తుండగా, రాత్రి వేళల్లో ఉత్పత్తిని 6 వేలకు తగ్గిస్తున్నారు. ప్రైవేటు, ఎన్టీపీసీ, సింగరేణి విద్యుత్ ప్లాంట్లలో ఉత్పత్తి తగ్గించేందుకు 24 గంటల ముందే యాజమాన్యాలకు సమాచారమివ్వాలి. కానీ డిమాండ్‌లో హెచ్చుతగ్గులు ఏర్పడుతుండటంతో ఉత్పత్తి తగ్గించుకోవడం సాధ్యం కాదని ట్రాన్స్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు తెలిపారు. మెరిట్ ఆర్డర్ ప్రకారం తక్కువ ధర ఉన్న జెన్‌కో ప్లాంట్లలో ఉత్పత్తి తగ్గించుకుంటున్నామన్నారు.

విద్యుత్ వినియోగంలో హెచ్చుతగ్గులు (డిమాండ్ మెగావాట్లలో)

తేదీ	అత్యధిక డిమాండ్	సమయం	అత్యల్ప డిమాండ్	సమయం
జనవరి 1, 2018	9,115	ఉ.9.01	6,355	రా.12.01
జనవరి 2, 2018	9,288	ఉ.8.06	6,199	రా.3.47
జనవరి 3, 2018	9,305	ఉ.8.01	6,171	రా.11.58
జనవరి 4, 2018	9,376	ఉ.7.57	5,898	రా.3.29
జనవరి 5, 2018	9,362	ఉ.8.06	5,912	రా.3.01
జనవరి 6, 2018	9,399	ఉ.8.21	5,866	రా.3.17
జనవరి 7, 2018	8,918	ఉ.8.52	5,786	రా. 3.01

చెక్కుతోనే 'పెట్టుబడి'

నిర్ణయం వెలువరించిన మంత్రివర్గ ఉపసంఘం

- చెక్కుల ద్వారా పంపిణీకే ఓటేసిన రైతులు
- ఖరీఫ్ నుంచి ఎకరాకు రూ.4 వేల అందజేత
- రైతుకు అప్పు లేని బ్యాంకులో చెక్ డిపాజిట్ చేసుకోవచ్చు
- పోస్టాఫీసులో కూడా క్లియర్ చేసుకునే వెసులుబాటు
- నేతలు, ధనవంతులు 'పెట్టుబడి' వదులుకోవాల్సిందిగా ప్రచారం



సాక్షి, హైదరాబాద్

రైతులకు పెట్టుబడి రాయితీ సొమ్మును చెక్కుల ద్వారానే పంపిణీ చేయాలని మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా మెజారిటీ రైతులు చెక్కుల ద్వారానే తమకు సొమ్ము చెల్లించాలని వ్యవసాయ శాఖ సర్వేలో చెప్పడంతో ఉపసంఘం కూడా అందుకు అనుగుణంగానే నిర్ణయం తీసుకుంది. మొదట్నుంచీ నిపుణులు, ఉన్నతాధికారులు, కొందరు మంత్రులు కూడా చెక్కుల ద్వారానే పంపిణీకే మొగ్గు చూపారు. వ్యవసాయశాఖ అధికారులతో సీఎం కార్యాలయం నిర్వహించిన సమావేశంలోనూ ఇదే అభిప్రాయం వ్యక్తమైంది. అయితే ఉపసంఘంలోని మంత్రులు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేయడంతో నేరుగా రైతుల వద్దకే వెళ్లి వారి మనోగతం తెలుసుకోవాలని నిర్ణయించారు. వ్యవసాయ శాఖ కూడా ఆగమేఘాలపై ఒకే ఒక్క రోజులో సర్వే చేపట్టి మెజారిటీ అభిప్రాయాన్ని నివేదించడంతో.. చివరకు చెక్కులు ఇవ్వాలని నిర్ణయించారు. దీంతో రైతులందరికీ వచ్చే ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి మే 15 నాటికి ఎకరానికి రూ.4 వేల చొప్పున అందనుంది. ప్రస్తుత లెక్కల ప్రకారం 71.75 లక్షల రైతు ఖాతాలకు చెందిన 1.42 కోట్ల ఎకరాలకు నగదు సొమ్ము అందనుంది. పెట్టుబడి సొమ్మును ఎలా అమలు చేయాలన్న దానిపై వ్యవసాయశాఖ మార్గదర్శకాలు ఖరారు చేసే పనిలో నిమగ్నమైంది. ఈ మేరకు ఒకట్రెండు రోజుల్లో జిల్లాల నుంచి వ్యవసాయాధికారులను హైదరాబాద్ పిలిపించి అమలు ఎలా ఉండాలన్న అంశంపై చర్చించనుంది. వారి అభిప్రాయాల ప్రకారం మార్గదర్శకాలు ఖరారు చేస్తామని ఆ శాఖ వర్గాలు తెలిపాయి. మార్గదర్శకాలు ఖరీఫ్ సీజన్‌లో అమలుకు సంబంధించే ఉంటాయి. రబీ సీజన్‌లో ఎలా అమలు చేయాలనే దానిపై ఇప్పుడే నిర్ణయం తీసుకోబోమని అధికారులు చెబుతున్నారు.

పెద్దలను స్వచ్ఛందంగా తప్పించాలి

ఎమ్మెల్యేలు, మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు, ఐఏఎస్, ఐపీఎస్ వంటి ఉన్నతాధికారులు, ధనవంతులందరికీ పెట్టుబడి పథకాన్ని వర్తింప చేస్తే ప్రజల్లో వ్యతిరేకత వస్తుందన్న చర్చ మంత్రివర్గ ఉపసంఘంలో జరిగింది. ఎక్కువ భూమి ఉన్న వారిని గుర్తించి ఎంతో కొంత సీలింగ్ పెట్టి పెట్టుబడి సొమ్ము ఇస్తే బాగుంటుందన్న అభిప్రాయం వ్యక్తమైంది. కానీ సీలింగ్ పెడితే ఇబ్బందులు వస్తాయని, రాజకీయాలు చొరబడి అర్హులైన రైతులకు కూడా అన్యాయం జరిగే అవకాశం ఉంటుందని మరికొందరు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సబ్సిడీని ధనవంతులు స్వచ్ఛందంగా వదులుకునేలా పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించింది. అలాగే రాష్ట్రంలోనూ పెట్టుబడి రాయితీని వదులుకునేందుకు ముందుకు వచ్చే వారిని ప్రోత్సహించాలని సూత్రప్రాయంగా నిర్ణయించారు. ముందుగా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వివిధ పార్టీలకు చెందిన ధనవంతులు, ఇతర ప్రజాప్రతినిధులు, ఐఏఎస్, ఐపీఎస్ తదితరులను ప్రోత్సహించి 'నాకు పెట్టుబడి రాయితీ వద్దు'అని వారితో ప్రకటన చేయిస్తారు. అంతే తప్ప ఒత్తిడి చేసి రాయితీ నుంచి తప్పించకూడదని నిర్ణయించారు.

సాగు చేస్తేనే సొమ్ము!

రాష్ట్రంలో 1.42 కోట్ల ఎకరాల భూమి సాగు యోగ్యమైనదిగా రెవెన్యూ శాఖ తేల్చింది. అయితే అనేకచోట్ల రైతులు భూమి సాగు చేయడం లేదని అంటున్నారు. కొన్నిచోట్ల కొండలు, గుట్టలతో భూమి ఉంది. చెరువుల్లోనూ పట్టా భూమి కలిగిన వారున్నారు. ఇలా సాగుకు యోగ్యంకాని భూములకు కూడా పెట్టుబడి రాయితీ ఇవ్వడం వల్ల ఇతర రైతుల్లో వ్యతిరేకత వస్తుందని కొందరు మంత్రులు ఉపసంఘం సమావేశంలో అభిప్రాయపడ్డారు. అందుకు సంబంధించి మార్గదర్శకాలు పకడ్బందీగా తయారు చేయాలని ఆదేశించారు. భూమిని సాగు చేస్తున్నట్లు రైతుల నుంచి డిక్లరేషన్ తీసుకోవాలని కూడా కొందరు సూచించారు. అయితే వచ్చే ఖరీఫ్ ప్రారంభానికి ముందే అంటే మే 15 నాటికి పెట్టుబడి రాయితీ ఇవ్వాల్సి ఉండటంతో ఎవరు సాగు చేస్తారో చేయరో అంచనాకు రాలేమని వ్యవసాయశాఖ వర్గాలు చెబుతున్నాయి. దీంతో ఖరీఫ్ సీజన్‌కు అందరికీ ఇచ్చి ఆ తర్వాత రబీ సీజన్ నుంచి కట్టుదిట్టం చేయాలని కొందరు సూచించారు. డిక్లరేషన్ తీసుకుంటున్నందున సాగుచేసే వారే పెట్టుబడి సొమ్ము తీసుకుంటారని అంటున్నారు.

అప్పులేని బ్యాంకులో డిపాజిట్‌కు అవకాశం

చెక్కులిస్తే వాటిని బ్యాంకులు తమ అప్పుల కింద జమ చేసుకుంటాయన్న భయం రైతులకు ఉంది. రుణమాఫీ వడ్డీల విషయంలో బ్యాంకులు రైతులతో ఇలాగే వ్యవహరించాయి. ప్రస్తుతం అలాంటి పరిస్థితి తలెత్తకుండా చెక్కులు ఏ బ్యాంకులోనైనా చెల్లుబాటయ్యేలా ఏర్పాటు చేస్తారు. చాలామంది రైతులకు రెండు మూడు బ్యాంకుల్లో ఖాతాలున్నాయని అంచనా. ఒకవేళ ఒకే ఖాతా ఉండి, అందులో బ్యాంకు రుణం చెల్లించని పరిస్థితి ఉంటే మరో బ్యాంకు ఖాతా తీసుకోవచ్చు. ఆ విధంగా చెక్కు మార్చుకోవచ్చు. నేరుగా చెక్కులిచ్చి నగదు తీసుకునే పరిస్థితి కూడా ఉంటుంది. ఇదేకాకుండా పోస్టాఫీసుల్లోనూ బ్యాంకు చెక్కులు క్లియర్ చేసుకునే వెసులుబాటు కల్పిస్తారు. ఈ మేరకు సహకారం అందిస్తామని పోస్టల్ శాఖ వర్గాలు ప్రభుత్వానికి హామీ ఇచ్చాయి. ఈ చెక్కులను గ్రామసభలు పెట్టి రైతులకు పంపిణీ చేస్తారు. గ్రామాల్లో ఒకే పేరు, ఇంటిపేరున్న వారు ఉండే అవకాశం ఉన్నందున అకౌంట్ చెక్కులు జారీ చేయడంతోపాటు వాటిపై సంబంధిత రైతుల ఆధార్ నంబర్ రాయాలని నిర్ణయించారు.

✦ టీఆర్‌ఎస్ సవాల్‌కు సై: రేవంత్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వ విద్యుత్ దుర్మార్గాలపై బహిరంగ చర్చకు తాము సిద్ధమేనని ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి అన్నారు. ఈ విషయంలో టీఆర్‌ఎస్ విసిరిన సవాల్‌ను స్వీకరిస్తున్నామని తెలిపారు. ఎంపీ బాల్క సుమన్ కోరిన విధంగా బహిరంగ చర్చకు తాను, అలంపూర్ ఎమ్మెల్యే సంపత్‌కుమార్, పీసీసీ అధికార ప్రతినిధి దాసోజు శ్రవణ్ 12వ తేదీన మధ్యాహ్నం 2 గంటలకు వస్తామని, చర్చా వేదిక సీఎం అధికార నివాసం ప్రగతి భవన్ అయినా లేదా మరెక్కడికైనా వస్తామని తెలిపారు. ఈ మేరకు రేవంత్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కొత్త రాష్ట్రం ఏర్పడినా విద్యుత్ కొరత ఏర్పడకుండా కాంగ్రెస్ హయాంలో చేపట్టిన కొత్త విద్యుత్ ప్రాజెక్టుల నిర్మాణాలు, ప్రస్తుతం రాష్ట్రంలో విద్యుత్ కొనుగోళ్లు, కొత్త ప్లాంట్ల నిర్మాణాల పేరుతో జరుగుతున్న అక్రమాలు.. అన్నీ బయటపెట్టడానికి సిద్ధంగా ఉన్నామన్నారు.

విద్యుత్ వెలుగుల వెనక చీకటి కోణం

'రోజంతా విద్యుత్'వెలుగుల వెనక చీకటి కోణం దాగి ఉందని ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నీటి మీద రాతలు రాయడంలో దిట్ట అని, తన ఆర్థిక అవసరాలకు అనుగుణంగా పనిచేయడంలో కేసీఆర్‌ది అందెవేసిన చెయ్యి అని ఆయన విమర్శించారు. బుధవారం గాంధీ భవన్‌లో రేవంత్ విలేకరులతో మాట్లాడుతూ, విద్యుదుత్పత్తి కేంద్రాల్లో సబ్ క్రిటికల్ టెక్నాలజీని మార్చమని కేంద్రం ఆదేశించినా ఇక్కడ దానిని పాటించడంలేదని అన్నారు. ఈ టెక్నాలజీని అందించే ఇండియా బుల్స్ సంస్థ కేసీఆర్‌ను ప్రసన్నం చేసుకుందని, అందుకే కేంద్ర ప్రభుత్వం తిరస్కరించినా.. కాలం చెల్లిన టెక్నాలజీని వాడుతున్నారని పేర్కొన్నారు. బీహెచ్‌ఈఎల్ ద్వారా ప్రభుత్వం ఇండియా బుల్స్‌కి రూ.2 వేల కోట్లు చెల్లించిందని ఆరోపించారు. ఈ చెల్లింపులోనే కేసీఆర్ చీకటి ఒప్పందం దాగి ఉందని అన్నారు.

✦ 24 గంటల విద్యుత్ కాంగ్రెస్‌కు ఇష్టం లేదు

రేవంత్‌వన్నీ తప్పుడు లెక్కలు: ఎంపీ బాల్క సుమన్



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్‌ను సరఫరా చేయడం కాంగ్రెస్‌కు ఇష్టం లేదని టీఆర్‌ఎస్ ఎంపీ బాల్క సుమన్ మండిపడ్డారు. ఈ పథకాన్ని కాంగ్రెస్ జీర్ణించుకోలేకపోతుందన్నారు. టీఆర్‌ఎస్‌ఎల్పీ కార్యాలయంలో మండలి విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ భానుప్రసాద్‌తో కలసి ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ..కరెంటు కష్టాల నుంచే తెలంగాణ ఉద్యమం పుట్టిందన్నారు. కరెంటుపై రేవంత్‌రెడ్డి చెప్పేవన్నీ తప్పుడు లెక్కలని నిరూపిస్తామని చెప్పారు. తాము చెప్పే లెక్కలు అబద్ధమైతే ప్రజలు వేసే ఏ శిక్షకైనా సిద్ధమన్నారు.

సవాల్‌కు సిద్ధమేనా?

ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకున్న విద్యుత్ సంస్థ కాంగ్రెస్ నేత సుబ్బరామిరెడ్డికి చెందినదని, ఒప్పందంలో అవకతవకలు జరిగినట్లు ఆయనతో రేవంత్ చెప్పించగలరా అని బాల్క సుమన్ సవాల్ విసిరారు. సీఎం కేసీఆర్ కృషితోనే భూపాలపల్లిలో విద్యుత్ ఉత్పాదన ప్రారంభమైందన్నారు. రేవంత్ చెబుతున్న గుజరాత్ కంపెనీ ఎక్కడుందో ఆయనకే తెలియాలన్నారు. విద్యుత్‌పై బహిరంగ చర్చకు కాంగ్రెస్ నేతలు సిద్ధమేనా అని ప్రశ్నించారు. పీసీసీ చీఫ్ ఉత్తమ్, సీఎల్పీ నేత జానారెడ్డితో కలసి వచ్చినా తమకు అభ్యంతరం లేదన్నారు. రేవంత్ చెప్పేది అబద్ధమైతే అబిడ్స్ చౌరాస్తాలో ముక్కు నేలకు రాస్తారా అని సవాలు చేశారు.

✦ సంపత్‌ను చేర్చుకోవాల్సిన అవసరం లేదు

టీఆర్‌ఎస్ నేత గువ్వల బాలరాజు



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ ఎమ్మెల్యే సంపత్‌ను చేర్చుకోవాల్సిన అవసరం తమకు లేదని టీఆర్‌ఎస్ నేత గువ్వల బాలరాజు అన్నారు. మంత్రి హరీశ్‌రావుపై సంపత్ వ్యాఖ్యలను ఖండించారు. టీఆర్‌ఎస్‌ఎల్పీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ..ఆర్డీఎస్‌పై సంపత్ బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. ఆయన టీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని లీకులు ఇవ్వాల్సిన అవసరం హరీశ్‌కు లేదని చెప్పారు. ఉమ్మడి ఏపీలో ఆర్డీఎస్‌కు జరిగిన అన్యాయంపై కాంగ్రెస్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తుమ్మిళ్ల లిఫ్ట్ పథకం శంకుస్థాపన నడిగడ్డ ప్రజల కళ్ళలో కొత్త కాంతులు నింపిందన్నారు. కేసీఆర్ పాదయాత్ర వల్లే తుమ్మిళ్ల లిఫ్టు రూపుదిద్దుకుందన్నారు. ఇకనైనా రేవంత్, సంపత్‌లు వ్యక్తిగత విమర్శలు మానుకోవాలని హితవు పలికారు.


✦ రైతు సమస్యలపై సర్కారుకు చిత్తశుద్ధిలేదు

సీఎల్పీ ఉపనేత టి.జీవన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: రైతుల సమస్యలపై ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి లేదని సీఎల్పీ ఉపనేత టి.జీవన్‌రెడ్డి విమర్శించారు. వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి పంటలపై కనీస అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని, సీఎం కేసీఆర్ రాసి పంపించే స్క్రిప్టునే ఆయన చదువుతున్నారని ఎద్దేవా చేశారు. బుధవారం ఆయన అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద విలేకరులతో మాట్లాడుతూ, ఖరీఫ్‌లో పంట నష్టపోతే రాష్ట్ర ప్రభుత్వం రైతులను అదుకోలేదని, పంట నష్టం జరిగితే కూడా బోనస్ ప్రకటించలేదని అన్నారు. కనీసం రబీ పంటకైనా బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రబీ నుంచే రూ.4 వేలు పెట్టుబడి ఇచ్చి రైతులను ఆదుకోవాలని, కౌలు రైతులు, పట్టేదారులు అనే భేదం లేకుండా వ్యవసాయ పెట్టుబడి అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎవరు భూమి సాగుచేస్తే వారికే పెట్టుబడి ఇవ్వాలని సూచించారు.

✦ రైతులకు న్యాయం చేయాలి: వీహెచ్



సాక్షి, న్యూఢిల్లీ: రైతుల భూముల్లో విద్యుత్ సరఫరా టవర్లు నిర్మించిన తెలంగాణ సర్కార్.. ఆయా స్థలాలకు నష్టపరిహారం చెల్లించేందుకు నిరాకరిస్తోందని మాజీ ఎంపీ వి.హనుమంతరావు కేంద్ర విద్యుత్ మంత్రి ఆర్కే సింగ్‌కు బుధవారం లేఖ రాశారు. కేంద్ర మార్గదర్శకాల మేరకు రహదారుల సమీపంలోని భూముల్లో టవర్లు నిర్మిస్తే టవర్‌కు రూ.4.5 లక్షలు, దూరంగా ఉన్న భూముల్లో టవర్లు నిర్మిస్తే టవర్‌కు రూ.3.15 లక్షల పరిహారం చెల్లించాల్సి ఉందని తెలిపారు. విద్యుత్ టవర్ల మధ్య స్థలానికి, పంట నష్టానికి 35 ఏళ్ల పాటు పరిహారం చెల్లించాల్సి ఉందన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఈ మేరకు రైతులకు నష్టపరిహారం చెల్లించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు.

చెక్కులు, ఖాతాలకే రైతుల మొగ్గు

పెట్టుబడి రాయితీపై వ్యవసాయ శాఖ కార్యదర్శి పార్థసారథి



సాక్షి, హైదరాబాద్: రైతులకు పెట్టుబడి రాయితీ సొమ్మును ఎలా అందజేయాలన్న దానిపై తాము నిర్వహించిన సర్వేలో 60 శాతం మంది రైతులు చెక్కులు ఇవ్వాలని లేదా తమ బ్యాంకు ఖాతాలో వేయాలని సూచించారని వ్యవసాయశాఖ కార్యదర్శి సి.పార్థసారథి వెల్లడించారు. సర్వే వివరాలను బుధవారం ఆయన ఒక ప్రకటనలో వెల్లడించారు. తాము ఆరు పద్ధతులపై 62,677 మంది రైతులతో సర్వే నిర్వహించామన్నారు. వాటిలో పై రెండింటికి మెజారిటీ రైతులు మొగ్గు చూపారన్నారు. సర్వే ముఖ్యాంశాలు ఇలా ఉన్నాయి.

- ➡ చెక్కు రూపేణా ఇవ్వాలని కోరిన రైతులు– 31.58 శాతం. (జిల్లాల వారీగా చూస్తే సర్వేలో పాల్గొన్న రైతులలో మేడ్చల్ 63.8 శాతం మంది, నిజామాబాద్ 57.1 శాతం, ఆదిలాబాద్ 50 శాతం మంది, అలాగే 40 శాతానికి పైగా ఈపద్ధతిని కోరిన జిల్లాల్లో కామారెడ్డి, కరీంనగర్, జగిత్యాల, సంగారెడ్డి, సిద్దిపేట, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల రైతులున్నారు)
- ➡ తమ బ్యాంకు ఖాతాలో జమ చేయాలన్న రైతులు– 27.55 శాతం. (వరంగల్ అర్బన్ 81.55 శాతం, రాజన్న సిరిసిల్ల 62.38 శాతం, వరంగల్ రూరల్ 49 శాతం, జనగాంలో 44.94 శాతం మంది ఉన్నారు. అలాగే 30 శాతానికి పైగా కోరిన వారిలో నిర్మల్, మంచిర్యాల, కరీంనగర్, పెద్దపల్లి, నాగర్ కర్నూల్, మెదక్, నల్లగొండ, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్ జిల్లాల రైతులున్నారు)
- ➡ నగదు రూపంలో ఇవ్వాలన్నవారు– 26.59 శాతం. (జిల్లాల వారీగా చూస్తే – ఆసిఫాబాద్ 62.17 శాతం, వికారాబాద్ 48 శాతం, జోగుళాంబ గద్వాల 46.08 శాతం, రంగారెడ్డి జిల్లాలో 42 శాతంమంది ఉండగా, 30 శాతానికిపైగా నగదు రూపంలో కోరిన జిల్లాల్లో మహబూబ్‌నగర్, వనపర్తి, నల్లగొండ, యాదాద్రి భువనగిరి, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ రైతులున్నారు)
- ➡ పోస్టాఫీసుల ద్వారా ఇవ్వాలన్నవారు– 6.81 శాతం
- ➡ ప్రీలోడెడ్ కార్డులు/ఇతర రూపాల్లో కోరినవారు– 6.44 శాతం
- ➡ ప్రాథమిక సహకార సంఘాల ద్వారా కోరినవారు– 1.03 మంది

కాళేశ్వరం ఓ అద్భుతం

ఇంత వేగమైన పనులు ఎక్కడా చూడలేదు • కేంద్ర జల సంఘం బృందం కితాబు

సాక్షి, హైదరాబాద్

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కాళేశ్వరం ఎత్తిపోతల పథకం పనులు జరుగుతున్న తీరుపై కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) సంతృప్తి వ్యక్తం చేసింది. ఈ తరహా వేగవంతమైన పనులను ఇంతకు ముందు ఎక్కడా చూడలేదని, ఇదో అద్భుతమని కితాబిచ్చింది. కాళేశ్వరం ప్రాజెక్టు దేశ చరిత్రలోనే విభిన్నమైనదని, ఈ ప్రాజెక్టుతో బహుళ ప్రయోజనాలు కలుగనున్నాయని పేర్కొంది. అనుకున్న సమయానికి, నిర్ణయించిన వ్యయంతో ప్రాజెక్టు పనులను పూర్తి చేయడం అత్యంత ముఖ్యమని, ఈ సవాలును ప్రభుత్వం అధిగమిస్తుందనే ఆశాభావం వ్యక్తం చేసింది. కాళేశ్వరం పనులు జరుగుతున్న తీరును రెండ్రోజులపాటు ప్రత్యక్షంగా పరిశీలించిన సీడబ్ల్యూసీకి చెందిన ప్రాజెక్టు అప్రైజల్ ఆర్గనైజేషన్(పీఏఓ) సీఈ సీకేఎల్ దాస్, హైడ్రాలజీ డైరెక్టర్ ఎన్.ఎన్.రాయ్, కాస్ట్ అప్రైజల్ డైరెక్టర్ రాజీవ్ కుమార్, ప్రాజెక్టు డైరెక్టర్ ముఖర్జీ బుధవారం జలసౌధలో మీడియా సమావేశంలో మాట్లాడారు. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణ రంగంలో జాతీయ, అంతర్జాతీయ ప్రమాణాల రీత్యా కూడా కాళేశ్వరం అన్నీ విధాలా ప్రత్యేకమైనదని బృందం సభ్యులు వ్యాఖ్యానించారు. ''కాళేశ్వరం సమీకృత, బహుళార్థ సాధక ప్రాజెక్టు. మిడ్ మానేరు, ఎస్సారెస్పీ సహా పలు ప్రాజెక్టులకు కాళేశ్వరం ఆధారం కాబోతోంది. ఇలా ఒక భారీ ప్రాజెక్టును మరికొన్ని సాగునీటి ప్రాజెక్టులతో అనుసంధానం చేస్తున్న ప్రక్రియ ఇక్కడే కనిపిస్తోంది. నిర్మాణాలు, ప్రణాళిక, పనులు జరుగుతున్న తీరు మమ్మల్ని ఆకట్టుకున్నాయి. రేయింబవళ్లు మూడు షిఫ్టులలో జరుగుతున్న పనుల వేగాన్ని చూస్తుంటే వచ్చే వానాకాలం కల్లా కాళేశ్వరం ప్రాజెక్టు మొదటి మైలురాయి దాటుతుందని భావిస్తున్నాం. మేం దేశంలో, దేశం బయట అనేక ప్రాజెక్టుల పరిధిలో పర్యటించినా.. ఈ తరహా వేగవంతమైన పనులు ఎక్కడా చూడలేదు. కాళేశ్వరం ప్రాజెక్టుతో 18 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించడంతో పాటు మరో 18 లక్షల ఎకరాలకు కొత్తగా సాగునీటిని అందించే అవకాశం ఉంది. కోట్లాది మంది రైతుల ప్రయోజనాలతో పాటు బహుళ ప్రయోజనాలు ఇందులో ఇమిడి ఉన్నాయి. ఈ ప్రాజెక్టు ఒక అద్భుతం''అని సీడబ్ల్యూసీ పీఏఓ సీఈ సీకేఎల్ దాస్ పేర్కొన్నారు. జూన్‌నాటికి ప్రాజెక్టు ద్వారా తొలి ఫలితాన్ని అందించాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుందని, పనులు ఇలాగే జరిగితే అనుకున్న గడువులోపే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందన్నారు. ప్రాజెక్టు నిర్మాణంలో ఆలస్యం చేయరాదని, వ్యయాలు పెరగకుండా జాగ్రత్త పడాలని సూచించారు. అనుకున్న సమయానికే ప్రాజెక్టును పూర్తి చేసేందుకు అన్ని శాఖలు కలిసికట్టుగా పనిచేయాలని పేర్కొన్నారు. మేడిగడ్డ బ్యారేజీ పనుల్లో వేగం మరింత పెంచాలని సూచించారు. ఇప్పటికే ప్రాజెక్టుకు వివిధ డైరెక్టరేట్‌ల నుంచి అనుమతులు వచ్చాయని, మిగతా అనుమతులు పరిశీలనలో ఉన్నాయన్నారు. కాళేశ్వరాన్ని జాతీయ ప్రాజెక్టుగా చేపట్టే అవకాశం ఉందా అని మీడియా అడగ్గా.. దీనిపై తాము ఎలాంటి ప్రకటన కానీ, వ్యాఖ్యలు కానీ చేయబోమన్నారు.



బుధవారం కాళేశ్వరం ప్రాజెక్టు పనులను పరిశీలిస్తున్న కేంద్ర జల సంఘం బృందం

నీటి లభ్యత పుష్కలం

మేడిగడ్డ వద్ద నీటి లభ్యత పుష్కలంగా ఉందని హైడ్రాలజీ డైరెక్టర్ నిత్యానంద రాయ్ అన్నారు. 284.3 టీఎంసీల మేర లభ్యత నీరుందని, కాళేశ్వరం అవసరాలకు ఇది సరిపోతుందన్నారు. కాళేశ్వరం నిర్మాణ పనులు చాలా సంతృప్తికరంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం కాళేశ్వరాన్ని నిర్ణీత గడువు లోగా పూర్తయ్యేలా ప్రణాళికా బద్ధంగా పని చేస్తోందని రాష్ట్ర ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎస్.కె.జోషి అన్నారు. నిర్ణీత గడువు లోపే ప్రాజెక్టును పూర్తి చేసి రికార్డు సృష్టిస్తామని అన్నారు. ఈ సమావేశంలో కాళేశ్వరం చీఫ్ ఇంజనీర్లు నల్లా వెంకటేశ్వర్లు, హరి రామ్, ఓఎస్డీ శ్రీధర్ దేశ్‌పాండేలు పాల్గొన్నారు. అనంతరం సీడబ్ల్యూసీ బృందం జలసౌధలో ఏర్పాటు చేసిన ప్రత్యేక స్క్రీన్‌ల ద్వారా కాళేశ్వరం పనుల తీరును ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించింది.

'భూ' మంతర్!

రికార్డుల్లో ఇష్టారాజ్యంగా భూముల నమోదు

- 4.7 లక్షల సర్వే నంబర్లలో 6.5 లక్షల ఎకరాలు తారుమారు..
- భూరికార్డుల ప్రక్షాళనలో వెలుగులోకి..



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో భూముల రికార్డుల ప్రక్షాళనలో వింతలు చోటుచేసుకున్నాయి. ఎక్కువ భూమి ఉన్న చోట తక్కువగా.. తక్కువ భూమి ఉన్న చోట ఎక్కువగా రికార్డుల్లో నమోదయ్యాయి. భూ రికార్డుల ప్రక్షాళన దాదాపు పూర్తయిన నేపథ్యంలో ఇలా తారుమారైన భూమి రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 6.5 లక్షల ఎకరాలపైనే ఉందని తేలింది. దాదాపు 4.7 లక్షల సర్వే నంబర్లలో భూమి తారుమారైనట్లు ఇప్పటివరకు రెవెన్యూ యంత్రాంగం గుర్తించింది. రికార్డుల ప్రక్షాళనలో భాగంగా ఇప్పుడు ఆ తారుమారు లెక్కలను సరిచేసే పనిలో పడింది. భూరికార్డుల ప్రక్షాళన గణాంకాలను పరిశీలిస్తే ఒక్క వనపర్తి జిల్లాలోనే 10 శాతానికి పైగా సర్వే నంబర్లలో భూములు ఎక్కువ తక్కువగా నమోదయ్యాయని తేలింది. ఈ జిల్లాలో మొత్తం 5,67,638 సర్వే నంబర్లను పరిశీలిస్తే అందులో 53,789 సర్వే నంబర్లలో రికార్డుల్లో ఉన్న భూమి కన్నా క్షేత్రస్థాయిలో భూమి తక్కువ ఉందని తేలింది. రికార్డుల్లో ఉన్న భూమి కన్నా క్షేత్రస్థాయిలో ఉన్న భూమి విస్తీర్ణం ఎక్కువగా ఉన్న సర్వే నంబర్లు 8,160 ఉన్నాయని తేలింది. మహబూబ్‌నగర్‌లో 45,907, జోగుళాంబ గద్వాల 38,593, నల్లగొండలో 35,696 సర్వే నంబర్లలో అత్యధికంగా భూములు తారుమారయ్యాయని తేలింది.

సర్దేది ఎలా?

ఒకటి కాదు, రెండు కాదు ఏకంగా 4.7 లక్షల సర్వే నంబర్లలో.. అంటే రాష్ట్రంలోని మొత్తం సర్వే నంబర్లలో 3 శాతం నంబర్లలో భూమి తారుమారయిందని నిర్ధారణ అయింది. ఇలా నిర్ధారణ అయిన వాటిలో 3.5 లక్షల సర్వే నంబర్లలో రికార్డుల్లో ఉన్న భూమి కంటే తక్కువ భూమి క్షేత్రస్థాయిలో ఉందని, 1.2 లక్షల సర్వే నంబర్లలో రికార్డుల్లో ఉన్న భూమి కంటే తక్కువ భూమి ఉందని రెవెన్యూ యంత్రాంగం గుర్తించింది. భూమి లేకపోయినా ఏదో ఒక రైతు పేరిట ఖాతా నంబర్ తెరచి ఫలానా సర్వే నంబర్‌లో ఇంత భూమి ఆ రైతుకు ఉందని దఖలు పరిచారన్నమాట. ఒక సర్వే నంబర్‌లో 10 మంది రైతులకు భూమి ఉంటే ఇప్పుడు రికార్డుల కన్నా తగ్గిన భూమిని ఏ రైతుకు తగ్గించి సర్దుబాటు చేయాలన్నది రెవెన్యూ యంత్రాంగానికి తలనొప్పిగా మారింది. చాలా చోట్ల రైతుల అంగీకారంతో భాగాలు పంచి, గుంటల లెక్కన భూమిని తగ్గించి 1బీ ఫారంలో నమోదు చేస్తున్నామని రెవెన్యూ వర్గాలు చెబుతున్నాయి. రికార్డుల్లో ఉన్న దాని కంటే ఎక్కువ భూమి ఉంటే మాత్రం ఆ మేరకు రైతుల పాసుపుస్తకాల్లో మార్పులు జరిగే అవకాశాలు కనిపించట్లేదు. మార్పులు చేయాలంటే రికార్డుల్లో ఎక్కువ, తక్కువ నమోదయిన భూములన్నింటినీ సర్వే చేయాల్సి ఉంటుందని, సర్వే ఇప్పట్లో సాధ్యం కానందున రైతుల మౌఖిక ఒప్పందం మేరకు మార్పులు చేస్తున్నామని రెవెన్యూ యంత్రాంగం చెబుతోంది.

'రాములోరి భూముల'పై కలెక్టర్ ఆరా

- 'సాక్షి' కథనంతో మేడ్చల్ జిల్లా అధికార యంత్రాంగంలో కదలిక
- దేవాదాయ శాఖ పరిధిలోని వివాదమేనన్న రెవెన్యూ శాఖ
- ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉందని కలెక్టర్‌కు నివేదిక

సాక్షి ఎఫెక్ట్..

సాక్షి, మేడ్చల్ జిల్లా: దేవరయాంజాల్ శ్రీరామచంద్రస్వామి ఆలయ భూముల వ్యవహారంపై మేడ్చల్ జిల్లా కలెక్టర్ ఆరా తీశారు. 'రాములోరి భూములు.. రాబందుల పాలు'అనే శీర్షికతో 'సాక్షి'లో బుధవారం ప్రచురితమైన కథనంతో జిల్లా అధికార యంత్రాంగంలో కదలిక వచ్చింది. ఈ భూముల వ్యవహారంపై రెవెన్యూ శాఖ నుంచి జిల్లా కలెక్టర్ ఎంవీ రెడ్డి వివరాలు కోరారు. దీంతో శామీర్‌పేట్ ఇన్‌చార్జి తహసీల్దార్, లా అధికారి ధర్మారామచంద్రారెడ్డి శ్రీరామచంద్రస్వామి ఆలయ భూముల వివాదంపై కలెక్టర్‌కు నివేదిక అందజేశారు. ఈ భూముల వ్యవహారం దేవాదాయ శాఖకు, కొంతమంది రైతులకు మధ్య నెలకొన్న వివాదంగా నివేదికలో జిల్లా రెవెన్యూ శాఖ పేర్కొన్నట్లు సమాచారం. దేవరయాంజాల్‌లోని ఓ సర్వే నంబర్‌లో ఉన్న 1,521.13 ఎకరాల భూమిపై ఇరు వర్గాలు కోర్టుకు వెళ్లాయని రెవెన్యూ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ వివాదంపై స్పెషల్ చీఫ్ సెక్రటరీ, భూపరిపాలన శాఖ కార్యదర్శి ఎ.రఘోత్తమరావును ప్రభుత్వం విచారణాధికారిగా నియమించినట్లు నివేదికలో ప్రస్తావించాయి. ఈ భూముల వివాద అంశాలతో కూడిన నివేదికను అప్పట్లో సీసీఎల్ఏ ప్రభుత్వానికి(1,425.17 ఎకరాలకు సబంధించి) నివేదించినట్లు రెవెన్యూ శాఖ పేర్కొంది. ఈ భూములపై తుది నిర్ణయం ప్రకటించే అధికారం ప్రభుత్వానికే ఉందని కలెక్టర్‌కు రెవెన్యూ వర్గాలు చెప్పినట్లు తెలుస్తోంది. ప్రభుత్వ నిర్ణయం వెలువడేంత వరకు ఈ భూముల రిజిస్ట్రేషన్‌ను నిలిపేస్తూ అప్పట్లో నోటిఫికేషన్ ఇచ్చినట్లు నివేదికలో ప్రస్తావించారు. దీంతో దేవరయాంజాల్ భూముల సమస్య అప్పటి నుంచి అపరిష్కృతంగా ఉండిపోయిందని వెల్లడించినట్టు సమాచారం. ఈ భూముల విషయంలో దేవాదాయ శాఖకు రెవెన్యూ శాఖ అన్ని విధాలా సహకరించేందుకు సిద్ధంగా ఉందని కలెక్టర్‌కు సమర్పించిన నివేదికలో ఆ శాఖ వర్గాలు పేర్కొన్నట్టు తెలుస్తోంది.

విద్యుత్ ప్రాజెక్టులకు కాంగ్రెస్ ఆటంకాలు

మండలిలో ప్రభుత్వ విప్ పల్లా



సాక్షి, హైదరాబాద్: సాగునీటి ప్రాజెక్టులపై కేసులు వేసిన కాంగ్రెస్ నేతలే విద్యుత్ ప్రాజెక్టు లపై కేసులు వేసి ఆటం కం కల్పిస్తున్నారని మండలిలో ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వర్ రెడ్డి ఆరోపించారు. 24 గంటల విద్యుత్ షాక్ నుంచి కాంగ్రెస్ నేతలు తేరుకోలేక పోతున్నారని, సాగునీటి ప్రాజెక్టులు పూర్తయితే కాంగ్రెస్ నిండా మునగడం ఖాయమన్నారు. 24 గంటల ఉచిత విద్యుత్‌పై రాజస్థాన్‌లో జరిగిన విప్‌ల సదస్సులో అందరూ ప్రశంసించారన్నారు. ఇకనైనా కాంగ్రెస్ నేతలు అబద్ధాలు మానుకోవాలని హితవు పలికారు.

తెలంగాణకు 50.. ఏపీకి 60 టీఎంసీలు

లభ్యత జలాలపై కృష్ణా త్రిసభ్య కమిటీ నిర్ణయం

- అధిక వినియోగంపై తర్వాత చర్చిద్దామని వెల్లడి

సాక్షి, హైదరాబాద్: కృష్ణా ప్రాజెక్టుల్లో లభ్యతగా ఉన్న జలాల వినియోగంపై కృష్ణా నదీ యాజమాన్య బోర్డు స్పష్టతనిచ్చింది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న 133.75 టీఎంసీల్లో తెలంగాణ 50, ఆంధ్రప్రదేశ్ 60 టీఎంసీల నీరు వినియోగించుకునే అవకాశం కల్పించింది. బుధవారం జలసౌధలో జరిగిన త్రిసభ్య కమిటీ సమావేశంలో బోర్డు ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టుల్లోని లభ్యత జలాల కేటాయింపులు, వచ్చే జూన్ వరకు నీటి అవసరాలపై భేటీలో చర్చ జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ పలు అంశాలను బోర్డు దృష్టికి తీసుకెళ్లింది. 'రెండు ప్రాజెక్టుల్లోని 357.25 టీఎంసీలను ఇప్పటివరకు రెండు రాష్ట్రాలు వినియోగించుకున్నాయి. ఒప్పందం ప్రకారం ప్రకారం తెలంగాణ 121.46, ఏపీ 235.79 టీఎంసీలు వినియోగించుకోవాలి. కానీ ఏపీ కాస్త ఎక్కువగా 254.57 టీఎంసీలు వినియోగించుకుంది'అని వివరించింది. ఆ నీటిని సర్దుబాటు చేసి తమకు కేటాయింపులు పెంచాలని కోరింది. బోర్డు స్పందిస్తూ.. లభ్యతగా ఉన్న 133.75 టీఎంసీల్లో వాటా ప్రకారం తెలంగాణకు 60.33 టీఎంసీలు, ఏపీకి 73.42 టీఎంసీలు దక్కుతాయని.. ఇందులో తెలంగాణ 50 టీఎంసీ, ఏపీ 60 టీఎంసీలు అవసరాలకు తగ్గట్లు వాడుకోవాలని సూచించింది. ఆ వినియోగం పూర్తయ్యాక అధిక వినియోగంపై తేలుద్దామనగా ఇరు రాష్ట్రాలు అంగీకరించాయి.

పోతిరెడ్డిపాడు లెక్కల్లో..

శ్రీశైలం నుంచి తక్షణమే సాగర్‌కు నీరు విడుదల చేయాలని తెలంగాణ కోరగా ఏపీ నిరాకరించింది. చెన్నై తాగు అవసరాలకు శ్రీశైలం నుంచి 5 టీఎంసీలు ఇవ్వాల్సి ఉందని, అది పూర్తయిన వెంటనే సాగర్‌కు విడుదల చేస్తామని తెలిపింది. పోతిరెడ్డిపాడు లెక్కల్లో చూపిస్తున్న దానికి మించి ఏపీ వినియోగం చేస్తోందని, అందుకే 25 టీఎంసీల మేర తేడా వస్తోందని బోర్డు దృష్టికి తెలంగాణ తీసుకెళ్లింది. దీనిపై బోర్డు స్పందిస్తూ.. అధిక వినియోగంపై బోర్డు ఏర్పాటు చేసిన కమిటీ పరిశీలిస్తోందని, మరో వారంలో కమిటీ నివేదిక వస్తుందని, రాగానే ఆ ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపింది. సాగర్ ఎడమ కాలువ కింద ఏపీ అవసరాలకు కేటాయించిన, వినియోగిస్తున్న నీటికి తేడా ఉంటోందని, దాన్ని పూడ్చాలని ఏపీ కోరింది. తెలంగాణ బదులిస్తూ.. సరఫరా నష్టాల వల్ల అలా జరుగుతోందని, దానిపైనా కమిటీ నియమించినందున, నివేదిక వచ్చాక నిర్ణయానికి రావాలని సూచించింది. ఇక టెలిమెట్రీ వ్యవస్థలను త్వరగా కార్యాచరణలోకి తీసుకురావాలని రెండు రాష్ట్రాలు కోరగా బోర్డు అంగీకరించింది. సమావేశంలో సభ్య కార్యదర్శి పరమేశంతో పాటు ఏపీ, తెలంగాణ ఈఎన్‌సీలు వెంకటేశ్వర్‌రావు, మురళీధర్, ఏపీ సీఈలు నారాయణరెడ్డి, జబ్బార్, సాగర్ సీఈ సునీల్, డిప్యూటీ చీఫ్ ఇంజనీర్‌లు నరహరి, రామచంద్రులు హాజరయ్యారు.

విదేశాల్లో రెండుసార్లు చిక్కితే పాస్‌పోర్ట్ రద్దు!

సందర్శక వీసాలపై వెళ్లి పనిచేస్తూ పట్టుబడుతున్న కార్మికులు

- కేంద్రం విడిపించినా.. మళ్లీ వెళుతున్న వైనం
- దాంతో ఐదేళ్లపాటు వారి పాస్‌పోర్టుల రద్దుకు నిర్ణయం
- అన్ని రాష్ట్రాల ఎన్నారై సంక్షేమ మంత్రులతో విదేశాంగ శాఖ సమావేశం
- హాజరైన కేటీఆర్.. సుష్మా స్వరాజ్‌కు పలు విజ్ఞప్తులు
- కేంద్ర వాణిజ్య మంత్రి సురేశ్ ప్రభుతోనూ భేటీ



బుధవారం ఢిల్లీలో కేంద్ర మంత్రి సురేశ్ ప్రభుతో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

సాక్షి, న్యూఢిల్లీ

పర్యాటక, సందర్శక వీసాలతో విదేశాలకు వెళ్లి పనిచేస్తూ పట్టుబడిన కార్మికుల పాస్‌పోర్టులను ఐదేళ్ల పాటు రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. కార్మికులు అలా పట్టుబడినప్పుడు ఆయా దేశాలతో మాట్లాడి విడిపించినా.. వారు మళ్లీ అదే తరహాలో విదేశాలకు వెళ్లి పనిచేస్తున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది. దీనికి అడ్డుకట్ట వేసేందుకే పాస్‌పోర్టుల రద్దు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. ఈ మేరకు బుధవారం ఢిల్లీలో జరిగిన అన్ని రాష్ట్రాల ఎన్నారై సంక్షేమ శాఖ మంత్రుల సమావేశంలో విదేశాంగ మంత్రి సుష్మా స్వరాజ్ వివరాలు వెల్లడించారు. ఈ భేటీలో పాల్గొన్న మంత్రి కె.తారకరామారావు అనంతరం మీడియాతో మాట్లాడారు. విదేశాల్లో ఒకసారి చిక్కుకుని కేంద్ర ప్రభుత్వ సాయంతో స్వదేశానికి చేరుకుంటున్న కొందరు కార్మికులు... తిరిగి అదేబాట పడుతున్నారని కేంద్రం గుర్తించిందని తెలిపారు. ఈ పరిస్థితికి అడ్డుకట్ట వేసేందుకు చర్యలు చేపట్టిందని, రెండు సార్లు విదేశాల్లో చిక్కుకున్న వారి పాస్‌పోర్టులను ఐదేళ్ల పాటు రద్దు చేయాలని నిర్ణయించిందని చెప్పారు. దానికి అన్ని రాష్ట్రాలు ఆమోదం తెలిపాయని వెల్లడించారు.

సుష్మాకు ఆహ్వానం

త్వరలో హైదరాబాద్‌లో జరగనున్న విదేశీ భవన్ శంకుస్థాపన కార్యక్రమానికి హాజరు కావాల్సిందిగా సుష్మా స్వరాజ్‌ను ఆహ్వానించామని కేటీఆర్ తెలిపారు. విదేశాల్లో ముఖ్యంగా మిడిల్ ఈస్ట్ దేశాల్లో తెలుగువారికి సహాయపడేందుకు అక్కడి ఎంబసీల్లో తెలుగు మాట్లాడే సిబ్బందిని నియమించాలని కేంద్ర మంత్రిని కోరామన్నారు. అవసరమైతే రాష్ట్రం నుంచి డిప్యుటేషన్ మీద తెలుగు సిబ్బందిని ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని వివరించామని, కేంద్ర మంత్రి దీనిపై సానుకూలంగా స్పందించారని చెప్పారు. విదేశాలకు పంపుతామంటూ ప్రచారం చేసుకునే నకిలీ ఏజెంట్ల పట్ల కఠిన వైఖరి అవలంబించాలని అన్ని రాష్ట్రాలను కేంద్ర మంత్రి కోరారని తెలిపారు. పాస్‌పోర్టు సేవల్లో హైదరాబాద్ కేంద్రం మెరుగైన పనితీరును కనబరుస్తోందని కితాబిచ్చారని వెల్లడించారు.

ఫార్మాసిటీకి 'నిమ్జ్' హోదా ఇవ్వండి

సుష్మాస్వరాజ్‌తో సమావేశం అనంతరం కేటీఆర్ కేంద్ర వాణిజ్య మంత్రి సురేశ్ ప్రభును కలిశారు. హైదరాబాద్ ఫార్మా సిటీకి 'జాతీయ పెట్టుబడులు, ఉత్పాదకత జోన్ (ఎన్‌ఐఎంజెడ్)'హోదా ఇచ్చే ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. అలాగే అక్కడ కామన్ ఎఫ్లూయంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ ఏర్పాటుకు రూ.1,500 కోట్లు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. నిజామాబాద్ స్పైస్ పార్కుకు కేంద్రం తరపున ఇస్తామన్న రూ.20 కోట్లు విడుదల చేయాలని... హైదరాబాద్–వరంగల్, హైదరాబాద్–రామగుండం, హైదరాబాద్–బెంగళూరు పారిశ్రామిక కారిడార్లలో మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు విడుదల చేయాలని కోరారు. తెలంగాణలో మెగా లెదర్‌పార్క్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వచ్చే నెల 22, 23 తేదీల్లో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న బయో ఆసియా సదస్సుకు గౌరవ అతిథిగా రావాలని సురేశ్ ప్రభును కేటీఆర్ ఆహ్వానించారు.



చెట్టు నీడ

జీవితమే ఒక సంతోషం

టీచర్ ఆరోజు తరగతి గదిలోకి రాగానే.. ''ఇవాళ మీరొక పరీక్షను రాయవలసి ఉంటుంది. సిద్ధంగా ఉండండి'' అన్నారు. విద్యార్థులలో ఆందోళన మొదలైంది. కొద్దిసేపటి తర్వాత ప్రశ్నపత్రాలు వచ్చాయి! ఎప్పటిలా ప్రశ్న పత్రాలను విద్యార్థుల ముందు బోర్లించి ఉంచారు టీచర్. ఆయన చెప్పేవరకు ఎవరూ ప్రశ్నపత్రాలను తిప్పి చూడకూడదు.

'దేవుడా, ప్రశ్నలు ఎంత కఠినంగా ఉండబోతున్నాయో' నని విద్యార్థులు బిక్కముఖాలు వేసుకుని కూర్చున్నారు. నిమిషాలు గడుస్తున్నాయి.

''స్టార్ట్'' అన్నారు టీచర్, చేతివాచీ చూసుకుంటూ.

వెంటనే విద్యార్థులంతా ప్రశ్నపత్రాలను తిప్పి చూసుకున్నారు. చూసుకుని, అంతా తెల్లమొహం వేశారు. ప్రశ్నపత్రంలో ప్రశ్నలు లేవు. అదొక తెల్ల కాగితం. కాగితం మధ్యలో మాత్రం ఒక నల్లటి చుక్క ఉంది! టీచర్ వైపు చూశారు. టీచర్ వారి వైపు చూసి, ''కాగితంలో మీరేం చూశారో అదే అక్కడ రాసివ్వండి'' అని చెప్పారు.

పీరియడ్ ముగియబోతుండగా టీచర్ ఆ ప్రశ్నప్రతాలన్నీ తీసుకుని, ఒక్కో పత్రంలో ఏం రాసి ఉందో పెద్దగా చదివి వినిపించడం మొదలు పెట్టారు. అందరూ ఒకటే రాశారు. 'ఒక నల్లటి చుక్క ఉంది. అది కాగితం మధ్యలో ఉంది' అని.

''మీరు రాసిన దానిని బట్టి నేను మీకేమీ మార్కులు ఇవ్వబోవడం లేదు. కేవలం మీలో ఆలోచన రేకెత్తించడానికే ఈ పరీక్షను పెట్టాను. మీలో ఎవరూ కాగితంలో తెల్లగా ఉన్న భాగం గురించి రాయలేదు. అందరి దృష్టీ నల్లచుక్క మీదే ఉండిపోయింది. మన జీవితాల్లో కూడా సరిగ్గా ఇలాగే జరుగుతుంటుంది. సమస్యలే కనిపిస్తాయి తప్ప సంతోషాలను పట్టించుకోము. భగవంతుడు ఎంతో ప్రేమతో, ఆపేక్షతో మనకు ఈ జీవితాన్ని గొప్ప వరంలా ప్రసాదించాడు. మన చుట్టూ చాలా సంతోషాలు ఉన్నాయి. ఆహ్లాదకరమైన ప్రకృతి ఉంది. మంచి కుటుంబం ఉంది. మంచి స్నేహితులు ఉన్నారు. బతకడానికి ఒక ఉపాధి ఉంది. వాటిని పట్టించుకోము! ఆరోగ్య సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు, ఇంట్లోని కలతలు, బయటి కలహాలు.. వీటిచుట్టూ మాత్రమే మనసు తిరుగుతుంటుంది. ఇవన్నీ జీవితంలోని నల్లచుక్కలు. సంతోషాలను మసకబార్చే చుక్కలు. వీటిని తలచుకుని మనం నిస్పృహ చెందకూడదు. జీవితం ఇచ్చిన సంతోషాలను మాత్రమే దైవప్రసాదంలా స్వీకరించి ముందుకు నడవాలి. ప్రతి క్షణాన్నీ ఆనందించాలి'' అని ముగించారు టీచర్.

టీచర్ చెప్పినట్లు.. జీవితం నిండా సంతోషాలే! చిన్న పువ్వు సంతోషం. తేనీటి పరిమళం సంతోషం. సూర్యకిరణం సంతోషం. చంద్రవంక సంతోషం. అసలు మనిషికి మనిషే ఒక సంతోషం! కష్టాలు ఒకటీ రెండే. ఎప్పుడూ ఆ ఒకటీ రెండు గురించే ఆలోచిస్తూ కూర్చుంటే, సంతోషంగా ఎప్పుడు గడుపుతాం? ఇన్ని సంతోషాలను ఇచ్చిన దేవుడికి ఎప్పుడు కృతజ్ఞతలు తెలుపుకుంటాం?

స్కీయింగ్

తొలి పతకం



అంచల్

అంచల్‌కు ఆల్రెడీ ప్రధాని మోదీ ట్విటర్‌లో అభినందనలు చెప్పేశారు. క్రీడల మంత్రి రాజ్యవర్ధన్ సింగ్ రాథోడ్ ప్రశంసలు గుప్పిస్తున్నారు. పూలగుత్తుల వెల్లువ ఇంకా ఆగలేదు. చరిత్ర సృష్టించిన కూతుర్ని దేశం పొగడ్తల్లో ముంచెత్తుతుంటే.. ఆమె తండ్రి రోషన్ ఠాకూర్ హృదయం ఉప్పొంగుతోంది. టర్కీ ఇంటర్నేషనల్ స్కీయింగ్‌లో అంచల్ పతకాన్ని సాధించడమే ఈ ఉల్లాసానికంతటికీ కారణం.
అంచల్ మూడవ స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని అందుకుంది. అదొక్కటే కాదు ఆమె ఘనత. మనదేశానికి స్కీయింగ్ విభాగంలో మెడల్ తెచ్చిన తొలి యువతి కూడా. అంచల్ ఠాకూర్ వయసు ఇరవై ఒకటి. మనాలీ (హిమాచల్ ప్రదేశ్) అమ్మాయి. తండ్రి 'వింటర్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా' ప్రధాన కార్యదర్శి. మన క్రీడా ప్రపంచా నికి పెద్దగా అలవాటు లేని స్కీయింగ్ క్రీడలో భారత్‌కు పతకం రావడం, అందునా ఆ ఘన తను సాధిం చింది తన కూతురు కావడంతో ఆనందాన్ని పట్టలేక పోతు న్నారు ఆయన. దేశమే మురిసి పోతుంటే తండ్రి మురిసిపోడా?!

– మంజీర



అంచల్

యూనిఫామ్ తొడుక్కుంటే సమాజానికి తెలుస్తుంది తన పవర్ ఏంటో!
సమాజానికి తోడుగా ఉంటే ఖాకీకి అర్థమవుతుంది తన పవర్ ఏంటో!!
సహనం, సంయమనం, నాయకత్వ లక్షణాలతో
యూనిఫామ్‌కే వన్నెతెచ్చిన స్వాతి లక్రా ఐపీఎస్‌తో ఇంటర్వ్యూ...

షీ లీడర్



ఫోటో: శివ మల్లాల

స్వాతి లక్రా, ఐపీఎస్
అడిషనల్ కమిషనర్ ఆఫ్ పోలీస్
(సిట్, క్రైమ్), హైదరాబాద్
'షీ టీమ్స్', 'భరోసా' సెంటర్స్ హెడ్

'హంఫ్రీ లీడర్‌షిప్' అవార్డు.. నాయకత్వ లక్షణాలకు ఒక నికార్సైన గుర్తింపు. ఆ గుర్తింపు 'షీ–టీమ్స్' సూపర్ కాప్ స్వాతి లక్రాకు వచ్చింది! అవార్డు అందుకోడానికి ఇటీవలే అమెరికా వెళ్లొచ్చారు. టీమ్ వర్క్ టిప్స్ కొన్ని అక్కడివారితో పంచుకున్నాను. అవార్డు అందుకుని వచ్చిన సందర్భంగా అభినందనలు తెలియజేయడానికి వెళ్లినప్పుడు ధన్యవాదాలు తెలుపుతూ, ఎంతో ప్రతిష్టాత్మకమైన ఆ గుర్తింపు తనకు షీ–టీమ్స్, భరోసా కేంద్రాల వల్ల వచ్చిందని అన్నారు. ''చాలా హ్యాపీగా ఉంది. అయితే నేనింకా చేయవలసింది ఎంతో ఉంది'' అన్నారు. 'సాక్షి'తో కొద్దిసేపు సంభాషించారు.

- **చిన్నప్పుడు మీ ఇంట్లో ఏమైనా వివక్ష ఉండేదా?**

లేదు. మా ఇంట్లో అసలు అలాంటి వాతావరణమే లేదు. మా బ్రదర్‌కి ఎన్ని అవకాశాలిచ్చారో మాకూ అన్నే అవకాశాలిచ్చారు మా ఇంట్లో. ఇక్కడ మీకో విషయం చెప్పాలి.. రాంచీలో కాలేజీలు సరిగ్గా లేవు. అంటే ఆ విశ్వవిద్యాలయాల పనితీరు తాత్సారంగా ఉండేది. దానివల్ల అక్కయ్య నష్టపోయింది. ఆమెకు కోల్‌కతా ఐఐఎమ్‌లో సీట్ వచ్చింది. కానీ అప్పటికి ఇంకా డిగ్రీ ఫలితాలను విడుదల చేయలేదు. దాంతో ఆమె ఆ సీటును వదులుకోవాల్సి వచ్చింది. ఈ సంఘటన తర్వాత మా నాన్న నన్ను, మా అన్నయ్యను ఢిల్లీ పంపించారు పై చదువుల కోసం. అక్కడ నన్ను 'లేడీ శ్రీరామ్ కాలేజీ'లో చేర్పించారు. ఇది ఎందుకు చెప్పానంటే.. మా అక్కకు జరిగిన నష్టం మా ఇద్దరికీ జరగకూడదని ఆయన తీసుకున్న శ్రద్ధను వివరించడానికి. ఆ టైమ్‌లో మా కుటుంబం నుంచి, మా బంధువులందరిలో ఢిల్లీకి వెళ్లి చదువుకుంది మేమే. వివక్ష లేదు కాబట్టే మా నాన్న మా అన్నయ్యతోపాటు నన్నూ పంపించగలిగారు.

- **సివిల్స్ రాయడానికి మీకు స్ఫూర్తి ఎవరు?**

మా నాన్నగారు, లేడీ శ్రీరామ్ కాలేజ్‌లోని నా స్నేహితులు. డిగ్రీలో నాది ఆర్ట్స్. పొలిటికల్ సైన్స్‌లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేశాను. పీజీలోనే సివిల్స్‌కి ప్రిపరేషన్ మొదలుపెట్టాను. అయితే సీరియస్‌గా తీసుకోలేదు. ఏమీ చదవకుండానే ప్రిలిమ్స్ అయితే పాస్ అయ్యాను కానీ ఫైనల్స్ కుదరలేదు (నవ్వుతూ). మా నాన్న ఫోన్ చేశారు. ఏమైంది? అని. దేని గురించీ అన్నాను. సివిల్స్ అన్నారు. రాలేదు అని చెప్పాను. పర్వాలేదు. ఈసారి ప్రయత్నించు అన్నారు. అప్పుడనిపించింది.. మా నాన్న పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకూడదు అని. సీరియస్‌గా చదివాను. ఐపీఎస్ సాధించాను.

- **ఫస్ట్ టైమ్ పోలీస్ యూనిఫామ్ చూసినప్పుడు ఎలా ఫీలయ్యారు?**

గర్వంగా. అప్పుడే కాదు ఇప్పటికీ గర్వంగానే ఉంటుంది. అదే నా గుర్తింపు. స్వాతి లక్రా అంటే నథింగ్. స్వాతిలక్రా ఐపీఎస్ అంటేనే కదా నాకు ఒక బాధ్యత.. దానివల్ల ఈ గుర్తింపు.

- **పోలీస్ ఉద్యోగం అంటే ఇరవై నాలుగు గంటల సర్వీస్.. రకరకాల మనుషులతో డీల్ చెయ్యాలి! ఇలాంటి ఉద్యోగాన్ని, అటు ఇంటిని ఎలా బ్యాలెన్స్ చేస్తున్నారు?**

సీ.. ఏ ఉద్యోగం అయినా దానికి తగ్గ సమస్యలు ఉంటాయి. ఇదీ అంతే. ఇవన్నీ ఉంటాయని తెలిసే ఈ ఉద్యోగంలోకి వచ్చాను కాబట్టి ఐ హావ్ టు డు! అయితే నేను ఇంటిని, ఆఫీస్‌ను కలపను. ఇంటికి ఆఫీస్ ఫైల్స్ తీసుకెళ్లను. ఇంట్లో కంప్లీట్‌గా నా పిల్లలకు మదర్‌లాగే ఉంటాను. అలాగే విధి నిర్వహణలో ఎదురయ్యే సవాళ్లను ఇంట్లో వాళ్లకు చెప్పను. నేను పరిష్కరించు కోగలను. మా అమ్మానాన్న, ఇన్ లాస్, భర్త అందరూ చాలా సపోర్టివ్‌గానే ఉన్నారు. మా వారు (బెన్‌హర్ మహేష్‌దత్ ఎక్కా) కూడా ఐఏఎస్. నా బ్యాచ్‌మేటే! నా చాలెంజెస్, నా ఉద్యోగ నియమాలు, బాధ్యతలు అన్నీ అర్థం చేసుకుంటారు. కాబట్టి ప్రాబ్లమ్ లేదు.

- **మీవారు ఐఏఎస్, మీరు ఐపీఎస్.. ఒకరి విషయాల్లో ఇంకొకరి ఇన్‌వాల్వ్‌మెంట్ ఉంటుందా?**

ఉండదు. మా ఇద్దరికీ స్పష్టత ఉంది. ఒకరికొకరం సహకరించుకుంటూ ఎవరి పనిలో వాళ్లం ఉంటాం. మా ప్రొఫెషనల్ స్పేస్‌నూ కాపాడుకుంటాం.

- **ఇప్పుడు పరిస్థితి ఎలా ఉంది? అమ్మాయిలకు సపోర్టివ్‌గా ఉందంటారా?**

మార్పు అయితే వచ్చింది. ఇంతకుముందు ఏ అమ్మాయికైనా వేధింపులు ఎదురైతే పోలీస్ కంప్లయింట్ ఇవ్వడానికి భయపడేవాళ్లు. పోలీస్‌ల మీద నమ్మకం లేకో.. వాళ్ల వివరాలను గోప్యంగా ఉంచలేమనో.. ఇలా రకరకాల కారణాల వల్ల ఫిర్యాదు చేసేవాళ్లు కాదు.

కానీ ఇప్పుడు అలా కాదు. ధైర్యంగా ముందుకొస్తున్నారు. మేము (పోలీసులు) కూడా 'పీపుల్ ఫ్రెండ్లీ' కావడానికి ట్రై చేస్తున్నాం. అలాగే మహిళల హక్కుల పట్ల కూడా మగవాళ్లలో కొంత అవేర్‌నెస్ వచ్చింది. 'షీ టీమ్స్' ద్వారా చూస్తున్నాం కదా.. బయట తమకెంత హక్కు ఉందో మహిళలకూ అంతే ఉందని అర్థం చేసుకుంటున్నారు మగవాళ్లు. మర్యాదగా ఉండేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇంకా అవగాహన కల్పించాలి. అది తెప్పించడం కోసం భవిష్యత్‌లో వలంటీర్స్‌తో అవేర్‌నెస్ ప్రోగ్రామ్స్ చేయాలనుకుంటున్నాం.

- **నేటి మహిళ ఎలా ఉండాలి?**

చాలా కాన్ఫిడెంట్‌గా.. భయంలేకుండా ఉండాలి. చేస్తున్న పని పట్ల ప్యాషన్ ఉండాలి. మన హక్కులు తెలుసుకోవాలి.. కాపాడుకోవాలి. అలాగే మగవాళ్లు కూడా ఆలోచించాలి. ప్రకృతిలో స్త్రీ, పురుషులు ఇద్దరూ ఉన్నప్పుడు ఇద్దరికీ సమాన హక్కులు ఉంటాయని!

– ఇంటర్వ్యూ: **సరస్వతి రమ**

ఇంట్లో గారం...
స్కూల్లో క్రమశిక్షణ

మేం ముగ్గురం. అక్క, అన్న. నేనే చిన్నదాన్నవడం వల్ల ఇంట్లో కొంచెం గారం ఎక్కువగానే ఉండేది. మా నాన్న (సుబోధ్ లక్రా) రైల్వేలో ఇంజనీరు. ఆయనకు తరచు బదిలీలు అవుతుండేవి. మా సొంతూరు రాంచీ. చదువుల కోసం మమ్మల్ని రాంచీలోనే ఉంచి ఆయన మాత్రమే వెళ్లేవారు. ఇంటిని, మమ్మల్ని మా అమ్మే (లూసీ లక్రా) చూసుకునేది. ఎల్‌కేజీ నుంచి టెన్త్ వరకు నేను ఒకే స్కూల్‌లో చదివాను. అది మిషనరీ స్కూల్. దాంతో క్రమశిక్షణ బాగా అలవడింది. అక్కడి టీచర్స్, సిస్టర్స్ దగ్గర్నుంచి చాలా నేర్చుకున్నాను.

త్రీడీ ఫార్ములా



సత్యార్థి

పిల్లలే ఫ్యూచర్

ఇవాళ సత్యార్థి బర్త్‌డే. బాలల ఆకాంక్షలకు స్వేచ్ఛనివ్వడమే ఆయనకు మనం పంపే బర్త్‌డే గ్రీటింగ్!

మనిషి పరుగులు ఎవరి కోసం? సంపాదన కోసం. సంపాదన ఎవరి కోసం? పిల్లల కోసం. లోకం.. పిల్లల చుట్టూ తిరుగుతోంది. పిల్లలే లోకంగా అవిశ్రాంతంగా శ్రమిస్తోంది. సూక్ష్మంగా చూస్తే సైన్స్‌అండ్ టెక్నాలజీ, సోషియాలజీ, పాలనా నిర్ణయాలు.. అన్నీ.. పిల్లల కోసమే. పిల్లలే ప్రపంచ భవిష్యత్తు కాబట్టి. అయితే.. పిల్లల చుట్టూ పరిభ్రమిస్తున్న మనిషి గానీ, పాలనా యంత్రాంగాలు కానీ పిల్ల రక్షణను, సంరక్షణకు అవసరమైన శ్రద్ధను చూపడం లేదు. సమాలోచనలు చేయడం లేదు. పిల్లల కోసం చేసిన చట్టాలు సక్రమంగా అమలవుతున్నదీ లేనిదీ చూడడం లేదు!

బాలల హక్కుల కార్యకర్త కైలాష్ సత్యార్థి.. ట్రెయినీ కలెక్టర్‌లతో ముచ్చటించేందుకు ప్రత్యేక ఆహ్వానంపై మంగళవారం హైదరాబాద్ వచ్చినప్పుడు ఇదే విషయమై ఆవేదన, ఆందోళన వ్యక్తం చేశారు. బాలల కోసం కలెక్టర్లుగా వాళ్లేం చేయవలసిందీ చెప్పారు. సత్యార్థి నోబెల్ శాంతి బహుమతి గ్రహీత కూడా. స్కూల్‌కు వెళ్లడం కోసం ఉగ్రవాదుల ఆక్షలను సైతం ఉల్లంఘించిన మలాలాకు, సత్యార్థికి కలిపి 2014లో ఆ అవార్డు వచ్చింది.

ప్రపంచ జనాభాలో ఆరు కోట్ల మంది బాలలకు చదువుకునే భాగ్యం లేదు. నాలుగు కోట్ల మంది బాలకార్మికులుగా నలిగిపోతున్నారు. నిమిషానికి ఒక చిన్నారి చొప్పున కనిపించకుండా పోతున్నారు! ఆ తర్వాత అక్రమ రవాణా అవుతున్నారు. ఇవన్నీ చెబుతూ, 'కలెక్టర్లు దృష్టి పెడితే ఈ పరిస్థితి మారుతుందని సత్యార్థి అన్నారు.

బాలల కోసం సత్యార్థి.. డ్రీమ్, డిస్కవరీ, డు.. అనే త్రీడీ ఫార్ములా ప్లాన్ చేశారు. భవిష్యత్తు గురించి కలలు కనడం, భవిష్యత్తు అవకాశాలను కనుగొనడం, అందుకు అనుగుణంగా ముందుకు సాగడం.. అనే ఈ త్రీడీ ఫార్ములాతో పిల్లలు స్వేచ్ఛగా ఎదిగేలా చూడడం, వారికి చట్టపరంగా జరగవలసిన న్యాయాన్ని అందించడం కలెక్టర్ల ప్రధాన కర్తవ్యం కావాలని సత్యార్థి కోరారు. సత్యార్థి కూడా ఒక కల కంటున్నారు. పిల్లలంతా సంతోషంగా కళకళలాడుతూ ఉండే ప్రపంచాన్ని ఆయన ఆకాంక్షిస్తున్నారు. పిల్లలే పెద్దల ప్రపంచం కావడం ఒక్కటే కాదు, ఈ ప్రపంచం పిల్లలది అయ్యేలా చూడ్డం ప్రతి తల్లీ తండ్రీ బాధ్యత. అలాగే ప్రభుత్వాలదీ.

గ్లోబల్ రిపోర్ట్

6 కోట్లు... బడి భాగ్యం లేని పిల్లల సంఖ్య
4 కోట్లు... బాల కార్మికుల సంఖ్య
నిమిషానికొకరు అదృశ్యం
80 శాతం చిన్నారులపై పరిచయస్తుల లైంగిక అఘాయిత్యాలు



మాటుంగ రైల్వేస్టేషన్

మమతల కోవెల

అందరూ మహిళలే. రైలుకు సిగ్నల్ ఇచ్చేది మహిళ, కౌంటర్‌లో టిక్కెట్ అమ్మేది మహిళ, రైల్లో టికెట్ చెక్ చేసేది మహిళ. ఒక్కమాటలో.. స్టేషన్‌మాస్టర్ నుంచి స్వీపర్ వరకు అందరూ మహిళలే. ఇదేమీ కాల్పనిక సన్నివేశం కాదు. రియల్‌లైఫ్‌లో మహిళలు సాధించిన ఘనత. లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్ నమోదు చేసిన మహిళా సాధికారత. ముంబై నగరంలో మాటుంగా రైల్వేస్టేషన్‌లో ఉద్యోగులంతా మహిళలే. ఆపరేషన్స్, కమర్షియల్ విభాగంలో పదిహేడు మంది, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్‌లో ఆరుగురు, టికెట్ చెకింగ్‌కి ఎనిమిది మంది, ఇక అనౌన్సర్‌లు, పాయింట్ పర్సన్స్, ఇతర బాధ్యతలలో ఉన్నవారు మొత్తం కలిపి 41 మంది మహిళలు!

సెంట్రల్ రైల్వేస్ జనరల్ మేనేజర్ డి.కె శర్మకు గత ఏడాది జూలైలో వచ్చిన వినూత్నమైన ఆలోచనకు ఆచరణ రూపమే ఈ అపూర్వ పరిణామం. నిబద్ధతగా ఉద్యోగం చేయడం నుంచి



మాటుంగ రైల్వేస్టేషన్ సిబ్బంది అంతా మహిళలే. ఈ ప్రత్యేకత కారణంగా లిమ్కా రికార్డ్స్‌లో ఈ స్టేషన్‌కు స్థానం లభించింది.

పరిశుభ్రత, ఇతర పనుల్లో కచ్చితంగా ఉండడం ఆడవాళ్లకు సహజమే. ఇతర ఒత్తిడిలేవీ లేకపోతే ఆడవాళ్లు అద్భుతాలు చేయగలరని, నిర్ణయాలు తీసుకోవడంలో సంఘటితంగా ఉండగలరనీ, చక్కటి పని వాతావరణాన్ని కల్పించడం ఆడవాళ్ల చేతుల్లోనే ఉందని జనరల్ మేనేజర్ శర్మకు ఉన్న నమ్మకాన్ని మహిళలంతా నిజమని నిరూపించారు. అందరూ మహిళలే ఉంటే మెరుగైన ఫలితాలు వస్తాయని, అనుకున్నదే తడవుగా ఆయన తీసుకున్న నిర్ణయం మంచి ఫలితాలను ఇస్తోందని, ఈ ఫార్ములాను కొనసాగిస్తామంటున్నారు పై అధికారులు. మరొక విశేషం ఏమిటంటే ఈ స్టేషన్ మాస్టర్ మమతా కులకర్ణి 1992లో ఇదే రైల్వేస్టేషన్‌లో అసిస్టెంట్ స్టేషన్ మేనేజర్‌గా ఉద్యోగంలో చేరారు. ఇప్పుడామె స్టేషన్ మాస్టర్. టీమ్‌ని నడిపించడంలో స్టేషన్‌ని మమతల కోవెలగా మార్చారు. అంతా బాగానే ఉంది కానీ, ఆ స్టేషన్‌కొచ్చే రైళ్లను నడిపేది మగవాళ్లేగా అని సెటైర్ వేసేవాళ్లు ఉండొచ్చు. అయితే ఉమన్ లోకోపైలట్‌లు ఇప్పుడు చెప్పుకోదగ్గ సంఖ్యలో ఉన్నారు. ముంబైతో మొదలైన ఆ ట్రెండ్ హైదరాబాద్ మెట్రో వరకు విస్తరించింది కూడా.


● రవితేజ

రవితేజ.. శ్రీను వైట్ల.. మైత్రి!

మైత్రీ కుదిరింది. అవును రవితేజ, శ్రీను వైట్లకు మైత్రీ కుదిరింది. ఇప్పుడేంటి? ఎప్పటి నుంచో ఈ ఇద్దరి మధ్య మంచి స్నేహం ఉంది కదా. 'నీ కోసం', 'వెంకీ', 'దుబాయ్ శీను'.. ఇలా వీళ్ల కాంబినేషన్‌లో సినిమాలు వచ్చాయి కదా అనుకుంటున్నారా! విషయం ఏంటంటే.. రవితేజ హీరోగా శ్రీను వైట్ల దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ ఓ సినిమా నిర్మించనుంది. వై. రవిశంకర్, ఎర్నేని నవీన్, చెరుకూరి మోహన్ నిర్మాతలు. త్వరలో ఈ చిత్రం షూటింగ్ ఆరంభం కానుందట. ప్రస్తుతం స్క్రిప్ట్ వర్క్ జరుగుతోందని సమాచారం. కథానుగుణంగా ఎక్కువ శాతం షూటింగ్‌ను అమెరికాలో జరపడానికి ప్లాన్ చేశారని భోగట్టా. ఇదిలా ఉంటే.. రవితేజ-శ్రీను వైట్ల చివరి సినిమా 'దుబాయ్ శీను' విడుదలైంది 2007లో. వీళ్ల కాంబినేషన్‌లో రూపొందిన మూడు సినిమాలూ హిట్టే. సో.. పదేళ్ల తర్వాత మరో హిట్ కోసం ఈ కాంబినేషన్ రెడీ అయిందన్న మాట.

గానా బజానా


● మహేశ్‌బాబు

థియేటర్‌కి వెళ్లారు హీరో మహేశ్‌బాబు. ఏ థియేటర్‌కి వెళ్లారు? ఆ థియేటర్ ఎక్కడుంది? అంటే.. హైదరాబాద్‌లో ఓ థియేటర్‌కి వెళ్లారు. ఏ సినిమా చూడ్డానికి వెళ్లారు? అంటే.. తన సినిమా కోసమే. మహేశ్‌బాబు సినిమా ఏ థియేటర్‌లోనూ ఆడటంలేదు కదా అనుకుంటున్నారా? మహేశ్ వెళ్లింది.. సినిమా చూడ్డానికి కాదు.. షూటింగ్ చేయడానికి. 'శ్రీమంతుడు' వంటి బ్లాక్ బస్టర్ మూవీ తర్వాత కొరటాల శివ దర్శకత్వంలో మహేశ్‌బాబు హీరోగా ఓ సినిమా రూపొందుతున్న సంగతి తెలిసిందే. 'భరత్ అనే నేను' టైటిల్‌ను పరిశీలిస్తున్నారట. డీవీవీ దానయ్య నిర్మిస్తున్న ఈ సినిమాలో కియారా అద్వాని కథానాయిక. ఒమెన్ విహార యాత్రల తర్వాత షూట్‌లో పాల్గొన్నారు మహేశ్. హైదరాబాద్‌లో మహేశ్, కియారాలపై సాంగ్ షూట్ చేశారు. ఆ సాంగ్ బ్యాక్‌డ్రాప్‌లో వచ్చే థియేటర్ సీక్వెన్స్‌లో మహేశ్‌బాబు పాల్గొన్నారట. థియేటర్లో గానా బజానా అదిరిపోయిందట. అసలు విషయం అది. పొంగల్‌కి ఫస్ట్‌లుక్ కాకుండా డైరెక్ట్‌గా టీజర్‌ను రిలీజ్ చేయాలన్న ఆలోచనలో ఉన్నారని ఫిల్మ్‌నగర్ టాక్. ఈ చిత్రానికి దేవీశ్రీ ప్రసాద్ స్వరకర్త.

● లొకేషన్లో చిల్ అవుతున్న కియారా



ఆడవాళ్లంటే వంట చేయడానికే కాదు

''మా గత చిత్రం 'వైశాఖం' నాకు చాలా సంతృప్తినిచ్చింది. ఆడియన్స్ కూడా బాగా అప్రిషియేట్ చేశారు. ఆ సినిమాలో ఇచ్చిన మెసేజ్ అందరికీ నచ్చింది. అంతకుముందు తీసిన 'లవ్లీ' అప్రిషియేషన్స్‌తో పాటు కమర్షియల్‌గా కూడా మంచి సక్సెస్ అయింది. 'లక్కీ ఫెలో' సినిమా 'లవ్లీ' కంటే పెద్ద హిట్ అవుతుంది" అని దర్శకురాలు జయ బి. అన్నారు. బుధవారం ఆమె పుట్టినరోజు. ఈ సందర్భంగా జయ బి. తన కొత్త చిత్రం వివరాలను, ఇతర విశేషాలను మీడియాతో పంచుకున్నారు.


● జయ బి.

- ప్రస్తుతం కొత్త సినిమా 'లక్కీ ఫెలో' ప్రీ-ప్రొడక్షన్ పనులు చేస్తున్నాం. ఇది 'వైశాఖం' అంత లేట్ అవ్వదు. జూన్‌లో స్టార్ట్ చేసి నాలుగైదు నెలల్లో కంప్లీట్ చేస్తాం. మనలో కొంతమందికి అనుకోకుండా ఒక పెద్ద అవకాశం వస్తుంది. ఆ వ్యక్తిని అందరం 'లక్కీ ఫెలో' అంటాం. ఈ సినిమాలో హీరో లక్కీ ఫెలో. ఆ లక్‌ను అతను ఎలా తీసుకుంటాడు? అన్నది కథాంశం. హ్యూమన్ సైకాలజీని బేస్ చేసుకొని కథ తయారు చేశాం.
- హీరోయిన్‌ది కూడా చాలా స్ట్రాంగ్ క్యారెక్టర్. సమాజంలో ఆడవాళ్లకు చిన్న చిన్న ఇబ్బందులు ఉంటాయి. అలాగని పెద్దవి ఉండవని కాదు. చిన్న సంఘటన అయినా మానసికంగా బాగా డిస్ట్రబ్ చేస్తుంది. టీనేజ్ అమ్మాయిలకైతే మరీను. హీరోయిన్ ఇలాంటి సెన్సిటీవ్ క్యారెక్టర్‌ని డీల్ చేస్తుంది. ఇప్పటివరకూ ఎవరూ ఈ పాయింట్‌ని టచ్ చేయలేదు. ఇప్పుడున్న యంగ్ హీరో హీరోయిన్లనే సెలెక్ట్ చేసుకుంటాం.
- నా ఫస్ట్ సినిమా 'చంటిగాడు' నుంచి ఎంటర్‌టైన్‌మెంట్ మిస్ అవ్వలేదు. ఎంటర్‌టైన్‌మెంట్‌తో పాటు అండర్ కరెంట్‌లో మెసేజ్ ఉంటుంది. త్వరగా సినిమాలు తీసేసి ఆ తర్వాత జనంలోకి వెళ్లి సమాజానికి ఉపయోగపడే పనులేవైనా చేయాలని ఉంది. నేను జర్నలిస్టుగా ఉన్న రోజుల్లో కూడా నన్ను చూసి ఇన్‌స్పైర్ అయి, జర్నలిజంలోకి వచ్చినవాళ్లు చాలామంది ఉన్నారు. మహిళా దర్శకుల సంఖ్య పెరగాలి. మగాళ్లు ఇంకా ఆడవాళ్లు అప్పడాలు చేయడానికి, వండటానికి మాత్రమే అనుకుంటున్నారు. ఆ ఆలోచనలో మార్పు రావాలి.



నెక్ట్స్ ఏంటి?

అవును. వాట్ నెక్ట్స్? అని మూడు నెలలుగా రకుల్ గురించి చాలామంది మనసులో ఉన్న ప్రశ్న. ఆ ప్రశ్నకు దాదాపు సమాధానం దొరికినట్లే. 'స్పైడర్' సినిమా రిలీజ్ అయి మూడు నెలలు కావొస్తున్నా రకుల్ తెలుగులో నెక్ట్స్ సినిమా ఇంకా సైన్ చేయలేదేంటి? అన్నదే ఆ ప్రశ్న. ప్రస్తుతం తమిళ సినిమాలు చేస్తోన్న రకుల్ ఓ తెలుగు సినిమాకి గ్రీన్ సిగ్నల్ ఇవ్వనున్నారట. శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వంలో నాగార్జున, నాని కాంబినేషన్‌లో ఓ మల్టీస్టారర్ మూవీ రూపొందనున్న విషయం తెలిసిందే. ఇందులో నాగార్జున డాన్‌గా, నాని డాక్టర్‌గా కనిపించబోతున్నారని సమాచారం. డాక్టర్‌కు జోడీగా.. అదేనండి నాని సరసన హీరోయిన్‌గా రకుల్ చేయనున్నారట. 'స్పైడర్'లో డాక్టర్‌గా చేసిన రకుల్ ఈ సినిమాలో డాక్టర్‌కి జోడీగా యాక్ట్ చేస్తారన్న మాట. వైజయంతీ మూవీస్ బ్యానర్ పై అశ్వినీదత్ నిర్మించనున్న ఈ సినిమా వచ్చే నెల నుంచి సెట్స్ పైకి వెళ్లనుంది.

● రకుల్

పెళ్లికూతురే పెళ్లికొడుకును లేపుకెళితే..


● అమైరా, సందీప్

'పెళ్లికూతురే పెళ్లికొడుకును లేపుకెళ్లడం ఫస్ట్ టైమ్ చూస్తున్నా'... కమెడియన్ ప్రియదర్శి.

'పెళ్లే కదా ఆగిపోయింది. వాళ్లు ఆగిపోలేదు కదా'.. నటుడు నాజర్

'మన హార్ట్‌తో మనం కనెక్ట్ అయితే మనకేమొస్తదే.. నువ్వు ఒక అబ్బాయితో కనెక్ట్ అవ్వాలి.. నేను బోలెడంత మంది అమ్మాయిలతో కనెక్ట్ అవ్వాలి'.. హీరోయిన్ అమైరా దస్తూర్‌తో హీరో సందీప్ కిషన్.

సూపర్‌స్టార్ కృష్ణ కుమార్తె మంజుల ఘట్టమనేని దర్శకత్వంలో తెరకెక్కిన తొలి చిత్రం 'మనసుకు నచ్చింది'లోని డైలాగ్స్ ఇవి. సందీప్ కిషన్, అమైరా దస్తూర్ జంటగా ఆనంది ఆర్ట్ క్రియేషన్స్-ఇందిరా ప్రొడక్షన్స్ పతాకాలపై సంజయ్ స్వరూప్. పి.కిరణ్ నిర్మించిన ఈ చిత్రం ట్రైలర్‌ను హీరో మహేశ్‌బాబు విడుదల చేశారు. ట్రైలర్‌లోని డైలాగ్స్ ఆకట్టుకునే విధంగా ఉన్నాయి. దర్శక-నిర్మాతలు మాట్లాడుతూ- ''రొమాంటిక్ డ్రామాగా రూపొందిన చిత్రమిది. ట్రైలర్‌కి విశేషమైన స్పందన లభించింది. రాధన్ స్వరపరచిన ఈ చిత్రం పాటలకు మంచి రెస్పాన్స్ వచ్చింది. త్వరలో ప్రీ-రిలీజ్ వేడుక నిర్వహించబోతున్నాం. ఈ నెల 26న సినిమాను విడుదల చేస్తాం'' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: రవి యాదవ్, మాటలు: సాయిమాధవ్ బుర్రా.

అంతరిక్షంలో టిక్ టిక్



ఇండియన్ సినిమా చరిత్రలో తొలి అంతరిక్ష సినిమాగా రూపొందిన తమిళ చిత్రం 'టిక్ టిక్ టిక్'. 'జయం' రవి, నివేదా పేతురాజ్ జంటగా శక్తీ సౌందర్‌రాజన్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాని చదలవాడ బ్రదర్స్ సమర్పణలో శ్రీ తిరుమల తిరుపతి వెంకటేశ్వర ఫిలింస్ పతాకంపై పద్మావతి చదలవాడ 'టిక్ టిక్ టిక్' పేరుతో తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు. ఈ చిత్రం టీజర్‌ను హీరో అడివి శేష్ విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ- ''టీజర్ చూస్తుంటే హాలీవుడ్ మూవీని తలపిస్తోంది. ఇండియన్ స్క్రీన్‌పై ఇలాంటి సినిమా రావడం గొప్ప విషయం. ఈ సినిమా బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ మూవీగా నిలుస్తుంది'' అన్నారు. సమర్పకుల్లో ఒకరైన లక్ష్మణ్ మాట్లాడుతూ- ''మా బ్యానర్‌లో వచ్చిన 'బిచ్చగాడు, 16' సినిమాలను ప్రేక్షకులు ఆదరించారు. ఇప్పుడు మరో విభిన్నమైన 'టిక్ టిక్ టిక్' సినిమాతో మీ ముందుకు వస్తున్నాం. ఆదరిస్తారనే నమ్మకం ఉంది. మంచి టెక్నికల్ అంశాలతో పాటు ఎమోషనల్ కంటెంట్ కూడా ఉంది. తొలి ఇండియన్ స్పేస్ చిత్రాన్ని తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నందుకు గర్వంగా ఉంది. త్వరలోనే సినిమాను విడుదల చేయనున్నాం'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: డి.ఇమ్మాన్, పాటలు: వెన్నెలకంటి, రాకేందు మౌళి, కెమెరా: వెంకటేశ్.

శ్రీనుగాడి ప్రేమ


● శ్రీనివాసరావు

శ్రీనివాసరావు హీరోగా, ప్రణవి, చాందినీ హీరోయిన్స్‌గా రూపొందిన సినిమా 'శీనుగాడి ప్రేమ'. 'సిన్సియర్ రా మామా' అన్నది ఉపశీర్షిక. ఆర్.కె.డి. దర్శకత్వంలో ధరిమిశెట్టి సత్యేశ్వరి నిర్మించిన ఈ సినిమా త్వరలో విడుదల కానుంది. సత్యేశ్వరి మాట్లాడుతూ-''లవ్, సెంటిమెంట్, యాక్షన్, కామెడీ నేపథ్యంలో తెరకెక్కిన చిత్రమిది. దర్శకుడు ఈ కథను అద్భుతంగా తెరపై ఆవిష్కరించారు. సంగీత దర్శకుడు రమణ కథకు తగ్గట్టు పాటలు, నేపథ్య సంగీతం అందించారు. అన్ని వర్గాల ప్రేక్షకులను మా చిత్రం ఆకట్టుకుని, విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది'' అన్నారు. చాందిని, రాంపల్లి వెంకటరమణ, సునీత, రంజిత్ తదితరులు నటించిన ఈ సినిమాకి కెమెరా: సతీష్.

పరి పరిశోధన

బ్యాక్టీరియా... మన జన్యువులను నియంత్రిస్తాయా?

వినడానికే ఆశ్చర్యంగా అనిపించే విషయమిది. శరీరంలో.. ముఖ్యంగా కడుపు, పేవుల్లో ఉండే కొన్ని రకాల బ్యాక్టీరియా మన జన్యువులను నియంత్రించడం ద్వారా మన ఆరోగ్యానికి కారణమవుతున్నాయని మూడు దేశాల శాస్త్రవేత్తలు కలిసికట్టుగా చేసిన పరిశోధన ద్వారా తెలిసింది. నేచర్ కమ్యూనికేషన్స్ తాజా సంచికలో ప్రచురితమైన పరిశోధన వివరాలు ఇలా ఉన్నాయి. మనం పండ్లు, కాయగూరలు తిన్నప్పుడు.. వాటిని బ్యాక్టీరియా జీర్ణం చేసుకుంటాయి. ఈ క్రమంలో అవి కొన్ని రసాయనాలను విడుదల చేస్తాయి. ఇవి బ్యాక్టీరియా నుంచి బయటపడి మన కణాల్లోకి ప్రవేశించే సామర్థ్యం కలిగి ఉంటాయి.



ఇలా అవి మన కణాల్లోకి చేరినప్పుడు అక్కడ ఉండే జన్యువుల ప్రవర్తనపై ప్రభావం చూపుతాయన్నమాట. బ్యాక్టీరియా విడుదల చేసే రసాయనాలు షార్ట్ చెయిన్ ఫ్యాటీయాసిడ్ల రూపంలో ఉంటాయని, హెచ్‌డీఏసీ అనే ప్రొటీన్ ఉత్పత్తిని అడ్డుకోవడం ద్వారా ఇవి జన్యువుల్లో రసాయన మార్పులకు కారణమవుతున్నాయని ఈ పరిశోధనల్లో పాలుపంచుకున్న శాస్త్రవేత్త డాక్టర్ ప్యాట్రిక్ వర్గా వెయిజ్ అంటున్నారు. కడుపు, పేవుల్లోని బ్యాక్టీరియా తొలగించిన ఎలుకల్లో హెచ్‌డీఏసీ ప్రొటీన్ ఎక్కువగా ఉందని, ఈ పరిస్థితి పేవుల్లో కేన్సర్‌కు ఒక కారణమని ఇప్పటికే కొన్ని పరిశోధనలు రుజువు చేశాయని ప్యాట్రిక్ తెలిపారు. కేన్సర్ నివారణతోపాటు మంచి ఆరోగ్యానికి శరీరంలోని కొన్ని బ్యాక్టీరియా కీలకమని తమ పరిశోధన చెబుతోందని ఆయన వివరించారు.

చీమలు, మొక్కల విషంతో కేన్సర్ కణాలకు చెక్!

శరీరంలోని కేన్సర్ కణాలను మాత్రమే విజయవంతంగా నాశనం చేసేందుకు కొన్ని రకాల మొక్కలు, చీమల్లోని రసాయనం ఉపయోగపడుతుందని వార్విక్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు అంటున్నారు. కేన్సర్ కణాలు వేగంగా విడిపోయేందుకు కారణమైన వ్యవస్థను లక్ష్యంగా చేసుకుని పనిచేయడం ద్వారా ఈ రసాయనం పనిచేస్తుందని ఈ పరిశోధనల్లో పాల్గొన్న శాస్త్రవేత్త డాక్టర్ పీటర్ తెలిపారు. మొక్కలు, చీమలతోపాటు అనేక జీవజాతుల్లో సోడియం ఫార్మాట్ అనే రసాయనం ఒకటి ఉంటుంది. దీనిన జేపీసీ11 అనే సేంద్రీయ పదార్థంతో కలిపి ప్రయోగించినప్పుడు కేన్సర్ కణాల విభజనకు ఉపయోగపడే పైరువేట్ రసాయనం కాస్తా అసహజమైన లాక్టేట్‌గా మారిపోతుంది. ఫలితంగా కణ విభజన స్తంభించిపోతుంది. కేన్సర్ కణాలు నాశనమైపోతాయి. ఇంకో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే... ఒకే కేన్సర్‌కణంపై ఈ రసాయనం మళ్లీమళ్లీ దాడి చేయగలదు కాబట్టి ఏ కణం కూడా దీని ప్రభావం నుంచి తప్పించుకోలేదని అంచనా. ఈ సరికొత్త రసాయన మిశ్రమం కేన్సర్‌పై పోరులో కీలక పాత్ర పోషించగలదని పీటర్ అంటున్నారు. కీమోథెరపీలో వాడే విషపూరిత రసాయనాల మోతాదును అతితక్కువ మోతాదులో వాడటం ద్వారా దుష్ప్రభావాలను గణనీయంగా తగ్గించవచ్చు. కేన్సర కణాలకు మాత్రమే పరిమితమైన వ్యవస్థలే లక్ష్యంగా పనిచేస్తూండటం వల్ల ఆరోగ్యకరమైన కణాలకు ఏమాత్రం హాని జరగదని పీటర్ చెప్పారు.



వారం రోజుల మందులు ఒక్క క్యాప్సూల్‌లో

హెచ్‌ఐవీతో బాధపడుతన్న వారికో శుభవార్త. రోజూ బోలెడన్ని మాత్రలు తీసుకోవాల్సిన శ్రమ త్వరలోనే తప్పనుంది. వారం రోజులకు సరిపడా మందులన్నింటినీ ఒకే ఒక్క క్యాప్సూల్‌లోకి చేర్చడంలో మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఐటీ) శాస్త్రవేత్తలు విజయం సాధించడం దీనికి కారణం. క్యాప్సూల్‌లోని మందులు నెమ్మదిగా విడుదల అవడం ద్వారా హెచ్‌ఐవీ వైరస్ నుంచి వారం పాటు రక్షణ కల్పిస్తాయని ఈ పరిశోధనల్లో పాల్గొన్న శాస్త్రవేత్త గియోవానీ ట్రావెర్సో తెలిపారు. లైండ్రా అనే ఫార్మా కంపెనీ ఇప్పుడు ఈ సరికొత్త క్యాప్సూల్ క్లినికల్ ట్రయల్స్ నిర్వహించే ప్రయత్నాల్లో ఉంది. వేర్వేరు మందులను ఒక్కచోటికి తీసుకు రాగల టెక్నాలజీ ఒక్క హెచ్‌ఐవీకి మాత్రమే కాకుండా అనేక ఇతర వ్యాధులకూ ఉపయోగపడుతుందని ట్రావెర్సో అంటున్నారు. యాంటీ రెట్రోవైరల్ మందులు అందుబాటులోకి వచ్చిన తరువాత హెచ్‌ఐవీ మరణాల రేటు గణనీయంగా తగ్గినప్పటికీ, వీటిని క్రమం తప్పకుండా తీసుకోవడంలో జరుగుతున్న నిర్లక్ష్యం వల్ల ఇప్పటికీ కొంతమంది చనిపోతున్నారు. ఈ నేపథ్యంలో లైండ్రా ఈ సరికొత్త క్యాప్సూల్‌ను అభివృద్ధి చేయడం విశేషం. ఆరు మూలలతో నక్షత్రం ఆకారంలో ఉండే ఈ క్యాప్సూల్ ఒక్కసారి కడుపులోకి చేరితే దాదాపు రెండు వారాలపాటు మనగలదు. ఈ కాలంలో ఒక్కో మూలలో ఉండే మందు క్రమేపీ విడుదలవుతూ వ్యాధి నుంచి రక్షణ కల్పిస్తుందన్నమాట. ఎప్పుడు ఏ మందు విడుదల కావాలో తయారీ సమయంలోనే నిర్ణయించుకోగలగడం ఇంకో విశేషం.



ముగ్గు-ముచ్చట



వీరంరెడ్డి పుష్పలత
గోపాలునిపల్లె, ప్రకాశం జిల్లా
18 చుక్కలు
18 వరుసలు




ఆర్.నివేదిత
మిర్యాలగూడ
నల్లగొండ జిల్లా
29 చుక్కలు
1 వచ్చేవరకు



శాంతి, హైదరాబాద్
16 చుక్కలు
4 వరుసలు
4 వరకు

లవ్ డాక్టర్ — నన్నడగొద్దు ప్లీజ్



ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

హాయ్ అన్నా, మీరు డైరెక్ట్‌గా ఆన్సర్ చెయ్యరు కానీ, చదివి చూస్తే.. అందులోని అసలైన సమాధానం అర్థమవుతుంది. మీ రైటింగ్ స్టైల్ సూపర్. అన్నా... నాది వెరైటీ లవ్. నేను 2012లో ఒక అమ్మాయిని బస్టాప్‌లో చూశాను. తను నా వంక చూసి నా పక్కనే కూర్చుంది. నా పక్కన మా డాడ్ ఉండటంతో అప్పుడు నేను తనతో మాట్లాడలేకపోయా. తరువాత వన్ ఇయర్ పాటు తనని వెతికాను. దాంతో తనని చూసిన సేమ్ ప్లేస్‌లో నా నెంబర్ రాశాను. వన్ వీక్‌లో రిప్లై వచ్చింది. వరల్డ్‌లోనే నాది ప్యూర్ లవ్ అని అనుకున్నా. తను నన్ను ఫస్ట్ టైమ్ చూసిన వైట్ షర్ట్‌ని ఫైవ్ ఇయర్స్ అయినా అలానే దాచుకున్నా. కానీ తను జలక్ ఇచ్చింది. మొదట్లో పెళ్లి చేసుకుందాం అనేది. ఇద్దరం బీటెక్ ఫైనల్ ఇయర్. అయితే నాకు ఫోర్ సబ్జెక్ట్స్ ఉన్నాయి. తను క్లాస్ టాపర్. దాంతో 'కెరీర్ ముఖ్యం' అంటోంది. మనం లైఫ్‌లాంగ్ ఫ్రెండ్స్‌లానే ఉందాం అంటోంది. తను నెక్స్ట్ ఇయర్ జాబ్‌లో జాయిన్ అవుతుంది. మరి నా పొజిషన్ ఏంటన్నా??

– దిలీప్

అట్లాంటిక్ మహా సముద్రంలో ఈత కొట్టు అన్నా..?

'వద్దు సార్ మీ వెటకారాలు భరించలేకపోతున్నాను. అసలు మీరు ఇంత రఫ్‌గా చురకలు పెడుతున్నా ఈ అబ్బాయిలకు ఏంటి సార్ అట్రాక్షన్.? మీకు రాస్తూనే ఉంటారు? అసలు నేను దిలీప్ పొజిషన్‌లో ఉంటే మీ బొమ్మలో ఉన్న మీసాలను గొరిగేసి.. లవ్ డాక్టర్ డౌన్.. డౌన్.. అని బ్యానెర్లు కట్టి.. ప్లకార్డులు పట్టి.. ఉద్యమం చేసి, యువ అబ్బాయిల సంఘం ప్రెసిడెంట్ అయిపోయి.. 'మీ పతనానికి ఏడు మెట్లు' అనే పుస్తకం రాసి.. ప్రతి లవర్ బాయ్‌కి టెన్ రూపీస్ డిస్కౌంట్‌లో అమ్మి.. మీ ప్రాక్టీస్ ఖతం చేసే దాన్ని... కానీ...'

కానీ ఏంటి నీలాంబరీ..

'కానీ అన్‌ఫార్చునేట్లీ నేను అమ్మాయిని అయిపోయాను..'

పోనీ అమ్మాయిగా ఉద్యమించు నీలాంబరీ.. నీకే నా ఫుల్ సపోర్ట్..!!

'ఎందుకు సార్.. మీ బోడి సపోర్ట్? అమ్మాయిలెవరూ మీకు అగేనెస్ట్‌గా రారన్న ధీమాతో మీరు ఇలా చేస్తున్నారు. పోనీలెండి సార్.. నా మాట విని ఎట్ లీస్ట్ దిలీప్ అయినా ఉద్యమించాలని కోరుకుంటున్నాను.'

ఆల్ ది బెస్ట్ దిలీప్..

'సార్.. మీ విషెస్ ఏం వద్దు.. ఆన్సర్ చెప్పండి..'

నాలుగు సబ్జెక్ట్స్ పల్టీ కొట్టి ప్రేమలో కుప్పిగంతులు వేస్తే.. ఏ అమ్మాయి ఒప్పుకుంటుందన్నా దిలీప్? ముందు లైఫ్‌లో పాస్ అవ్వు. ఆ తరువాత ఆ అమ్మాయిని మించిన అమ్మాయి నీ లవ్ కోసం వస్తుంది. వైట్ షర్ట్‌కి కొత్త రంగు డై కొట్టించు. కోతలు కొట్టడం మానెయ్యి..

'ఏంటి సార్ దిలీప్ లవ్ స్టోరీ కోతలా సార్???'

ఈ మధ్యే ''హలో'' అనే సినిమా వచ్చింది.. దాని కథే తిప్పి రాశాడు దిలీప్ అన్న.. చాలా క్రియేటివ్..!

lovedoctorram@sakshi.com

పాశుర ప్రభాతం



27వ పాశురం

కూడార్రై వెల్లుమ్ శీర్ గోవిన్దా! ఉందన్నై
ప్పాడి పఱైకొణ్డు యామ్‌పెఱు శమ్మానమ్,
నాడు పుకళుమ్ పరిశినాల్ నన్రాగ,
శూడగమే తోళ్‌వళైయే తోడే శెవిప్పూవే,
పాడగమే యెన్ఱనైయ పల్‌కలనుమ్ యామణివోమ్,
ఆడైయుడుప్పోమ్ అదన్‌పిన్నే పాల్ శోఱు
మూడ నెయ్ పెయ్‌దు ముళంగై వళివార,
కూడియిరున్దు కుళిర్ న్దేలో రెమ్బావాయ్.

భావం : నీ పట్ల శత్రుభావమును కలిగిన వారిని కూడా జయించగల శుభగుణ సంపద కలిగినట్టి గోవిందుడా! నీ ఘనమైన చరితమును నోరారా పాడి మా వ్రతమునకు సాధనమైన పర (తప్పెట) అను వాద్యమును పొందెదము. ఆ తరువాత ఈ లోకమంతా గొప్పగా పొగిడేట్లుగా మాకు నీవు సన్మానము చేయవలయును. చేతులకు గాజులు మొదలైన ఆభరణములు, భుజములకు దండకడియములు, చెవికి క్రింది భాగంలో ధరించే దిద్దులు, చెవి పైభాగంలో పెట్టుకునే కర్ణపూవులు, కాలి అందెలు మొదలగు అనేక ఆభరణములను నీవు ఇవ్వగా మేము ధరించవలయును.ఆ తరువాత మేము మంచి వములను ధరించునట్లు చేయుము. అటుపిమ్మట పాలు, అన్నము మునుగునట్లుగా నెయ్యిని పోసి పాయసము తయారుచేసి, మోచేతి నుండి ఆ తీపి పదార్థము కారునట్లుగా ఓ గోవిందుడా నీతో కలిసి కూర్చొని చల్లగా హాయిగా మేము భుజించునట్లు చేయుము అని గోపికలు ప్రార్థించిరి.

– ఎస్. శ్రీప్రియ

ఉప్పుతిప్పలు..!



ఉప్పు ఉప్పున ఆరోగ్యాన్ని ఊదేస్తుందట.
ఉప్పు చప్పున బీపీని తెచ్చేస్తుందట. ఇప్పుడు ఉప్పు గురించి ఉన్న ప్రచారాలివి.
మరి ఇందులో వాస్తవమెంత? అపోహ ఎంత? నిజంగానే ఉప్పు తెల్లటి విషమా?
ఉపయోగపడే విషయమేమీ ఉప్పులో లేదా? ఉప్పు ఇచ్చే ఆరోగ్యాలూ...
ఉప్పు తెచ్చే అనర్థాలను సాక్షాత్తూ ఆ ఉప్పే తన ఆత్మకథగా చెప్పుకుంటే ఏం చెబుతుంది?
తనపై ఉన్న అనేకానేక దురభిప్రాయాలను తొలగిస్తే ఎలా ఉంటుందన్న అంశమే
ఈ ప్రత్యేక కథనం.

రక్తనాళాల చివరన క్యాపిల్లరీస్ వెంట్రుకంత సన్నగా ఉంటాయి. దాంతో హైబీపీ వంటివి ఉన్నవారు ఉప్పు ఎక్కువగా వాడితే అధిక ఒత్తిడికి అవి చిట్లిపోవచ్చు.

రక్తపోటు, గుండెజబ్బులు, డయాబెటిస్, కిడ్నీ సమస్యలు, కాళ్లవాపుల వంటి ఆరోగ్య సమస్యలు ఉన్నవారు ఉప్పు చాలా తక్కువగా వాడాలి.

డబ్ల్యూహెచ్‌ఓ సిఫార్సుల ప్రకారం ఒక వ్యక్తి ఒక రోజుకు గరిష్టంగా 4.2 గ్రాములకు మించనివ్వకుండా ఉప్పు తీసుకోవచ్చు.

మీరు పలికే తొలి తెలుగు పద్యానికి తొలి పదం నేనే. 'ఉప్పుకప్పురంబు'తోనే కదా ఎవ్వరైనా తొలి పద్యం పలికేది. నేను మీ అందరి పౌరుషానికి ఒక చిహ్నం. అందుకే ఆత్మగౌరవంతో, పౌరుషంతో ఎవరైనా స్పందించకపోతే 'ఏం ఉప్పూ కారం తినడం లేదా' అంటారు. మరి అలాంటప్పుడు ఎందుకు నన్ను ఆడిపోసుకోవడం? మీ ఆహార పదార్థంలోని 'ఉప్పూ కారం' జంటలోనూ నేనే ముందు. తీపి మినహా ప్రతివంటలో భాగస్వామ్యం నాకే చెందు. నా ప్రాధాన్యం, నా ప్రాథమ్యం వదిలి ఇక నన్ను తినడం వల్ల మీకు వచ్చే ఆ 'ఉప్పు ముప్పు' గురించి చెప్పమంటారా? అమృతాన్నైనా అతిగా వాడితే అనర్థమే కదా. అందుకే 'అతి సర్వత్ర వర్జయేత్' అనే మాట పుట్టింది. అప్పుడు తప్పంతా నామీదే వేసేస్తే ఎలా?

మీ మెదడు సందేశాల వార్తాహారి నేనే...

మీలోని ప్రతి అవయవానికీ ఫలానా పని చేయమంటూ మెదడునుంచే ఆజ్ఞలూ, ఆదేశాలూ జారి అవుతుంటాయని తెలుసుకదా. వాటిని మోసుకుపోయే లవణాల్లో ప్రధానమైనదాన్ని నేనే. నాలోని సోడియమ్‌తో పాటు పొటాషియమ్, మెగ్నీషియమ్ వంటి ఇతర మిత్రులూ ఆ ఆదేశాలను మోసుకుపోయినా... అందులో ఎక్కువగా నేనే తీసుకెళ్తుంటా. నాలోని అయాన్ల సహాయంతోనే మన నాడీ వ్యవస్థలోని నరాల నుంచి వివిధ అవయవాలకు ఆ ఆదేశాలన్నీ అందుతుంటాయి. ఆ ఆదేశాలకు అనుగుణంగానే మన వివిధ అవయవాలన్నీ పని చేస్తుంటాయి. అందుకే నరాలన్నీ సక్రమంగా పని చేయాలంటే నేను కావాల్సిందే. అందుకే మీ అవయవాలన్నీ సరిగా పనిచేసేంత పరిమిత మోతాదుల్లో నన్ను వాడుకోండి.

అర్ధరాత్రి అకస్మాత్తుగా మీకెప్పుడైనా పిక్క పట్టేసిందా?

మీరు హాయిగా ఆదమరచి నిద్రపోతుంటారు. కానీ మెదడు నుంచి ఆదేశాలను చేరవేసే నా పనిని నేను నిర్విరామంగా చేసుకుంటూ పోతుంటాను. అదెలా? ముందు చెప్పినట్టుగా నాలోని అయాన్ల ద్వారా. ఆ అయాన్లకు వాహకం నీళ్లు. ఏదైనా కారణంతో ఆ నీళ్లూ, ఈ నేనూ తగ్గామనుకోండి. అకస్మాత్తుగా పిక్క పట్టేస్తుంది. ఎంతో నొప్పితో మిమ్మల్ని నిద్రలేపేస్తుంది. ఆ బాధ చాలా సేపు కొనసాగుతుంది. మజిల్ క్రాంప్ అని పిలిచే ఈ నొప్పి, బాధా కేవలం పిక్కకు మాత్రమే కాదు... ఒంట్లోని ఏ కండరానికైనా రావచ్చు. కారణం... నేను మజిల్ కంట్రాక్షన్ అనే ప్రక్రియ ద్వారా మీ కండరాల కదలికలకు నేను అవసరం. మీ కాళ్లూ చేతులు బాగా కదులుతున్నాయంటే అది నా వల్లే. అంతెందుకు మీరు క్రికెట్ ఆడారా? మీ ఒంట్లో నీళ్లు బాగా తగ్గినప్పుడు మీతో పాటు చాలా మంది క్రీడాకారులు క్రాంప్స్ కారణంగా ఆటలాడలేని పరిస్థితి వస్తుంది. అలా జరగగానే మీరు గ్రహించాల్సిందొకటే. మీ ఒంట్లో నీళ్లు... నేనూ... నా మిత్రులైన ఇతర లవణాలూ తగ్గాయని. డీహైడ్రేషన్ కారణంగా నీరూ, నేనూ, నా ప్రాణమిత్రుల్లాంటి లవణ మిత్రులు సరిగా అందకపోతే ఒక్కోసారి ప్రాణాలే పోవచ్చు.

నేను తగ్గితే ప్రాణాపాయం కూడా...

నేనూ, నా మిత్రులైన నీరూ లవణాలూ తగ్గి మీరు డీ–హైడ్రేషన్‌కు గురైనప్పుడు (మరీ ముఖ్యంగా వేసవిలో) నీళ్లలో చిటికెడు ఉప్పు, చారెడు పంచదార వేసి, ఓరల్ రీహైడ్రేషన్ సొల్యూషన్ తయారు చేసి, తక్షణ చికిత్సగా అందిస్తారు. ఇంకా చెప్పనా! నేను మీ ఒంట్లోని నీటి పాళ్లను నియంత్రిస్తుంటాను. అంతెందుకు... నన్నో శత్రువులా చూస్తూ నన్ను పట్టుబట్టి తగ్గించుకుంటే దాంతో నేనే గనకా మీలో ఉండాల్సిన మోతాదులో లేకపోతే మీకు 'హైపోనేట్రీమియా' అనే మెడికల్ కండిషన్ రావచ్చు. అప్పుడు ఆసుపత్రిలో అందునా ఐసీయూలో చేర్చి మరీ నేను లోపించినందుకు మీకు చికిత్స అందించాల్సి రావచ్చు.

మరి నాతో అనర్థాలేమీ లేవా?

ఎందుకు లేవూ? ఉన్నాయి. కాకపోతే అవి నేరుగా నా వల్లనే కాదు. నేను మితిమీరడం వల్ల. అన్ని రక్తనాళాల చివరల్లో అత్యంత సన్నగా ఉండే నాళాలుంటాయి. అవి వెంట్రుక కంటే సన్నగా ఉంటాయి. అందుకే వాటిని తెలుగులో రక్త'కేశ'నాళికలంటారు. ఇంగ్లిష్‌లో క్యాపిల్లరీస్ అంటారు. వెంట్రుకంత సన్నగా ఉండటం వల్ల వీటి గోడలు చాలా పలుచగా ఉంటాయి. దాంతో రక్తపు అధిక ఒత్తిడికి అవి చిట్లిపోవచ్చు. ఇలాంటి ప్రమాదం ప్రధానంగా కిడ్నీల విషయంలో ఎక్కువగా చూస్తుంటాం. అదే గుండె గోడల్లో జరిగితే వల్ల గుండెకు సంబంధించిన సమస్యలు, మెదడుకు జరిగితే పక్షవాతం (స్ట్రోక్) వచ్చే అవకాశం ఉంది. అందుకే నా మోతాదును తగ్గించాలని డాక్టర్లు మొదలుకొని అందరూ సలహా ఇస్తుంటారు. అందుకే రక్తపోటు, డయాబెటిస్, గుండెజబ్బులు, పక్షవాతం వంటి సమస్యలు ఉన్నవారు నన్ను చాలా తక్కువగా తీసుకోవాలంటూ సలహా ఇస్తుంటారు.

స్వతహాగానే నేను ఎక్కువగా ఉండే పదార్థాలివి...

నేనెక్కువైతే ప్రమాదమని తెలిసింది కదా. అందుకే నేను ఎక్కువగా ఉండే ఆహారాలేమిటో తెలుసుకొని వాటి విషయంలో కాస్త జాగ్రత్తగా ఉండాల్సిందే. మామూలు వాళ్లతో పోలిస్తే రక్తపోటు, గుండెజబ్బులు, డయాబెటిస్, కిడ్నీ సమస్యలు, కాళ్లవాపులు వంటి ఆరోగ్య సమస్యలు ఉన్నవారు నేనెక్కువ పాళ్లలో ఉండే ఆహారాన్ని పరిహరించాల్సిందే. అవి... ● అప్పడాలు, ● పచ్చళ్లు, ● బేకరీ ఐటమ్స్, ● సాస్, ● నిల్వ ఉంచే ఫ్రోజెన్ ఫుడ్స్, ఫాస్ట్ ఫుడ్స్, ● స్మోక్‌డ్ మాసాహారం, ● చీజ్, ● సలాడ్స్, ● సాల్టెడ్ చిప్స్ వంటి నిల్వ ఉంచే చిరుతిండ్లు, ● దీర్ఘకాలం నిల్వ ఉంచేందుకు వీలుగా (షెల్ఫ్ లైఫ్ ఎక్కువగా ఉండేలా) రూపొందించిన స్నాక్స్. వీటి విషయంలో జాగ్రత్తగా ఉండాలి.

ఒంట్లో ఉప్పు బాగా తగ్గితే కనిపించే లక్షణాలు :

శరీరంలో ఉప్పు పాళ్లు బాగా తగ్గితే కొన్ని లక్షణాలు కనిపిస్తాయి. శరీరంలో సోడియమ్ పాళ్లు తగ్గడం వల్ల ఆ లక్షణాలు కనిపిస్తాయి. అవి... ● తీవ్రమైన అలసట (ఫెటీగ్) ● తలనొప్పి (హెడ్‌ఏక్) ● కండరాలు బిగుసుకుపోవడం (మజిల్ క్రాంప్స్) ఒంట్లో ఉప్పు పాళ్లు బాగా పెరిగితే కనిపించే లక్షణాలు: ● విపరీతమైన దాహం ● కింది నుంచి గాలి అపాన వాయువు రూపంలో పోవడం.

నా నియంత్రణలో చాలా బాధ్యత కిడ్నీదే!

నా వల్ల కలిగే కీడెంతో, మేలెంతో తెలిసింది కదా. మోతాదుకు మించితేనే నా వల్ల ప్రమాదమని అర్థమైంది కదా. ఈ విషయం తెలియని వాళ్లు నన్ను తగ్గించేందుకు చాలా పరిమితంగా నన్ను వాడుతుంటారు. దాంతో వాళ్ల ఒంట్లో నా పాళ్లు తగ్గాయనుకోండి. ఆ పరిస్థితిని గుర్తించి చక్కబెట్టే బాధ్యత మూత్రపిండాలది. శరీరంలో ఉప్పు తగ్గినట్లుగా కిడ్నీలకు 'ఉప్పందుతుంది'. దాంతో అవి తమ బాధ్యతను మొదలుపెడతాయి. శరీరంలోంచి మూత్రం ద్వారా నేను అనగా ఉప్పు బయటికి పోయి ముప్పు రాకూడదంటూ అవి నన్ను అడ్డుకుంటాయి. తమ దగ్గర ఉండాల్సిన బ్యాలెన్స్ కంటే ఎక్కువగా ఉన్న ఉప్పును తమ వద్ద నిల్వ చేసి ఉంచి శరీరానికి అందిస్తుంటాయి. అదే శరీరంలో ఉప్పు పాళ్లు పెరగగానే మళ్లీ యథావిధిగా మూత్రం ద్వారా బయటకు పంపిస్తాయి. అందుకే చాలా మంది ఇంట్లో తినే తిండిలో నా పాళ్లను తగ్గించినా అప్పుడప్పుడూ వాళ్లు బయటతినే పదార్థాల్లో లభ్యమైన నన్ను జాగ్రత్తగా పోగు చేసి శరీరానికి అందిస్తూ నా కొరత తీరుస్తాయి కిడ్నీలు. కొందరిలో 'సోడియమ్ సెన్సిటివిటీ' అనే గుణం ఉంటుంది. ఆ గుణం ఉన్నవారు నన్ను ఎంత పరిమితంగా తీసుకున్నా వారిలో రక్తపోటు పెరిగి ప్రమాదాలకు దారి తీయవచ్చు.

ఉప్పసంహారం.. సారీ... ఉపసంహారం...

ఇదీ నా కథ. నేను అనగా ఉప్పు వల్ల ముప్పుతో పాటు నేను తగ్గితే ప్రమాదమూ ఉంది. ఉప్పుతో బీపీ పెరిగే మాటా నిజమే. అది గ్రహించే గాంధీగారు ఉప్పు సత్యాగ్రహం చేస్తే... బ్రిటిష్ వాళ్లకు బీపీ పెరిగి రాజకీయారోగ్యం క్షీణించి మనల్ని వదిలిపోయారు. దరిమిలా తేలేదేమిటంటే... నన్ను వాడుకోవాల్సిన రీతిలో వాడుకుంటే నేనెప్పుడూ ఉపయోగమే. నాతోనూ ఉంది కొంత మేలు. అది మీరు గ్రహిస్తే చాలు.



డాక్టర్ కె. శివరాజు
సీనియర్ ఫిజీషియన్,
కిమ్స్ హాస్పిటల్స్, సికింద్రాబాద్

ఉప్పు విషయంలో ఈ జాగ్రత్తలు తప్పనిసరి



ఆహారంలో ఉప్పు.. బీపీ పెరిగే ముప్పు

- హైబీపీ, డయాబెటిస్, గుండెజబ్బులు, కిడ్నీ ఫెయిల్యూర్, కాళ్లవాపులు (అనసార్కా/ఎడిమా) ఉన్నవారికి మాత్రమే ఉప్పు చాలా పరిమితంగా తగ్గించాలి.
- ఒకవేళ ఏదైనా కుటుంబంలో హైబీపీ, డయాబెటిస్, గుండెజబ్బులు, కిడ్నీ ఫెయిల్యూర్, కాళ్లవాపులు ఉన్నవారు ఉన్న కుటుంబంలో ప్రత్యేకంగా ఆ జబ్బుతో బాధపడేవారు (అంటే మెడికల్ రీజన్‌తో మాత్రమే ఉప్పు తగ్గించాలి తప్ప... ఇంట్లోని పిల్లలకూ కాదు. పిల్లలు మామూలుగానే ఉప్పు వాడేలా చూడాలి.
- పెద్ద వయసు వారిలో ఏ ఆరోగ్య సమస్యా లేనప్పుడు ఉప్పు పరిమితంగానే వాడాలి తప్ప అస్సలు మానేయకూడదు. అలా వాళ్లలో సోడియమ్ తగ్గడం వల్ల ప్రమాదకరమైన పరిస్థితులు ఏర్పడవచ్చు.

గర్భిణులూ జాగ్రత్త...

కొందరు ఉప్పు తగ్గించి తినాలనే వారు చాలా పరిమితంగా ఉప్పు వాడుతుంటారు. అలాంటి కుటుంబంలో ఉండే గర్భవతులు ఒకింత జాగ్రత్తగా ఉండాలి. మిగతావారి విషయం ఎలా ఉన్నా గర్భవతులు రోజుకు 2 నుంచి 6 గ్రాముల ఉప్పు తీసుకోవాలి. అంతకు మించి తీసుకోవడం కూడా ప్రమాదమే అని గుర్తుంచుకోవాలి. గర్భవతుల్లో ఉప్పు పాళ్లు బాగా తగ్గితే కడుపులోని బిడ్డ బరువు బాగా తగ్గి అండర్‌వెయిట్ బేబీగా పుట్టవచ్చు. లో బర్త్ వెయిట్ పిల్లల్లో అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయి. పైగా గర్భిణులు 2 గ్రా. నుంచి 6 గ్రా. ఉప్పు కూడా తీసుకోకపోతే బిడ్డలో మానసిక వికాసం కూడా తగ్గే అవకాశం ఉంటుంది.



ఉప్పును ఎంత మోతాదులో వాడాలి?

ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) సిఫార్సు ప్రకారం :
● డబ్ల్యూహెచ్‌ఓ సిఫార్సుల ప్రకారం ఒక వ్యక్తి ఒక రోజుకు గరిష్ఠంగా 4.2 గ్రాములకు మించనివ్వకుండా ఉప్పు తీసుకోవచ్చు. (ఒక టీ స్పూన్‌లో 5 గ్రాముల పరిమాణం పడుతుంది). ● అలాగే ఒక వ్యక్తి ఒక రోజుకు కనీసం 1.5 గ్రాముల ఉప్పు తీసుకోవాలి. అంతకంటే తగ్గడం వల్ల అతడికి అవసరమైన సోడియమ్ పరిమాణానికి, జీవక్రియలకు విఘాతం కలగవచ్చు. ● ఇక చిన్నపిల్లల విషయానికి వస్తే వారి వయసును బట్టి వాళ్లకు అవసరమైన ఉప్పు వివరాలివి... ● 1 నుంచి 3 ఏళ్ల పిల్లల్లో ... రోజుకు 2 గ్రాముల ఉప్పు ● 4 నుంచి 6 ఏళ్ల పిల్లల్లో ... రోజుకు 3 గ్రాముల ఉప్పు ● 7 నుంచి 10 ఏళ్ల పిల్లల్లో ... రోజుకు 5 గ్రాముల ఉప్పు ● 11 ఏళ్లు మించిన పిల్లలకు రోజుకు 6 గ్రాముల ఉప్పు... కావాలి.

వీరు క్యాన్సర్‌ను జయించారు



Dr. Ch. Mohana Vamsy
Chief Surgical Oncologist
Omega Hospitals, Hyderabad
Ph: 98480 11421, Kurnool 08518273001

ఇప్పుడు క్యాన్సర్‌ను జయించడం అంత కష్టమేం కాదు. మనోబలం, నిబ్బరం చాలు క్యాన్సర్‌ను జయించడానికి. అలా జయించిన వారు చాలామందే ఉన్నారు. వారి స్ఫూర్తి మనలో నింపుకుంటే ఇప్పుడు క్యాన్సర్‌ను ఓడించడం సులభమే. అలా క్యాన్సర్‌ను జయించిన కొంతమంది ప్రముఖుల గురించి ఈ కథనంలో...

ప్రముఖ క్రికెటర్ యువరాజ్‌సింగ్ 2011లో సెమినోమా (ఊపిరితిత్తులు, గుండె మధ్య కణితి)కి గురైనప్పుడు అంత ఆరోగ్యవంతులకూ క్యాన్సర్ వస్తుందా అంటూ అందరూ ఆందోళనకు గురయ్యారు. ఆ తర్వాత ఆయన చికిత్స తీసుకున్నారు. పూర్తిగా కోలుకొని 'ద టెస్ట్ ఆఫ్ మై లైఫ్' అనే పుస్తకం రాశారు. ఇంతకు ముందులాగే అంతే ఆరోగ్యకరమైన రీతిలో, అంతే సామర్థ్యంతో క్రీడాజీవితం గడుపుతున్నారు.

ఎందరికో అభిమాన నటిగా పేరుతెచ్చుకున్న మనీషా కోయిరాలా 2012లో ఒవేరియన్ క్యాన్సర్‌కు గురయ్యారు. సర్జరీతో పాటు మిగతా చికిత్స తీసుకొని ఇప్పుడు క్యాన్సర్ మీద అవగాహన కలిగించే అనేక కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు.

ప్రపంచ ప్రఖ్యాత సైక్లిస్ట్ లాన్స్ ఆర్మ్‌స్ట్రాంగ్ 16 ఏళ్ల నుంచే రేసుల్లో పాల్గొనడం మొదలుపెట్టాడు. 25 ఏళ్ల వయసులో క్యాన్సర్... మెదడు, ఊపిరితిత్తులు, ఇతర శరీర భాగాల్లోకి పాకడంతో పాటు అడ్వాన్స్‌డ్ దశలో టెస్టిక్యులార్ (వృషణాల) క్యాన్సర్ బయటపడ్డప్పుడు ఆయన బతకడం కష్టం అని అందరూ అనుకున్నారు. కానీ ఆయన పట్టుదలతో, ఆత్మస్థైర్యంతో అన్ని రకాల కాంబినేషన్ చికిత్స తీసుకొని ఆయన ఆ మహమ్మారిపై విజయం సాధించారు. తర్వాత ఆరుసార్లు టూర్ డిఫ్రాన్స్ సైక్లింగ్ ఛాంపియన్‌షిప్ గెలుచుకున్నారు.

ఒకప్పటి సౌత్‌ఆఫ్రికా దేశాధ్యక్షుడు, నోబెల్ శాంతి బహుమతి విజేత, భారతరత్న నెల్సన్‌మండేలా పీఎస్‌ఏ పరీక్షతో ముందే ప్రోస్టేట్ క్యాన్సర్‌ను పసిగట్టి రేడియేషన్ థెరపీ తీసుకున్నారు. 1990లో ప్రోస్టేట్‌గ్రంథిని తొలగించుకొని, ఆ క్యాన్సర్ బారినుంచి విముక్తిపొందారు. 95 ఏళ్ల వయసులో ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్‌తో మరణించారు. అంతేగానీ క్యాన్సర్‌తో కాదు.

ప్రముఖ నటి గౌతమి, గ్రామీఅవార్డు దక్కించుకున్న పాటల రచయితా, గాయని షెరిల్ క్రౌ, ఇక జీన్‌మ్యూటేషన్ పరీక్షతో రొమ్ముక్యాన్సర్ వచ్చే అవకాశం ఉందని ముందే పసిగట్టి మాసెక్టమీ చేయించుకున్న హాలీవుడ్ నటి ఏంజిలినా జోలీ బ్రెస్ట్‌క్యాన్సర్ మీద విజయం సాధించిన చాలా మందిలో కొందరు మాత్రమే.

ఇలా మనకు తెలిసిన ప్రముఖ విజేతలతో పాటు తెలియనివారెందరో గుండెధైర్యంతో జీవితంలోని అనేక ఒడిదొడుకులను ఎదుర్కొంటూ, క్యాన్సర్‌కు ఎదురొడ్డి నిలిచి, దాన్ని జయించారు. వీరిలో జీన్ మ్యూటేషన్, ఇతర పరీక్షలతో ముందే ప్రమాదాన్ని గుర్తించి క్యాన్సర్ రాకుండా చికిత్స తీసుకున్న వారు కొందరైతే, మరికొందరు శరీరమంతా అది పాకినా, ఇంక ఏ విధమైన ఆశలు లేవని తేలిపోయినా... ఆ స్థితి నుంచి బయటపడి సాధారణ జీవితం గడుపుతున్నవారూ ఉన్నారు. ఇలాంటి విజేతలందరిలో ఉండే లక్షణాలు ఏమిటా అని ఆలోచిస్తే... వారికి క్యాన్సర్ ఉందని తెలిశాక కూడా కుంగిపోకుండా, మనోనిబ్బరంతో దాన్ని ఎదుర్కోవడమే. ముందుగా కొంత ఆందోళనకు గురైనా, తర్వాత వారు ఈ సమస్యను ఎలా ఎదుర్కోవాలి, చికిత్స ఎలా తీసుకోవాలి, ఏయే జాగ్రత్తలు పాటిస్తే మంచిది, ఆహారం పట్ల ఎలాంటి శ్రద్ధ తీసుకోవాలి... లాంటి విషయాలపై అవగాహన పెంపొందించుకొని డాక్టర్ సలహాలు తప్పక పాటిస్తూ, చికిత్స తీసుకుంటూనే తమ తమ రంగాల్లో తమ కృషిని కొనసాగిస్తూ... నటించిన వారూ, ఆటల్లో పాల్గొన్న వారూ, పుస్తకాలు రాసినవారూ ఉన్నారు.

ఏ క్యాన్సర్ అయినా తొలిదశలో గుర్తిస్తే ఆ కణం మీద విజయం సాధించడం తేలికే. పొగాకు ఉత్పత్తులు వాడేవారికి, ఆల్కహాల్ అలవాట్లు, అధికబరువు ఉన్న వారికి ఈ ముప్పు మరింత ఎక్కువ అని అందరూ తెలుసుకుంటే మంచిది. క్యాన్సర్ రిస్క్ అన్నది పర్యావరణ పరిస్థితులు, వారు చేసే వృత్తి, వంశపారంపర్య లక్షణాలు, వారు వాడే ఇతర మందులు, మానసిక ఒత్తిడి, ఆహారపు అలవాట్లు, కాలుష్యం, ఇతర అలవాట్లు... ఇలా అనేక విషయాలతో ముడిపడి ఉంటుంది. అయితే మనలో చాలామందికి ఈ సమస్య విషయంలో అవగాహన లేమితో పాటు అపోహలు, అనవసర అనుమానాలు ఎక్కువే అని చెప్పుకోవచ్చు.

క్యాన్సర్ వ్యాధి రావడానికి ఖచ్చితమైన కారణం ఇదీ అని తెలియదు. ఈ వ్యాధికి గురైనవారిలో చక్కటి ఆరోగ్యవంతమైన జీవనశైలి గడుపుతూ ఉన్నవారూ ఉన్నారు... అలాగే దురలవాట్లకి లోనైనవారూ, వయసుపైబడిన వారూ ఉంటారు. మనం చేయాల్సిందల్లా మంచి జీవనశైలితో పాటు క్యాన్సర్‌పై అవగాహన పెంచుకోవడం. వీలైనంతగా క్యాన్సర్‌ను ముందే పసిగట్టగలగడం.

మనకు అందుబాటులో ఉన్న ఇప్పటి ఆధునిక వైద్యవిధానాలతో ఇతర దీర్ఘకాలిక వ్యాధుల మీద, క్యాన్సర్ మీద పట్టు సాధించగలుగుతున్నాం. అన్ని సందర్భాల్లోనూ నయం చేయడం సాధ్యం కాకపోతే, కనీసం అదుపులోకి తీసుకురాగలుగుతున్నాం. కీమో మందులలో మరింత కొత్తవి, దుష్ప్రభావాలు తక్కువగా ఉండేవి వస్తున్నాయి. సైడ్ ఎఫెక్ట్స్ తక్కువగా ఉండే ఈ కీమో మందుల ధరలు ఇంకా అదుపులోకి రావాల్సి ఉంది. ఇతర శరీర భాగాల మీద చాలా తక్కువ ప్రభావం చూపే రేడియేషన్ థెరపీలు అందుబాటులోకి వచ్చేశాయి. వీఎమ్‌ఏటీ, సైబర్‌నైఫ్ వంటి రేడియో రోబోటిక్ సర్జరీలతో దుష్ఫలితాలు గణనీయంగా తగ్గిపోయాయి. ఇక సర్జరీలు, శరీరభాగాలను తొలగించినప్పుడు చేసే రీకన్‌స్ట్రక్టివ్ సర్జరీలలో విప్లవాత్మకమైన మార్పులు చోటు చేసుకున్నాయి.

ఇక మనం చేయాల్సిందల్లా... క్యాన్సర్‌ను తొలిదశలో కనుగొనడం, అనుభవజ్ఞులైన డాక్టర్‌ను సంప్రదించడం, చికిత్స, మందులు సరిగా తీసుకోవడంతో పాటు కౌన్సెలింగ్, గ్రూప్ కౌన్సెలింగ్‌కు హాజరు కావడం, యోగా, ధ్యానం, మంచి వ్యాపకాల వంటివి ప్రాక్టీస్ చేయడం, నలుగురితో ఉండటానికి ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వడం. ఇలా చేస్తే అన్ని విధాలా మంచిది.

క్యాన్సర్ అని తెలియగానే మానసికంగా కుంగిపోయి, డిప్రెషన్‌కు గురయ్యేవారిలో ఎక్కువగా మహిళలే ఉంటున్నారు. అందుకే వారు మరింత జాగ్రత్తగా ఉండాలి. ఆరోగ్యకరమైన వ్యాపకాలు పెంపొందించుకొని, మంచి చికిత్స తీసుకుంటే మీరూ క్యాన్సర్‌ను జయించవచ్చు.

హోమియో కౌన్సెలింగ్స్ — ఫ్యామిలీ డాక్టర్

వరుస గర్భస్రావాలు...

నా వయసు 30 ఏళ్లు. పెళ్లయి ఐదేళ్లు అవుతోంది. మూడుసార్లు గర్భం వచ్చింది. కానీ గర్భస్రావం అయ్యింది. డాక్టర్‌ను సంప్రదిస్తే అన్నీ నార్మల్‌గానే ఉన్నాయని అన్నారు. అయినా ఈ విధంగా ఎందుకు జరుగుతోందో అర్థం కావడం లేదు. హోమియో ద్వారా నాకు సంతాన ప్రాప్తి కలిగే అవకాశం ఉందా?

– ఒక సోదరి, కాకినాడ

రెండు లేదా మూడుసార్లు గర్భస్రావం అయితే దాన్ని 'రికరెంట్ ప్రెగ్నెన్సీ లాస్'గా పేర్కొంటారు.

కారణాలు : ● గర్భాశయం అసాధారణంగా నిర్మితమై ఉండటం (రెండు గదుల గర్భాశయం) ● గర్భాశయంలో కణుతులు / పాలిప్స్ ఉండటం ● గర్భాశయపు సర్విక్స్ బలహీనంగా ఉండటం అయితే కొంతమందిలో ఎలాంటి కారణం లేకుండా కూడా గర్భస్రావాలు జరుగుతుండవచ్చు.



చికిత్స: రోగనిరోధకశక్తిని పెంపొందించడం, హార్మోన్ల అసమతౌల్యతను చక్కదిద్దడం వంటి చర్యల ద్వారా సంతాన లేమి సమస్యను పరిష్కరించవచ్చు. అలాగే గర్భస్రావానికి దారితీసే అనేక కరణాలు కనుగొని, వాటికి తగి చికిత్స అందించడంతో పాటు కాన్‌స్టిట్యూషన్ పద్ధతిలో మానసిక, శారీరక తత్వాలను పరిగణనలోకి తీసుకొని చికిత్స అందిస్తే సంతాన సాఫల్యం కలుగుతుంది. అయితే అనుభవజ్ఞులైన వైద్యుల పర్యవేక్షణలో మాత్రమే ఇదంతా జరగాలి.



డాక్టర్ శ్రీకాంత్ మోర్లావర్
సీఎండీ, హోమియోకేర్
ఇంటర్నేషనల్, హైదరాబాద్

గ్యాస్ట్రిక్ అల్సర్ తగ్గుతుందా?



నా వయసు 35 ఏళ్లు. ఇటీవల కడుపులో మంట, వికారంతో డాక్టర్ దగ్గరికి వెళ్తే పరీక్షలు చేయించి, అల్సర్ ఉందని చెప్పారు. నా సమస్యకు హోమియోలో పరిష్కారం ఉందా?

– అనిల్‌కుమార్, బెల్లంపల్లి

ఆధునిక జీవనశైలి, ఆహారపు అలవాట్ల వల్ల జీర్ణకోశ సమస్యలు.. ముఖ్యంగా గ్యాస్ట్రిక్ అల్సర్ వంటివి ఎక్కువగా కనిపిస్తున్నాయి.

కారణాలు : ● బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్స్ ● మానసిక ఒత్తిడి, కారం, మసాలాలు ఎక్కువగా ఉన్న ఆహారం తీసుకోవడం ●మద్యపానం, పొగతాగడం

లక్షణాలు : ● కడుపులో నొప్పి, మంట, ఉబ్బరం ● ఛాతీలో నొప్పి, పుల్లటి తేన్పులు, మలబద్ధకం ● తలనొప్పి ● కొంచెం తిన్నా కడుపు నిండినట్లు ఉండటం

నివారణ జాగ్రత్తలు : ● పరిశుభ్రమైన నీరు, ఆహారం తీసుకోవాలి ●మద్యపానం, పొగతాగడం అలవాట్లు మానేయాలి ● కారం, మసాలా ఆహారాల విషయంలో జాగ్రత్త వహించాలి ● మానసిక ఒత్తిడి దూరం కావడానికి యోగా, ధ్యానం వంటివి చేయాలి.

చికిత్స : గ్యాస్ట్రిక్ అల్సర్‌కు హోమియోలో మంచి మందులు అందుబాటులో ఉన్నాయి. ఆర్సనిక్ ఆల్బ్, యాసిడ్ నైట్రికమ్, మెర్క్‌సాల్, గ్రాఫైటిస్, ఫాస్ఫరస్ వంటి మందులు ఈ సమస్యకు చక్కగా పనిచేస్తాయి.

డాక్టర్ మురళి కె. అంకిరెడ్డి,
ఎండీ (హోమియో) స్టార్
హోమియోపతి, హైదరాబాద్

వజ్రాల హారం.. డిజైనర్ శారీ!

● నిశ్చయమైనట్లేనా?


● దీపికా పదుకోన్

● రణ్‌వీర్‌సింగ్

బాలీవుడ్ ప్రేమికులు రణ్‌వీర్‌సింగ్, దీపికా పదుకోన్‌ల నిశ్చితార్థం అయ్యిందా? లేదా? బాలీవుడ్ వర్గాల్లో ఇప్పుడిదే హాట్ టాపిక్. ఈ నెల 5న దీపిక పుట్టినరోజున శ్రీలంకలో వీరిద్దరి నిశ్చితార్థం కుటుంబ సభ్యుల సమక్షంలో జరగనుందంటూ బాలీవుడ్ మీడియా కోడై కూసిన విషయం తెలిసిందే. దీంతో అటు ఇండస్ట్రీలోనూ ఇటు ప్రేక్షకుల్లోనూ వీరి నిశ్చితార్థంపై క్రేజ్ నెలకొంది. ఐదో తారీఖు వచ్చింది.. వెళ్లింది. అయినా వీరి ఎంగేజ్‌మెంట్ గురించి ఇప్పటివరకూ ఒక్క వార్త, ఫొటో కూడా బయటకు రాలేదు. తాజా సమాచారం ఏంటంటే.. దీపిక తన 32వ పుట్టినరోజును రణ్‌వీర్ సింగ్, అతని కుటుంబ సభ్యులతో శ్రీలకంలో జరుపుకున్నారట. ఈ సందర్భంగా తమకు కాబోయే కోడలికి రణ్‌వీర్ తల్లిదండ్రులు అంజు భవాని, జగ్జీత్ సింగ్ ఖరీదైన వజ్రాల హారం బహూకరించారట. అలాగే ప్రముఖ డిజైనర్ సబ్యాసాచితో ప్రత్యేకంగా చీర తయారు చేయించి, కాబోయే కోడలికి ఇచ్చారని టాక్. కాబోయే అత్తమామలు ఇచ్చిన గిఫ్ట్స్ దీపికకు భలేగా నచ్చేశాయట. ఇదిలా ఉంటే శ్రీలంకలో దీపిక బర్త్‌డే మాత్రమే జరిగిందనీ, ఎంగేజ్‌మెంట్ జరగలేదని కొందరు అంటుంటే.. సీక్రెట్‌గా రణ్‌వీర్–దీపిక రింగులు మార్చుకున్నారని మరికొందరు అంటున్నారు. మరి ఏది నిజం? వెయిట్ అండ్ సీ.


● హృతిక్ రోషన్

● రాకేష్ రోషన్

క్రిష్ అనగానే అందరూ టకీమని చెప్పే పేరు హృతిక్ రోషన్. క్రిష్ పాత్రలో అంతగా ఆయన ఒదిగిపోయారు. బుధవారం ఆయన బర్త్‌డే. ఈ సందర్భంగా హృతిక్ తండ్రి రాకేష్ రోషన్ క్రిష్ ఫ్రాంఛైజీ అభిమానులందరికీ ఓ తీపి కబురు అందించారు. అదేంటో తెలుసా? 'క్రిష్ 4' రిలీజ్ అప్‌డేట్. ఇప్పటివరకు వచ్చిన క్రిష్ సినిమాలన్నింటికీ రాకేష్

క్రిష్ 4 @ 2020 క్రిస్మస్

రోషన్‌నే దర్శకుడని ప్రత్యేకించి చెప్పక్కర్లేదు. ''క్రిష్ 4 రిలీజ్‌ను ఎనౌన్స్ చేయడానికి ఇంత కన్నా మంచి రోజు ఉండదేమో. 2020 క్రిస్మస్‌కు 'క్రిష్ 4'ను రిలీజ్ చేయాలనుకుంటున్నాం. హృతిక్ ఫ్యాన్స్ అందరికీ నా గిఫ్ట్ ఇది. హ్యాపీ బర్త్‌డే హృతిక్'' అని పేర్కొన్నారు రాకేష్ రోషన్.

హోలీకి పరీ


● అనుష్కా శర్మ

మంగళవారం... నైట్ పదిన్నర టైమ్‌లో స్వీట్ డ్రీమ్స్ అంటూ బాలీవుడ్ హీరోయిన్ అనుష్కా శర్మ ఓ 18 సెకన్ల వీడియోను సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. కొత్త పెళ్లికూతురు.. అది కూడా నైట్ టైమ్‌లో స్వీట్ డ్రీమ్స్ అంటూ క్యాప్షన్ ఇచ్చారు. అందుకని ఇదేదో రొమాంటిక్ వీడియో అయ్యింటుందని ఊహిస్తే పొరపాటే. ఎందుకంటే ఆమె పోస్ట్ చేసింది తన అప్‌కమింగ్ మూవీ 'పరీ'కి సంబంధించిన వీడియో. 'వామ్మో ఏంటిది?' అంటున్నారు ఆ వీడియో చూసిన ప్రేక్షకులు. ఎందుకంటే అంతలా భయపెట్టారామె. ఇప్పుడామె ఈ వీడియోను పోస్ట్ చేయడానికి ఓ రీజన్ ఉందండోయ్. అదేంటంటే ఈ సినిమా రిలీజ్ డేట్‌ను చేంజ్ చేశారు. ప్రోసిత్ రాయ్ దర్శకత్వంలో అనుష్కా శర్మ, పరమ్‌భట్ ఛటర్జీ ముఖ్య తారలుగా రూపొందుతున్న హారర్ చిత్రం 'పరీ'. 'నాట్ ఏ ఫెయిరీ టేల్' అనేది ఉపశీర్షిక. అంటే.. అద్భుతమైన కథ ఏం కాదు అని అర్థం. ఈ సినిమాను తొలుత ఫిబ్రవరి 9న రిలీజ్ చేయాలనుకున్నారు. కానీ హోలీ సందర్భంగా సినిమాను మార్చి 2న విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. అయితే... ఇదే రోజున విశాల్ పాండ్య దర్శకత్వంలో ఊర్వశి రౌతేలా లీడ్ రోల్ చేసిన 'హేట్ స్టోరీ 4', తరుష్ మనుష్కాని దర్శకత్వంలో సుశాంత్ సింగ్ రాజ్‌పుత్, జాక్వెలిన్ ఫెర్నాండెజ్, విక్రమ్ జిత్, సప్నా పబ్బి ముఖ్య తారలుగా రూపొందుతున్న 'డ్రైవ్' సినిమా కూడా విడుదలకు సిద్ధమవుతున్నాయి. మరి ఈ మూడు సినిమాలూ హోలీకి ట్రిపుల్ ధమాకా ఇస్తాయా? లేక ఏదైనా వాయిదా పడుతుందా? అనేది చూడాలి. ఎందుకంటే, రీసెంట్‌గా చాలా హిందీ చిత్రాలు ఎనౌన్స్ చేసిన రిలీజ్ డేట్స్‌ను చేంజ్ చేసుకుంటున్నాయి. భాగీ 2, సంజయ్‌దత్ బయోపిక్, పద్మావత్, ప్యాడ్ మ్యాన్, అయ్యారే సినిమాలు ముందు ప్రకటించిన రిలీజ్ డేట్స్‌ను మార్చుకున్న క్లబ్‌లోనే ఉన్నాయి. లేటెస్ట్‌గా ఈ లిస్ట్‌లోకి 'పరి' చేరింది.



కేసరికి జోడీగా..


● అక్షయ్ కుమార్

పాత్రల పరంగా వైవిధ్యం చూపించే హీరోల లిస్ట్‌లో అక్షయ్ కుమార్ పేరు ఉంటుంది. 'ప్యాడ్‌మ్యాన్'లో సమాజానికి మేలు చేసే వ్యక్తిగా, బల్బీర్ సింగ్ బయోపిక్ 'గోల్డ్' సినిమాలో హాకీ ప్లేయర్‌గా, సంగీత దర్శకుడు గుల్షన్‌కుమార్ బయోపిక్‌లో టైటిల్ రోల్‌లో... ఇలా ఒకదానికి ఒకటి పోలిక లేని పాత్రలు చేస్తున్నారు అక్షయ్‌కుమార్. ఇక, '2.0'లో అయితే 'క్రొమ్యాన్' క్యారెక్టర్‌లో కనిపించనున్నారు. పక్షుల మనుగడ కోసం రోబోటిక్ టెక్నాలజీ వాడే వ్యక్తి పాత్రలో డిఫరెంట్ లుక్‌లో కనిపించనున్న విషయం తెలిసిందే. తాజాగా మరో డిఫరెంట్ రోల్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు అక్షయ్. ఆ చిత్రం పేరు 'కేసరి'. ఇప్పటికే విడుదలైన అక్షయ్ లుక్ ఆకట్టుకుంది. అనురాగ్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నారు. భారతీయ చరిత్రలతో జరిగిన పెద్ద యుద్ధాలలో ఓ యుద్ధం నేపథ్యంలో ఈ సినిమా ఉంటుంది. ఈ సినిమాలో కథానాయికగా పరిణీతీ చోప్రాను ఎంపిక చేశారు. ''ఈ సినిమాలో పార్ట్ అయినందుకు చాలా సంతోషంగా ఉంది. చిత్రబృందానికి థ్యాంక్స్'' అన్నారు పరిణీతీ చోప్రా.


● పరిణీతీ చోప్రా

నీ జ్ఞాపకాలు

జీవితంలో అన్ని సంఘటనలు జ్ఞాపకాలు కాలేవు. కానీ ప్రేమ విషయంలో ప్రతీది జ్ఞాపకమే అవుతుంది. మరి ఆ జ్ఞాపకాలు తీపివా? చేదువా అంటే? 'తేరీ యాద్' (నీ జ్ఞాపకాలు అని అర్థం) చూడాలంటున్నారు మోహిత్ సూరి. 'ఆషికీ 2, హాఫ్ గర్ల్‌ఫ్రెండ్' వంటి లవ్ స్టోరీలు తెరకెక్కించిన మోహిత్ తన తదుపరి సినిమాకు 'తేరీ యాద్' టైటిల్‌ను ఫిక్స్ చేశామని అనౌన్స్ చేశారు. 'ఆషికీ 2, ఏక్ విలన్, హాఫ్ గర్ల్ ఫ్రెండ్' సినిమాల హీరోయిన్ శ్రద్ధా కపూర్ ఈ సినిమాలోనూ హీరోయిన్‌గా నటించనున్నట్టు సమాచారం.


● మోహిత్ సూరి











మంచు తుపాను ధాటికి గడ్డకట్టిన అమెరికాలోని ప్రఖ్యాతిగాంచిన నయాగరా జలపాతం. 'బాంబ్ సైక్లోన్'గా పిలుస్తున్న ఈ మంచు తుపాను దెబ్బకు అమెరికా తూర్పుతీర రాష్ట్రాల ప్రజలు అల్లాడుతున్నారు.

ఆధార్‌కు భరోసా..!

ఇక తాత్కాలిక ఆధార్ నంబర్

- సమాచార పరిరక్షణ, గోప్యత కోసం యూఐడీఏఐ నూతన విధానం
- వాణిజ్య సంస్థల చేతికి పరిమిత వివరాలు మాత్రమే
- మార్చి 1 నుంచి కొత్త పద్ధతిలో ఆధార్–ఈకేవైసీ ధ్రువీకరణలు
- గోప్యతపై ఆందోళనల నేపథ్యంలో యూఐడీఏఐ దిద్దుబాటు

న్యూఢిల్లీ: ఆధార్ వల్ల ప్రజల సమాచార భద్రత, గోప్యత ప్రశ్నార్థకమవుతోందంటూ భయాందోళనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (యూఐడీఏఐ– యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా) దిద్దుబాటు చర్యలు ప్రారంభించింది. సమస్యను అధిగమించేందుకు ఆధార్ ధ్రువీకరణ కోసం కొత్త పద్ధతిని త్వరలోనే అమల్లోకి తేనున్నట్లు బుధవారం ప్రకటించింది. నూతన విధానంలో ప్రజలెవరూ తమ 12 అంకెల ఒరిజినల్ ఆధార్ సంఖ్యను ఎవ్వరికీ ఇవ్వాల్సిన అవసరం లేదనీ, ఆధార్ ఎక్కడ అవసరమైతే అక్కడ, దాని స్థానంలో తాత్కాలికంగా ఉండే ఒక వర్చువల్ గుర్తింపు సంఖ్యను మాత్రం ఇస్తే చాలని యూఐడీఏఐ పేర్కొంది. దీనివల్ల వినియోగదారుడి ఆధార్‌లో ఉన్న సమస్త సమాచారం వాణిజ్య సంస్థలు, ప్రభుత్వ విభాగాల్లోని ఉద్యోగులకు కనిపించదనీ, కేవలం ఫొటో, పేరు వంటి నామమాత్రపు వివరాలు మాత్రమే అందేలా కొత్త విధానంలో పలు నియంత్రణలున్నాయని యూఐడీఏఐ ఒక సర్క్యులర్‌లో వెల్లడించింది.

ఎలా పనిచేస్తుంది?

ముందుగా వినియోగదారులు యూఐడీఏఐ వెబ్‌సైట్‌లో లాగిన్ అవ్వాలి. ఆ తర్వాత ఆధార్ నంబర్‌కు అనుసంధానిస్తూ 16 అంకెల వర్చువల్ గుర్తింపు సంఖ్యను యూఐడీఏఐ వినియోగదారుడికి కేటాయిస్తుంది. బ్యాంకులు, టెలికాం ఆపరేటర్లు, ప్రభుత్వ విభాగాలు ఎక్కడైనా సరే...ప్రజలు తమ ఆధార్ నంబర్‌కు బదులుగా ఈ వర్చువల్ నంబర్‌ను ఇచ్చి, గతంలో మాదిరిగానే వేలిముద్ర వేయాల్సి ఉంటుంది. వెంటనే వర్చువల్ నంబర్‌కు అనుసంధానమై ఉన్న ఆధార్ నంబర్‌లోని సమాచారం వాణిజ్య సంస్థలు/ప్రభుత్వ విభాగాలకు చేరుతుంది. అయితే ఆధార్‌లోని పూర్తి వివరాలు కాకుండా పేరు, ఫొటో, చిరునామా వంటి నామమాత్రపు సమాచారం మాత్రమే వారికి అందుతుంది. ఆ వివరాలతో కేవైసీ (మీ వినియోగదారుల గురించి తెలుసుకోండి) ధ్రువీకరణను సంస్థలు పూర్తి చేసుకుంటాయి. ఈ వర్చువల్ నంబర్‌ను వినియోగదారులు ఎన్నింటినైనా సృష్టించుకోవచ్చు. ఒక్కో వర్చువల్ సంఖ్య నిర్దిష్ట కాలంపాటు లేదా కొత్త నంబర్‌ను సృష్టించుకునే వరకు యాక్టివ్‌గా ఉంటుంది. సంస్థలకు వినియోగదారుడి ఆధార్ నంబర్‌తో పనిలేదు. అది వారికి తెలియాల్సిన అవసరం ఉండదు. అలాగే పరిమిత సమాచారం మాత్రమే యూఐడీఏఐ నుంచి సంస్థలకు అందుతుంది కాబట్టి ఈ వ్యవస్థ భద్రంగా ఉంటుందని యూఐడీఏఐ చెబుతోంది. వినియోగదారుడి తరపున కంపెనీలు ఈ వర్చువల్ గుర్తింపు సంఖ్యను సృష్టించేందుకు కూడా అనుమతి ఉండదు.

మార్చి నుంచి అమలు

కొత్త విధానాన్ని మార్చి 1 నుంచి అమల్లోకి తీసుకురావాలని యూఐడీఏఐ నిర్ణయించింది. జూన్ 1 నుంచి ఆధార్ ధ్రువీకరణలన్నీ కొత్త విధానంలోనే జరుగుతాయని సర్క్యులర్‌లో పేర్కొంది. నిర్దేశిత సమయం తర్వాత కూడా ఈ కొత్త విధానాన్ని అందిపుచ్చుకోని కంపెనీలపై జరిమానాలు విధిస్తామని హెచ్చరించింది. 'ఆధార్ నంబర్ కలిగినవారు ధ్రువీకరణల కోసం ఆధార్ నంబర్‌కు బదులుగా వర్చువల్ గుర్తింపు సంఖ్యను వాణిజ్య సంస్థలకు ఇవ్వొచ్చు. గతంలో ఆధార్ నంబర్ చెప్పి వేలిముద్రలు ఎలా వేసేవారో ఇప్పుడు కూడా అలాగే ఈ తాత్కాలిక నంబర్ చెప్పి వేలిముద్ర వేయాల్సి ఉంటుంది' అని సర్క్యులర్‌లో యూఐడీఏఐ పేర్కొంది.

ఆందోళనలు తగ్గించేందుకే

ఆధార్ కార్డు కోసమంటూ ప్రజల మొబైల్ నంబర్లు, ఈమెయిల్ ఐడీలు, వేలిముద్రలు, ఐరిస్ సహా ఎంతో సున్నితమైన సమాచారాన్ని యూఐడీఏఐ సేకరిస్తోంది. అయితే ఈ సమాచారానికి రక్షణ కరువైందనీ, ఎవరికి పడితే వారికి ఆధార్ సమాచారం చాలా సులువుగా దొరుకుతోందని నిరూపించేలా పలు ఘటనలు జరిగాయి. ఈ నెల 3న ఆంగ్ల పత్రిక 'ద ట్రిబ్యూన్'... రూ.500కే దేశంలో ఎవరి ఆధార్ సమాచారం కావాలన్నా దొరుకుతోందంటూ ఆధారాలతో సహా బయటపెట్టి సంచలనం సృష్టించడం, ఆ తర్వాత పత్రిక, ఆ వార్త రాసిన విలేకరిపై ప్రభుత్వం ఎఫ్ఐఆర్ నమోదు చేయించడం తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రజల్లో నెలకొన్న ఆందోళనలను తగ్గించేందుకు, ఆధార్ సమాచారం దుర్వినియోగం కాకుండా చూసేందుకే యూఐడీఏఐ కొత్త విధానం ప్రకటించినట్లు తెలుస్తోంది.



ప్రస్తుత విధానంలో..

- 12 అంకెల ఆధార్ సంఖ్యను వెల్లడించాలి
- వేలిముద్ర వేయాలి
- వాణిజ్య సంస్థల చేతికి ఆధార్‌లోని పూర్తి సమాచారం వెళ్తుంది
- ఒకటే ఆధార్ నంబర్ ఉంటుంది

కొత్త విధానంలో..

- 16 అంకెల వర్చువల్ సంఖ్యను వెల్లడించాలి
- వేలిముద్ర వేయాలి
- వాణిజ్య సంస్థలకు పేరు, ఫొటో, చిరునామాతో పరిమిత సమాచారమే వెళ్తుంది
- ఎన్ని తాత్కాలిక సంఖ్యలనైనా సృష్టించుకోవచ్చు.

సివిల్స్ మెయిన్స్ ఫలితాల విడుదల

సాక్షి, అమరావతి: సివిల్ సర్వీస్–2017 మెయిన్స్ పరీక్షా ఫలితాలను బుధవారం విడుదల చేసినట్లు యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ) తెలిపింది. మెయిన్స్‌లో అర్హత సాధించిన అభ్యర్థుల హాల్‌టికెట్ నంబర్లను తమ అధికారిక వెబ్‌సైట్ www.upsc.gov.in లో అందుబాటులో ఉంచినట్లు వెల్లడించింది. అయితే గతేడాది అక్టోబర్ 28 నుంచి నవంబర్ 3 వరకూ దేశవ్యాప్తంగా నిర్వహించిన మెయిన్స్‌లో ఎంతమంది అభ్యర్థులు ఉత్తీర్ణులయ్యారో మాత్రం యూపీఎస్సీ తెలపలేదు. మరోవైపు మెయిన్స్‌లో అర్హత సాధించిన అభ్యర్థులకు ఇంటర్వ్యూలను ఫిబ్రవరి 19 నుంచి నిర్వహించే అవకాశముందని యూపీఎస్సీ పేర్కొంది. ఇంటర్వ్యూ ఈ–సమన్ లెటర్స్‌ను కమిషన్ వెబ్‌సైట్‌లో ఈ నెల 18 నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపింది. మెయిన్స్‌లో ఉత్తీర్ణులు కాని అభ్యర్థుల మార్క్‌షీట్‌లను తుది ఫలితాలు ప్రకటించిన 15 రోజుల్లోగా తమ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతామంది. ఈ పేపర్లు వెబ్‌సైట్‌లో కేవలం 60 రోజుల వరకే ఉంటాయని స్పష్టం చేసింది.

మార్చి 5 నుంచి సీబీఎస్‌ఈ పరీక్షలు

న్యూఢిల్లీ: సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్‌ఈ) నిర్వహించే 10, 12వ తరగతి వార్షిక పరీక్షలు మార్చి 5వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. పదో తరగతికి ఏప్రిల్ 4 వరకు, 12వ తరగతికి ఏప్రిల్ 12వ తేదీ వరకు పరీక్షలు జరుగుతాయి. పదో తరగతి పరీక్ష ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీతో, పన్నెండో తరగతి పరీక్ష ఇంగ్లిష్ పేపర్‌తో మొదలవుతాయి.

వాట్సాప్‌లో వాయిస్ కాల్ టు వీడియో కాల్



లండన్: వాట్సాప్ మరో సరికొత్త ఫీచర్‌ను తీసుకొచ్చింది. వాట్సాప్ వాయిస్ కాల్స్ నుంచి కేవలం ఒక్క బటన్ ద్వారా నేరుగా వీడియో కాల్‌కు మారేలా కొత్త అప్‌డేట్‌ను తెచ్చింది. ప్రస్తుతం టెస్టింగ్ దశలో ఉన్న ఈ ఫీచర్.. బీటా వెర్షన్ యూజర్లకు మాత్రమే అందుబాటులోఉంది. ప్రస్తుతమున్న వాట్సాప్ వర్షన్‌లో వాయిస్ కాల్ నుంచి వీడియో కాల్‌కు మారాలంటే.. వాయిస్ కాల్‌ను కట్ చేసి.. తిరిగి వీడియో కాల్ చేయాలి. కానీ ఈ నూతన అప్‌డేట్‌లో వాయిస్ కాల్ నుంచి వీడియో కాల్ మారేందుకు కాల్ స్క్రీన్‌లో ఓ వీడియో సింబల్ బటన్‌ను ప్రెస్ చేస్తే సరిపోతుంది.

ఎంపీలు లాయర్లుగా కొనసాగొచ్చా?

న్యూఢిల్లీ: చట్ట సభలకు ఎన్నికైన తరువాత కూడా లాయర్లుగా కొనసాగుతున్న వారికి ది బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) నోటీసులు జారీచేసింది. ఎమ్మెల్యేలు, ఎంపీలు న్యాయవాద వృత్తిలో కొనసాగకుండా నిషేధం విధించాలని ఓ పిటిషన్ దాఖలైన నేపథ్యంలో ఈ మేరకు స్పందించింది. ఈ పిటిషన్‌పై వారంలోపు అభిప్రాయాలు తెలపాలని వారిని కోరింది. బీజేపీ ఢిల్లీ యూనిట్ అధికార ప్రతినిధి అశ్విని కుమార్ ఉపాధ్యాయ్ దాఖలు చేసిన ఈ పిటిషన్‌లో... లాయర్లుగా కొనసాగుతున్న ఎమ్మెల్యేలు, ఎంపీలపై బీసీఐ నిబంధనల మేరకు నిషేధం విధించాలని కోరారు. ఎంపీలు కపిల్ సిబల్, పి.చిదంబరం, కేటీఎస్ తులసి, అభిషేక్ మనుసింఘ్వీ, కల్యాణ్ బెనర్జీ, మీనాక్షి లేఖి తదితరులు నోటీసులు జారీ అయిన వారిలో ఉన్నారు.

బ్రిటన్ కేబినెట్‌లో నారాయణమూర్తి అల్లుడు



లండన్: టెక్ కంపెనీ ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుడు నారాయణమూర్తి అల్లుడు రిషి సునాక్‌కు బ్రిటన్ మంత్రి మండలిలో చోటు దక్కింది. ఇటీవల ప్రధాని థెరిసా మే చేపట్టిన కేబినెట్ పునర్వ్యవస్థీకరణలో రిషితో పాటు మరో ఇద్దరు భారత మూలాలున్న ఎంపీలను కూడా మంత్రి పదవులు వరించాయి. రిచ్‌మాండ్ (యార్క్‌షైర్) నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న రిషి హౌసింగ్, స్థానిక ప్రభుత్వం, కమ్యూనిటీస్ శాఖకు సహాయ మంత్రిగా నియమితులయ్యారు. భారత్–బ్రిటన్ మధ్య సంబంధాల బలోపేతానికి కృషిచేశారన్న పేరుంది. నారాయణమూర్తి కూతురు అక్షతా మూర్తిని రిషి వివాహమాడారు.

'ఆ వార్తతో మాకు సంబంధం లేదు'

హైదరాబాద్: ఆధార్ సమాచారానికి సరైన భద్రత లేదనీ, సైబర్ దాడి జరిగితే ఊహించని నష్టం జరుగుతుందంటూ బుధవారం మీడియాలో వచ్చిన వార్తకు, తమకు ఏ సంబంధం లేదని ఆర్‌బీఐ అనుబంధ ఐడీఆర్‌బీటీ (ఇన్‌స్టిట్యూట్ ఫర్ డెవలప్‌మెంట్ అండ్ రీసెర్చ్ ఇన్ బ్యాంకింగ్ టెక్నాలజీ) చెప్పింది. కొన్ని మీడియా సంస్థలు ఆ వార్తలోని అంశాలను ఆర్‌బీఐ పరిశోధకులకు ఆపాదించాయనీ, సదరు నివేదికతో ఆర్‌బీఐకిగానీ, తమకుగానీ ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేసింది. నివేదిక తయారుచేసిన అధ్యాపకుడు ఎస్ అనంత్ తమ సంస్థలో తాత్కాలిక ఉద్యోగిగా మాత్రమే పనిచేస్తున్నారని ఐడీఆర్‌బీటీ ఒక ప్రకటనలో వెల్లడించింది.

ప్రభుత్వాన్ని నడపాలనుకోవట్లేదు

- కార్యనిర్వాహక వ్యవస్థ సక్రమంగా పని చేయట్లేదు
- ఈ విషయాన్ని లేవనెత్తితే మాపై విమర్శలు చేస్తున్నారు
- సుప్రీంకోర్టు అసహనం



న్యూఢిల్లీ: తాము ప్రభుత్వాన్ని నడిపేందుకు ప్రయత్నిస్తున్నామంటూ వస్తున్న విమర్శలపై సుప్రీంకోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. కార్యనిర్వాహక వ్యవస్థ తన పని సక్రమంగా చేయడం లేదని, ఈ విషయాన్ని న్యాయ వ్యవస్థ ఎత్తిచూపితే తమపై విమర్శలకు దిగుతున్నారని అసంతృప్తి వ్యక్తం చేసింది. దేశంలోని వివిధ పట్టణాల్లోని పేదలకు నివాసయోగ్యత కల్పించే అంశానికి సంబంధించిన కేసు విచారణ సందర్భంగా బుధవారం సుప్రీం ఈ వ్యాఖ్యలు చేసింది. పట్టణ పేదలకు నివాసయోగ్యత కల్పించే అంశంలో ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వ యంత్రాంగం వైఫల్యం చెందినట్టు కనిపిస్తోందని న్యాయమూర్తులు జస్టిస్ మదన్ బి లోకూర్, జస్టిస్ దీపక్ గుప్తాలతో కూడిన బెంచ్ వ్యాఖ్యానించింది. 'మాది కార్యనిర్వాహక వ్యవస్థ కాదు. మీరు మీ పనిని సక్రమంగా చేయడం లేదు. దీనిపై ఏమైనా అంటే మేము దేశాన్ని నడిపించడానికి, ప్రభుత్వాన్ని నడిపించడానికి ప్రయత్నిస్తున్నామంటూ అందరూ మాపై విమర్శలు గుప్పిస్తున్నారు''అని పేర్కొంది. దీన్‌దయాళ్ అంత్యోదయ యోజన–నేషనల్ అర్బన్ లైవ్లీహుడ్ మిషన్ (ఎన్‌యూఎల్‌ఎం) పథకం 2014లో ప్రారంభమైందని, అయితే యూపీ ప్రభుత్వం ఇప్పటి వరకూ చేసింది శూన్యమని చెప్పింది. ఇది మనుషులకు సంబంధించిన విషయమని అధికారులు గుర్తుంచుకోవాలని ప్రభుత్వం తరపున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ (ఏఎస్‌జీ) తుషార్‌మెహతాకు స్పష్టం చేసింది. దీనికి ఏఎస్‌జీ స్పందిస్తూ.. ఈ అంశంలో ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని, పట్టణ పేదలకు నివాస వసతి కల్పించే ప్రయత్నాలు చేస్తోందన్నారు. పట్టణ పేదలకు సంబంధించిన వ్యవహారాలను పర్యవేక్షించేందుకు రాష్ట్ర స్థాయి కమిటీలను ఏర్పాటు చేయాలని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ అంశంపై ప్రతి రాష్ట్రంలో ఇద్దరు సభ్యుల కమిటీలను ఏర్పాటు చేస్తే ప్రయోజనకరంగా ఉంటుందని కేంద్రం సుప్రీంకు తెలిపింది. దీనికి స్పందించిన సుప్రీం రాష్ట్రాలతో సమన్వ యం చేసుకుని, కమిటీ సభ్యుల పేర్లను రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిపాదించేలా చేయాలని సూచించింది. కేంద్రంలో కార్యదర్శి స్థాయిలో పనిచేసి పదవీ విరమణ చేసిన అధికారి, పట్టణాభివృద్ధి శాఖలోని సీనియర్ అధికారి, పౌరసమాజం నుంచి ఒకరిని ఈ కమిటీలోకి ఎంపిక చేయాలంది.

పట్టణ నిరాశ్రయులకు ఆధార్ ఎలా?

పట్టణాల్లో నిరాశ్రయులైన పేదలకు ఆధార్ కార్డులను ఎలా జారీచేస్తున్నారని సుప్రీంకోర్టు యూపీ ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. దేశవ్యాప్తంగా పట్టణాల్లో నిరాశ్రయులకు ఆవాసం కల్పించడంపై జరిగిన విచారణ సందర్భంగా బుధవారం ఈ అంశాన్ని లేవనెత్తింది. ఇల్లు లేని వ్యక్తి ఆధార్ కార్డులో ఏ చిరునామా చేరుస్తారని కోర్టు ప్రశ్నించగా, యూపీ ప్రభుత్వం తరపున హాజరైన అడిషనల్ సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా బదులిస్తూ... అలాంటి వారికి ఆధార్ జారీచేసే అవకాశాలు లేవని అన్నారు. మరి ఆధార్ కార్డులేని వారు భారత్‌లో, యూపీలో లేరా? ఉంటే వారికి షెల్టర్ హోంలలో నీడ కల్పించరా? అని కోర్టు తిరిగి ప్రశ్నించగా...వారికి ఓటరు ఐడీ లాంటి ఇతర గుర్తింపు కార్డులున్నాయన్నారు.

కేవీల్లో ప్రార్థనా గీతం తప్పనిసరా?

కేంద్రం వివరణ అడిగిన సుప్రీంకోర్టు



న్యూఢిల్లీ: కేంద్రీయ విద్యాలయా(కేవీ)ల్లో ఉదయం అసెంబ్లీలో విద్యార్థులు తప్పనిసరిగా ప్రార్థనా గీతం పాడటంపై కేంద్రం వివరణ ఇవ్వాలని సుప్రీం కోర్టు ఆదేశించింది. కేవీల్లో ప్రార్థనాగీతం ఆలపించాలన్న కేంద్రం నిర్ణయానికి వ్యతిరేకంగా సుప్రీం కోర్టులో మధ్యప్రదేశ్‌కు చెందిన వినాయక్ సిన్హా అనే వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ ఆర్ఎఫ్ నారీమన్, జస్టిస్ నవీన్ సిన్హాల ధర్మాసనం బుధవారం విచారించింది. దేశవ్యాప్తంగా ఉన్న కేవీల్లో హిందూ మతానికి చెందిన ఓ ప్రార్థనా గీతాన్ని విద్యార్థులు తప్పనిసరిగా ఆలపించాలంటూ కేంద్రం బలవంతపు ఆదేశాలు జారీ చేసిందని.. దానివల్ల విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందడం కష్టమని పిటిషనర్ వాదించారు.

ఇస్రో చైర్మన్‌గా శివన్

19న బాధ్యతల స్వీకరణ



శ్రీహరికోట (సూళ్లూరుపేట): భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో) చైర్మన్‌గా ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ కె.శివన్ నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర కేబినెట్ నియామకాల కమిటీ శివన్‌ను ఇస్రోతో పాటు అంతరిక్ష కమిషన్ చైర్మన్‌గా, అంతరిక్ష విభాగం కార్యదర్శిగా నియమిస్తూ బుధవారం నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం ఇస్రో చైర్మన్‌గా ఉన్న ఏఎస్ కిరణ్‌కుమార్ పదవీకాలం జనవరి 18తో పూర్తికానుంది. ఈ నేపథ్యంలో ఈ నెల 19న శివన్ ఇస్రో ప్రధాన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించనున్నారు. మూడేళ్లపాటు శివన్ ఈ పదవుల్లో కొనసాగనున్నారు. ప్రస్తుతం ఆయన తిరువనంతపురంలోని విక్రమ్ సారాభాయ్ స్పేస్‌సెంటర్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఈ నెల 12న ఇస్రో తన 100వ ఉపగ్రహాన్ని ప్రయోగించనున్న నేపథ్యంలో శివన్ నియామక ప్రకటన వెలువడటం గమనార్హం. మద్రాస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుంచి 1980లో ఏరోనాటికల్ ఇంజనీరింగ్ పట్టా పొందిన శివన్..బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్(ఐఐఎస్‌సీ)లో మాస్టర్స్ చేశారు. ఇస్రో 1982లో చేపట్టిన పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికల్ (పీఎస్ఎల్వీ) ప్రాజెక్టుతో శివన్ కెరీర్ ప్రారంభమైంది. భారత జాతీయ ఇంజనీరింగ్ అకాడమీతో పాటు ఏరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా, సిస్టమ్స్ సొసైటీ ఆఫ్ ఇండియాలో శివన్ సభ్యుడిగా ఉన్నారు.

ఎంపీల్యాడ్స్ కాలపరిమితి పొడిగింపు

- 2020, మార్చి 31 వరకు కొనసాగింపు
- కేంద్ర కేబినెట్ నిర్ణయం



సాక్షి, న్యూఢిల్లీ: పార్లమెంటు సభ్యుల స్థానిక ప్రాంత అభివృద్ధి పథకం(ఎంపీల్యాడ్స్)ను 14వ ఆర్థిక సంఘం కాల పరిమితి ముగిసే తేదీ అయిన 2020, మార్చి 31 వరకు కొనసాగించాలని కేంద్రం నిర్ణయించింది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన సమావేశమైన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ బుధవారం ఈ మేరకు అంగీకరించింది. వచ్చే మూడేళ్ల కాలంలో ఈ పథకం కింద రూ. 11,850 కోట్లు వెచ్చించనున్నారు. ప్రారంభించిన కార్యక్రమాల పర్యవేక్షణ, సామర్థ్య పెంపు, స్థానిక అధికారుల శిక్షణ తదితరాలకు అదనంగా ఏటా రూ.5 కోట్లు వ్యయం చేయనున్నారు. స్థానికంగా ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని తాగునీరు, విద్య, వైద్యం, పారిశుధ్యం, రహదారులు తదితరాల అభివృద్ధికి ఏడాదికి రూ. 5 కోట్లు ఖర్చు చేసేందుకు పార్లమెంటు సభ్యులు సిఫారసు చేయొచ్చు. 1993–94లో ఈ పథకం ప్రారంభమైనప్పటి నుంచి గత ఆగస్టు వరకు పలు అభివృద్ధి పనులకు రూ.44,929.17 కోట్లు మంజూరు చేశారు.

దివ్యాంగుల చట్ట సవరణకు ఆమోదం

దివ్యాంగుల సంక్షేమ జాతీయ ట్రస్టు చైర్మన్, సభ్యుల పదవీకాలాన్ని మూడేళ్లుగా నిర్ధారిస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ఇందుకోసం నేషనల్ ట్రస్ట్ ఫర్ ది వెల్ఫేర్ ఆఫ్ పర్సన్స్ విత్ ఆటిజం, సెరెబ్రల్ పాల్సీ, మెంటల్ రిటార్డేషన్, అండ్ మల్టిపుల్ డిజేబిలిటీస్ చట్టం–1999ను సవరించాలంది.

సీఐఎస్ఎఫ్ కేడర్ సమీక్షకు ఓకే..

కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం(సీఐఎస్ఎఫ్) కేడర్ సమీక్ష ప్రతిపాదనకు కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. ఫలితంగా అసిస్టెంట్ కమాండంట్ నుంచి అడిషనల్ డైరెక్టర్ జనరల్ వరకు వివిధ స్థాయిల్లో 25 కొత్త పోస్టులు ఏర్పాటుకానున్నాయి.



మెరిట్ బేస్డ్ విధానమే భేష్

వలస విధానంపై ట్రంప్ పునరుద్ఘాటన ● ఉభయపక్ష నేతల సమావేశంలో ప్రతిపాదన

వాషింగ్టన్: నైపుణ్య ఆధారమైన వలసలను ప్రోత్సహించటం ద్వారా అక్రమ వలసలకు చెక్ పెట్టొచ్చని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. తద్వారా మంచి ట్రాక్ రికార్డున్న నిపుణులు అమెరికాకు వచ్చేందుకు వీలుంటుందన్నారు. శ్వేతసౌధంలో రిపబ్లిక్, డెమొక్రాట్ చట్ట సభ్యుల బృందంతో ట్రంప్ సమావేశమయ్యారు. అమెరికాలో ప్రవేశానికి ప్రస్తుతం అనుసరిస్తున్న చైన్ మైగ్రేషన్ విధానానికి (అమెరికా పౌరుడై ఉన్న లేదా అక్కడ చట్టపరంగా నివసిస్తున్న కుటుంబ సభ్యుల స్పాన్సర్‌షిప్ ద్వారా ప్రవేశం పొందటం) ముగింపు పలకాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు. ఈ విధానం ద్వారా అమెరికాలో వేగంగా, సులభంగా ప్రవేశం పొందేందుకు అనుమతి లభిస్తోంది. 'వీసాల గురించి మనం ప్రవేశపెట్టే అన్ని బిల్లుల్లోనూ నైపుణ్యం అనే పదాన్ని జోడించాలి. ఎందుకంటే.. కెనడాలో, ఆస్ట్రేలియాలో ఉన్నట్లుగా మనకు కూడా నైపుణ్యాధారిత వలసలుండాలని భావిస్తున్నాను. అందుకే మంచి ట్రాక్ రికార్డున్న వారు మనదేశానికి వస్తే బాగుంటుంది' అని ట్రంప్ పేర్కొన్నారు.

ట్రంప్‌కు మరో ఎదురుదెబ్బ: సరైన అనుమతి పత్రాలు లేకుండా చిన్నతనంలోనే తల్లిదండ్రులతోపాటు అమెరికా వెళ్లి,అక్రమంగా నివసిస్తున్న స్వాప్నికుల (డ్రీమర్స్)ను తిరిగి స్వదేశాలకు పంపేందుకు ప్రయత్నించిన ట్రంప్ ప్రభుత్వానికి ఎదురుదెబ్బ తగిలింది. ఈ పథకాన్ని రద్దు చేయాలన్నప్రతిపాదనను శాన్‌ఫ్రాన్సిస్కోలోని జిల్లా కోర్టు తిరస్కరించింది. విచారణ ముగిసేవరకు దీన్ని కొనసాగించాలని చెప్పింది.


1984 అల్లర్లపై మరో సిట్

మూసేసిన 186 కేసుల దర్యాప్తు పర్యవేక్షణ

- హైకోర్టు మాజీ న్యాయమూర్తి నేతృత్వం
- సుప్రీంకోర్టు ఆదేశాలు

న్యూఢిల్లీ: సంచలనం సృష్టించిన 1984 నాటి సిక్కు వ్యతిరేక అల్లర్ల కేసులను మరోసారి విచారించాలని సుప్రీంకోర్టు నిర్ణయించింది. నాటి అల్లర్లకు సంబంధించిన 241 కేసుల్లో 186 కేసులను ఎలాంటి దర్యాప్తు జరపకుండానే మూసేయడంపై ఆగ్రహం వ్యక్తం చేసిన కోర్టు.. తాజా దర్యాప్తును పర్యవేక్షించేందుకు మళ్లీ త్రిసభ్య ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని(సిట్)ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. హైకోర్టు మాజీ న్యాయమూర్తి నేతృత్వంలోని ఆ సిట్ మూసేసిన 186 సిక్కు వ్యతిరేక కేసులను దర్యాప్తును పర్యవేక్షిస్తుందని బుధవారం స్పష్టం చేసింది. సిట్‌లో ఒక రిటైర్డు పోలీసు ఆఫీసర్(పదవీవిరమణ నాటికి డీఐజీ ర్యాంకుకు తగ్గని అధికారి), మరో పదవిలో ఉన్న పోలీసు అధికారి సభ్యులుగా ఉంటారంది. సిట్‌లో సభ్యులుగా నియమించేందుకు అర్హులైన వారిని సిఫారసు చేయాలని కేంద్రాన్ని ఆదేశించింది. ఈ కేసుల్లో దర్యాప్తు జరిగిన తీరును ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం తీవ్రంగా తప్పుబట్టింది.

కేసు దర్యాప్తును పర్యవేక్షించేందుకు గతంలో ఏర్పాటు చేసిన సిట్ 241 కేసులను మూసేయాలని నిర్ణయించడంపై.. మాజీ న్యాయమూర్తులు జస్టిస్ జేఎం పంచల్, జస్టిస్ కేఎస్‌పీ రాధాకృష్ణన్‌లతో ఒక కమిటీని 2017 ఆగస్టులో సుప్రీంకోర్టు నియమించింది. ఆ కమిటీ ఇచ్చిన నివేదికను బుధవారం సుప్రీం ధర్మాసనం పరిశీలించింది. మూసేసిన 241 కేసుల్లో 186 కేసులను ఎలాంటి దర్యాప్తు లేకుండానే గతంలో ఏర్పాటు చేసిన సిట్ మూసేసిన వైనాన్ని ఆ కమిటీ గుర్తించి సుప్రీంకోర్టు దృష్టికి తీసుకువచ్చింది. దానిపై స్పందించిన ధర్మాసనం తాజాగా మరో సిట్ ఏర్పాటుకు నిర్ణయం తీసుకుంది. ఈ సిట్ గతంలో మూసేసిన 186 కేసుల పునర్విచారణను మాత్రమే పర్యవేక్షిస్తుందని స్పష్టం చేసింది. సిక్కు వ్యతిరేక అల్లర్లకు సంబంధించి దర్యాప్తు జరిపిన 250 కేసుల్లో 241 కేసులను పాత సిట్(1986 బ్యాచ్ ఐపీఎస్ అధికారి



మాజీ ప్రధాని ఇందిర హత్య తర్వాత సిక్కులపై మారణకాండ దృశ్యం (ఫైల్)

ప్రమోద్ అస్తానా నేతృత్వంలోని) మూసేయగా, మరో 9 కేసుల విచారణ కొనసాగుతోంది. ఆ తొమ్మిది కేసుల్లో రెండింటిని సీబీఐ విచారిస్తోంది. 1984లో నాటి ప్రధాని ఇందిరాగాంధీ హత్యానంతరం సిక్కు మతస్తులు లక్ష్యంగా చోటుచేసుకున్న దారుణ ఊచకోతపై ఇప్పటికే పలు కమిషన్‌లు, కమిటీలు నివేదికలు సమర్పించిన విషయం తెలిసిందే.

2,733 మంది ఊచకోత: 1984 నాటి ఇందిర హత్యానంతరం జరిగిన సిక్కు వ్యతిరేక అల్లర్లలో 2,733 మంది సిక్కులు ఊచకోతకు గురైన సంగతి తెలిసిందే. ఈ అల్లర్లకు నేతృత్వం వహించారన్న ఆరోపణలతో కాంగ్రెస్ నేతలు జగదీశ్ టైట్లర్, సజ్జన్ కుమార్ తదితరులపై కేసులు నమోదయ్యాయి. అయితే సాక్షులు సహకరించటం లేదంటూ, సరైన ఆధారాల్లేవంటూ ఈ ఇద్దరు కాంగ్రెస్ నేతలు సహా పలువురిపై కేసులను సీబీఐ వెనక్కు తీసుకుంది. నాటి (2005 తర్వాత) కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే చాలా కేసుల్లో విచారణను అర్ధాంతరంగా ముగించిందని ఢిల్లీ సిఖ్ గురుద్వారా మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యుడు గుర్లాద్ సింగ్ కహ్లోన్ పిటిషన్ వేశారు. దీనిపై విచారణ సందర్భంగానే కోర్టు తాజాగా మరో సిట్ ఏర్పాటుకు సంసిద్ధత వ్యక్తం చేసింది.

33 ఏళ్ల విచారణ



- **1984, నవంబర్:** అక్టోబర్ 31 నాటి ఇందిరా గాంధీ హత్యకు సిక్కులే కారణమంటూ ఢిల్లీలో చెలరేగిన అల్లర్లు. గురుద్వారాలు, సిక్కులు నివసించే ప్రాంతాలే లక్ష్యంగా దాడులు. ఒక్క ఢిల్లీలోనే 2,733 మంది ఊచకోత.
- **2000, మే:** సిక్కు వ్యతిరేక ఘర్షణలపై విచారణకోసం జస్టిస్ జీటీ నానావతి కమిషన్‌ను ఏర్పాటుచేసిన వాజ్‌పేయి ప్రభుత్వం.
- **2005, ఆగస్టు 8:** పార్లమెంటు ముందుకు నానావతి కమిషన్ నివేదిక.
- **ఆగస్టు 10:** పార్లమెంటులో విపక్షాల ఆందోళన, విస్తృత చర్చ. ఈ అల్లర్లపై ఎఫ్ఐఆర్ నమోదు చేయనున్నట్లు నాటి ప్రధాని మన్మోహన్ ప్రకటన.
- **నవంబర్ 5:** కాంగ్రెస్ నేత జగదీశ్ టైట్లర్‌పై కేసు నమోదు చేసిన సీబీఐ.
- **2007, అక్టోబర్ 28:** టైట్లర్ పాత్ర రుజువు కానందున కేసు వెనక్కు తీసుకున్న సీబీఐ.
- **డిసెంబర్ 18:** సీబీఐ నివేదికను తిరస్కరించిన కోర్టు. కేసు పునర్విచారణకు ఆదేశం.
- **డిసెంబర్ 2008 నుంచి ఏప్రిల్ 2009:** కేసుకు సంబంధించి సాక్ష్యాలను విచారించిన సీబీఐ. మరోసారి టైట్లర్‌పై కేసు వెనక్కు తీసుకున్నట్లు కోర్టుకు వినతి.
- **ఫిబ్రవరి, 2010:** కాంగ్రెస్ నేత సజ్జన్ కుమార్ సహా ఏడుగురికి కోర్టు సమన్లు. సజ్జన్ కుమార్‌పై నాన్–బెయిలబుల్ వారెంట్ జారీ.
- **ఏప్రిల్ 2010:** టైట్లర్‌పై కేసు కొట్టేయాలన్న సీబీఐ వినతిని అంగీకరించిన కోర్టు.
- **జూలై 2010:** కోర్టులో బాధితుల పిటిషన్. కేసు విచారణ సరిగా జరగటం లేదని, పునర్విచారణ జరపాలని వినతి. అంగీకరించిన కోర్టు. ఐపీఎస్ అధికారి ప్రమోద్ ఆస్తానా నేతృత్వంలో త్రిసభ్య సిట్ ఏర్పాటు.
- **ఏప్రిల్, 2013:** కేసును తిరిగి ప్రారంభించాలని సీబీఐకి ఆదేశం.
- **ఏప్రిల్ 30:** సజ్జన్‌కుమార్‌ను నిర్దోషిగా ప్రకటించిన కోర్టు.

2050కి నంబర్‌వన్ రాష్ట్రంగా ఏపీ: సీఎం



సాక్షి, రాజమహేంద్రవరం: మూడు విజన్లతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు సీఎం చంద్రబాబునాయుడు చెప్పారు. 2022 నాటికి దేశంలో మొదటి మూడు రాష్ట్రాల్లో ఒకటిగా, 2029 నాటికి దేశంలో, 2050 నాటికి ప్రపంచంలో నంబర్‌వన్ రాష్ట్రంగా నిలిపేందుకు విజన్‌తో పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు. దేశ అభివృద్ధి కన్నా రాష్ట్ర అభివృద్ధి 5.57 శాతం అధికంగా ఉందని చెప్పారు. వ్యవసాయంలో బాగా అభివృద్ధి సాధించామన్నారు. బుధవారం తూర్పుగోదావరి జిల్లా ముమ్మిడివరం మండలం చెయ్యేరు గున్నేపల్లిలో నిర్వహించిన 'జన్మభూమి–మా ఊరు' సభలో సీఎం చంద్రబాబు మాట్లాడారు. త్వరలో రెండు లక్షల మందికి కార్పొరేషన్ల ద్వారా రుణాల్ని ఎంపీడీవో కార్యాలయానికి పిలిపించి ఇస్తామన్నారు. రానూపోనూ ఖర్చులను ప్రభుత్వమే భరిస్తుందన్నారు.

✦ చంద్రబాబు అంకెల గారడీ

వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి వాసిరెడ్డి పద్మ



సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి చంద్రబాబు అబద్ధాలకు హద్దే లేకుండా పోయిందని, అంకెలతో గారడీ చేస్తున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి వాసిరెడ్డి పద్మ విమర్శించారు. ఆమె బుధవారం పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... చంద్రబాబు అబద్ధాలకు హద్దే లేకుండా పోయిందని ధ్వజమెత్తారు. అపోలో టైర్స్ పరిశ్రమపై ముఖ్యమంత్రి మంగళవారం చేసిన ప్రకటనతో పాటు రాష్ట్రంలో పారిశ్రామిక పెట్టుబడులు, ఉద్యోగాలు, జీడీపీ లెక్కలు, వీటితో పాటు చంద్రబాబు కుటుంబ ఆస్తుల ప్రకటనల్లో కూడా ఎక్కడా వాస్తవం కనిపించటం లేదని మండిపడ్డారు. 2022 నాటికి ఏపీ దేశంలోని మూడు అగ్రగామి రాష్ట్రాల్లో ఒకటిగా ఉంటుందని, 2019 నాటికి నంబర్ 1గా ఉంటుందని, 2050 నాటికి ప్రపంచంలోనే నంబర్ 1గా ఉంటుందని చంద్రబాబు చెప్పడం విచిత్రంగా ఉందన్నారు. ఈ పిచ్చి మాటలను ఆయన దార్శనికతకు నిదర్శనంగా మళ్లీ మీడియాలో రాయించుకుంటున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పనుల అవకతవకలపై సీబీఐ విచారణకు చంద్రబాబు సిద్ధమా? అని బహిరంగ సవాల్‌ను విసిరారు. సీబీఐ విచారణ జరిగితే చంద్రబాబు జైలుకు వెళ్లాల్సి వస్తుందని స్పష్టంచేశారు.

✦ నడిరోడ్డుపై ఆత్మహత్యాయత్నం



పెందుర్తి: విశాఖ జిల్లా పెందుర్తి పోలీస్‌స్టేషన్ ఎదుట నడిరోడ్డుపై ఓ వ్యక్తి ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్న ఘటన జనాన్ని బెంబేలెత్తించింది. బుధవారం ఉదయం జరిగిన ఈ సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. పెందుర్తిలో నివాసం ఉంటున్న మునస మహాలక్ష్మినాయుడు(45) అనే వ్యక్తి భార్య రాజరాజేశ్వరిపై అనుమానంతో గత ఏడాది అక్టోబర్ 13న ఇంట్లో ఉన్న క్రికెట్ బ్యాట్‌తో కొట్టి హతమార్చినట్లు కేసు ఉంది. ఈ క్రమంలో అతను 80 రోజులు జైల్లో రిమాండ్ ఖైదీగా ఉండి కొద్దిరోజుల క్రితమే బెయిల్‌పై వచ్చాడు. దీంతో ఆదివారం అతడి వద్దకు పిల్లలు శ్వేత, సాయితో పాటు భార్య తరపు బంధువులు వచ్చి పిల్లలకు న్యాయం చేయాలని ఆందోళనకు దిగారు. ఈ నేపథ్యంలో పిల్లల పేర ఆస్తి రాసిస్తానని, అయితే పిల్లలు తన వద్దే ఉండాలని మహాలక్ష్మినాయుడు షరతు పెట్టాడు. దీనికి పిల్లలతో సహా బంధువులు ఒప్పుకోలేదు. దీంతో ఇరువర్గాల మధ్య వివాదం చెలరేగింది. ఈ క్రమంలో పిల్లలను కూడా చంపుతానని బెదిరించాడని ఆరోపిస్తూ మహాలక్ష్మినాయుడిపై సోమవారం పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన మహాలక్ష్మినాయుడు బుధవారం పెందుర్తి పోలీస్‌స్టేషన్ వద్దకు వచ్చి ఎదురుగా ఉన్న బీఆర్‌టీఎస్ రహదారిపై నిల్చుని మీద పెట్రోల్ పోసుకుని నిప్పు పెట్టుకున్నాడు. మంటలు వ్యాపించడంతో అతడు రోడ్డుపై పరిగెడుతుంటే స్థానికులు బెంబేలెత్తిపోయారు. కాసేపటికి తేరుకున్న స్థానికులు, పోలీసులు మంటలు ఆర్పి అతన్ని విశాఖలోని కేజీహెచ్‌కు తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. పెందుర్తి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

✦ కర్నూలు అసెంబ్లీ స్థానానికి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా హాఫీజ్‌ఖాన్

కర్నూలు (ఓల్డ్‌సిటీ): కర్నూలు అసెంబ్లీ స్థానం నుంచి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా హాఫీజ్ ఖాన్‌ను ప్రకటించారు. కర్నూలులోని రాయల్ ఫంక్షన్ హాలులో బుధవారం సాయంత్రం కర్నూలు నియోజకవర్గ పార్టీ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా నెల్లూరు జిల్లా ఆత్మకూరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ మేకపాటి గౌతంరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆయన హాఫీజ్ ఖాన్‌ను అభ్యర్థిగా ప్రకటించారు.

తెలంగాణ

'మేడారం'లో కాషాయ గుడారం..!

- రాష్ట్రంలో బలోపేతానికి జాతరపై బీజేపీ కన్ను
- కేంద్ర మంత్రులు, బీజేపీ పాలిత సీఎంలను తీసుకొచ్చేందుకు యత్నం



మహారాష్ట్ర ముఖ్యమంత్రిని జాతరకు ఆహ్వానిస్తున్న కె.లక్ష్మణ్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పార్టీని బలోపేతం చేసేందుకు తీవ్రంగా కృషి చేస్తున్న కమలనాథులు మేడారం జాతరపై దృష్టి పెట్టారు. కోట్లలో జనం తరలివచ్చే ఈ గిరిజన కుంభమేళాను తమకు అనుకూలంగా మలుచుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈనెల 31 నుంచి ఫిబ్రవరి 3 వరకు జరిగే జాతరకు కేంద్ర మంత్రులు, బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులను రప్పించేందుకు కసరత్తు చేస్తున్నారు. అలాగే గిరిజనులతోపాటు గ్రామాల పురోగతికి కేంద్ర ప్రభుత్వం, రాష్ట్రాల్లోని బీజేపీ ప్రభుత్వాలు చేస్తున్న కృషిని వివరించే స్టాళ్లను ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే నితిన్ గడ్కరీ, స్మృతి ఇరానీ, జేపీ నడ్డా, ధర్మేంద్ర ప్రధాన్, కిరెణ్ రిజిజు, జుయల్ ఓరం సహా పది మంది కేంద్ర మంత్రులు, మహారాష్ట్ర గవర్నర్ సీహెచ్ విద్యాసాగరరావు, ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, గిరిజన జనాభా అధికంగా ఉన్న ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి రమణ్‌సింగ్‌లను ఆహ్వానించారు. మధ్యప్రదేశ్ సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్‌తోపాటు మరికొందరు ముఖ్యమంత్రులను కూడా ఆహ్వానించబోతున్నారు. సాధారణంగా జాతరలు, ఉత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తుంది. కేంద్ర మంత్రులు, ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు, గవర్నర్లను రాష్ట్ర ప్రభుత్వమే ఆహ్వానిస్తుంది. కానీ ఇందుకు భిన్నంగా కమలనాథులు పార్టీ తరపున వారిని రప్పించేందుకు యత్నిస్తున్నారు.

పథకాలను వివరించే స్టాళ్లు..

కేంద్ర ప్రభుత్వ పథకాలు, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అనుసరిస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను అక్కడికి వచ్చే భక్తజనం దృష్టికి తీసుకెళ్లేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వ శాఖలకు సంబంధించి కొన్ని స్టాళ్లను ఏర్పాటు చేయించాలని నిర్ణయించారు. రాష్ట్రంలోని జాతీయ రహదారుల నిడివి రెట్టింపు అయ్యేలా కేంద్ర ప్రభుత్వం కొత్త రోడ్లు మంజూరు చేసింది. ఇది రాష్ట్రాభివృద్ధిలో కీలక భూమిక పోషించనున్నందున కేంద్ర ఉపరితల రవాణా శాఖ చేత ప్రత్యేక స్టాల్ ఏర్పాటు చేయించనున్నారు. అలాగే గ్రామీణాభివృద్ధి, వైద్య ఆరోగ్య శాఖల స్టాళ్లను ఏర్పాటు చేయించాలని భావిస్తున్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అనుసరిస్తున్న గ్రామీణాభివృద్ధి పథకాలను వివరించనున్నారు. మహారాష్ట్రలో గిరిజన సంక్షేమం, గ్రామీణాభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు కేటాయించే చట్టం ఏర్పాటుకు ఆ రాష్ట్ర గవర్నర్ విద్యాసాగరరావు ప్రత్యేక చొరవ చూపారని, దాన్ని వివరించే ఏర్పాటు కూడా చేయాలని నిర్ణయించారు. ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలు అనుసరిస్తున్న విధానాలపైనా అవగాహన కల్పించే స్టాళ్లు ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం.

కార్యకర్తలతో ప్రత్యేక శిబిరం

బీజేపీ ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఆర్‌ఎస్‌ఎస్‌కు చేరువగా ఉండే వనవాసీ కల్యాణ్ పరిషత్ కార్యకర్తలు.. భక్తుల సేవలో ఉండేలా నియోగిస్తున్నారు. ఇప్పటికే బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ దీనిపై పార్టీ నేతలతో సమావేశాలు నిర్వహించారు. ఢిల్లీ, ముంబైలకు పార్టీ నేతలు ప్రేమేందర్‌రెడ్డి, చందా లింగయ్య ఇతర నేతలతో కలసి వెళ్లి కేంద్ర మంత్రులు, ముఖ్యమంత్రి ఫడ్నవీస్, గవర్నర్ విద్యాసాగరరావులతో భేటీ అయ్యారు.

800 కిలోమీటర్లు దాటిన పాదయాత్ర

ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌కు అడుగడుగునా సమస్యలు ఏకరువు పెడుతున్న జనం



పాతగుంట వద్ద ప్రజలకు అభివాదం చేస్తున్న వైఎస్ జగన్

సాక్షి ప్రతినిధి, తిరుపతి

ప్రతిపక్ష నేత, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజా సంకల్ప యాత్ర బుధవారం చిత్తూరు జిల్లాలో 800 కిలోమీటర్ల మైలు రాయి దాటింది. ఈ సందర్భంగా వెదురుకుప్పం మండలం నల్లవెంగనపల్లి గ్రామం వద్ద ఆయన ఓ మొక్కను నాటారు. వైఎస్సార్ జిల్లా ఇడుపులపాయ వద్ద నుంచి ప్రారంభమైన పాదయాత్ర కర్నూలు, అనంతపురం జిల్లాల్లో పూర్తి చేసుకుని గత నెల 28న చిత్తూరు జిల్లాలో ప్రవేశించింది. ప్రస్తుతం గంగాధర నెల్లూరు నియోజకవర్గంలో కొనసాగుతోంది. 58వ రోజు బుధవారం సాయంత్రానికి 804.4 కిలోమీటర్ల మేర యాత్ర పూర్తి చేశారు. కొండలు.. కోనలు.. అడవులు.. కరువు నేలల మీదుగా పాదయాత్ర సాగిస్తున్న జగన్‌కు అడుగడుగునా ప్రజలు తమ సమస్యలు ఏకరువు పెడుతున్నారు. చంద్రబాబు నాలుగేళ్ల పాలనలో ఎవరికీ న్యాయం జరగలేదని గోడు వెళ్లబోసుకుంటున్నారు. తమ కష్టాలు వినే నాయకుడొచ్చాడని ఘన స్వాగతం పలుకుతున్నారు. ప్రజలు జగన్‌ను చూడాలని, ఆయనకు తమ సమస్యలు చెప్పుకోవాలని గంటల తరబడి వేచి చూస్తున్నారు. యువకుల కేరింతలు.. అవ్వాతాతల ఆశీర్వచనాలు.. అక్కాచెల్లెళ్ల ఆత్మీయత నడుమ జిల్లాలో ప్రజా సంకల్పయాత్ర దిగ్విజయంగా సాగుతోంది. దగా పడిన ప్రజలు, ఉపాధి లేక వీధిన పడ్డ యువకులు, పింఛను అందని దివ్యాంగులు, ఫీజు రీయింబర్స్‌మెంట్ అందని విద్యార్థులు జననేతకు అర్జీలు సమర్పిస్తున్నారు.

అడుగడుగునా నివేదనలు..

తంబళ్లపల్లి నియోజకవర్గంలోని తంబళ్లపల్లి, కురబలకోట మండలాల్లోని ప్రజలు కరువు వల్ల పడే ఇబ్బందులను జననేతకు చెప్పుకున్నారు. ఉపాధి అవకాశాలు లేక, పొట్టనిండక పొరుగు రాష్ట్రాలకు పరుగులు తీయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. మదనపల్లి, పీలేరు, పుంగనూరు నియోజకవర్గాల్లోని ప్రజలు తమకు పింఛన్లు, వైద్యం, ఇళ్లు అందడం లేదని గోడు వెళ్లబోసుకున్నారు. కల్లూరు మండలంలో బీడీ, చింతపండు కార్మికులు వారు పడుతున్న కష్టాలను జననేతకు వివరించారు. పింఛన్ ఇవ్వడం లేదని, ఇల్లు మంజూరు చేయలేదని పెద్ద సంఖ్యలో పేదలు జగన్‌కు చెప్పుకున్నారు. రుణమాఫీ కాలేదని డ్వాక్రా అక్కచెల్లెమ్మలు.. మాఫీ సొమ్ము వడ్డీకి కూడా సరిపోలేదని రైతులు గోడు వెళ్లబోసుకుంటున్నారు. అందరి సమస్యలు ఓపికగా వింటున్న జగన్.. మనందరి ప్రభుత్వం రాగానే నవరత్నాల ద్వారా అన్ని వర్గాల వారిని ఆదుకుంటామని భరోసా ఇస్తూ ముందుకు సాగుతున్నారు. వైద్యం ఖర్చు రూ.వెయ్యి దాటితే ఆరోగ్య శ్రీ కిందకు చేరుస్తామని, పేద విద్యార్థుల ఉన్నత చదువు కోసం ఎంత ఖర్చు అయినా భరిస్తామని జగన్ బహిరంగ సభల్లో చెబుతున్నపుడు ప్రజల నుంచి మంచి స్పందన వస్తోంది.

మరిన్ని ఫొటోలు టాబ్లాయిడ్‌లో..

నేడు హైమన్ డార్ఫ్ 31వ వర్ధంతి



సాక్షి, ఆసిఫాబాద్: ఆదివాసీ ఆరాధ్యుడు ప్రొఫెసర్ క్రిస్టోఫర్ వోన్ ఫ్యూరర్ హైమన్‌డార్ఫ్ 31వ వర్ధంతిని గురువారం కుము రం భీం జిల్లా జైనూర్ మండలం మార్లవాయిలో ఆదివాసీలు ఘనంగా జరపను న్నారు. 1940వ దశకంలో ఆస్ట్రియా దేశపు ఆంత్రోపాలజిస్టు ఆదివాసీల సంస్కృతీ సంప్రదాయాలపై అధ్యయనం చేసి వారి స్థితిగతులను ప్రపంచానికి తెలియజేశారు. మార్లవాయిలో నివసించిన ఆయన చివరి నిజాం మీర్ ఉస్మాన్ అలీ ఖాన్‌కు ఆదివాసీల సమస్యలు వివరించి వారికోసం కొన్ని ప్రత్యేక హక్కులు కల్పించేలా కృషి చేశారు. 1987లో హైమన్ డార్ఫ్ భార్య ఎలిజబెత్, 1995లో డార్ఫ్ లండన్‌లో చనిపోగా వారి కోరిక మేరకు వారి చితాభస్మం తెచ్చి సమాధులు నిర్మించారు. అప్పటి నుంచి ఆదివాసీలు డార్ఫ్ వర్ధంతిని ఏటా నిర్వహిస్తున్నారు.

తెలంగాణ

కాంగ్రెసోళ్లకు మనసున పడ్తలేదు

24 గంటల కరెంట్ ఇస్తే ఒద్దంటుండ్రు..: మంత్రి హరీశ్‌రావు

- జానా తన సవాల్‌పై ఇప్పుడేమంటారు?
- కాళేశ్వరం పనులు ప్రపంచంలోనే రికార్డు
- సీడబ్ల్యూసీ ప్రశంసించింది
- కేసీఆర్ అంకితభావమే ఈ ఘనతకు కారణం



గజ్వేల్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

గజ్వేల్: 'మా ప్రభుత్వం 24 గంటల విద్యుత్ ఇస్తే కాంగ్రెసోళ్లకు మనసున పడ్తలేదు. ఒకరేమో అన్ని గంటలు కరెంటు ఒద్దంటుండ్రు, మరొకరేమో ఈ ఘనత అంతా మాదేనంటుండ్రు. వాళ్లది వాళ్లే ఆగమాగమైతుండ్రు. ఆ పార్టీ ప్రతిపక్ష నేత జానారెడ్డి పల్లెటూరు, పట్నంకు, రైతుకు నిరంతర కరెంటిస్తే విచిత్రమే.. అట్ల జేస్తే నేనే కేసీఆర్‌కు ముందుండి కార్యకర్తగా ప్రచారం చేస్తానని చెప్పిండు. మాటమీద నిలబడతారా? మీ విజ్ఞతకే వదిలేస్తున్నా' అని భారీ నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. బుధవారం సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో నిర్వహిం చిన టీఆర్‌ఎస్ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన కాంగ్రెస్‌పై విరుచుకుపడ్డారు. 'సీఎం కేసీఆర్ ప్రజలకు ఇచ్చిన ప్రతి మాటను నిలబెట్టుకుంటున్నారు. తెలంగాణ తెస్తామని అనుకున్నది సాధించిండు. ఇంటింటికీనల్లా నీళ్లు ఇస్తామని ఇచ్చి చూపించిండు. నిరంతర కరెంటు ఇస్తమని ఇయ్యాల ఆ కలను నిజం చేసిండు' అని అన్నారు. గోదావరి జలాలతో రాష్ట్రంలోని ప్రతి ఎకరాకు నీళ్లందిస్తామని చెప్పి ఆ మాటనూ నెరవేరుస్తున్నారని తెలిపారు. గోదావరి నది పై కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి పదేళ్లు పడుతుందని, అలాంటిది రెండేళ్లలో పూర్తి చేసేందుకు కృషిచేస్తున్నామన్నారు. పనులు జరుగుతున్న తీరును సీడబ్ల్యూసీ (సెంట్రల్ వాటర్ వర్క్స్ కమిషన్) సభ్యులు ప్రశంసించారని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టు పనుల ప్రక్రియ ప్రపంచంలోనే ఒక రికార్డుగా అభివర్ణించారు. ఇటీవల గజ్వేల్‌ను సందర్శించిన బిహార్ ఉప ముఖ్యమంత్రి సుశీల్ కుమార్ మోదీ అభివృద్ధిని చూసి ప్రశంసలు కురిపించారని, హైదరాబాద్‌కు వచ్చిన కర్ణాటక కాంగ్రెస్ మంత్రి రేవణ్ణ గొల్ల కురుమల సంక్షేమానికి కేసీఆర్ తీసుకుంటున్న చర్యలను కొనియాడిన తీరును వివరించారు. సమావేశంలో మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ చైర్మన్ మడుపు భూంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ లే అవుట్లకు నో రిజిస్ట్రేషన్!

- నూతన పంచాయతీరాజ్ చట్టంపై మంత్రుల సబ్ కమిటీ చర్చ
- భవన నిర్మాణ అనుమతులకు మండల స్థాయిలోనూ కమిటీ
- హెచ్‌ఎండీఏ అనుమతిచ్చిన వారంలోనే పంచాయతీ క్లియరెన్స్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి. చిత్రంలో పోచారం, ఈటల, జగదీశ్

సాక్షి, హైదరాబాద్: అనుమతి లేని లే అవుట్లలోని ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేయకుండా చర్యలు తీసుకుంటే ఎలా ఉంటుందనే అంశంపై మంత్రి జూపల్లి కృష్ణారావు అధ్యక్షతన ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం ఆలోచనలు చేస్తోంది. బుధవారమిక్కడ ఎంసీ ఆర్‌హెచ్‌ఆర్డీలో మూడోరోజూ సమావేశమైన మంత్రుల సబ్ కమిటీ దాదాపు ఎనిమిది గంటల పాటు అనేక అంశాలపై చర్చించింది. కమిటీ సభ్యులు మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఈటల రాజేందర్‌తోపాటు జగదీశ్వర్‌రెడ్డి చర్చలో పాల్గొన్నారు. అనుమతి లేని లే అవుట్లలో ప్లాట్ల రిజిస్ట్రేషన్‌ను ఆపేసే అంశంపై సంబంధిత శాఖ మంత్రి, డిప్యూటీ సీఎం మహమూద్ అలీతోనూ సబ్ కమిటీ ప్రత్యేకంగా చర్చించింది. లే అవుట్‌కు అనుమతి ఉంటేనే ప్లాట్లకు రిజిస్ట్రేషన్ చేసేలా చర్యలు తీసుకుంటే మంచిదని పేర్కొన్నారు.

గ్రామాభివృద్ధికి ఎన్నారైల సహకారం

ప్రస్తుతం జిల్లా పరిషత్, మండల పరిషత్‌లో ఉన్నట్లుగానే పంచాయతీ పాలకవర్గ సమావేశాలకు హాజరయ్యే సభ్యులకు కూడా సిట్టింగ్ ఫీజు ఇవ్వాలనే అభిప్రాయం కూడా వ్యక్తమైంది. ప్రత్యేక పరిస్థితుల్లో మినహా వరుసగా మూడుసార్లు పాలకవర్గ సమావేశాలకు డుమ్మా కొడితే అనర్హత వేటు కూడా వేసే అంశంపైనా చర్చించారు. పంచాయతీల్లో కో–ఆప్షన్ సభ్యులను నియమించే అంశాన్ని పరిశీలిస్తున్న సబ్ కమిటీ.. ఇందులో ఎన్నారైలకు, గ్రామంలో లేని వారికి కూడా అవకాశం ఇస్తే ఎలా ఉంటుందన్న దానిపై చర్చించారు. పంచాయతీ జనాభాను బట్టి ఇద్దరు, ముగ్గురిని కూడా నామినేట్ చేసుకునే అవకాశాలపై చర్చించారు. గ్రామానికి చెందిన ఎన్నారైలు, గ్రామ మహిళ సమాఖ్య అధ్యక్షురాలు, నిపుణులకు అవకాశం కల్పించడం వల్ల గ్రామాభివృద్ధికి వారి సహకారం ఉపయోగపడుతుందన్న అభిప్రాయం వ్యక్తమైంది. ప్రస్తుతం 200 చదరపు గజాల లోపు విస్తీర్ణంలో జీ ప్లస్ 2 ఎత్తులో నిర్మించే భవనాల అనుమతులను గ్రామ పంచాయతీలో ఇస్తున్నారు. అంతకన్నా ఎక్కువ విస్తీర్ణంలో అయితే మండలాల్లో ఎంపీడీవో, తహసీల్దార్, ఈఓ పీఆర్డీ, పంచాయతీరాజ్ ఏఈల నేతృత్వంలో కమిటీ ఏర్పాటు చేసి అనుమతించే అంశంపైనా చర్చించారు. అలాగే భవన నిర్మాణానికి హెచ్‌ఎండీఏ అనుమతిచ్చిన వారం రోజుల్లోనే పంచాయతీ క్లియరెన్స్ ఇవ్వాలని.. లేనిపక్షంలో అనుమతిచ్చినట్లుగానే భావించేలా చట్టంలో నిబంధనలు పొందుపర్చే అంశం కూడా సబ్ కమిటీలో చర్చకు వచ్చింది. సర్పంచ్‌లకు విస్తృత అధికారాలు కల్పించే దిశగా కొత్త చట్టంలో మార్పులు చేయాలని భావిస్తున్న సబ్ కమిటీ.. అదే సమయంలో ప్రజల కోసం ప్రత్యేకంగా హక్కుల జాబితాను కూడా చట్టంలో పొందుపర్చే యోచన చేస్తోంది. గురువారం కూడా సబ్ కమిటీ మరోసారి సమావేశం కానుంది.

ప్రజల హక్కుల్ని హరిస్తే ఎలా సారూ!

సీఎం కేసీఆర్‌కు మానవ హక్కుల వేదిక బహిరంగలేఖ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో నిర్బంధ పరిస్థితులు నెలకొన్నాయని, అవి ప్రజలకు ఆందోళనకరంగా ఉన్నాయని మానవ హక్కుల వేదిక పేర్కొంది. ప్రత్యామ్నాయ ఆలోచనల పట్ల, ప్రజల అభిప్రాయాల వ్యక్తీకరణపట్ల ప్రభుత్వం తీవ్ర అసహనంతో వ్యవహరిస్తోందని వేదిక అధ్యక్షుడు గొర్రెపాటి మాధవరావు, ప్రధానకార్యదర్శి జి.మోహన్ ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వతీరుపై మానవ హక్కుల వేదిక సీఎం కేసీఆర్‌కు బుధవారం బహిరంగ లేఖ రాసింది. ప్రివెంటివ్ డిటెన్షన్, బహిరంగసభలు, ఊరేగింపులను క్రమబద్ధీకరించే చట్టాలైన సెక్షన్ 30, సెక్షన్ 144ను పోలీసులు విచక్షణారహితంగా అమలు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఎక్కడా మీటింగులకు అనుమతి నివ్వడం లేదని, రైతు సమస్యలపై నిరసన తెలిపినా అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

గ్రేటర్‌లోకి 27 శివారు పంచాయతీలు!

గండిపేట మండలం పూర్తిగా బల్దియా పరిధిలోకి

- అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని ఏడు గ్రామాలు కూడా..
- పదవీకాలం ముగుస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం కసరత్తు
- న్యాయపరమైన చిక్కులు తలెత్తకుండా జాగ్రత్తలు

సాక్షి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి: హైదరాబాద్ మహానగర పాలక సంస్థ(జీహెచ్ఎంసీ) పరిధి మరింత విస్తృతం కానుంది. శివార్లలోని గ్రామ పంచాయతీలను విలీనం చేయడం ద్వారా గ్రేటర్ భౌగోళిక విస్తీర్ణం భారీగా పెరగనుంది. తాజాగా రాజధాని శివార్లలోని 27 గ్రామాలను జీహెచ్‌ఎంసీలో కలిపే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. తాజా ప్రతిపాదనలతో రాజేంద్రనగర్(ప్రస్తుతం గండిపేట) గ్రామీణ మండలం అంతా బల్దియా గొడుగు కిందకు రానుంది. శంషాబాద్ మండలంలోని ఆరు గ్రామాలను కూడా జీహెచ్‌ఎంసీలో చేర్చాలని ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించింది. శరవేగంగా పట్టణ రూపు సంతరించుకుంటున్న శంషాబాద్ మండల కేంద్రం సహా పరిసర గ్రామాలను ఇందులో కలిపేందుకు ప్రతిపాదనలు తయారు చేసింది. దీంతో కొత్తగా 1,52,261 జనాభా(2011 గణాంకాల ప్రకారం) గ్రేటర్ పరిధిలోకి రానుంది.

నగరీకరణ నేపథ్యంలో..

బహుళజాతి సంస్థలు, సాఫ్ట్‌వేర్ కంపెనీల తాకిడి, అంతర్జాతీయ విమానాశ్రయం ఏర్పాటుతో శివారు ప్రాంతాల రూపురేఖలు మారిపోయాయి. ఈ క్రమంలో ఐటీ హబ్‌కు సమీపంలో ఉన్న గండిపేట మండలంలోని గ్రామా లు బహుళ అంతస్తు భవనాలు, కార్పొరేట్ కంపెనీలతో కొలువుదీరాయి. అయితే, మౌలిక సదుపాయాలు అంతగా లేకపోవడం.. పంచా యతీ పాలకవర్గాలు ఆ దిశగా ఆలోచన చేయకపోవడం ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి వచ్చింది. ఈ క్రమంలో నగరీకరణ, మౌలిక సదుపాయాల కల్పన దృష్ట్యా శివారు పంచాయతీలను గ్రేటర్ పరిధిలోకి తేవాలని నిర్ణయించింది. ఈ మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేసినప్పటికీ, న్యాయపరమైన ఇబ్బందులు తలెత్తడంతో వెనక్కి తగ్గింది. అయితే త్వరలోనే ఈ పంచాయతీ పాలకవర్గాల పదవీ కాలం ముగుస్తుండటంతో తెలంగాణ ప్రభుత్వం పాత ప్రతిపాదనలపై దృష్టి సారించింది.

గండిపేట మండలమంతా..

కొత్త పంచాయతీరాజ్ చట్టంపై కసరత్తు చేస్తున్న సర్కారు.. బల్దియాలో పంచాయతీల విలీనం, కొత్త పంచాయతీల ఏర్పాటు అంశాన్ని కూడా పరిశీలిస్తోంది. ఈ క్రమంలోనే జీహెచ్‌ఎంసీకి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామాల జాబితాను కోరింది. ఈ పరిధిలోకి వచ్చే ప్రాంతాలు గ్రేటర్‌లో కలపాలని నిర్ణయించింది. దీంతో గండిపేట మండలంలోని బండ్లగూడ, గండిపేట, హిమాయత్‌సాగర్, హైదర్షాకోట్, కిస్మత్‌పూర్, ఖానాపూర్, కోకాపేట, మంచిరేవుల, మణికొండ జాగీర్, నార్సింగి, నెక్నాంపూర్, పీరంచెరువు, పుప్పాల్‌గూడ, వట్టినాగుపల్లి పంచాయతీలను జీహెచ్‌ఎంసీలో కలపనుంది. ఈ మేరకు బుధవారం పంచాయతీరాజ్ కమిషనర్‌కు రంగారెడ్డి జిల్లా యంత్రాంగం ప్రతిపాదనలు పంపింది. అలాగే, శంషాబాద్ సహా కొత్వాల్‌గూడ, ఊట్‌పల్లి, తొండుపల్లి, చిన్నగొల్లపల్లి, సాతంరాయి గ్రామాలు కూడా గ్రేటర్‌లో కలవనున్నాయి. తాజా ప్రతిపాదనలతో గండిపేట ఇకపై పట్టణ మండలంగా కొనసాగనుంది. ప్రస్తుతం ఉన్న మండల పరిషత్ వ్యవస్థ రద్దయి.. పురపాలనలోకి మారనుంది.

హయత్‌నగర్‌లోని ఏడు గ్రామాలు..

హయత్‌నగర్ (ప్రస్తుతం అబ్దుల్లాపూర్‌మెట్) మండలంలోని తొర్రూరు, బ్రాహ్మణపల్లి, మునగనూరు, కోహెడ, ఇంజాపూర్, తుర్కయాంజాల్, కమ్మగూడ గ్రామాలు జీహెచ్‌ఎంసీలో చేరనున్నాయి. ప్రస్తుతం గ్రేటర్ సరిహద్దు నుంచి 5 కిలోమీటర్ల పరిధిలో ఉన్నందున.. వీటిని విలీనం చేసే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోంది. మరోవైపు ప్రస్తుత నగర పంచాయతీలకు కిలోమీటర్ దూరంలోని గ్రామాలను ఆయా నగర పంచాయతీల్లో కలిపేస్తోంది.

న్యాయపరమైన చిక్కులు లేకుండా..

మరోవైపు షాద్‌నగర్ మున్సిపాల్టీలోకి ఎనిమిది సమీప గ్రామాలు చేరనున్నాయి. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని అన్నారం, బుచ్చిగూడ, చిలకమర్రి, దుస్‌కల్, హాజిపల్లి, కమ్మదనం, లింగారెడ్డిగూడ, నాగులపల్లి గ్రామాలు ఈ పురపాలికలో విలీనం కానున్నాయి. ఈ ఏడాది ఆగస్టు 2తో ప్రస్తుత పంచాయతీ పాలకమండళ్ల పదవీకాలం ముగిస్తున్నందున.. ఆ లోపు వీటిని పంచాయతీరాజ్‌శాఖ నుంచి డీనోటిఫై చేసి.. పురపాలక శాఖలో చేరుస్తూ నోటిఫికేషన్ విడుదల చేసే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోంది. ఈ క్రమంలో గతంలో మాదిరి న్యాయపరమైన చిక్కులు తలెత్తకుండా జాగ్రత్త పడుతోంది. మరోవైపు ఈ పంచాయతీలే కాకుండా.. ఔటర్ రింగ్‌రోడ్డు లోపల ఉన్న గ్రామాలను కూడా పురపాలన పరిధిలోకి తెస్తే ఎలా ఉంటుందనే అంశంపై సర్కారు దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. ఇది కార్యరూపం దాల్చితే.. హైదరాబాద్ మరింత విస్తరించే అవకాశముంది.

కెనరా బ్యాంక్‌లో 450 ప్రొబేషనరీ ఆఫీసర్లు

కెనరా బ్యాంక్.. 450 ప్రొబేషనరీ ఆఫీసర్ పోస్టులను ఏడాది పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా(బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్) కోర్సు ద్వారా భర్తీ చేసేందుకు దరఖాస్తులు కోరుతూ ప్రకటన విడుదల చేసింది. ఈ కోర్సును బెంగళూరులోని మణిపాల్ గ్లోబల్ ఎడ్యుకేషన్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్(ఎంజీఈ) లేదా మణిపాల్‌లోని నిట్టె(ఎన్ఐటీటీఈ) ఎడ్యుకేషనల్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా అందిస్తారు. కనీసం 60శాతం(ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ అభ్యర్థులకు 55శాతం) మార్కులతో ఏదైనా డిగ్రీ/తత్సమాన విద్యలో ఉత్తీర్ణులై, వయసు 20-30 ఏళ్ల లోపు ఉన్న అభ్యర్థులు అర్హులు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. చివరి తేదీ జనవరి 31, 2018. దరఖాస్తు ఫీజు, రిజర్వేషన్లు తదితర పూర్తి వివరాలకు వెబ్‌సైట్: www.canarabank.com

నేటి టాబ్లాయిడ్ విద్య పేజీల్లో...



సోషల్ స్టడీస్

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్,
సాక్షి దినపత్రిక,
రోడ్ నంబర్-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com

అజీజ్ అన్సారీకి గోల్డెన్ గ్లోబ్ పురస్కారం

బులెటిన్ బోర్డ్

ఆర్మీ పబ్లిక్ స్కూల్‌లో 39 ఖాళీలు

సికింద్రాబాద్‌లోని ఆర్మీ పబ్లిక్ స్కూల్.. వివిధ విభాగాల్లోని 39 బోధన ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **పోస్టు-ఖాళీలు:** పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్(పీజీటీ)-7; ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్(టీజీటీ)-16; ప్రైమరీ టీచర్(పీఆర్‌టీ)-12; ఫిజికల్ ట్రెయినింగ్ ఇన్‌స్ట్రక్టర్(పీటీఐ-పీఆర్‌టీ)-2; పీఆర్‌టీ-మ్యూజిక్(వెస్ట్రన్)-1, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్-1.
- **బోధనాంశాల వారీ ఖాళీలు:** పీజీటీలో.. ఫిజిక్స్-1, బయాలజీ-1, పొలిటికల్ సైన్స్-1, జాగ్రఫీ-1, సైకాలజీ-1, ఎకనమిక్స్-1, హిస్టరీ-1; టీజీటీలో.. ఫిజిక్స్-1, కెమిస్ట్రీ-1; సోషల్ సైన్సెస్-3, మ్యాథ్స్-4, హిందీ-2, సంస్కృతం-1; పీఆర్‌టీలో.. ప్రాథమిక స్థాయి సబ్జెక్టులన్నీ.
- **అర్హతలు:** పీజీటీకి-సంబంధిత విభాగంలో పీజీ+బీఈడీ; టీజీటీ, పీఆర్‌టీకి -సంబంధిత విభాగంలో గ్రాడ్యుయేషన్+ బీఈడీ; పీటీఐకి.. గ్రాడ్యుయేషన్(ఫిజికల్ ఎడ్యుకేషన్); పీఆర్‌టీ-మ్యూజికల్, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్‌కు సీబీఎస్ఈ నిబంధనల ప్రకారం సంబంధిత విభాగంలో గ్రాడ్యుయేషన్.
- **నోట్:** పీజీటీ, టీజీటీ, పీఆర్‌టీ పోస్టులకు ఏడబ్ల్యూఈఎస్ సీఎస్‌బీ, సీటెట్/టెట్ ఉత్తీర్ణులైన వారికి ప్రాధాన్యం ఉంటుంది. ❖ **దరఖాస్తు రుసుం:** రూ.100.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్.
- **దరఖాస్తు చేరడానికి చివరి తేదీ:** జనవరి 31, 2018.
- **వెబ్‌సైట్:** www.apsrkpuram.edu.in

సెంట్రల్ పవర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో 18 ఖాళీలు

సెంట్రల్ పవర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(సీపీఆర్ఐ).. 18 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. సీపీఆర్ఐ ప్రధాన కార్యాలయం బెంగళూరులో ఉండగా, హైదరాబాద్, భోపాల్, నాగ్‌పూర్, నోయిడా, కోల్‌కతా, గువాహటి, బినా(మధ్యప్రదేశ్)లో యూనిట్స్ ఉన్నాయి.

- **పోస్టు-ఖాళీలు:** ఇంజనీరింగ్ ఆఫీసర్ గ్రేడ్(1)-9; ఇంజనీరింగ్ అసిస్టెంట్ గ్రేడ్(2)-2; టెక్నీషియన్ గ్రేడ్(1)-2;అసిస్టెంట్ గ్రేడ్(2)-3; అసిస్టెంట్ లైబ్రేరియన్-2. ❖ **అర్హతలు:** సంబంధిత పోస్టులను అనుసరించి బీఈ/బీటెక్(ఎలక్ట్రికల్/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్)+గేట్(2016/17)/ డిప్లొమా(సివిల్ ఇంజనీరింగ్)/ ఐటీఐ(ఎలక్ట్రిక్)/డిగ్రీ(కామర్స్/బిజినెస్ అడ్మినిస్ట్రేషన్/బిజినెస్ మేనేజ్‌మెంట్)+టైపింగ్/ డిగ్రీ+డిప్లొమా(లైబ్రరీ సైన్స్)/ బి.లైబ్రరీ సైన్స్. వీటితోపాటు నిబంధనల మేర ఉద్యోగానుభవం.
- **వయసు:** దరఖాస్తు గడువు ముగిసే నాటికి ఇంజనీరింగ్ అసిస్టెంట్‌కు 35ఏళ్లు; టెక్నీషియన్‌కు 28ఏళ్లు; మిగిలిన పోస్టులకు 30ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్లు వర్తిస్తాయి.
- **ఎంపిక:** ఎంసీక్యూ టెస్ట్/ స్కిల్ టెస్ట్/ట్రేడ్ టెస్ట్/డాక్యుమెంట్ వెరిఫికేషన్/... ❖ **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్.
- **చివరి తేదీ:** జనవరి 29, 2018. ❖ **వెబ్‌సైట్:** www.cpri.in

నేషనల్ మెటలర్జికల్ లేబొరేటరీలో 14 ఖాళీలు

జంషెడ్‌పూర్‌లోని నేషనల్ మెటలర్జికల్ లేబొరేటరీ(ఎన్ఎంఎల్).. 14 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **పోస్టు-ఖాళీలు:** సైంటిస్ట్/సీనియర్ సైంటిస్ట్-12; రెసిడెన్షియల్ మెడికల్ ఆఫీసర్(ఆర్ఎంవో)-1; టెక్నికల్ ఆఫీసర్(టీవో)-1.
- **వేతనం:** సైంటిస్ట్-రూ.85,000; సీనియర్ సైంటిస్ట్-రూ.99,000; ఆర్ఎంవో-రూ.83,000; టీవో-రూ.56,000.
- **అర్హతలు:** సంబంధిత పోస్టులను అనుసరించి ఎంటెక్/ పీహెచ్‌డీ(సైన్స్/ఇంజనీరింగ్)/ఎంబీబీఎస్/బీఈ/బీటెక్. దీంతోపాటు నిబంధనల మేర మార్కుల శాతం ఉండాలి.
- **వయసు:** టీవోకు 30 ఏళ్లు; ఆర్ఎంవోకు 35 ఏళ్లు; సైంటిస్ట్‌కు 32 ఏళ్లు; సీనియర్ సైంటిస్ట్‌కు 37 ఏళ్లు మించకూడదు.
- **దరఖాస్తు రుసుం:** రూ.100; ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ/మహిళ/ డిపార్ట్‌మెంటల్ కేటగిరీలకు ఫీజు లేదు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని, దరఖాస్తు హార్డ్‌కాపీ ప్రింటవుట్‌ను సంబంధిత ధ్రువపత్రాల నకళ్లతో గడువులోగా పంపాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 5, 2018.
- **హార్డ్‌కాపీలు చేరడానికి చివరి తేదీ:** ఫిబ్రవరి 20, 2018.
- **వెబ్‌సైట్:** www.nmlindia.org

ఆర్‌జీఎన్ఐవైడీలో 10 ఖాళీలు

కేంద్ర క్రీడలు, యువజన వ్యవహారాల శాఖకు చెందిన రాజీవ్ గాంధీ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యూత్ డెవలప్‌మెంట్(ఆర్‌జీఎన్ఐవైడీ).. 10 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **పోస్టు:** ట్రైనింగ్ ఆఫీసర్ ❖ **వేతనం:** రూ.40,000.
- **అర్హతలు:** కనీసం 55శాతం మార్కులతో మాస్టర్స్ డిగ్రీ (హ్యూమానిటీస్/సోషల్ సైన్సెస్/మేనేజ్‌మెంట్ సైన్సెస్/లా)తోపాటు యువత సంబంధించిన ట్రైనింగ్ ప్రోగ్రామ్స్‌లో రెండేళ్ల అనుభవం తదితరం ఉండాలి.
- **వయసు:** 40 ఏళ్లకు మించకూడదు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్. ❖ **చివరి తేదీ:** జనవరి 19, 2018. ❖ **వెబ్‌సైట్:** www.rgniyd.gov.in

యూజీసీ పీజీ ఉపకారవేతనాలు

విశ్వవిద్యాలయాల నిధుల సంఘం (యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ : యూజీసీ).. యూనివర్సిటీ స్థాయిలో అండర్ గ్రాడ్యుయేషన్‌లో ర్యాంకు పొంది, పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో చేరిన అభ్యర్థులకు అందించే ఉపకార వేతనాలకు దరఖాస్తులు కోరుతోంది.

- **స్కాలర్‌షిప్:** పోస్ట్ గ్రాడ్యుయేట్ స్కాలర్‌షిప్ ఫర్ యూనివర్సిటీ ర్యాంకు హోల్డర్స్.❖ **స్కాలర్‌షిప్ వ్యవధి:** రెండేళ్లు.
- **ఫెలోషిప్:** నెలకు రూ.3,100(ఏడాదిలో 10 నెలలు మాత్రమే). ❖ **అర్హతలు:** అండర్ గ్రాడ్యుయేషన్ (లైఫ్ సైన్సెస్/ ఫిజికల్ సైన్సెస్/ కెమికల్ సైన్సెస్/ఎర్త్ సైన్సెస్/మ్యాథమెటికల్ సైన్సెస్/సోషల్ సైన్సెస్/కామర్స్/లాంగ్వేజెస్)లో యూనివర్సిటీ స్థాయిలో ప్రథమ, ద్వితీయ ర్యాంకులు సాధించి, పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో ప్రవేశం పొంది ఉండాలి.
- **వయసు:** పీజీలో ప్రవేశం పొందేనాటికి 30 ఏళ్ల లోపు ఉండాలి. ❖ **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్.
- **వెబ్‌సైట్:** www.scholarships.gov.in , www.ugc.ac.in

అంతర్జాతీయం

ఆసియాన్-ఇండియా రౌండ్ టేబుల్ సమావేశం

ఆసియాన్-ఇండియా నెట్‌వర్క్ మేధావుల ఐదవ రౌండ్ టేబుల్ సమావేశాన్ని భారత విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి సుష్మా స్వరాజ్ జనవరి 6న జకర్తాలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 'సమష్టి భద్రత, సమష్టి సంపద' అనే రెండు సూత్రాల ఆధారంగా ఆసియాన్ దేశాల మధ్య ప్రాంతీయ సహకారాన్ని ఆకాంక్షించారు. ఆసియాన్ దేశాలు.. దృఢ, గతిశీల ఆర్థిక బంధాలను కలిగి ఉండాలన్నారు. ఈ దిశగా నౌకాయాన భద్రత, వాణిజ్యం, పెట్టుబడులు, విద్య, సాంస్కృతిక వారసత్వ సంబంధాలను పెంపొందించుకోవాలన్నారు.

ఆసియాన్-ప్రవాసీ భారతీయ దివస్



సింగపూర్‌లో జనవరి 7న జరిగిన ఆసియాన్-ప్రవాసీ భారతీయ దివస్ సదస్సులో విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి సుష్మా స్వరాజ్ పాల్గొన్నారు. సదస్సులో ప్రసంగించిన ఆమె.. ఆసియాన్ కూటమితో భారత్ దృఢ బంధం ఏర్పరచుకోవడంలో ప్రవాస భారతీయులు అద్భుత వేదికగా నిలిచారన్నారు.

పాకిస్థాన్‌కు నిధులు నిలిపేసిన యూఎస్

2016 ఆర్థిక సంవత్సరానికి పాకిస్థాన్‌కు ఇవ్వదలచిన రూ.17,000 కోట్ల(255 మిలియన్ డాలర్లు) సహాయాన్ని నిలిపేస్తున్నట్లు అమెరికా జనవరి 1న ప్రకటించింది. దీంతోపాటు 900 మిలియన్ డాలర్ల భద్రతా సహాయాన్ని కూడా ఆపేస్తున్నట్లు జనవరి 4న వెల్లడించింది. ఉగ్రవాద వ్యతిరేక పోరు కోసమంటూ నిధులు పొందుతూ.. చివరికి తమనే వంచిస్తోందంటూ పాకిస్థాన్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేసిన వెంటనే శ్వేతసౌధం ఈ మేరకు స్పష్టత ఇచ్చింది. గత 15 ఏళ్లుగా అమెరికా నుంచి నిధులు పొందుతున్న పాకిస్థాన్.. అసత్యాలు చెబుతూ ఉగ్రవాదులకు ఆశ్రయమిస్తోందని ట్రంప్ ధ్వజమెత్తిన సంగతి తెలిసిందే.

జాతీయం

జౌళి సంచుల్లో ఆహార ధాన్యాలు, పంచదార



ఈ ఏడాది జూన్ వరకు ఆహార ధాన్యాలు, పంచదారను తప్పనిసరిగా జౌళి సంచుల్లోనే ప్యాక్ చేయాలని ఆర్థిక వ్యవహారాల మంత్రివర్గ కమిటీ(సీసీఈఏ) జనవరి 3న నిర్ణయించింది. ఆహార ధాన్యాల్లో 90 శాతం, పంచదార ఉత్పత్తుల్లో 20 శాతాన్ని జౌళి సంచుల్లో ప్యాక్ చేస్తే 40 లక్షల మంది రైతులు; 3.7 లక్షల మంది కార్మికులకు మేలు జరుగుతుందని కేంద్ర జౌళి శాఖ మంత్రి స్మృతి ఇరానీ పేర్కొన్నారు. ప్యాకింగ్‌కు పర్యావరణ అనుకూల జౌళిని వినియోగించేలా దేశీయ, అంతర్జాతీయ విపణుల్లో ప్రచారం నిర్వహిస్తామని తెలిపారు. తాజా నిర్ణయం వల్ల ఆంధ్రప్రదేశ్, పశ్చిమ బెంగాల్, బిహార్, అసోం, మేఘాలయ, త్రిపురల్లోని రైతులు, కార్మికులకు మేలు జరుగుతుంది.

జడ్జీల వేతనాల బిల్లుకు లోక్‌సభ ఆమోదం

సుప్రీంకోర్టు, హైకోర్టుల న్యాయమూర్తుల వేతనాల పెంపు బిల్లును లోక్‌సభ జనవరి 4న ఆమోదించింది. ఈ బిల్లు చట్ట రూపం దాలిస్తే భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) నెల వేతనం రూ.లక్ష నుంచి రూ.2.80 లక్షలకు; సుప్రీంకోర్టు న్యాయమూర్తుల వేతనం రూ.90,000 నుంచి రూ.2.50 లక్షలకు పెరుగుతుంది. అదేవిధంగా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తుల వేతనం రూ.90,000 నుంచి రూ.2.50 లక్షలకు; హైకోర్టు న్యాయమూర్తుల వేతనం రూ.80,000 నుంచి రూ.2.25 లక్షలకు చేరనుంది. ఏడో వేతన సంఘం సిఫార్సుల మేరకు చేసిన ఈ మార్పులు 2016, జనవరి 1 నుంచి వర్తిస్తాయి.

హిమాచల్‌ప్రదేశ్‌కు ఎయిమ్స్

హిమాచల్‌ప్రదేశ్‌కు ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్)ను మంజూరు చేస్తూ కేంద్ర మంత్రివర్గం జనవరి 3న నిర్ణయం తీసుకుంది. దీన్ని ఆ రాష్ట్రంలోని బిలాస్‌పూర్ వద్ద రూ.1,350 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేయనున్నారు. దీని నిర్మాణాన్ని 48 నెలల్లో పూర్తిచేస్తారు.

డీజీపీ, ఐజీపీల వార్షిక సమావేశం

మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్(సమీపం) బీఎస్ఎఫ్ అకాడమీలో జనవరి 7న జరిగిన డీజీపీ,ఐజీల వార్షిక సదస్సులో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొన్నారు. ఈ సదస్సుకు 250 మంది పోలీసు అధికారులు హాజరయ్యారు. సమావేశం జనవరి 6 నుంచి 8 వరకు జరిగింది.

18వ అఖిల భారత విప్‌ల సదస్సు

18వ అఖిల భారత విప్‌ల సదస్సును కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి అనంత్‌కుమార్ జనవరి 8న ఉదయ్‌పూర్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విప్‌లు పార్టీ సభ్యులను పర్యవేక్షించడంతోపాటు చైతన్యవంతులను చేయాలని సూచించారు. చట్టసభల్లో సభ్యుల ప్రవర్తన, క్రమశిక్షణలను పరిశీలించాల్సింది విప్‌లేనన్నారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయడానికే ఇలాంటి సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనికి దాదాపు అన్ని రాష్ట్రాల విప్‌లు హాజరయ్యారు.

సైన్స్ అండ్ టెక్నాలజీ

క్రూయిజ్ క్షిపణి హర్బాను పరీక్షించిన పాక్


స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన క్రూయిజ్ క్షిపణి హర్బాను విజయవంతంగా పరీక్షించినట్లు పాకిస్థాన్ నౌకాదళం జనవరి 3న ప్రకటించింది. ఇది ఉపరితలం నుంచి ఉపరితల, భూభాగ లక్ష్యాలను ఛేదించగలదు.

రాఫెల్‌తో రక్షణ ఒప్పందం రద్దు



ట్యాంకుల నిరోధక క్షిపణులను అభివృద్ధి చేసేందుకు ఇజ్రాయెల్‌కు చెందిన రాఫెల్ అడ్వాన్స్‌డ్ డిఫెన్స్ సిస్టమ్స్ లిమిటెడ్‌తో కుదుర్చుకున్న రూ.3,175 కోట్ల (సుమారు) విలువైన రక్షణ ఒప్పందాన్ని భారత్ రద్దు చేసుకుంది. ఈ మేరకు రాఫెల్ జనవరి 3న వెల్లడించింది.

వార్తల్లో వ్యక్తులు



అజీజ్ అన్సారీ: లాస్ ఏంజెల్స్‌లో జనవరి 7న గోల్డెన్ గ్లోబ్ పురస్కారాలను ప్రదానం చేశారు. ఇందులో భారత సంతతికి చెందిన అజీజ్ అన్సారీకి ప్రతిష్టాత్మక గోల్డెన్ గ్లోబ్ పురస్కారం దక్కింది. దీంతో ఈ అవార్డు అందుకున్న తొలి ఆసియా సంతతి వ్యక్తిగా ఆయన గుర్తింపు పొందారు. 'మాస్టర్ ఆఫ్ నన్' టీవీ సిరీస్‌లో అన్సారీ నటనకు ఈ అవార్డు దక్కింది. టాక్ షో వ్యాఖ్యాతగా, నటిగా గుర్తింపు పొందిన ఆఫ్రికా సంతతి అమెరికా మహిళ.. ఓప్రా విన్‌ఫ్రేకు అత్యంత ప్రతిష్టాత్మక సిసిల్ బీ డీమిల్లే అవార్డు లభించింది.

రాధా విశ్వనాథన్: కర్ణాటక సంగీత విద్వాంసురాలు రాధా విశ్వనాథన్(83) జనవరి 2న బెంగళూరులో మరణించారు.

జాన్ యంగ్: అమెరికా వ్యోమగామి జాన్ యంగ్ (87) జనవరి 5న మరణించినట్లు అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ నాసా వెల్లడించింది. యంగ్ ఆరుసార్లు అంతరిక్షంలోకి వెళ్లారు. చంద్రుడిపై కాలుమోపారు. జెమిని-3; జెమిని-10; అపోలో-10; అపోలో-16 ప్రాజెక్టుల్లో పాలుపంచుకున్నారు. వ్యోమనౌకకు కమాండర్‌గా వ్యవహరించిన తొలి వ్యక్తిగా రికార్డులకెక్కారు.

జొనాథన్: అమెరికాకు చెందిన జొనాథన్ పేస్ అనే ఎలక్ట్రికల్ ఇంజనీర్ ప్రపంచంలోనే అతిపెద్ద ప్రధానసంఖ్య (ఇప్పటి వరకు తెలిసిన)ను కనుగొన్నారు. ఆయన డిసెంబర్ 26న ఈ ఘనత సాధించారు. 2ను 7,72,32,917 సార్లు గుణించగా వచ్చిన సంఖ్య నుంచి ఒకటి తీసివేశారు. అలా వచ్చిన సంఖ్యలో 2,32,49,425 అంకెలు ఉన్నాయి. ఇప్పటి వరకు తెలిసిన ప్రధాన సంఖ్య కంటే 'M77232917'గా పిలుస్తున్న ఈ కొత్త ప్రధాన సంఖ్యలో దాదాపు 10 లక్షల అంకెలు ఎక్కువ ఉన్నాయి.

కాంపిటీటివ్ గైడెన్స్

కరెంట్ అఫైర్స్

ఆర్థికం

వృద్ధిరేటు 6.5 శాతంగా అంచనా

భారత స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధిరేటు 2017-18లో 6.5 శాతంగా ఉండనుందని కేంద్ర గణాంకాల కార్యాలయం (సీఎస్‌వో) జనవరి 5న విడుదల చేసిన ముందస్తు అంచనాల్లో వెల్లడించింది. వస్తు, సేవల పన్ను(జీఎస్‌టీ) పేలవ వసూళ్లు, వ్యవసాయ ఉత్పత్తి తగ్గడమే దీనికి కారణంగా పేర్కొంది. తాజా గణాంకాల ప్రకారం- తలసరి ఆదాయ వృద్ధి 9.7 శాతం నుంచి 8.3 శాతానికి మందగించే అవకాశముంది.

ఏపీ రుణభారం రూ.2 లక్షల కోట్లు

2018 బడ్జెట్ నాటికి ఆంధ్రప్రదేశ్ రుణభారం రూ.2.16 లక్షల కోట్లకు చేరుతుందని జనవరి 5న కేంద్ర ఆర్థిక శాఖ సహాయమంత్రి పి.రాధాకృష్ణన్ లోక్‌సభకు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఖాతాలు, బడ్జెట్ ప్రకారం 2016 మార్చి నాటికి ఏపీ రుణం రూ.1,73,854 కోట్లకు; 2017 మార్చి బడ్జెట్ నాటికి రూ.1,92,984 కోట్లకు చేరిందన్నారు. ఇది 2018 బడ్జెట్ నాటికి రూ.2,16,027 కోట్లకు చేరుతుందని అంచనా వేసినట్లు తెలిపారు.

క్రీడలు

హాప్‌మన్ కప్ టైటిల్ స్విస్ కైవసం



స్విట్జర్లాండ్ హాప్‌మన్ కప్ టైటిల్ కైవసం చేసుకుంది. పెర్త్‌లో జనవరి 6న ముగిసిన పోటీల్లో జర్మనీపై స్విట్జర్లాండ్ గెలుపొందింది. 30 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ టోర్నీలో స్విట్జర్లాండ్ విజేతగా నిలవడం ఇది మూడోసారి. గతంలో 1992, 2001లలో స్విట్జర్లాండ్ చాంపియన్‌గా నిలిచింది.

టాటా ఓపెన్ విజేతగా సిమోన్

ఫ్రాన్స్ టెన్నిస్ ప్లేయర్ గిల్స్ సిమోన్ భారత్‌లో జరిగే ఏకైక ఏటీపీ టోర్నీ.. టాటా ఓపెన్ పురుషుల సింగిల్స్ టైటిల్ గెలుచుకున్నాడు. పుణేలో జనవరి 6న జరిగిన ఫైనల్లో సిమోన్ 7-6 తేడాతో కెవిన్ అండర్సన్ (దక్షిణాఫ్రికా)ను ఓడించాడు. డబుల్స్ టైటిల్ ను రాబిన్ హాసే-మిడెల్‌కూప్(నెదర్లాండ్స్) జోడీ గెలుచుకుంది.



ఆకేపాటి శ్రీనివాసులు రెడ్డి
కరెంట్ అఫైర్స్ నిపుణులు
ఆర్‌సీ రెడ్డి స్టడీ సర్కిల్, హైదరాబాద్

హయ్యర్ ఎడ్యుకేషన్



ప్రతిఏటా డిసెంబర్ ఒకటో తేదీ నుంచి తదుపరి సంవత్సరం మార్చి చివరి వరకు.. ఐఐటీల్లో క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ జరుగుతాయి. 2017-18లో కోర్సు పూర్తిచేసుకునే బ్యాచ్‌కు సంబంధించి అన్ని ఐఐటీల్లో తొలిదశ క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ ఇటీవలే ముగిశాయి. 80 శాతం మేర విద్యార్థులకు ఆఫర్స్ లభించాయి. ఓ వైపు గతంతో పోల్చితే నియామకాల్లో 5 శాతం మేర తగ్గుదల నమోదైందనే వార్తలు.. మరోవైపు తొలి దశలోనే 80 శాతంపైగా విద్యార్థులకు ఆఫర్లు లభించాయంటున్న ఐఐటీ క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ వర్గాలు!! ఈ నేపథ్యంలో.. ఐఐటీల్లో ఈ ఏడాది తొలి దశ క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ ట్రెండ్స్‌పై విశ్లేషణ..

ట్రెండ్స్ ఆశాజనకం...!

ఐఐటీ ప్లేస్‌మెంట్స్

ప్రముఖ ఐఐటీలుగా పేర్కొనే తొలితరం ఐఐటీల్లో ఈ ఏడాది క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ ఎప్పటి మాదిరిగానే తొలిదశలోనే బీటెక్, ఎంటెక్ విద్యార్థులకు ఆఫర్‌ల హవా కొనసాగింది.

- ఐఐటీ-ముంబైలో మొత్తం 1650మంది విద్యార్థులు తొలిదశ ప్లేస్‌మెంట్స్ డ్రైవ్స్‌లో పాల్గొనగా.. 1011 మందికి ఆఫర్లు లభించాయి. బీటెక్ విద్యార్థులు 75 శాతం మంది; ఎంటెక్ విద్యార్థులు 70 శాతం మందికి జాబ్స్ సొంతమయ్యాయి.
- ఐఐటీ-ఢిల్లీలో బీటెక్, ఎంటెక్ కలిపి దాదాపు రెండు వేల మంది విద్యార్థులకుగాను.. 80 శాతం మంది కొలువులు సొంతం చేసుకున్నారు.
- ఐఐటీ-కాన్పూర్‌లోనూ ఇదే తీరు కనిపించింది. దాదాపు 1700 మంది విద్యార్థులకుగాను 1200 మందికి కొలువులు ఖరారయ్యాయి.
- ఐఐటీ-హైదరాబాద్‌లో 424 మంది విద్యార్థులు క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో పాల్గొంటే.. 90 శాతం మందికి ఉద్యోగాలు సొంతమయ్యాయి.
- ఐఐటీ ఖరగ్‌పూర్ క్యాంపస్‌లో తొలిదశలోనే మొత్తం 1200 మంది విద్యార్థులకు ఆఫర్స్ లభించాయి. బీటెక్ విద్యార్థుల్లో 75 శాతం మందికి, ఎంటెక్ విద్యార్థుల్లో 38 శాతం మందికి జాబ్స్ ఖరారయ్యాయి. గతేడాదితో పోల్చితే ఈ సంఖ్య కాస్త ఎక్కువే. బీటెక్ విద్యార్థులకు 12 శాతం, ఎంటెక్ అభ్యర్థుల పరంగా 14శాతం పురోగతి నమోదైంది.
- ఐఐటీ-చెన్నైలోనూ ఇదే తీరు కనిపించింది. మొత్తం 1100 మంది అభ్యర్థులు క్యాంపస్ డ్రైవ్స్‌లో పాల్గొనగా.. 763 మందికి ఆఫర్లు ఖరారయ్యాయి. ఇప్పటికే లభించిన ప్రీప్లేస్‌మెంట్ ఆఫర్స్(114)ను కూడా కలిపితే మొత్తం 877మంది విద్యార్థులకు కార్పొరేట్ కొలువులు సొంతమయ్యాయి.
- మరో ప్రముఖ ఐఐటీ.. రూర్కీ క్యాంపస్‌లోనూ 824 మంది బీటెక్ విద్యార్థులు, 502 మంది ఎంటెక్, ఎంఎస్,ఎంటెక్-పీహెచ్‌డీ డ్యూయల్ డిగ్రీ అభ్యర్థులు కలిపి మొత్తం 1326 విద్యార్థులు క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌కు నమోదు చేసుకోగా.. బీటెక్ విద్యార్థులు 630 మంది; ఎంటెక్, ఇతర పోస్ట్ గ్రాడ్యుయేట్ టెక్నికల్ కోర్సుల అభ్యర్థులు 212 మంది తొలిదశలోనే ఆఫర్లు ఖరారు చేసుకున్నారు.



కొత్త ఐఐటీల హవా

కొత్తగా ఏర్పాటైన ఐఐటీల్లో సైతం క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో గణనీయమైన పెరుగుదల నమోదైంది. ఐఐటీ-గాంధీనగర్ క్యాంపస్‌లో 88 శాతం మంది విద్యార్థులు కొలువులు సొంతం చేసుకున్నారు. దీంతోపాటు ఐఐటీ-మండి, పాట్నా క్యాంపస్‌లలో 74 శాతం మేర కొలువులు ఖరారయ్యాయి.

పెరిగిన పీజీ ఆఫర్లు

ఈ ఏడాది క్యాంపస్ రిక్రూట్‌మెంట్స్‌లో మరో విశేషం.. పీజీ విద్యార్థులకు ఆఫర్ల సంఖ్య పెరగడం. గతేడాదితో పోల్చితే ఆయా క్యాంపస్‌లలో 15శాతం నుంచి 25శాతం మేరకు పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులకు ఆఫర్లు పెరిగాయి. ముఖ్యంగా ఐఐటీ-కాన్పూర్, ఖరగ్‌పూర్, ఢిల్లీ, చెన్నై వంటి క్యాంపస్‌లలో 20 శాతంపైగా జాబ్స్ లభించడం విశేషం. వీరిలో ఎక్కువ శాతం మందికి ఆర్‌అండ్‌డీ విభాగాల్లో కొలువులు ఖరారయ్యాయి.



ఇంటర్నేషనల్ ఆఫర్స్

ఈ ఏడాది ఐఐటీ క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో మరో విశేషం.. ఇంటర్నేషనల్ ఆఫర్స్ సంఖ్య పెరగడం. అన్ని ఐఐటీల్లో కలిపి మొత్తం విద్యార్థుల్లో పది నుంచి 15శాతం మేర విద్యార్థులకు ఇంటర్నేషనల్ ఆఫర్స్ లభించాయి. ఐఐటీ-ముంబైలో.. 47మందికి ఇంటర్నేషనల్ అవకాశాలు అందాయి. ఐఐటీ ఖరగ్‌పూర్, కాన్పూర్, ఢిల్లీలలోనూ దాదాపు 40 మంది చొప్పున ఇంటర్నేషనల్ ఆఫర్స్ సొంతం చేసుకున్నారు.

కోర్ సెక్టార్ హవా

క్యాంపస్ రిక్రూట్‌మెంట్స్‌లో గతేడాదితో పోల్చితే ఈ సంవత్సరం కోర్‌సెక్టార్ హవా కొనసాగింది. అన్ని ఐఐటీల్లో కలిపి 15శాతం మేర కోర్‌సెక్టార్ ఆఫర్లు పెరిగాయి. తయారీ ఆర్‌అండ్‌డీ విభాగాలకు చెందిన కంపెనీలు ముందు వరుసలో నిలిచాయి. శాంసంగ్, ఐటీసీ, మైక్రోసాఫ్ట్, ఇంటెల్ వంటి ప్రముఖ కార్పొరేట్ కంపెనీలే కాకుండా.. ఇస్రో, ఓఎన్‌జీసీ వంటి ప్రభుత్వ రంగ సంస్థలు కూడా ఈ జాబితాలో నిలవడం గమనార్హం. కోర్ సెక్టార్, ఐటీ తర్వాత కన్సల్టింగ్ రంగం ముందంజలో నిలిచింది. ఈ రంగంలో గోల్డ్‌మన్‌శాచ్, ఈఅండ్‌వై, డెలాయిట్ వంటి ప్రముఖ కన్సల్టింగ్ సంస్థలు ఉన్నాయి.

ఐటీ ఆశాజనకం

ఐటీ రంగం గురించి ప్రతికూల వార్తలు వస్తున్నా.. ఈ ఏడాది కూడా ఐఐటీ క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో ఐటీ కంపెనీల హవా కొనసాగింది. మొత్తం అన్ని ఐఐటీల్లోని ఆఫర్లలో దాదాపు 25 శాతం మేర ఐటీ రంగం నుంచే కావడం విశేషం. ఐఐటీ-ముంబైలో శాంసంగ్ కంపెనీ ఐటీ విభాగంలో 30 ఆఫర్లు అందించింది. ఇంటెల్ సంస్థ ఐఐటీ-ఢిల్లీ నుంచి 32మందికి; ఐఐటీ-కాన్పూర్ నుంచి 59మందికి ఐటీ విభాగంలో ఉద్యోగాలు ఇచ్చింది. వాస్తవానికి ఐటీలో ఇప్పుడు ఆటోమేషన్ ప్రభావం పెరుగుతోంది. శిక్షణనివ్వడం ద్వారా కొత్త టెక్నాలజీపై అవగాహన కల్పించొచ్చనే ఉద్దేశంతో ఐటీ సంస్థలు ఆఫర్లు ఇచ్చినట్లు నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

వేతనాలిలా

ఐఐటీల్లో క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ వేతనాల సరళిని పరిశీలిస్తే.. బీటెక్ విద్యార్థులకు డొమెస్టిక్ ఆఫర్ల విషయంలో సగటు వేతనం 30 లక్షలుగా నమోదైంది. కనిష్టంగా 18 లక్షలు, గరిష్టంగా 35 లక్షల వేతనాలు లభించాయి. పీజీ విద్యార్థులకు వేతనాల పరంగా సగటున రూ.40లక్షల వేతనం ఖరారైంది. కనిష్ట వేతనం రూ.18లక్షలుగా; గరిష్ట వేతనం రూ.45లక్షలుగా నమోదైంది. ముఖ్యంగా పీజీ స్థాయిలో వీఎల్ఎస్ఐ, ఎలక్ట్రానిక్స్, సర్క్యూట్ స్పెషలైజేషన్ అభ్యర్థులకు ఆఫర్లు ఇచ్చేందుకు కంపెనీలు ఆసక్తి చూపాయి. ఇంటర్నేషనల్ ఆఫర్స్ పరంగా కనిష్టంగా రూ.45లక్షలు; గరిష్టంగా రూ.1.20కోట్లు వార్షిక వేతనాలతో విద్యార్థులకు కొలువులు ఖరారయ్యాయి.

5 శాతం తగ్గుదల?

ఐఐటీ క్యాంపస్ రిక్రూట్‌మెంట్స్ కోణంలో 5 శాతం తగ్గుదల అని ఇటీవల హెచ్‌ఆర్‌డీ శాఖ స్వయంగా ప్రకటించింది. మొత్తం 16 ఐఐటీలను పరిగణనలోకి తీసుకుంటే.. ఇప్పుడు తొలి దశ మాత్రమే ముగిసిందని.. మలిదశ నాటికి అందరికీ అవకాశాలు లభిస్తాయని ఐఐటీ ప్లేస్‌మెంట్ సెల్ అధికారులు పేర్కొంటున్నారు. కాబట్టి విద్యార్థులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇస్తున్నారు.

అనలిటికల్ ఎబిలిటీస్‌కే ప్రాధాన్యం..

"క్యాంపస్ డ్రైవ్స్ నిర్వహించిన కంపెనీలు.. అభ్యర్థుల్లోని అనలిటికల్ ఎబిలిటీస్‌కు అత్యంత ప్రాధాన్యమిచ్చాయి. ప్రాబ్లమ్ సాల్వింగ్ అప్రోచ్ , లాజికల్ థింకింగ్, అల్గారిథమ్స్, కోడింగ్ నైపుణ్యాలు కూడా ఎంపిక క్రమంలో ప్రధానంగా మారాయి. ఇలాంటి నైపుణ్యాలున్న అభ్యర్థులకు వారి బ్రాంచ్‌తో సంబంధం లేకుండా ఆఫర్లు ఇచ్చేందుకు సంస్థలు ముందుకొచ్చాయి. కాబట్టి విద్యార్థులు సంబంధిత స్కిల్స్ పెంచుకునేందుకు కృషి చేయాలి.

– ప్రొఫెసర్. జి.పి.రాజశేఖర్, సీడీసీ వైస్ ఛైర్మన్, ఐఐటీ-ఖరగ్‌పూర్

సాక్షి బిజినెస్
గురువారం 11-1-2018
WWW.SAKSHIBUSINESS.COM

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్	నిఫ్టీ
10 ▼	5 ▼
34,433	10,632

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30కి)

నాస్‌డాక్	7,138	▽	26
డోజోన్స్	25,365	▽	20
ఎఫ్‌టీఎస్ఈ 100	7,749	△	17
డాక్స్	13,281	▽	104
షాంఘై	3,422	△	8
నికాయ్	23,788	▽	62

● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			● కొనుగోలు	● అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	64.42	64.55
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	87.61	87.79
€	యూరో	ఎస్‌బీఐ	77.30	77.46
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	57.62	57.74
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	50.73	50.83
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	48.44	48.53
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	15.40	18.26
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	15.77	18.43
¥	చైనా యువాన్	థామస్‌కుక్	6.91	11.21

ఎఫ్‌డీఐ.. రయ్ రయ్!



సింగిల్ బ్రాండ్ రిటైల్‌లో 100% 'ఆటోమేటిక్' పెట్టుబడులకు ఓకే

- పవర్ ఎక్ఛేంజీల ఐపీఓల్లో ఎఫ్‌పీఐల పెట్టుబడులకూ అనుమతి
- ఎయిరిండియాలో 49 శాతం వాటా విక్రయానికి ఆమోదం...
- సంస్కరణలపై కేంద్ర క్యాబినెట్ కీలక నిర్ణయాలు...

న్యూఢిల్లీ: విదేశీ పెట్టుబడులను మరింతగా ఆకర్షించే దిశగా బడ్జెట్‌కి ముందుగానే కేంద్రం మరిన్ని సంస్కరణలకు తెరతీసింది. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ) విధానంలో కీలక సవరణలు చేసింది. సింగిల్ బ్రాండ్ రిటైల్, నిర్మాణ రంగం, విద్యుత్ ఎక్చేంజీల్లో ఎఫ్‌డీఐ నిబంధనలను సడలించింది. అలాగే రుణ సంక్షోభంలో కూరుకున్న ప్రభుత్వ రంగ విమానయాన దిగ్గజం ఎయిరిండియాలో 49 శాతం దాకా విదేశీ ఎయిర్‌లైన్స్ ఇన్వెస్ట్ చేసేందుకు అనుమతించింది. అటు వైద్య పరికరాల తయారీ సంస్థలు, విదేశీ నిధులు అందుకునే కంపెనీలకు సేవలందించే ఆడిట్ సంస్థల్లో ఎఫ్‌డీఐ నిబంధనలను కూడా సరళతరం చేసింది. ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలో బుధవారం సమావేశమైన కేంద్ర క్యాబినెట్ ఈ మేరకు నిర్ణయాలు తీసుకుంది. దీంతో సింగిల్ బ్రాండ్ రిటైల్ రంగంలో ఆటోమేటిక్ విధానంలో 100 శాతం ఎఫ్‌డీఐలకు మార్గం సుగమం అయ్యింది. ఇప్పటిదాకా సింగిల్ బ్రాండ్ రిటైల్‌లో 49 శాతం దాకా ఆటోమేటిక్ పద్ధతిలో అనుమతులు ఉండగా, అంతకు మించితే ప్రభుత్వ అనుమతి తీసుకోవాల్సి ఉంటోంది. ఈ నెల దావోస్‌లో జరిగే వరల్డ్ ఎకనమిక్ ఫోరంలో మోదీ పాల్గొనున్న నేపథ్యంలో ఎఫ్‌డీఐలపై తాజా నిర్ణయాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

సోర్సింగ్ నిబంధనలూ సరళతరం..

ఇక ఐకియా, హెచ్అండ్ఎం వంటి దిగ్గజాలు కోరుతున్నట్లుగా.. విదేశీ రిటైల్ సంస్థలు స్థానికంగా 30 శాతం దాకా తప్పనిసరిగా కొనుగోళ్లు చేయాలన్న నిబంధనలో కూడా కేంద్రం కొంత వెసులుబాటు కల్పించింది. విదేశీ మార్కెట్ల కోసం భారత్ నుంచి కొనుగోలు చేసే వాటిని కూడా ఈ 30 శాతం సోర్సింగ్ నిబంధనలో చూపించుకునే వీలు ఉంటుందని పేర్కొంది. తొలి స్టోర్ తెరిచిన ఏడాదిలో ఏప్రిల్ 1 నుంచి అయిదేళ్ల పాటు ఇది వర్తిస్తుందని పారిశ్రామిక విధానం, ప్రోత్సాహక విభాగం డీఐపీపీ కార్యదర్శి రమేష్ అభిషేక్ తెలిపారు. 'దేశీయంగా వ్యాపారాల నిర్వహణను సులభతరం చేసే దిశగా.. విధానాన్ని సరళతరం చేసే లక్ష్యంతో ఎఫ్‌డీఐ పాలసీ సవరించడం జరిగింది. ఇది మరిన్ని ఎఫ్‌డీఐల రాకకు, తద్వారా పెట్టుబడులు, ఆదాయం, ఉపాధి కల్పన వృద్ధికి దోహదపడగలదు' అని ఒక ప్రకటనలో పేర్కొంది. విదేశీ పెట్టుబడుల రాకకు ఆటంకాలను తొలగించేందుకు ఈ నిర్ణయాలు ఉపయోగపడగలవని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి సురేశ్ ప్రభు అభిప్రాయపడ్డారు. ఎకానమీ వేగవంతంగా అభివృద్ధి చెందేందుకు నిబంధనల సరళీకరణ తోడ్పడగలదని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎన్‌డీఏ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎఫ్‌డీఐ విధానాన్ని ఇంత భారీ స్థాయిలో మార్చడం ఇది రెండోసారి. గతంలో 2016 జూన్‌లోనూ ఇదే విధంగా మార్పులు చేశారు. అప్పటి నిర్ణయాలతో 2016లో మొత్తం 60.08 బిలియన్ డాలర్ల మేర ఎఫ్‌డీఐలు వచ్చాయని, ఇది ఆల్‌టైమ్ గరిష్టమని కేంద్రం వెల్లడించింది.

రియల్టీ బ్రోకింగ్ సేవలపై స్పష్టత

నిర్మాణ రంగానికి సంబంధించి రియల్ ఎస్టేట్ బ్రోకింగ్ సేవలను.. రియల్ ఎస్టేట్ వ్యాపారంగా పరిగణించడం జరగదని ప్రభుత్వం స్పష్టతనిచ్చింది. ఈ నేపథ్యంలో ఆటోమేటిక్ పద్ధతిలో 100 శాతం ఎఫ్‌డీఐలు పొందేందుకు బ్రోకింగ్ సేవల సంస్థలకు అర్హత ఉంటుందని పేర్కొంది. మరోవైపు, విద్యుత్ ట్రేడింగ్ జరిగే పవర్ ఎక్చేంజీల్లో ఎఫ్‌డీఐలను సైతం సడలించింది. ప్రస్తుత పాలసీ ప్రకారం పవర్ ఎక్చేంజీల్లో ఆటోమేటిక్ పద్ధతిలో 49 శాతం దాకా మాత్రమే ఎఫ్‌డీఐలకు అనుమతి ఉంది. విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు, విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల కొనుగోళ్లు సెకండరీ మార్కెట్‌కి మాత్రమే పరిమితంగా ఉంటున్నాయి. 'ఈ నిబంధనను తొలగించాలని, ఎఫ్ఐఐలు/ఎఫ్‌పీఐలు కూడా ప్రైమరీ మార్కెట్ ద్వారా పవర్ ఎక్చేంజీల్లో ఇన్వెస్ట్ చేసేందుకు అనుమతించాలని నిర్ణయించడం జరిగింది' అని కేంద్రం పేర్కొంది. ప్రక్రియపరమైన మార్పుల్లో భాగంగా ఆటోమేటిక్ రూట్ రంగాల్లో పాకిస్తాన్, బంగ్లాదేశ్ వంటి దేశాల నుంచి వచ్చే పెట్టుబడి దరఖాస్తులను పారిశ్రామిక విధానం, ప్రోత్సాహక విభాగం (డీఐపీపీ) పరిశీలించి కేంద్రం ఆమోదానికి పంపుతుంది.

భారత్ ర్యాంకింగ్ మరింత మెరుగుపడుతుంది..

ఎఫ్‌డీఐ నిబంధనల సరళీకరణతో దుస్తుల నుంచి ఎలక్ట్రానిక్స్ దాకా అనేక అంతర్జాతీయ బ్రాండ్స్ దేశీ వినియోగదారులకు అందుబాటులోకి రాగలవని కన్సల్టెన్సీ సంస్థ డెలాయిట్ ఇండియా పార్ట్‌నర్ రజత్ వాహి తెలిపారు. అలాగే, సులభతరంగా వ్యాపారాల నిర్వహణకు అనువైన దేశాల జాబితాలో భారత ర్యాంకింగ్ మరింత మెరుగుపడటానికి కూడా ఇది ఉపయోగపడగలదన్నారు. 'దీర్ఘకాలంలో చూస్తే ఈ సంస్కరణలు ఉపాధికి ఊతమివ్వగలవు. అలాగే కొనుగోలుదారులకు మరిన్ని బ్రాండ్స్ అందుబాటులోకి రావడంతో పాటు ఎకానమీ వృద్ధికి కూడా ఇవి దోహదపడగలవు' అని రిటైలర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సీఈవో కుమార్ రాజగోపాలన్ పేర్కొన్నారు. 'దేశీ సంస్థలు.. విదేశీ ఇన్వెస్టర్ల నుంచి మరిన్ని నిధులు సమీకరించడానికి ఈ సంస్కరణలతో కొత్తగా దారి లభించింది. దేశ, విదేశాల్లో విస్తరణ వ్యూహాలను మరింత మెరుగ్గా అమలు చేసుకునేందుకు ఇవి ఉపయోగపడతాయి' అని వైల్డ్‌క్రాఫ్ట్ సంస్థ సహ-వ్యవస్థాపకుడు సిద్ధార్థ్ సూద్ పేర్కొన్నారు. అయితే, అఖిల భారత ట్రేడర్ల సమాఖ్య సీఏఐటీ మాత్రం సింగిల్ బ్రాండ్ రిటైల్‌లోకి ఆటోమేటిక్ పద్ధతిలో 100 శాతం ఎఫ్‌డీఐలను అనుమతించడాన్ని వ్యతిరేకించింది. దీంతో బహుళజాతి దిగ్గజాలు రిటైల్ రంగంలోకి సులువుగా ప్రవేశించడానికి వీలు దొరుకుతుందని పేర్కొంది. ఇది, చిన్న వ్యాపారాలను తీవ్రంగా దెబ్బతీస్తుందని ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేసింది. సింగిల్ బ్రాండ్ రిటైల్ నిబంధనల సడలింపు.. టెక్ దిగ్గజం యాపిల్‌తో పాటు షావోమీ, ఒప్పో వంటి చైనా హ్యాండ్‌సెట్స్ తయారీ సంస్థలకు భారత్‌లోనూ స్టోర్స్ పెట్టేందుకు లాభించగలదని కౌంటర్‌పాయింట్ రీసెర్చ్ అసోసియేట్ డైరెక్టర్ తరుణ్ పాఠక్ చెప్పారు. అయితే, ప్రీమియం ఉత్పత్తులను విక్రయించే యాపిల్..ఇక్కడ స్టోర్ పెడితే ఏ ధరకు వాటిని అందిస్తుందన్నది కీలకం కాగలదని ఆయన పేర్కొన్నారు.

మరోవైపు, ప్రాపర్టీ బ్రోకరేజి సర్వీసుల సంస్థల్లోకి 100 శాతం ఎఫ్‌డీఐలు.. దేశీ రియల్ ఎస్టేట్ మార్కెట్‌ను సంఘటితం చేసేందుకు తోడ్పడుతుందని అనరాక్ ప్రాపర్టీ కన్సల్టెంట్స్ చైర్మన్ అనుజ్ పురి తెలిపారు. తాజా పరిణామంతో ఇప్పటికే భారత్‌లో పూర్తి స్థాయి కార్యకలాపాలు ఉన్న వాటికి, భవిష్యత్‌లో జాయింట్ వెంచర్లు కుదుర్చుకోవాలనుకునే అంతర్జాతీయ సంస్థలకు స్పష్టత లభించినట్లయిందని పీడబ్ల్యూసీ ఇండియా లీడర్ (డైరెక్ట్ ట్యాక్స్ విభాగం) అభిషేక్ గోయెంకా పేర్కొన్నారు.

సుమారు 49 శాతం దాకా విదేశీ ఎయిర్‌లైన్స్ పెట్టుబడులకు అనుమతినివ్వడం ద్వారా వేల కోట్ల రుణభారంతో కుంగుతున్న ఎయిరిండియాకు ఊతమివ్వడంపై కేంద్రం దృష్టి పెట్టింది. ఆటోమేటిక్ పద్ధతిలో కాకుండా ఈ పెట్టుబడులకు ప్రభుత్వ ఆమోదం కావాల్సి ఉంటుంది. అలాగే మరికొన్ని షరతులు వర్తిస్తాయని పేర్కొంది. ప్రస్తుతం విమాన సేవలు అందిస్తున్న భారతీయ కంపెనీల్లో పెయిడప్ క్యాపిటల్‌లో 49% దాకా విదేశీ ఎయిర్‌లైన్స్ పెట్టుబడులకు అనుమతి ఉన్నప్పటికీ.. ఎయిరిండియాకి మాత్రం దీన్ని వర్తింపచేయడం లేదు. 'తాజాగా ఈ ఆంక్షను ఎత్తివేయాలని, ప్రభుత్వ అనుమతుల మార్గంలో ఎయిరిండియాలో 49% దాకా విదేశీ ఎయిర్‌లైన్స్ పెట్టుబడులను అనుమతించాలని నిర్ణయించడం జరిగింది' అని కేంద్రం తెలిపింది. అయితే, యాజమాన్యం, నిర్వహణ బాధ్యతలన్నీ కూడా భారతీయుల చేతిలోనే ఉంటాయని స్పష్టం చేసింది. తాజా పరిణామంతో ఎయిరిండియాకు ఇకపై ప్రత్యేక హోదా ఏమీ ఉండబోదని పౌర విమానయాన మంత్రి అశోక్ గజపతిరాజు తెలిపారు. మిగతా ఎయిర్‌లైన్స్ కోవలోకే ఎయిరిండియా కూడా చేరుతుందన్నారు. ఎయిరిండియాలో విదేశీ ఎయిర్‌లైన్స్ పెట్టుబడులను అనుమతించడంతో పాటు ఎఫ్‌డీఐ విధానాలను సడలించడాన్ని అంతర్జాతీయ విమానయాన సంస్థల సమాఖ్య ఐఏటీఏ స్వాగతించింది. గతేడాది సెప్టెంబర్ ఆఖరు నాటికి ఎయిరిండియా రుణభారం సుమారు రూ. 52,000 కోట్ల మేర ఉంది. దీంతో సంస్థను గట్టెక్కించేందుకు పదేళ్ల వ్యవధిలో రూ. 30,231 కోట్ల మేర సహాయ ప్యాకేజీ అందించేలా గత యూపీఏ ప్రభుత్వ ప్రతిపాదన 2012 నుంచి అమల్లోకి వచ్చింది. అప్పులకుప్పగా మారిన ఎయిరిండియాలో వాటా విక్రయంపై కేంద్రం కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగా ఈ నెల 25న ఆసక్తి వ్యక్తీకరణను ఆహ్వానించే అవకాశాలు కూడా ఉన్నాయి. టాటా తదితర సంస్థలు కొనుగోలుకు ఆసక్తిగా ఉన్నాయి.

మహారాజాకు ఊపిరి..



ఎయిరిండియా వివరాలు మరిన్ని..

- దేశీ మార్కెట్‌కి సంబంధించి 2005–06లో 28 శాతం ఉన్న వాటా 2016–17 నాటికి 14 శాతానికి తగ్గిపోయింది.
- విదేశీ రూట్లలో 25% మార్కెట్ వాటా (2016–17).
- సమయపాలనలో పరిశ్రమ ప్రమాణాలు 85 శాతంగా ఉండగా.. ఎయిరిండియాది 76 శాతంగా ఉంది.
- 107 విమానాలు, 11,912 మంది సిబ్బంది.
- మొత్తం రుణభారం రూ. 52,000 కోట్లు. వర్కింగ్ క్యాపిటల్ రుణం రూ. 30,000 కోట్లు కాగా విమానాల కోసం తీసుకున్న రుణాలు రూ. 20,000 కోట్లు.
- ఇంధన బిల్లు రూ. 5,745 కోట్లు (వ్యయాల్లో 29 శాతం)
- వేతనాల బిల్లు రూ.2,400 కోట్లు (మొత్తం వ్యయాల్లో 12%)

వాటా కొనుగోలుకు సై: సింగపూర్ ఎయిర్‌లైన్స్

ఎయిరిండియాలో వాటా కొనుగోలుకు సిద్ధంగా ఉన్నామని సింగపూర్ ఎయిర్‌లైన్స్ తెలిపింది. 'విస్తార' విమానయాన సంస్థ విస్తరణకు ప్రాధాన్యత ఇస్తామని కూడా పేర్కొంది. అయితే ఎయిరిండియాలో 49 శాతం వరకూ వాటా కొనుగోలుకు విదేశీ విమాన సంస్థలను అనుమతించాలని కేబినెట్ నిర్ణయించడంతో వాటా కొనుగోలును పరిశీలిస్తామని వివరించింది. విస్తార విమానయాన కంపెనీలో సింగపూర్ ఎయిర్‌లైన్స్‌కు 49 శాతం వాటా ఉంది, మిగిలిన వాటా టాటాలది. కాగా, ఎయిరిండియాలో వాటా కొనుగోలుకు సింగపూర్ ఎయిర్‌లైన్స్, టాటా గ్రూప్‌లు సంయుక్తంగా బిడ్ చేస్తారని విశ్వసనీయ వర్గాల సమాచారం.

హ్యుందాయ్ 'వెర్నా'లో కొత్త వేరియంట్లు

ప్రారంభ ధర రూ.7.79 లక్షలు

న్యూఢిల్లీ: ప్రముఖ వాహన తయారీ కంపెనీ 'హ్యుందాయ్ మోటార్ ఇండియా' తాజాగా తన మిడ్‌సైజ్డ్ ప్రీమియం సెడాన్ 'వెర్నా'లో 'ఇ,' 'ఇఎక్స్' అనే రెండు కొత్త వేరియంట్లను మార్కెట్‌లోకి తీసుకువచ్చింది. వీటి ధరలు వరుసగా రూ.7.79 లక్షలు, రూ.9.09 లక్షలుగా (ఎక్స్‌షోరూమ్ ఢిల్లీ)గా ఉంది.



తాజా వేరియంట్లు 1.4 లీటర్ పెట్రోల్ ఇంజిన్‌తో కస్టమర్లకు అందుబాటులో ఉంటాయని కంపెనీ తెలిపింది. 'కస్టమర్ల ప్రాధాన్యాలకు అనువైన ప్రొడక్టులు ఆవిష్కరించడమే మా లక్ష్యం. తాజా వేరియంట్లు మా నిబద్ధతకు నిదర్శనం. పనితీరు, ఇంధన సామర్థ్యం కచ్చితమైన కలయికతో వీటిని తీసుకువచ్చాం' అని కంపెనీ డైరెక్టర్ (సేల్స్ అండ్ మార్కెటింగ్) రాకేశ్ శ్రీవాత్సవ తెలిపారు. 6 స్పీడ్ మాన్యువల్ ట్రాన్స్‌మిషన్‌తో వస్తోన్న కొత్త వేరియంట్లు లీటరుకు 19.1 కిలోమీటర్ల మైలేజ్‌ను అందిస్తాయని పేర్కొన్నారు.

మార్కెట్‌లోకి శాంసంగ్ 'గెలాక్సీ ఏ8 ప్లస్'

ధర రూ.32,990

న్యూఢిల్లీ: ప్రముఖ మొబైల్ హ్యాండ్‌సెట్స్ తయారీ కంపెనీ 'శాంసంగ్ ఇండియా' తాజాగా 'గెలాక్సీ ఏ8 ప్లస్' స్మార్ట్‌ఫోన్‌ను మార్కెట్‌లో ఆవిష్కరించింది. దీని ధర రూ.32,990. కంపెనీ నుంచి డ్యూయెల్ ఫ్రంట్ కెమెరా ఫీచర్‌తో వస్తోన్న తొలి స్మార్ట్‌ఫోన్ ఇదే.



ఎస్–8, ఎస్–8 ప్లస్, నోట్–8 వంటి ప్రీమియం స్మార్ట్‌ఫోన్లలోని పలు ప్రత్యేకతలను ఏ8 ప్లస్‌లో పొందుపరిచినట్లు కంపెనీ తెలిపింది. ఇందులో 6 జీబీ ర్యామ్, 64 జీబీ మెమరీ, శాంసంగ్ పే, ఐపీ–68 వాటర్ అండ్ డస్ట్ రెసిస్టెన్స్, 6 అంగుళాల ఫుల్–హెచ్‌డీ సూపర్ అమోల్డ్ ఇన్ఫినిటీ డిస్‌ప్లే, 16 ఎంపీ+8 ఎంపీ డ్యూయెల్ ఫ్రంట్ కెమెరా, 16 ఎంపీ రియర్ కెమెరా, ఆల్‌వేస్ ఆన్ డిస్‌ప్లే, బిక్స్‌బీ వర్చువల్ అసిస్టెంట్, ఆక్టాకోర్ ప్రాసెసర్, 3,500 ఎంఏహెచ్ బ్యాటరీ వంటి పలు ప్రత్యేకతలున్నాయని వివరించింది. కాగా ఈ ఫోన్లు జనవరి 20 నుంచి అమెజాన్‌లో అందుబాటులో ఉండనున్నాయి.

బజాజ్ డిస్కవర్‌లో కొత్త బైక్స్

ప్రారంభ ధర రూ.50,496

న్యూఢిల్లీ: ప్రముఖ వాహన తయారీ కంపెనీ 'బజాజ్ ఆటో' తాజాగా డిస్కవర్ 110, డిస్కవర్ 125 అనే రెండు బైక్స్‌ను మార్కెట్‌లోకి తీసుకువచ్చింది. డిస్కవర్ 110 మోడల్ ధర రూ.50,496గా ఉంది. ఇక డిస్కవర్ 125లో డ్రమ్ వెర్షన్ ధర



రూ.53,491గా, డిస్క్ వెర్షన్ ధర రూ.56,314గా ఉంది. అన్ని ధరలు ఎక్స్‌షోరూమ్ మహారాష్ట్ర. ప్రీమియం ఎగ్జిక్యూటివ్ విభాగంలో తన స్థానాన్ని మరింత బలోపేతం చేసుకోవాలనే లక్ష్యంతో కంపెనీ ఈ బైక్స్‌ను ఆవిష్కరించింది. 'ప్లాటినా కంఫర్టెక్, సీటీ–100 మోడళ్లతో 100 సీసీ విభాగంలో గణనీయమైన ప్రభావం చూపించాం. ఇక 100–125 సీసీ విభాగంలో పలు ప్రత్యేకమైన ఫీచర్లతో తాజా బైక్స్‌ను ఆవిష్కరించాం' అని బజాజ్ ఆటో ప్రెసిడెంట్ (మోటార్‌సైకిల్స్) ఎరిక్ వాస్ తెలిపారు. వీటిల్లో ఎల్ఈడీ డే టైమ్ రన్నింగ్ హెడ్‌ల్యాంప్స్, డిజిటల్ ఇన్‌స్ట్రుమెంట్ డిస్‌ప్లే పానెల్ వంటి పలు ప్రత్యేకతలున్నాయని తెలిపారు.

మారుతీ, హోండా ధరలు పెరిగాయ్

న్యూఢిల్లీ: దేశీ దిగ్గజ కార్ల తయారీ కంపెనీ మారుతీ సుజుకీ ఇండియా, హోండా కార్స్ ఇండియా తాజాగా కార్ల ధరలను రూ.32,000 వరకు పెంచాయి. ఉత్పత్తి వ్యయాల పెరుగుదల కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఇరు కంపెనీలు పేర్కొన్నాయి. 'కార్ల ధరల పెంపు రూ.1,700–రూ.17,000 శ్రేణిలో ఉంటుంది. కమోడిటీ, అడ్మినిస్ట్రేటివ్, డిస్ట్రిబ్యూషన్



వ్యయాల పెరుగుదల ఇందుకు కారణం' అని మారుతీ సుజుకీ తెలియజేసింది. కాగా మారుతీ సుజుకీ.. హ్యాచ్‌బ్యాక్ కారు 'ఆల్టో 800' మొదలు ప్రీమియం క్రాస్‌ఓవర్ 'ఎస్–క్రాస్' వరకు పలు మోడళ్లను మార్కెట్‌లో విక్రయిస్తోంది. వీటి ధర రూ.2.45 లక్షలు–రూ.11.29 లక్షల శ్రేణిలో (ఎక్స్‌షోరూమ్ ఢిల్లీ) ఉంది. మరొకవైపు ధరల పెంపు రూ.6,000–రూ.32,000 శ్రేణిలో ఉంటుందని హోండా కార్స్ ఇండియా (హెచ్‌సీఐఎల్) పేర్కొంది. అయితే దీనికి అకార్డ్ హైబ్రిడ్ మోడల్ మినహాయింపు.

చివరకు కన్నీళ్లే!

క్రిప్టో కరెన్సీలపై బఫెట్ వ్యాఖ్యలు



న్యూయార్క్: ఇన్వెస్ట్‌మెంట్ గురు.. వారెన్ బఫెట్ బిట్‌కాయిన్ వంటి క్రిప్టోకరెన్సీలు చివరకు కన్నీళ్లే మిగులుస్తాయని వ్యాఖ్యానించారు. బిట్‌కాయిన్ ఒక జోక్ అని 2014లోనే ఆయన పేర్కొనడం విశేషం. అప్పటి నుంచి ఇప్పటి దాకా బిట్‌కాయిన్ వేల రెట్లు పెరిగినప్పటికీ, ఆయన తన దృక్పథాన్ని మార్చుకోలేదు. తనకు కొద్దో, గొప్పో తెలిసిన విషయాలపైనే ఎంతో కొంత గందరగోళానికి గురవుతున్నానని, ఏమీ తెలియని బిట్‌కాయిన్‌లో పెట్టుబడి ఎందుకు పెట్టాలని ప్రశ్నించారు. క్రిప్టో కరెన్సీల పై ఇన్వెస్టర్లు ఆసక్తి చూపుతున్న తరుణంలో బఫెట్ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

సాక్షి బిజినెస్ వెబ్‌సైట్‌లో...

➡ కరెక్షన్ కోసం కాచుకొని ఉండాలా ?
➡ చమురు వేడితో అబాన్ ఆఫ్‌షోర్ పరుగులు
➡ సీఎల్ఎస్ఏ నుంచి మిడ్‌క్యాప్ సిఫార్సులు
➡ ఏవియేషన్, రిటైల్‌షేర్లకు ఎఫ్‌డీఐ బూస్ట్
➡ షార్ట్ కవరింగ్‌తో 10,750 వరకూ ర్యాలీకి ఛాన్స్

మరిన్ని ఆసక్తికర కథనాలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం..
WWW.SAKSHIBUSINESS.COM
SAKSHIBUSINESS యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్, యాపిల్ యాప్ స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోండి
GET IT ON Google Play | Available on the App Store

గృహాలు కిందికి.. ఆఫీసులు పైకి!

- హైదరాబాద్‌లో గృహ రంగం ప్రారంభాల్లో 84 శాతం క్షీణత
- ఆఫీసు లావాదేవీల్లో 5 శాతం వృద్ధి
- పెద్దనోట్ల రద్దు, రెరా, జీఎస్‌టీలతో రియల్టీ కుదేల్
- నైట్‌ఫ్రాంక్ ఇండియా 8వ ఎడిషన్‌లో వెల్లడి

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: హైదరాబాద్ గృహ నిర్మాణ రంగంలో నూతన ప్రాజెక్ట్‌ల విషయంలో గణనీయమైన తగ్గుదల ఉందని, కార్యాలయాల మార్కెట్ మాత్రం కాసింత మెరుగ్గా ఉందని నైట్‌ఫ్రాంక్ ఇండియా నివేదిక తెలిపింది. హెచ్1తో పోలిస్తే నగరంలో జూలై–డిసెంబర్ (హెచ్2) మధ్య కాలంలో కొత్త ప్రాజెక్ట్‌ల ప్రారంభాలు 84 శాతం క్షీణత, ఆఫీసు లావాదేవీల్లో మాత్రం 5 శాతం వృద్ధిని నమోదు చేసిందని నివేదిక వెల్లడించింది. దేశంలోని అన్ని ముఖ్య నగరాలతో పాటూ హైదరాబాద్‌లోని నివాస, కార్యాలయాల విభాగం పరిస్థితులపై క్షేత్రస్థాయిలోని వివరాలను నైట్‌ఫ్రాంక్ హైదరాబాద్ డైరెక్టర్ సామ్‌సన్ ఆర్థర్ బుధవారమిక్కడ విడుదల చేశారు.

పెద్ద నోట్ల రద్దు, రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ బిల్లు (రెరా), వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) కారణంగా దేశంలోని అన్ని ముఖ్యమైన నగరాల్లోని రియల్టీ మార్కెట్‌పై ప్రభావం చూపించింది. హైదరాబాద్‌లో అయితే పరిస్థితి మరీ ఘోరంగా తయారైంది.



నైట్‌ఫ్రాంక్ ఇండియా 8వ సంచికను విడుదల చేస్తున్న హైదరాబాద్ డైరెక్టర్ సామ్‌సన్ ఆర్థర్

ఇక్కడ హెచ్1లో 2,571 యూనిట్లు ప్రారంభం కాగా.. హెచ్2లో 84 శాతం తగ్గుదలతో 940 యూనిట్లకే పరిమితమయ్యాయి.

అమ్మకాలూ డౌన్..

హెచ్2లో నగరంలో గృహాల అమ్మకాల్లోనూ 13 శాతం తగ్గుదల కనిపించింది. హెచ్1లో 7,901 యూనిట్లు అమ్ముడుపోగా.. హెచ్2లో 6,342 యూనిట్లకు చేరాయి. నగరంలో ఇంకా అమ్ముడుపోకుండా ఉన్న ఇన్వెంటరీ 2016తో పోలిస్తే 28,088 నుంచి 17,356 యూనిట్లకు తగ్గింది. అమ్మకాలు ఆశాజనకంగా ఉండటంతో రూ.50 లక్షల లోపు ఉండే అందుబాటు గృహాల ప్రాజెక్ట్‌ల వైపు నిర్మాణ సంస్థలు దృష్టిసారించాయి. దీంతో ఈ విభాగంలో కొత్త ప్రాజెక్ట్‌ల ప్రారంభాలు 40 శాతం పెరిగాయి.

ఆఫీస్‌లో 5 శాతం వృద్ధి..

జూలై–డిసెంబర్ మధ్య కాలంలో హైదరాబాద్ ఆఫీసు రియల్టీ మార్కెట్ రికార్డుల మోత మోగించింది. ఈ 6 నెలల కాలంలో 3.34 మిలియన్ చ.అ. ఆఫీసు లావాదేవీలు జరిగాయి. హెచ్1లో ఇది 2.33 మిలియన్ చ.అ.లుగా ఉంది. అంటే 5 శాతం వృద్ధిని నమోదు చేసింది. అయితే 2016 ఏడాదితో పోలిస్తే మాత్రం 2017లో ఆఫీసు విభాగ లావాదేవీలు 4 శాతం తగ్గాయి.

దేశంలోనూ సేమ్ సీన్!

2017 హెచ్2లో దేశంలోని 8 ప్రధాన మార్కెట్లలో గృహ రంగంలో క్షీణత, ఆఫీసు విభాగంలో వృద్ధిని నమోదు చేసింది. హెచ్1లో 62,738 యూనిట్లు ప్రారంభం కాగా.. హెచ్2లో 41 శాతం తగ్గుదలతో 40,832 యూనిట్లకు పరిమితమయ్యాయి. అమ్మకాల్లోనూ అంతే! హెచ్1లో 1,20,756 యూనిట్లు అమ్ముడుపోగా.. హెచ్2లో 2 శాతం క్షీణతతో 1,07,316కు చేరాయి. అమ్ముడుపోకుండా ఉన్న ఇన్వెంటరీ 2016లో 6,52,996 యూనిట్లు ఉండగా. 2017లో ఇవి 5,28,494 యూనిట్లకు తగ్గాయి.

9 శాతం అప్..

హెచ్2లో ఆఫీస్ విభాగంలో 22.5 మిలియన్ చ.అ. లావాదేవీలు జరిగాయి. హెచ్1లో 19.2 మిలియన్ చ.అలుగా ఉంది. 9 శాతం వృద్ధిని కనబర్చింది. విభాగాల వారీగా పరిశీలిస్తే.. ఐటీ, ఐటీఈఎస్ విభాగం 37 శాతం, బీఎఫ్ఎస్ఐ 14 శాతం, తయారీ రంగం 14 శాతం ఆఫీసు స్థలాన్ని ఆక్రమించాయి.

వెల్త్ మేనేజ్‌మెంట్‌లోకి పేటీఎం!

- సెబీకి దరఖాస్తు; మార్చిలో విపణిలోకి ఉత్పత్తులు
- రూ.63 కోట్ల పెట్టుబడులు; 40 మంది నియామకం



పేటీఎం మనీ హెడ్ ప్రవీణ్ జాదవ్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్రముఖ ఈ–కామర్స్ సంస్థ పేటీఎం.. పెట్టుబడులు, ఆర్థిక నిర్వహణ విభాగం(వెల్త్ మేనేజ్‌మెంట్)లోకి అడుగుపెట్టనుంది. అనుమతుల కోసం సెబీకి దరఖాస్తు చేసుకున్నామని.. ఈ ఏడాది తొలి త్రైమాసికం లోపు విపణిలోకి తొలి ఉత్పత్తులను ప్రవేశపెడతామని పేటీఎం సీఈఓ విజయ్ శేఖర్ శర్మ ట్విటర్‌లో తెలిపారు. ముందుగా మ్యూచువల్ ఫండ్స్ ఉత్పత్తులను విక్రయించనుంది. ఇప్పటికే పలు ప్రముఖ 10–12 అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ (ఏఎంసీ)లతో చర్చిస్తున్నట్లు శేఖర్ తెలిపారు. పేటీఎం బ్రాండ్‌ను వన్97 కమ్యూనికేషన్స్ నిర్వహిస్తోంది. ప్రస్తుతం దీనికి పేటీఎం వాలెట్, మాల్, పేమెంట్ బ్యాంక్ మూడు అనుబంధ సంస్థలున్నాయి. ఇప్పుడిది నాల్గోది. ఇప్పటివరకు పేటీఎంలో సాఫ్ట్‌బ్యాంక్ గ్రూప్, సైఫ్ పార్టనర్స్, అలీబాబా, ఏఎన్‌టీ ఫైనాన్షియల్ సర్వీసెస్ పెట్టుబడులు పెట్టాయి.

రూ.63 కోట్ల పెట్టుబడులు..

పేటీఎం మనీలో రూ.63 కోట్లు పెట్టుబడులు పెట్టనున్నట్లు తెలిసింది. పేటీఎం మనీకి ప్రవీణ్ జాదవ్ సీనియర్ హెడ్‌గా వ్యవహరించనున్నారు. గతంలో ఆయన రెడిఫ్, ఎంటర్‌టైన్‌మెంట్ పోర్టల్స్‌లో పనిచేశారు. సోషల్ నెట్‌వర్కింగ్ సైట్ విష్‌బర్గ్ వ్యవస్థాపకులు ఈయనే. బెంగళూరు కేంద్రంగా పనిచేసే పేటీఎం మనీలో ఇప్పటివరకు 40 మంది ఉద్యోగులను నియమించుకున్నారు. మరో 6 నెలల్లో 200 మందిని నియమించుకోనున్నట్లు జాదవ్ తెలిపారు. ప్రస్తుతం దేశంలో 40కి పైగా వెల్త్ మేనేజ్‌మెంట్ కంపెనీలుండగా.. ఇవన్నీ అర్బన్ మార్కెట్లకే పరిమితమయ్యాయని.. పేటీఎం మనీ మాత్రం గ్రామీణ, పట్టణ ప్రాంతాలపై దృష్టిసారిస్తుందని ఆయన పేర్కొన్నారు.

వృద్ధి వేగం ఎలా? ప్రధాని సమీక్ష



న్యూఢిల్లీ: దేశ ఆర్థిక వృద్ధిపై ప్రధాని నరేంద్రమోదీ అధ్యక్షతన బుధవారం ఒక అత్యున్నత స్థాయి సమావేశం జరిగింది. 40 మంది సీనియర్ ఆర్థికవేత్తలు, వివిధ రంగాల నిపుణులు ఈ భేటీలో పాల్గొన్నారు. దేశాభివృద్ధి నాలుగేళ్ల కనిష్టానికి పడిపోవడం, ఫిబ్రవరి 1న బడ్జెట్‌ను ప్రవేశపెడుతుండటం తాజా సమావేశ నేపథ్యం. వ్యవసాయం, గ్రామీణ అభివృద్ధి, ఉపాధి, ఆరోగ్యం, విద్య, తయారీ, ఎగుమతులు, పట్టణాభివృద్ధి, మౌలిక వనరుల కల్పన వంటి అంశాలు చర్చల్లో చోటుచేసుకున్నాయని ప్రధాని కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

నిత్యావసరాల ధరలు (హోల్‌సేల్/క్వింటాల్‌కు)

సరుకు	ధర
పత్తి (వరంగల్, వ్యాపారస్తులు)	రూ. 4,600 (కనిష్టం); రూ. 4,910 (గరిష్టం)
మిర్చి (వరంగల్, తేజ)	రూ. 4,500 (కనిష్టం); రూ. 8,800 (గరిష్టం)
పసుపు (నిజామాబాద్, కొమ్ము)	--; --
ఉల్లి (కర్నూలు)	రూ.1,640 (కనిష్టం); రూ.3,600 (గరిష్టం)
చక్కెర (చెన్నై)	రూ.3,600
బియ్యం (కరీంనగర్)	-- (హెచ్ఎంటీ)
కందిపప్పు (చెన్నై)	రూ.7,200
సుబాబులు (కృష్ణా)	రూ.4,400 (టన్నుకు)
ఆయిల్ పామ్ (పశ్చిమ గోదావరి)	--

లాభాలకు బ్రేక్

- ఇంట్రాడేలో ఆల్ టైమ్ హైకి స్టాక్ సూచీలు
- 10 పాయింట్ల నష్టంతో 34,433కు సెన్సెక్స్
- 5 పాయింట్ల నష్టంతో 10,632కు నిఫ్టీ

కీలక కంపెనీల క్యూ3 ఆర్థిక ఫలితాలు నేటి(గురువారం) నుంచి వెల్లడి కానున్న నేపథ్యంలో బుధవారం స్టాక్‌మార్కెట్ అక్కడక్కడే ముగిసింది స్టాక్ సూచీలు ఇంట్రాడేలో తాజా జీవిత కాల గరిష్ట స్థాయిలను తాకినా, ఆ తర్వాత లాభాల స్వీకరణ చోటు చేసుకోవడం, అంతర్జాతీయ సంకేతాలు బలహీనంగా ఉండటంతో నష్టాల్లోకి జారిపోయి చివరకు ఫ్లాట్‌గా ముగిశాయి. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల నిబంధనల సరళీకరణ పెద్దగా ప్రభావం చూపించలేకపోయింది. ముడి చమురు ధరలు మూడేళ్ల గరిష్టానికి చేరడం ప్రతికూల ప్రభావం చూపించింది. బీఎస్ఈ సెన్సెక్స్ 10 పాయింట్ల నష్టంతో 34,433 పాయింట్ల వద్ద, ఎన్ఎస్ఈ నిఫ్టీ 5 పాయింట్ల నష్టంతో 10,632 పాయింట్ల వద్ద ముగిశాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 34,566 పాయింట్లు, నిఫ్టీ 10,655 పాయింట్ల గరిష్ట స్థాయిలను తాకాయి. ఇవి ఆయా సూచీలకు ఇంట్రాడే జీవిత కాల గరిష్ట స్థాయిలు. ప్రభుత్వ రంగ బ్యాంక్‌లు, వాహన, మౌలిక రంగ షేర్లు నష్టపోగా, ఐటీ, రియల్టీ షేర్లు లాభపడ్డాయి.

254 పాయింట్ల రేంజ్‌లో కదలాడిన సెన్సెక్స్

సెన్సెక్స్ 122 పాయింట్లు లాభపడగా, మరో దశలో 132 పాయింట్లు నష్టపోయింది. మొత్తం మీద 254 పాయింట్ల రేంజ్‌లో కదలాడింది.

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	5,026
ఎన్ఎస్ఈ (ఈక్విటీ)	36,414
ఎన్ఎస్ఈ (డెరివేటివ్స్)	5,96,072
ఎఫ్ఐఐ	-572
డీఐఐ	600

5 రెట్లు ఓవర్ సబ్‌స్క్రైబయిన ఎన్ఎమ్‌డీసీ రిటైల్ వాటా విక్రయం

ఎన్ఎమ్‌డీసీ రిటైల్ ఇన్వెస్టర్ల వాటా విక్రయం 5.40 రెట్లు ఓవర్ సబ్‌స్క్రైబయింది. రిటైల్ ఇన్వెస్టర్లకు కేటాయించిన 1.59 కోట్ల షేర్లకు గాను 8.58 కోట్ల షేర్లకు దరఖాస్తులు వచ్చాయి. ఫ్లోర్ ధరగా రూ.153.50ను ప్రభుత్వం నిర్ణయించింది. ఓఎఫ్ఎస్ మార్గంలో ఎన్ఎమ్‌డీసీలో 2.52 శాతం వాటా విక్రయం ద్వారా ప్రభుత్వానికి రూ.1,200 కోట్లు వస్తున్నాయి. కాగా బీఎస్ఈలో ఎన్ఎమ్‌డీసీ షేర్ స్వల్పంగా పెరిగి రూ.155.30 వద్ద ముగిసింది.

గుర్గావ్‌లో ట్రంప్ టవర్స్ ప్రాజెక్టు

న్యూఢిల్లీ: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కుటుంబానికి చెందిన రియల్టీ బ్రాండ్ 'ట్రంప్ టవర్స్' తాజాగా గుర్గావ్‌లో కూడా ఖరీదైన రెసిడెన్షియల్ ప్రాజెక్టు చేపడుతోంది. డొనాల్డ్ కుమారుడు ట్రంప్ జూనియర్ సారథ్యంలోని ది ట్రంప్ ఆర్గనైజేషన్ నుంచి లైసెన్స్ తీసుకున్న ఎం3ఎం, ట్రైబెకా సంస్థలు ఈ ప్రాజెక్టును ప్రకటించాయి. ఇందులో రూ. 1,200 కోట్ల మేర పెట్టుబడులతో 250 అల్ట్రా లగ్జరీ అపార్ట్‌మెంట్లు ఉంటాయి. 3,500 చ.అ. నుంచి 6,000 చ.అ. దాకా ఉండే త్రీ, ఫోర్ బెడ్‌రూమ్ ఫ్లాట్స్ ఖరీదు రూ. 5 కోట్ల నుంచి రూ. 10 కోట్ల దాకా ఉంటుంది. పుణె, ముంబై, కోల్‌కతా తర్వాత ట్రంప్ టవర్స్‌కి భారత్‌లో ఇది నాలుగో ప్రాజెక్టు. ప్రాజెక్టు మార్చిలో ప్రారంభమై, ఐదేళ్లలో పూర్తవుతుంది. మొదటి 100 మంది కొనుగోలుదారులను అమెరికా తీసుకువెళ్లి ట్రంప్ జూనియర్‌తో విందు అవకాశం కల్పించనుండడం మరో విశేషం.



6 దేశాల్లో 11 షోరూమ్‌లను ప్రారంభించనున్న మలబార్

ముంబై: జువెలరీ సంస్థ 'మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్' విదేశీ మార్కెట్ల విస్తరణపై ప్రధానంగా దృష్టి కేంద్రీకరించింది. అందులో భాగంగానే జనవరి 12న ఆరు దేశాల్లో 11 షోరూమ్‌లను ప్రారంభించడానికి సిద్ధమైంది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఖతార్, ఒమన్, సింగపూర్, మలేసియా, తెలంగాణ (వరంగల్)లలో ఈ షోరూమ్‌లు ఏర్పాటు కానున్నవి. వీటితో కలుపుకుంటే మొత్తం షోరూమ్‌ల సంఖ్య 208కి చేరుతుందని సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది.

బినామీ లావాదేవీలకు దూరంగా ఉండండి

ఆదాయపన్ను శాఖ హెచ్చరిక

న్యూఢిల్లీ: బినామీ లావాదేవీలకు దూరంగా ఉండాలని ఆదాయ పన్ను శాఖ దేశ ప్రజలకు సూచించింది. బినామీ లావాదేవీల్లో పాత్ర ఉంటే కొత్తగా అమల్లోకి వచ్చిన చట్టం కింద నేర విచారణను ఎదుర్కోవాల్సి వస్తుందని, ఏడేళ్ల వరకు జైలు శిక్షనూ అనుభవించాల్సి వస్తుందని హెచ్చరించింది. ఈ మేరకు జాతీయ దినపత్రికల్లో ఐటీ శాఖ ప్రముఖంగా ప్రకటనలు ఇచ్చింది. బినామీ లావాదేవీలకు దూరంగా ఉండాలనే టైటిల్‌తో ఇచ్చిన ఈ ప్రకటనల్లో... నల్లధనాన్ని మానవజాతి వ్యతిరేక నేరంగా పేర్కొంది. చట్టం పట్ల అవగాహన కలిగిన వారు నల్లధనాన్ని నిర్మూలించేందుకు ప్రభుత్వానికి సాయం చేయాలని కోరింది. ''బినామీదారు (ఆస్తిని తమ పేరిట కలిగి ఉన్న వారు), లబ్ధిదారు (ఆ ఆస్తికి అసలైన యజమాని), బినామీ లావాదేవీలకు పాల్పడేవారు, ప్రోత్సహించేవారు ఏడేళ్ల కఠిన జైలు శిక్షను ఎదుర్కోవాల్సి ఉంటుంది'' అని స్పష్టంచేసింది.

రోడ్డు భద్రతపై అవగాహనకు నేషనల్ ఇన్సూరెన్స్ మారథాన్



కోల్‌కతా: నేషనల్ ఇన్సూరెన్స్ ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన కల్పించేందుకు కోల్‌కతా పోలీసుల భాగస్వామ్యంతో ఎస్‌డీఎస్ఎల్ హాఫ్ మారథాన్‌ను నిర్వహించింది. జనవరి 7న కోల్‌కతాలో ఇది జరిగింది. 5కే, 10కే, 21కే విభాగాల్లో దాదాపు 10,000కు పైగా రన్నర్లు ఇందులో పాల్గొన్నారని నేషనల్ ఇన్సూరెన్స్ ఒక ప్రకటనలో తెలిపింది. కోల్‌కతా పోలీస్ కమిషనర్, ఇతర అధికారులు, ప్రముఖుల సమక్షంలో నేషనల్ ఇన్సూరెన్స్ సీఎండీ కె.సనత్ కుమార్ జెండా ఊపి మారథాన్‌ను ప్రారంభించారు.

తుంగభద్ర స్టీల్ ప్రొడక్ట్స్ మూసివేతకు కేబినెట్ ఓకే

న్యూఢిల్లీ: తుంగభద్ర స్టీల్ ప్రొడక్ట్స్(టీఎస్‌పీఎల్)ను మూసేయాలన్న సీసీఈఏ నిర్ణయాన్ని కేంద్ర కేబినెట్ ఆమోదించింది. ఈ కంపెనీ స్థిరాస్తుల విక్రయానికి పచ్చజెండా ఊపింది. మెటలర్జికల్, మెటీరియల్ హ్యాండ్లింగ్ ప్లాంట్లను, 20 వేల చదరపు మీటర్ల భూమిని కర్ణాటకకు కేటాయించాలన్న ప్రతిపాదనకు కూడా ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన గల కేబినెట్ కమిటీ ఆమోదం తెలిపింది. కర్ణాటకలోని హోస్పేట్‌లో ఉన్న 82.37 ఎకరాల భూమిని ఎకరానికి రూ.66 లక్షల ధరకు కర్ణాటక స్టేట్ హౌసింగ్ బోర్డ్‌కు విక్రయించాలన్న ప్రతిపాదన కూడా ఆమోదం పొందింది. ఉద్యోగులకు, రుణదాతలకు రావలసిన బకాయిలన్నింటినీ తీర్చివేయడంతో 2015 డిసెంబర్‌లోనే ఈ కంపెనీని మూసేయాలని కేబినెట్ కమిటీ ఆన్ ఎకనామిక్ ఎఫైర్స్(సీసీఈఏ) సిఫార్సు చేసింది. తుంగభద్ర స్టీల్ ప్రొడక్ట్స్ కంపెనీని 1960లో సమాన భాగస్వామ్యంతో ఆంధ్రప్రదేశ్, మైసూర్ ప్రభుత్వాలు నెలకొల్పాయి. ఆ తర్వాత కేంద్రం ఈ కంపెనీలో 79 శాతం వాటాను కొనుగోలు చేసి, ప్రధాన వాటాదారుగా అవతరించింది. భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఆధీనంలో ఈ కంపెనీ కార్యకలాపాలు నిర్వహించేది.

నెలాఖరుకు 12 ఎన్‌పీఏ ఆస్తులకు బిడ్డింగ్: ఎస్‌బీఐ



న్యూఢిల్లీ: బ్యాంకులకు రూ.1.75 లక్షల కోట్ల మేర రుణాలను ఎగవేసిన 12 ఎన్‌పీఏ ఖాతాలకు సంబంధించి ఆస్తుల బిడ్డింగ్ ప్రక్రియ ఈ నెలాఖరుకు ముగుస్తుందని ఎస్‌బీఐ తెలిపింది. 12 కేసుల్లో ఆరింటికి ఎస్‌బీఐ లీడ్ బ్యాంకర్‌గా ఉంది. ''ఎలక్ట్రోస్టీల్, మోనెత్ ఇస్పాత్‌కు సంబంధించిన ఫైనాన్షియల్ బిడ్లు ఇప్పటికే వచ్చేశాయి. మిగిలిన కేసుల్లోనూ బిడ్లు వస్తాయని ఆశిస్తున్నాం'' అని ఎస్‌బీఐ చైర్మన్ రజనీష్ కుమార్ తెలిపారు. ఇన్‌సాల్వెన్సీ అండ్ బ్యాంక్రప్టసీ (ఐబీసీ) చట్టం కింద ఎన్‌సీఎల్‌టీ ముందు పెండింగ్‌లో ఉన్న ఇతర కేసుల్లో ఎస్సార్ స్టీల్, భూషణ్ స్టీల్, భూషణ్ పవర్ అండ్ స్టీల్, ల్యాంకో ఇన్‌ఫ్రా, అలోక్ ఇండస్ట్రీస్, ఆమ్టెక్ ఆటో, ఎరా ఇన్‌ఫ్రా, జేపీ ఇన్‌ఫ్రాటెక్, ఏబీజీ షిప్‌యార్డ్, జ్యోతి స్ట్రక్చర్స్ ఉన్నాయి. ఒక్కోటి రూ.5,000 కోట్లకుపైగా రుణాలను ఎగవేసిన 12 భారీ ఎన్‌పీఏ కేసులను ఆర్‌బీఐ సలహా కమిటీ గతేడాది జూన్‌లో గుర్తించిన విషయం తెలిసిందే. దేశ బ్యాంకింగ్ రంగ ఎన్‌పీఏల్లో ఈ 12 ఖాతాల మొత్తమే 20–25 శాతంగా ఉంది.

2018లో భారత్ వృద్ధి 7.3 %

ప్రపంచబ్యాంక్ అంచనా • అటుపై రెండేళ్లూ 7.5 శాతం • మహిళా కార్మిక శక్తి పటిష్టం కావాలి...

వాషింగ్టన్: భారత స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) 2018లో 7.3 శాతంగా నమోదవుతుందని ప్రపంచ బ్యాంక్ అంచనా వేస్తోంది. అటుపై రెండేళ్లలో వృద్ధి 7.5 శాతంగా ఉంటుందనీ విశ్లేషిస్తోంది. ఇతర వర్ధమాన దేశాలతో పోల్చితే, భారత్‌కు మంచి వృద్ధి అవకాశాలు ఉన్నాయని పేర్కొన్న ప్రపంచబ్యాంక్ ఈ సందర్భంగా కేంద్రం చేపడుతున్న ఆర్థిక సంస్కరణలను ప్రస్తావించింది. 2018 గ్లోబల్ ఎకనమిక్స్ ప్రాస్పెక్ట్స్ పేరుతో ప్రపంచబ్యాంక్ విడుదల చేసిన తాజా నివేదికలోని కొన్ని ముఖ్యాంశాలను చూస్తే...

- 2017లో భారత్ వృద్ధి 6.7 శాతం అంచనా. పెద్ద నోట్ల రద్దు, వస్తు సేవల పన్ను అమలుకు తొలిదశలో ఏర్పడుతున్న ఇబ్బందులు దీనికి ప్రధాన కారణాలు.
- వృద్ధి మందగమనంలో ఉన్న చైనాతో పోల్చి చూస్తే, భారత్‌లో వృద్ధి వేగం క్రమంగా పుంజుకుంటోంది. 2017లో భారత్‌కన్నా (6.7 శాతం) కొంచెం ఎక్కువగా ఉన్న చైనా వృద్ధి రేటు (6.8 శాతం), 2018లో 6.4 శాతానికి తగ్గే వీలుంది. అటుపై వచ్చే రెండేళ్లలో వృద్ధి 6.3 శాతం, 6.2 శాతానికి తగ్గవచ్చు
- వచ్చే పదేళ్లలో భారత్ వృద్ధి సగటున 7 శాతం ఉండచ్చు. కొన్ని ఇబ్బందులు తలెత్తినా, మొత్తంగా ఆర్థిక వ్యవస్థ సానుకూలంగా ఉంటుంది.



- ఉత్పాదనాపరంగా సానుకూల స్థితిలో ఉన్న భారత్, బ్యాంకింగ్ మొండిబకాయిల సమస్య పరిష్కారానికి తగిన కృషి చేస్తోంది. ఈ సవాలునూ అధిగమించగలిగితే, దేశంలో వృద్ధి మరింత ఊపందుకుంటుంది. మొండిబకాయిలతోపాటు ఉద్యోగ కల్పన, ప్రైవేటు పెట్టుబడుల పెంపు వంటి అంశాలూ కీలకమైనవి.
- ఇక దేశంలో మహిళా కార్మిక శక్తి కూడా మరింత పటిష్టమవ్వాల్సి ఉంది. ఇతర అభివృద్ధి చెందిన దేశాలతో పోల్చినా భారత్ ఈ విషయంలో వెనుకబడి ఉంది. ఆర్థికాభివృద్ధిలో మహిళా కార్మిక శక్తి ప్రాధాన్యత ఎంతో ఉంటుంది.

2018–19లో వృద్ధి 7.3%: హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్

కాగా వచ్చే ఆర్థిక సంవత్సరం (2018 ఏప్రిల్– 2019 మార్చి మధ్య) భారత్ వృద్ధి 7.3 శాతం నమోదవుతుందని దేశంలో రెండవ అతిపెద్ద ప్రైవేటు బ్యాంకింగ్ దిగ్గజం– హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ అంచనావేసింది. గ్రామీణాభివృద్ధికి కేంద్రం తీసుకుంటున్న చర్యలు, పెరుగుతున్న వినియోగం దీనికి కారణాలుగా విశ్లేషించింది.

రీక్యాప్ బాండ్లతో బ్యాంకులకు భరోసా: ఫిచ్

ఇదిలావుండగా, ప్రభుత్వ రంగ బ్యాంకుల పటిష్టతకు కేంద్ర రీ-క్యాపిటలైజేషన్ ప్రణాళిక మంచి ఫలితాలను అందిస్తుందని క్రెడిట్ రేటింగ్ సంస్థ– ఫిచ్ తన తాజా నివేదికలో పేర్కొంది. రుణ వృద్ధికీ ఈ నిర్ణయం దోహదపడుతుందని పేర్కొంది.

ఆదాయ వృద్ధి ఐదేళ్ల గరిష్టానికి...: క్రిసిల్

ఇక భారత కంపెనీల ఆదాయ వృద్ధి ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో ఐదేళ్ల గరిష్ట స్థాయికి చేరుతుందని రేటింగ్ ఏజెన్సీ క్రిసిల్ అంచనా వేస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అక్టోబర్–డిసెంబర్ కాలానికి కంపెనీల ఆదాయాలు 9 శాతానికి పైగా పెరుగుతాయని పేర్కొంది. అయితే లాభాల క్షీణత మాత్రం కొనసాగుతుందని వివరించింది.

బోర్డ్ మీటింగ్స్

టీసీఎస్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, బజాజ్ కార్ప్, శ్రీ సిమెంట్, హిందుస్తాన్ మీడియా, బ్లిస్ జీవీఎస్ ఫార్మా, ఇమామి ఇన్‌ఫ్రా, సూర్యజ్యోతి స్పిన్నర్స్

బులియన్ రూ.లలో

	ధర	మార్పు
ముంబై		
బంగారం (99.9, 10గ్రా)	29,810	▲ 130
బంగారం (99.5, 10గ్రా)	29,660	▲ 130
వెండి (కిలో)	38,885	▲ 340
చెన్నై		
బంగారం (24 క్యారెట్లు)	- -	
బంగారం (22 క్యారెట్లు)	28,260	▲ 50
వెండి (కిలో)	- -	
హైదరాబాద్		
బంగారం (24 క్యారెట్లు)	30,090	▼ 120
బంగారం (22 క్యారెట్లు)	28,140	▼ 110
వెండి(కిలో)	38,925	▼ 190
ప్రొద్దుటూరు		
బంగారం (24 క్యారెట్లు)	30,350	▼ 50
బంగారం (22 క్యారెట్లు)	28,130	▼ 30
వెండి(కిలో)	39,600	▼ 400
విశాఖపట్నం (మంగళవారం ధరలు)		
బంగారం (24 క్యారెట్లు)	30,810	
బంగారం (22 క్యారెట్లు)	28,250	
వెండి(కిలో)	38,500	
విజయవాడ		
బంగారం (24 క్యారెట్లు)	30,750	▲ 200
బంగారం (22 క్యారెట్లు)	28,500	▲ 250
వెండి(కిలో)	40,000	0
ఏపీ బులియన్ అసోసియేషన్		
బంగారం (24 క్యారెట్లు)	30,560	▲ 60
బంగారం (22 క్యారెట్లు)	28,140	▼ 70
వెండి(కిలో)	39,800	0

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

ముడిచమురు... (బ్యారల్)

	రాత్రి 11.30కు	మంగళవారం ముగింపు
నైమెక్స్ లైట్ స్వీట్	63.34	$62.96
బ్రెంట్	68.93	$68.82

కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్ /100కు రూ.లలో) 11-1-2018

విశాఖ	404–00
చిత్తూరు	398–00
వరంగల్	404–00
ముంబై	447–00
చెన్నై	405–00
విజయవాడ	404–00
గోదావరి	404–00
నమక్కల్	395–00
10–1–2018 ఫామ్ ధర...	
హైదరాబాద్	402–00
రిటైల్ (ఒక గుడ్డుకు)	4.60
బెంగళూరు	405–00
ఢిల్లీ	425–00
కోల్‌కతా	445–00

ఎన్ఎస్ఈ నగదు విభాగంలో ట్రేడైన షేర్లు

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
ADANI PO	423.45	421.1
AMBUJA C	276.1	277.15
ASIAN PA	1177.4	1193.05
AXIS BAN	562.8	565.3
BAJAJ AU	3207.4	3243.5
BAJAJ FI	1802.2	1819.5

A B C D

20 MICRO	60.95	62.5
3M INDIA	18468.55	18967.95
5PAISA C	356.1	364.55
63 MOONS	115.75	116.9
8K MILES	846.25	847.1
AARTI DR	763.95	770.35
AARTI IN	1121	1140.4
AARVEE D	51.5	51.3
AARVI EN	107.5	101.5
BASF IND	2258.1	2282.95
BATA IND	753.95	746.9
BAYER CR	4703.3	4714.5
BEARDSEL	68.9	69.5
BEML LIM	1554.1	1567.05
BERGER P	262.1	268.05
BETA DRU	200.7	202.25
BF INVES	396.35	403.7
BF UTILI	574.25	573.4
BGR ENER	139.5	139.85
BHAGERIA	304.4	308.4
BHANSALI	205.05	206.35
DILIP BU	994.75	989.55
DISH TV	84.7	86.2
DISHMAN	336.85	340.2
DIXON TE	4026.8	4049.6
DOLLAR I	496.95	501.55
DOLPHIN	148.2	134.55
DR. LAL	883.05	888.5
DWARIKES	51.95	50.9
DYNACONS	53.45	52.1
DYNAMATI	2173.1	2220.65

E F G H

GUJARAT	143.05	138.75
GUJARAT	169.5	167.75
GUJARAT	218.1	218.45
GUJARAT	235.7	230.5
GUJARAT	868.2	858.85
GUJARAT	860.75	872.3
GUJARAT	894.85	905.3
GULF OIL	980.35	1000
GULSHAN	90.9	90.5
HARITA S	1078.6	1077.2
HATSUN A	840.9	841.1
HB STOCK	50.95	51.85

I J K L

JINDAL D	225.1	214.9
JINDAL P	417.6	411.25
JINDAL S	123.5	123.55
JINDAL S	161.35	164.45
JINDAL S	241.85	235.9
JINDAL S	262.4	248.75
JINDAL W	576.3	598.1
JK CEMEN	1144.9	1148.9
JK LAKSH	446.5	443.95
JK PAPER	163.75	164.75
JK TYRE	168.75	168.45
JKUMAR I	339.75	335.7

M N O P

MANUGRAP	58.85	60.25
MARAL OV	51.35	52.55
MARATHON	641.5	648.35
MAS FINA	627.2	622.4
MASTEK L	420.85	412.45
MATRIMON	914.65	905.9
MAWANA S	80.2	80.9
MAX FINA	574.45	584.65
MAX INDI	122.5	124.75
MAX VENT	92.8	93.5
MAYUR UN	533.1	525.25
MAZDA LI	475.2	495.75
PFIZER L	2047.3	2027.8
PG ELECT	422.1	424.3
PHILIPS	1424.6	1451.25
PI INDUS	1016.2	1011.8
PIONEER	217.8	207.2
PLASTIBL	264.85	274
PNB HOUS	1328.35	1332.9
PNC INFR	198.1	200.85
PODDAR H	1338.3	1324.4
PODDAR P	336.65	342.15
POKARNA	261.3	269.45
POLY MED	290	280.25

R S T U

SHAKTI P	500.75	505.65
SHALBY L	251.35	266.25
SHALIM P	197.75	197.15
SHANKARA	1712.65	1714.6
SHANTHI	167.35	166.7
SHARDA C	463.45	469.45
SHARDA M	2529.7	2547.9
SHEELA F	1693.8	1683.4
SHEMAROO	429.9	440.85
SHILPA M	600.6	602.05
SHIPPING	97.55	95.15
SHIRPUR	189.05	190.75
THE HI-T	567.05	582.9
THE INDI	143.15	142.15
THE INDI	193	192.1
THE MAND	175.85	176.65
THE NEW	627.15	632.25
THE P K	366.7	370.75
THE PHOE	589.5	602.55
THE RAMC	809.5	802.45
THE RUBY	415.7	422.25
THE TINP	311.55	268.5
THEJO EN	535.65	510.15
THEMIS M	618.35	638.15

భలేగుందండి.. 74 చక్రాల బండి



కల్హేర్ (నారాయణఖేడ్): సంగారెడ్డి జిల్లా కల్హేర్ మండలం మాసాన్‌పల్లి చౌరస్తాలో సంగారెడ్డి–నాందేడ్ జాతీయ రహదారిపై బుధవారం 74 చక్రాల భారీ వాహనం కనిపించింది. దీన్ని 'సాక్షి' కెమెరా క్లిక్‌మనిపించింది. వాహనానికి వెనుక వైపు ఎనిమిది వరుసలతో 8 చొప్పున 64 చక్రాలు, ఇంజిన్ భాగంలో మరో పది కలిపి మొత్తం 74 చక్రాలున్నాయి. పటాన్‌చెరువు పారిశ్రామికవాడ నుంచి మహారాష్ట్రలోని దులిగ పట్టణానికి భారీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఇందులో తరలించారు. రహదారిపై వెళ్తున్న ఈ వాహనాన్ని వాహనదారులు, స్థానికులు ఆసక్తిగా తిలకించారు.

ఓ అభాగ్యుడి 'శవయాత్ర'

ఉపాధి కోసం సూరత్ వెళ్లి..

- అనారోగ్యంతో మృతి
- గ్రామస్తులు, కార్మికుల చందాలతో మృతదేహం ఇంటికి..
- విరాళాలతోనే అంత్యక్రియలు
- సొంత ఇల్లు లేక రోడ్డుపైనే శవం..



రోదిస్తున్న కుటుంబీకులు. (ఇన్‌సెట్‌లో) లింగేశ్ మృతదేహం

బోయినపల్లి(చొప్పదండి):

సొంతిల్లులేదు.. స్వగ్రామంలో ఉపాధి లభించలేదు.. కుటుంబ పోషణ, ఇతర అవసరాల కోసం అప్పు చేశాడు.. అది తీర్చేందుకు పొట్టచేత పట్టుకుని సూరత్ వెళ్లాడు. అక్కడ అనారోగ్యానికి గురై మృత్యువాత పడ్డాడు. కనీసం శవాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చే స్తోమత లేకపోవడంతో దాతలు తలాకొంత విరాళాలు వేసుకున్నారు. సుమారు వెయ్యి కిలోమీటర్ల దూరం నుంచి వచ్చిన మృతదేహాన్ని ఉంచేందుకూ స్థలంలేక రోడ్డుపక్కనే వేసిన ఉదంతం రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండల కేంద్రంలో జరిగింది. బోయినపల్లికి చెందిన బొడ్డు లింగేశ్(49) సుతారీ(మేస్త్రీ) పనితోపాటు వ్యవసాయం చేసేవాడు. భార్య కాంతవ్వ, కరణ్, మధు కుమారులు, దివ్య, వైశాలి కూతుళ్లు. లింగేశ్ గతేడాది తనకున్న ఎకరంతోపాటు మరో రెండెకరాలు కౌలుకు తీసుకుని పత్తి వేశాడు. పెట్టుబడుల కోసం రూ. రెండు లక్షల వరకు అప్పు చేశారు. దిగుబడి రాక అప్పు మీదపడింది. దీంతో సూరత్ వెళ్లి.. సుతారీ పనిలో కుదిరాడు. అక్కడ ఆరోగ్య పరిస్థితి విషమించి ఈనెల 8న అక్కడి ఆస్పత్రిలో మృతి చెందాడు.

మృతదేహాన్ని తెప్పించడానికి చందాలు..

లింగేశ్ మృతదేహాన్ని స్వగ్రామం తెప్పించేందుకు కుటుంబసభ్యులు అష్టకష్టాలు పడ్డారు. కొందరు గ్రామస్తులు చందాలు ఇవ్వగా, మరికొందరు అప్పుగా ఇచ్చిన సుమారు రూ.20 వేలను అక్కడి కార్మికులకు పంపించారు. ఈ సొమ్ముతో మృతదేహాన్ని బుధవారం స్వగ్రామానికి తీసుకొచ్చారు.

చదువు మానేసి.. పనులకు..

అప్పుల బాధతో లింగేశ్ సూరత్ వెళ్లగా, ఆయన భార్య కాంతవ్వ మానసిక స్థితి కోల్పోయింది. కుటుంబ భారం పెద్ద కుమారుడు, కుమార్తెపై పడింది. దీంతో చదువు మానేసి వారు కూలీలుగా మారారు. కుమారుడు కరణ్, కూతురు దివ్య గంగాధరలో ఒకేషనల్ ఇంటర్ చదివేవారు. కరణ్ కూలి పనికి, దివ్య వ్యవసాయ పనులకు వెళ్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. లింగేశ్ మరణంతో ఆ కుటుంబం ఇప్పుడు రోడ్డున పడింది.

రోడ్డుపైనే శవం..

లింగేశ్‌కు సొంతిల్లు లేదు. సోదరుల ఇంట్లో ఓ చిన్న గదిలో కుటుంబసభ్యులు తలదాచుకుంటున్నారు. అక్కడ శవం వేస్తే నిలువ నీడ ఉండదు. పైగా ఆయన మృతి చెంది మూడు రోజులు గడిచింది. దీంతో బోయినపల్లి నుంచి కొదురుపాక వెళ్లే డబుల్ లేన్ రోడ్డు మధ్య పెట్రోల్ బంక్ పరిసరాల్లో మృతదేహాన్ని ఉంచారు. అనంతరం చందాలు పోగుచేసి అంత్యక్రియలు నిర్వహించారు.

పీఎస్‌ఎల్‌వీ సీ40కి నేడు కౌంట్‌డౌన్ ప్రారంభం

రేపు ఉదయం 9.28 గంటలకు నింగిలోకి దూసుకెళ్లనున్న రాకెట్

శ్రీహరికోట(సూళ్లూరుపేట): శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్) నుంచి శుక్రవారం ఉదయం 9.29 గంటలకు పీఎస్‌ఎల్‌వీ సీ40 నింగిలోకి దూసుకెళ్లనుంది. ఈ విషయాన్ని బుధవారం షార్‌లోని బ్రహ్మప్రకాష్ హాల్లో జరిగిన మిషన్ సంసిద్ధతా సమావేశం (ఎంఆర్‌ఆర్)లో అధికారికంగా ప్రకటించారు. రాకెట్‌కు అన్ని రకాల పరీక్షలు నిర్వహించిన అనంతరం సాయంత్రం ఎంఆర్‌ఆర్ కమిటీ వారు ప్రయోగ పనులను లాంచ్ ఆథరై జేషన్ బోర్డుకి అప్పగించారు. లాంచ్ ఆథరైజేషన్ బోర్డు చైర్మన్ పీ కున్హికృష్ణన్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి సమావేశం నిర్వహించి గురువారం తెల్లవారుజామున 5.29 గంటలకు కౌంట్‌డౌన్ ప్రారంభించేందుకు నిర్ణయం తీసుకున్నారు. పీఎస్ ఎల్‌వీ సీ40 ద్వారా 1,323 కిలోల బరువు కలిగిన 31 ఉపగ్రహాలను రోదసీలోకి పంపనున్నారు. 710 కిలోల బరువు కలిగిన కార్టోశాట్–2 సిరీస్‌లో ఐదో ఉపగ్రహంతో పాటు దేశీయంగా ఒక సూక్ష్మ ఉపగ్రహం, మరో బుల్లి ఉపగ్రహంతో పాటు ఆరు దేశాలకు చెందిన 28 ఉపగ్రహాలు ప్రయోగించనున్నారు. గతేడాది ఆగస్టు 31న ప్రయోగించిన పీఎస్‌ఎల్‌వీ సీ39 విఫలమైనందున ఈసారి అన్ని జాగ్రత్తలు తీసుకుని ప్రయోగానికి సిద్ధమవుతున్నారు.



షార్ మొదటి ప్రయోగవేదికపై సిద్ధంగా ఉన్న పీఎస్‌ఎల్‌వీ సీ40

'మేడారం' ముందట.. 'నాగోబా' సందడి

సాక్షి, ఆదిలాబాద్: ఆదివాసీల అతిపెద్ద పండుగ మేడారం మహా జాతర ఈనెల 31 నుంచి జరగనుండగా, అంతకుముందే ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్‌లో ఈ నెల 16 నుంచి నాగోబా జాతర ప్రారంభం కానుంది. ఆదివాసీల ఆరాధ్య దైవం నాగోబా జాతరను ప్రభుత్వం 2015లో రాష్ట్ర పండుగగా గుర్తించిన తర్వాత నాల్గోసారి ఈ జాతర జరగనుంది. జాతర సందర్భంగా ప్రతి ఏడాది మూడో రోజు అధికారులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో దర్బార్ నిర్వహిస్తారు. అయితే ఈసారి దర్బార్ నిర్వహణ తేదీలను ప్రభుత్వం ఇంకా ప్రకటించలేదు. ప్రధానంగా ఇటీవల ఆదివాసీలు, లంబాడాల వివాదం నేపథ్యంలో ప్రభుత్వం దీనిపై కొంత ఆచితూచి వ్యవహరిస్తుండటంతో దర్బార్ తేదీ ప్రకటనలో ఆలస్యమవుతున్నట్లు సమాచారం.

పట్టా కావడం లేదని
రైతు ఆత్మహత్య

చందుర్తి (వేములవాడ): ఏళ్ల తరబడి సాగు చేస్తున్న భూమి పట్టా కావడం లేదనే మనస్తాపంతో రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కేంద్రానికి చెందిన రైతు దయ్యాల లింగయ్య(60) బుధవారం ఆత్మహత్య చేసుకున్నాడు. లింగయ్య ఇదే గ్రామానికి చెందిన దయ్యాల సొల్లు నర్సయ్య వద్ద 40ఏళ్ల క్రితం రెండెకరాల భూమి కొనుగోలు చేశాడు. తర్వాత నర్సయ్య మృతి చెందాడు. మృతుడి కుమారుడు కొండయ్య ఆ భూమికి పట్టా చేయిస్తానని ముందుకు వచ్చినా.. అతడి బంధువులు వద్దని బెదిరిస్తున్నారు. దీంతో ఆ భూమిపట్టా నేటికీ కాలేదు. దీనికోసం లింగయ్య అధికారులు, విక్రయ కుటుంబం చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకుండా పోయింది. ఇక భూమి పట్టాకాదేమోననే మనస్తాపంతో బుధవారం ఇంటి ఎదుట రేకులషెడ్డులో ఉరి వేసుకున్నాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీస్ మంత్రిత్వశాఖ
భారత ప్రభుత్వం

ఆగ్రో ప్రాసెసింగ్ మౌలిక సదుపాయాలలో సువర్ణావకాశం

ప్రధాన మంత్రి కిసాన్ సంపద యోజన క్రింద

ప్రతిపాదనల ఆహ్వానం

దేశంలో ఆగ్రో ప్రాసెసింగ్ క్లస్టర్స్ కొరకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు పథకం క్రింద సమర్థవంతమైన ప్రమోటర్లు/పెట్టుబడిదారుల నుండి ప్రతిపాదనలు కోరబడుతున్నవి.

అభీష్టంగల పెట్టుబడిదారులు తమ ప్రతిపాదనలను 31-03-2018న లేదా ఆలోగా సా. 5.00 గం. వరకు ఆన్‌లైన్ పోర్టల్ (http://sampada-mofpi.gov.in/cluster/Login.aspx) ద్వారా దాఖలు చేయవలెను. స్వయంగా ప్రతిపాదన దాఖలు అంగీకరించబడదు.

పథకం యొక్క సవివరమైన నిర్వహణా మార్గదర్శకాలు, ఆసక్తి వ్యక్తీకరణ (EOI), అవసరమైన బయానా మొ॥వాటి కొరకు మంత్రిత్వ శాఖ వెబ్‌సైట్: www.mofpi.nic.in దర్శించవచ్చును.

ఏవేని స్పష్టీకరణల కొరకు సంప్రదించండి
టెలిఫోన్. నం: 011-26406547
ఇ-మెయిల్: atul.saxena69@gov.in

davp/16101/13/0042/1718



@MOFPI_GOI @MOFPIIndia MOFPI

Department of Atomic Energy
HEAVY WATER PLANT (MANUGURU)
Notice Inviting Tender

On behalf of the President of India by the General Manager, Heavy Water Plant, Manuguru invites online item rate tenders in Two Stage system, through e-tendering and local tender for following works.

Tender No. HWPM/Civil/CPP/NIT/ Name of work	Contract Period	Est. Cost Rs. in Lakha	Sale of tender documents	Last date for receipt/online submission of tender	Last date for submission of tender (Hard Copies)	Date & Time of opening of tender technical bid
Corrigendum-2017/ 53 Retrofitting works to hot & cold tunnels in CPP during MTA at HWPM.	30 Days	9.24	Upto 16-01-18 15-00 hrs.	Upto 15-01-18 15-00 hrs.	19-01-18 9-00 hrs. to 14-00 hrs.	19-01-18 at 14-30 hrs.
2017/60 - Structural repairs to the cooling towers in CPP at HWPM. (Phase -1)	04 Months	24.82	08-01-18 09-30 hrs to 20-01-18 23-00 hrs.	24-01-18 23-00 hrs.	27-01-18 upto 14-00 hrs.	27-01-18 at 14-30 hrs.
2017/61 - Extension of portico works to the Guest House & RPUM office at Heavy Water General Facilities, Hyderabad.	04 Months	15.22	16-01-18 09-30 hrs to 27-01-18 23-00 hrs.	30-01-18 23-00 hrs.	02-02-18 upto 14-00 hrs.	02-02-18 at 14-30 hrs.

The Tender documents for e-tender can be downloaded online from e-tender website www.tender-wizard.com/DAE. For more details, refer website www.hwb.gov.in

No. HWPM/GEN/1(15)/2018/2283 Dt. 10-1-2018



బినామీ ఆస్తి లావాదేవీల నిషేధ చట్టం, 1988

ముఖ్యాంశాలు :

- బినామీ ఆస్తి లావాదేవీల నిషేధ చట్టం, 1988 (బినామీ చట్టం) 01-11-2016 నుండి వర్తింపుతో అమలులోకి వచ్చింది.
- బినామీదారు (బినామీ ఆస్తి ఎవరి పేరున ఉన్నదో వారు) లబ్ధిదారుడు (వాస్తవంగా ప్రతిఫలం చెల్లించినవారు) మరియు బినామీ లావాదేవీలు ప్రోత్సహించిన మరియు ప్రేరేపించిన వ్యక్తులు ప్రాసిక్యూట్ చేయబడతారు మరియు 7 సంవత్సరాల వరకు కఠిన కారాగార శిక్ష ఎదుర్కోవడమే కాకుండా బినామీ ఆస్తి యొక్క సముచిత మార్కెట్ విలువలో 25% వరకు జరిమానా చెల్లించుటకు బాధ్యులవుతారు.
- బినామీ ఆస్తి లావాదేవీల నిషేధ చట్టం, 2016 క్రింద అధికారులకు తప్పుడు సమాచారం ఇచ్చిన వ్యక్తులు ప్రాసిక్యూట్ చేయబడతారు మరియు 5 సంవత్సరాల వరకు కారాగార శిక్షకు గురి అవడమే కాకుండ బినామీ ఆస్తి యొక్క సముచిత మార్కెట్ విలువలో 10% వరకు జరిమానా చెల్లించుటకు బాధ్యులవుతారు.
- బినామీ ఆస్తి జప్తుచేయబడవచ్చును మరియు ప్రభుత్వంచే స్వాధీనం చేసుకోబడవచ్చును.
- ఈ చర్యలు ఆదాయపన్ను చట్టం 1961 వంటి ఇతర చట్టాల క్రింద చర్యలకు అదనంగా ఉంటాయి.

బినామీ లావాదేవీలు జరుపకండి

- నల్లధనం మానవత్వానికి వ్యతిరేకమైన నేరం
- దానిని రూపుమాపడంలో ప్రభుత్వానికి సహాయపడవలసిందిగా మనస్సాక్షి గల ప్రతి పౌరుడిని మేము అర్థిస్తున్నాము.

davp15401/13/0098/1718

దర్శించండి: www.incometaxindia.gov.in www.cleanmoney.gov.in

@IncomeTaxIndia

డౌన్‌లోడ్ చేసుకోండి : "ఆయ్‌కర్ సేతు" ట్యాక్స్ పేయర్స్ సర్వీసెస్ మాడ్యూల్ & మొబైల్ అప్లికేషన్

ఆదాయ పన్ను శాఖ
ప్రత్యక్ష పన్నుల సెంట్రల్ బోర్డ్



రెండో రౌండ్‌లో యూకీ, రామ్‌కుమార్

ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ క్వాలిఫయింగ్ టోర్నమెంట్‌లో భారత క్రీడాకారులు యూకీ బాంబ్రీ, రామ్‌కుమార్ రామనాథన్ శుభారంభం చేశారు. మెల్‌బోర్న్‌లో బుధవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో యూకీ 1-6, 6-3, 6-4తో బ్రాడ్లీ షనెర్ (కెనడా)పై, రామ్‌కుమార్ 6-7 (8/10), 7-6 (7/3), 6-2తో బ్రాడ్లీ క్లాన్ (అమెరికా)పై గెలిచారు. భారత్‌కే చెందిన ప్రజ్నేశ్ గుణేశ్వరన్ 6-1, 1-6, 2-6తో తొబియాస్ కామ్కే (జర్మనీ) చేతిలో... సుమీత్ నాగల్ 6-7 (5/7), 6-3, 3-6తో గియానెస్సి (ఇటలీ) చేతిలో ఓడిపోయారు.

పురుషులు, మహిళల విభాగాల్లో వరల్డ్ నంబర్‌వన్ షట్లర్లు... తొమ్మిది మంది ఒలింపిక్ పతక విజేతలు... ఎనిమిది మంది ప్రపంచ చాంపియన్‌షిప్ పతక విజేతలు.. రూ. 6 కోట్ల ప్రైజ్‌మనీ... ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్ 2018కు సంబంధించిన కొన్ని విశేషాలు ఇవి. తొలి రెండు సీజన్లతో పోలిస్తే ఈసారి ఆదరణపరంగా కూడా లీగ్ మరో మెట్టు పైకెక్కింది. డిసెంబర్ 23న గువాహటిలో తొలి మ్యాచ్ జరిగినప్పటి నుంచి ఇప్పటి వరకు అన్ని నగరాల్లో ప్రేక్షకులు లీగ్‌కు బ్రహ్మరథం పట్టారు. అదనంగా వచ్చిన రెండు కొత్త జట్లను కూడా ఫ్యాన్స్ అక్కున చేర్చుకోగా... కొన్ని అద్భుత మ్యాచ్‌లు లీగ్ విలువను పెంచాయి. పైగా పలువురు అగ్రశ్రేణి ఆటగాళ్లు ఈసారి లీగ్‌లో భాగం కావడం పీబీఎల్ స్థాయిని చూపిస్తోంది.

రాకెట్ సూపర్‌హిట్...

మూడు సీజన్లుగా విజయవంతమైన ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్

కొత్త జట్లు, కొత్త ఆటగాళ్లతో కళకళ ● పెరిగిన ఆదరణ, అభిమానుల సంఖ్య

సాక్షి క్రీడా ప్రతినిధి

'పీబీఎల్ ప్రారంభంలో కుర్రాడు సాత్విక్ సాయిరాజ్‌ను అతి తక్కువ మొత్తానికి ఒక జట్టులోకి తీసుకుంటే చాలా మంది ఆశ్చర్యపోయారు. అతనికి అసలు సీనియర్ విభాగంలో ఆడే స్థాయి కూడా లేదన్నారు. అయితే గత రెండు సీజన్లలో సాత్విక్ ఆడిన కొన్ని మ్యాచ్‌లు, ఓడించిన ప్రత్యర్థులను చూస్తే అతను ఎంత అద్భుతంగా దూసుకుపోయాడో అర్థమవుతోంది. ఆ విజయాలు ఇచ్చిన ఆత్మవిశ్వాసం అతను అంతర్జాతీయ స్థాయిలో కూడా మంచి ఫలితాలు సాధించేందుకు దోహదం చేసింది. నా దృష్టిలో ఇదంతా కచ్చితంగా పీబీఎల్ ఘనతే. ఇలాంటి ప్రతిభ గల ఆటగాళ్లను అందించడమే ఈ లీగ్ సాధించిన విజయమని చెప్పగలను'... భారత బ్యాడ్మింటన్ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్ చేసిన వ్యాఖ్య ఇది. మూడు సీజన్ల తర్వాత అభిమానుల స్పందనలో గానీ ఆటపై ఇతర వర్గాల్లో ఆసక్తి పెంచడంలో గానీ పీబీఎల్ కూడా విజయవంతమైందనడంలో మాత్రం ఎలాంటి సందేహం లేదు. వేర్వేరు క్రీడాంశాల్లో వరుసగా దూసుకొచ్చిన లీగ్‌ల జాబితాలో పీబీఎల్ తన ప్రత్యేకతను నిలబెట్టుకోవడం విశేషం.


అక్సెల్‌సన్


తై జు యింగ్

సీన్ మారిపోయింది...

నాలుగేళ్ల క్రితం ఇండియన్ బ్యాడ్మింటన్ లీగ్ (ఐబీఎల్) పేరుతో తొలిసారి ఈ తరహా లీగ్ జరిగింది. అయితే వేర్వేరు కారణాలతో ఒక్క ఏడాదికే అది పరిమితమైంది. ఆ తర్వాత కొన్ని మార్పులతో మళ్లీ తీసుకొచ్చిన ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్ (పీబీఎల్)ను నిర్వాహకులు ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. దానికి తోడు అంతర్జాతీయ స్థాయిలో భారత స్టార్లు సైనా, సింధు, శ్రీకాంత్, సాయిప్రణీత్ సాధించిన వరుస విజయాలు తటస్థ అభిమానులను ఈ ఆట వైపు లాక్కొచ్చాయి. ఫలితంగా పీబీఎల్ కూడా ప్రధాన లీగ్‌గా ఎదిగింది. ముఖ్యంగా రియో ఒలింపిక్స్‌లో సింధు ప్రదర్శన తర్వాత లీగ్‌పై పెద్ద ఎత్తున ఆసక్తి కనిపించింది. గత ఏడాదిలాగే ఇప్పుడు కూడా ప్రధాన స్పాన్సర్‌గా వొడాఫోన్‌ను కొనసాగించగలగడంలో పీబీఎల్ విజయవంతమైంది. దీనికి తోడు మరో ప్రధాన స్పాన్సర్‌గా ఈసారి ఇండియన్ ఆయిల్ కూడా వచ్చి చేరింది. బజాజ్ ఎలక్ట్రానిక్స్, బిస్లెరివంటి సంస్థలు కూడా కొత్తగా జత చేరాయి. ఇక వివిధ టీమ్‌లకు ఉండే వ్యక్తిగత స్పాన్సర్లు వేరు. హైదరాబాద్ హంటర్స్ టీమ్‌తో బూస్ట్ సంస్థ ఒప్పందం కుదుర్చుకోవడం ఈ సీజన్‌లో మరో పరిణామం. సచిన్ టెండూల్కర్ లాంటి దిగ్గజం (బెంగళూరు బ్లాస్టర్స్ టీమ్) లీగ్‌లో భాగం కావడం కూడా స్పాన్సర్లను ఆకర్షించేందుకు కారణమైంది. ఇప్పటికిప్పుడే లాభాలు రాకపోయినా... లీగ్‌లో కొనసాగేందుకు ఒక్కో ఫ్రాంచైజీ ఏడాదికి దాదాపు రూ. 6.5 కోట్ల వరకు ఖర్చు చేస్తుండటం బ్యాడ్మింటన్‌పై వారి ఆసక్తికి నిదర్శనం.


మారిన్




సింధు

"మన దేశంలో క్రికెటర్లు తప్పిస్తే ఇతర క్రీడాకారులు డబ్బు సంపాదించడం చాలా కష్టం. కానీ పీబీఎల్ చాలా విషయాలు మార్చేసింది. షట్లర్లకు లీగ్ ద్వారా ఆర్థికపరంగా కూడా మంచి ప్రయోజనం కలిగింది. మన దేశంలో ఒక లీగ్ ఇంతగా విజయవంతమవుతుందని కొన్నేళ్ల క్రితం కనీసం నేను ఊహించలేదు. అది ఇప్పుడు జరగడం సంతోషకరం. ఒకప్పుడు మనం చైనా, కొరియా ఆటగాళ్లను ఓడించడం కష్టమనే భావన ఉండేది. కానీ పీబీఎల్ వచ్చాక అలాంటి ఆలోచనలు మారిపోయాయి. ఈ లీగ్‌లో మా షట్లర్ల ఆటను చూడండి. వారు మరింత ప్రొఫెషనల్‌గా కనిపిస్తున్నారు."

– పీబీఎల్‌పై సైనా నెహ్వాల్ వ్యాఖ్య

టాప్ ఆటగాళ్లూ సై...

తొలి పీబీఎల్ సమయంలో అగ్రశ్రేణి విదేశీ ఆటగాళ్లు ఇందులో పాల్గొనేందుకు పెద్దగా ఆసక్తి చూపించలేదు. ఆ తర్వాత రెండో సీజన్‌లో అప్పటి వరల్డ్ నంబర్‌వన్, ప్రపంచ చాంపియన్ కరోలినా మారిన్ (స్పెయిన్) వచ్చింది. పురుషుల సింగిల్స్‌లో ప్రపంచ నంబర్‌వన్ విక్టర్ అక్సెల్‌సన్ (డెన్మార్క్)కు కూడా ఇదో రెండో సీజన్. ప్రస్తుత మహిళల వరల్డ్ నంబర్‌వన్ తై జు యింగ్ (చైనీస్ తైపీ) ఇప్పుడు జరుగుతున్న పోటీలతో లీగ్‌లోకి అడుగు పెట్టింది. చైనా ఆటగాళ్లు కూడా లీగ్‌పై ఆసక్తి కనబరుస్తున్నారు. 2016 బీడబ్ల్యూఎఫ్ సూపర్ సిరీస్ ఫైనల్లో రన్నరప్‌గా నిలిచిన తియాన్ హువీకి ఈ సారి వేలంలో రెండో అత్యధిక మొత్తం రూ. 58 లక్షలు లభించాయి. అన్ని వైపుల నుంచి వచ్చిన డిమాండ్ మేరకు ఈసారి మరో రెండు కొత్త జట్లను చేర్చి టోర్నీని నిర్వహించారు. ఇక భారత యువ షట్లర్లు అనేక మందికి పీబీఎల్ కొత్త దారులు తెరిచింది. సూపర్ సిరీస్ టోర్నీ స్థాయికి చేరితే మాత్రమే తలపడే అవకాశం ఉన్న అనేక మంది టాప్ ప్లేయర్లతో ఆడే అవకాశం రావడం, జట్టులో సభ్యులుగా వారి నుంచి నేర్చుకునే చాన్స్ కూడా దక్కడం స్ఫూర్తి పెంచుతుందనడంలో సందేహం లేదు. 'ఇంత తొందరగా నా జీవితంలో వరల్డ్ నంబర్‌వన్ తై జు యింగ్‌ను కోర్టులో ఎదుర్కోగలనని అస్సలు ఊహించలేదు. మ్యాచ్ ఓడినా నేర్చుకున్న పాఠాలు కూడా గొప్పవి. పీబీఎల్ నాకిచ్చిన అవకాశం ఇది' అని మహిళల సింగిల్స్ ప్లేయర్ రసిక రాజే ఆనందంగా చెప్పింది. ఇక హైదరాబాద్ అమ్మాయి సిక్కి రెడ్డి, శుభాంకర్ డే లాంటి వారికైతే తమ సత్తాను చూపించేందుకు పీబీఎల్ రూపంలో సరైన వేదిక లభించింది. ప్రతి మ్యాచ్‌లో రాణించిన ఆటగాళ్లకు అవార్డుల రూపంలో ఆకర్షణీయమైన మొత్తంలో నగదు దక్కుతోంది. 'సూపర్ ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు పొందిన వారికి రూ. 50 వేలు... 'ఇండియన్ ప్లేయర్ ఆఫ్ ద డే'కు రూ. 25 వేలు... 'ఫాస్టెస్ట్ స్మాష్ ఆఫ్ ద డే' కొట్టిన వారికి రూ. 25 వేలు అందజేస్తున్నారు. స్టార్ ఆటగాళ్లతో కళకళలాడుతున్న పీబీఎల్ ఎదుగుతున్న తీరు చూస్తే మున్ముందు మరింత పురోగతిని ఆశించవచ్చు.



సాత్విక్



శ్రీకాంత్


సాయిప్రణీత్


ప్రణయ్

సెమీస్‌లో ఢిల్లీ డాషర్స్

చివరి లీగ్ మ్యాచ్‌లో నార్త్ ఈస్టర్న్‌పై గెలుపు


సుంగ్ జీ హున్

సాక్షి, హైదరాబాద్: ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్‌లో ఢిల్లీ డాషర్స్ జట్టు సెమీఫైనల్లోకి ప్రవేశించింది. బుధవారం గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరిగిన తమ చివరి లీగ్ పోరులో ఢిల్లీ 4–1 తేడాతో నార్త్ ఈస్టర్న్ వారియర్స్‌ను ఓడించింది. తాజా ఫలితంతో స్టార్ ప్లేయర్స్ సైనా నెహ్వాల్, శ్రీకాంత్, కశ్యప్‌లతో కూడిన అవధ్ వారియర్స్ జట్టు లీగ్ నుంచి నిష్క్రమించింది. ఈ టోర్నీలో ఇప్పటికే హైదరాబాద్ హంటర్స్, బెంగళూరు బ్లాస్టర్స్, అహ్మదాబాద్ రాకెట్స్ సెమీస్‌కు చేరుకున్నాయి. సెమీస్‌లో ఎవరితో ఎవరు తలపడతారనేది గురువారం హైదరాబాద్, బెంగళూరు మధ్య జరిగే మ్యాచ్‌తో తేలుతుంది.

హైదరాబాద్ వేదికగా జరిగిన తొలి పోరు దాదాపు ఏకపక్షంగా సాగింది. ముందుగా జరిగిన మిక్స్‌డ్ డబుల్స్ మ్యాచ్‌లో నార్త్ ఈస్టర్న్ జంట మిషెల్ లీ–షిన్ బాక్ చెల్ 15–13, 15–11తో అశ్విని పొన్నప్ప–వ్లదీమర్ ఇవనోవ్ (ఢిల్లీ)ను ఓడించింది. తొలి పురుషుల సింగిల్స్‌లో నార్త్ ఈస్టర్న్ ప్రధాన ఆటగాడు అజయ్ జయరామ్ 13–15, 15–10, 12–15తో ఢిల్లీ ప్లేయర్ వింగ్ కీ వాంగ్ విన్సెంట్ చేతిలో ఓడిపోయాడు. దాంతో స్కోరు 1–1తో సమంగా నిలిచింది. రెండో పురుషుల సింగిల్స్‌ను ట్రంప్ మ్యాచ్‌గా ఎంచుకున్న వారియర్స్ భంగపడింది. వారియర్స్ ఆటగాడు జు వీ వాంగ్ 10–15, 15–8, 11–15 తేడాతో తియాన్ హువీ చేతిలో ఓటమి పాలయ్యాడు. ఈ ఫలితంతో నార్త్ ఈస్టర్న్ పాయింట్ కోల్పోగా... డాషర్స్ 2–0తో ముందంజలో నిలిచింది. ఆ తర్వాత మహిళల సింగిల్స్ మ్యాచ్‌ను ఢిల్లీ ట్రంప్‌గా ఎంచుకుంది. ఇందులో సత్తా చాటిన సుంగ్ జీ హున్ 13–15, 15–11, 15–13తో మిచెల్లి లీని ఓడించి తమ జట్టు ఖాతాలో రెండు పాయింట్లు చేర్చింది. దాంతో డాషర్స్ ఆధిక్యం 4–0కు పెరిగి జట్టు సెమీస్ చేరడం ఖాయమైపోయింది. ప్రాధాన్యత లేని చివరి పురుషుల డబుల్స్ మ్యాచ్‌లో వారియర్స్ తరఫున కిమ్ జి జంగ్–షిన్ బేక్ చెల్... ఢిల్లీ తరఫున ఇవనోవ్–సొజొనొవ్ తలపడ్డారు. ఇందులో వారియర్స్ జోడీ 9–15, 15–10, 15–9తో ఢిల్లీ జంటపై గెలుపొంది విజయంతో పీబీఎల్ తొలి సీజన్‌ను ముగించింది.

మహిళల సీనియర్ క్రికెట్ జట్టులో జెమీమా



న్యూఢిల్లీ: దేశవాళీ మహిళల క్రికెట్‌లో దుమ్మురేపుతున్న యువ సంచలనం జెమీమా రోడ్రిగ్స్ భారత సీనియర్ మహిళల క్రికెట్ జట్టుకు తొలిసారి ఎంపికైంది. వచ్చే నెలలో దక్షిణాఫ్రికా సిరీస్‌లో పాల్గొననున్న మహిళల జట్టులో 17 ఏళ్ల ఈ ముంబై అమ్మాయి చోటు దక్కించుకుంది. దక్షిణాఫ్రికాతో జరగనున్న మూడు వన్డేల సిరీస్‌కు బీసీసీఐ 16 మంది సభ్యులతో కూడిన జట్టును బుధవారం ప్రకటించింది. 13 ఏళ్ల వయసులోనే అండర్–19 జట్టుకు ప్రాతినిధ్యం వహించిన జెమీమా రోడ్రిగ్స్ అక్కడ సత్తా చాటి వెలుగులోకి వచ్చింది. ఇప్పటికే పలు టోర్నీల్లో సెంచరీలు, డబుల్ సెంచరీలతో ఆకట్టుకుంటున్న జెమీమాను ఇటీవలే బంగ్లాదేశ్ 'ఎ'తో జరిగిన సిరీస్‌కు ఎంపిక చేశారు. ఆ సిరీస్‌లోనూ ఆమె రాణించడంతో సీనియర్ వన్డే జట్టులో స్థానం కల్పించారు. గతేడాది ప్రపంచకప్‌లో భారత్‌ను రన్నరప్‌గా నిలబెట్టిన హైదరాబాద్ క్రికెటర్ మిథాలీ రాజ్‌కే మళ్లీ సారథ్య బాధ్యతలు అప్పగించారు. భారత మహిళల జట్టు ఫిబ్రవరిలో దక్షిణాఫ్రికా వెళ్లనుంది. అక్కడ మూడు వన్డేలతో పాటు 5 టి20 మ్యాచ్‌లు ఆడనుంది. కాగా ప్రస్తుతం వన్డే జట్టును మాత్రమే ప్రకటించారు.

నిఖత్‌కు పతకం ఖాయం



రోహ్‌తక్: జాతీయ సీనియర్ మహిళల ఎలైట్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ బాక్సర్ నిఖత్ జరీన్ పతకాన్ని ఖాయం చేసుకుంది. 51 కేజీల విభాగంలో ఆమె సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన అభాతో జరిగిన క్వార్టర్ ఫైనల్ బౌట్‌లో నిఖత్ అలవోక విజయం సాధించింది. మాజీ ప్రపంచ చాంపియన్ సరితా దేవి (60 కేజీలు), ఆసియా చాంపియన్‌షిప్ రజత పతక విజేత సోనియా లాథెర్ (57 కేజీలు), పవిత్ర (60 కేజీలు), సర్జుబాలా దేవి (48 కేజీలు) కూడా సెమీఫైనల్లో అడుగుపెట్టారు. మరోవైపు భారత బాక్సింగ్ సమాఖ్య ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌లో మహిళా బాక్సర్ల ప్రతినిధిగా సరితా దేవి ఎన్నికైంది.

ఐర్లాండ్‌తో భారత్ రెండు టి20లు

న్యూఢిల్లీ: ఈ ఏడాది జూన్‌లో భారత క్రికెట్ జట్టు ఐర్లాండ్‌తో రెండు టి20 మ్యాచ్‌లు ఆడనుంది. ఇంగ్లండ్‌తో జూలై–సెప్టెంబరు మధ్య జరగనున్న పూర్తి స్థాయి సిరీస్‌కు ముందు టీమిండియా ఐర్లాండ్‌లో పర్యటించనుంది. ఈ మ్యాచ్‌లు జూన్ 27, 29 తేదీల్లో డబ్లిన్‌లో జరుగుతాయని బీసీసీఐ బుధవారం ప్రకటించింది. భారత్ చివరిసారి 2007లో బెల్‌ఫాస్ట్‌లో ఐర్లాండ్ జట్టుతో వన్డే ఆడింది. డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో 9 వికెట్లతో విజయం సాధించింది. తర్వాత 2009 టి20 ప్రపంచకప్ సందర్భంగా నాటింగ్‌హామ్‌లో ఇరు జట్లు తలపడ్డాయి.

భారత్ శుభారంభం

దుబాయ్: అంధుల వన్డే ప్రపంచకప్‌లో భారత్ శుభారంభం చేసింది. శ్రీలంకతో బుధవారం జరిగిన మ్యాచ్‌లో భారత్ ఆరు వికెట్ల తేడాతో గెలిచింది. 359 పరుగుల లక్ష్యాన్ని టీమిండియా 32 ఓవర్లలో అధిగమించింది. భారత ఓపెనర్ దీపక్ మాలిక్ (103 బంతుల్లో 179) అజేయ శతకంతో చెలరేగాడు. ప్రకాశ్ జయరామయ్య 76 పరుగులు చేశాడు. అంతకుముందు శ్రీలంక 40 ఓవర్లలో ఎనిమిది వికెట్లు కోల్పోయి 358 పరుగులు చేసింది. సురంగ సంపత్ (68), కేపీ సిల్వా (64) రాణించారు.

పఠాన్ కేసు పెండింగ్‌లో ఉంది: వాడా



ముంబై: ప్రపంచ డోపింగ్ నిరోధక సంస్థ (వాడా) ప్రొటోకాల్ ప్రకారం ఆల్‌రౌండర్ యూసుఫ్ పఠాన్ కేసు పెండింగ్‌లో ఉందని 'వాడా' మేనేజర్ మాగి డ్యురండ్ వెల్లడించారు. అనుకోకుండా నిషిద్ధ ఉత్ప్రేరకం తీసుకున్నట్లు తేలడంతో పఠాన్‌పై భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఐదు నెలల నిషేధం విధించిన సంగతి తెలిసిందే. గత ఆగస్టు 15 నుంచే అమలైన ఈ సస్పెన్షన్ ఈ నెల 14తో ముగియనుంది. వాడా సంస్థ మీడియా రిలేషన్స్, కమ్యూనికేషన్స్ మేనేజర్ మాగి డ్యురండ్ మాట్లాడుతూ 'ఇది పెండింగ్ కేసు. ఇప్పుడు దీనిపై వ్యాఖ్యానించబోం' అని అన్నారు. అయితే వాడా డోపింగ్ కోడ్–2015 ప్రకారం తొలిసారి డోపీలకు కేసు తీవ్రతను బట్టి గరిష్టంగా నాలుగేళ్ల నిషేధం విధించే అవకాశం ఉంది.

సిడ్నీ ఓపెన్ సెమీస్‌లో బోపన్న జంట

సిడ్నీ: భారత టెన్నిస్ డబుల్స్ నంబర్‌వన్ రోహన్ బోపన్న తన భాగస్వామి ఎడ్వర్డ్ రోజర్ వాసెలిన్ (ఫ్రాన్స్)తో కలిసి సిడ్నీ ఓపెన్ టోర్నీలో సెమీఫైనల్‌కు చేరుకున్నాడు. సిడ్నీలో బుధవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో బోపన్న–వాసెలిన్ ద్వయం 7–6 (7/5), 7–6 (7/5)తో నాలుగో సీడ్ ఫ్యాబ్రిస్ మార్టిన్ (ఫ్రాన్స్)–నికోలస్ మొన్రో (అమెరికా) జంటను కంగుతినిపించింది.



‘తొక్క’లోది తినేస్తే పోలే..

అరటి పండు తొక్క తీసి తినాలి.. చిన్నప్పటి నుంచి మనం ఇలాగే తింటున్నాం.. జపానోళ్లు మాత్రం తొక్కతో సహా తినేస్తే పోలే.. అని ఆ మధ్య అనుకున్నారు. అలా అనుకున్నారో లేదో.. ఈ మాంగీ బనానాను సృష్టించేశారు. జపాన్‌లోని ఒకయామాకు చెందిన డీఅండ్‌టీ సంస్థ తొక్కతో సహా తినేసే అరటిపళ్లను అభివృద్ధి చేసింది. ఈ అరటిపళ్ల తొక్కలో విటమిన్ బి6, మెగ్నీషియం సమృద్ధిగా ఉంటాయని సదరు సంస్థ చెబుతోంది. పూర్తిగా పండిన తర్వాతే.. అంటే.. తొక్కపై మచ్చలు వచ్చాకే.. వీటిని తీస్తారు. ప్రస్తుతానికి వారానికి 10 మాత్రమే వస్తున్నాయి. ఒక్కోదాని ధర రూ. 363.. వీటి రుచి.. పైనాపిల్ పండులాగ ఉంటోందని చెబుతున్నారు.

‘స్వచ్ఛ’ ఫేస్‌బుక్ సంకల్పం!

ఈ ఏడాది ప్రతినబూనిన జుకర్‌బర్గ్ • సమస్యల పరిష్కారాల కోసం వెతుకుతానని ప్రతిజ్ఞ

ఫేస్‌బుక్.. చిన్న పిల్లాడి నుంచి పెద్ద వయసున్న వారికి సుపరిచితమే.. పొద్దున లేచినప్పటి నుంచి రాత్రి వరకు ‘ఫ్రెండ్స్’తో చాటింగ్ చేస్తూ గడిపేస్తారు. ఫొటోలు, వీడియోలు చూసుకుంటూ కాలక్షేపం చేస్తుంటారు. కొంత కాలంగా ఫేస్‌బుక్ దుర్వినియోగం పెరిగిపోయిందనడంలో అతిశయోక్తి లేదు. ఈ విషయాన్ని ఫేస్‌బుక్ వ్యవస్థాపకుడు మార్క్ జుకర్‌బర్గ్ ఇప్పటివరకు ఖండిస్తూ వచ్చాడు. ఆయనకు కూడా అసలు విషయం బోధపడినట్లుంది. మనుషులను దగ్గర చేసే లక్ష్యంతో తాను సృష్టించిన ఫేస్‌బుక్ కాస్తా ఫేక్‌బుక్ అయిపోతుందేమోనని వాపోతున్నాడు. ఇక ప్రక్షాళన మొదలు పెడతానని ప్రకటించేశాడు. ఏడాదిలోగా స్వచ్ఛ ‘ఫేస్‌బుక్’ను అందించడం తన కృతనిశ్చయమని ప్రతిన బూనాడు!

అయ్యే పనేనా..?

కొందరి స్వార్థపూరిత ఆలోచనలు అనండి.. టెక్నాలజీని దుర్వినియోగం అనండి.. ఫేస్‌బుక్ కేంద్రంగా అరాచకాలు పెరిగిపోతున్నాయన్న మాట వాస్తవం. ఈ విషయాన్ని సామాజిక శాస్త్రవేత్తలు కూడా ధ్రువీకరిస్తున్నారు. తప్పుడు సమాచారం.. ఫేక్ అకౌంట్ల ద్వారా ఇతరులపై మాటల దాడులు కూడా పెచ్చు మీరుతున్నాయి. ఈ విషయాన్ని ఫేస్‌బుక్ మాజీ ఉద్యోగులు కొందరు బహిరంగంగానే అంగీకరిస్తున్నారు. అయితే జుకర్‌బర్గ్ మాత్రం నిన్న మొన్నటివరకు వీటిని కొట్టిపారేసేవాడు. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ అనుకూల వాతావరణం ఏర్పడేందుకు రష్యన్ ఏజెంట్ల ఫేక్ అకౌంట్లు కారణమన్న వాదనను జుకర్‌బర్గ్ మొదట తిరస్కరించినా తర్వాత పరోక్షంగా అంగీకరించాడు.

కొత్త ఏడాది సవాలు..



‘ఏటా ఓ కొత్త సవాలు స్వీకరించడం నాకు అలవాటు. ఏదైనా కొత్త విషయం నేర్చుకోవాలని అనుకుంటాను. ప్రపంచంలో ఆత్రుత పెరిగిపోయింది. ముక్కలుగా విడిపోయింది. ఈ విషయాల్లో ఫేస్‌బుక్ చేయాల్సిన పనులు చాలానే ఉన్నాయి. తిట్లు, ద్వేషపూరితవ్యాఖ్యల నుంచి సమాజాన్ని రక్షించడమైనా.. ఇతర దేశాలు మన వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడాన్ని అడ్డుకోవాలన్నా.. ఫేస్‌బుక్‌పై ఖర్చుపెట్టే టైమ్ వృథా కాకుండా చూడాలన్నా ఎంతో చేయాలి. ఈ చిక్కు సమస్యలకు పరిష్కారాలు కనుక్కోవడం ఈ ఏడాది సవాలుగా స్వీకరిస్తున్నా. ఈ అంశాలపై ఎక్కువ దృష్టి పెట్టడం ద్వారా నేను ఎన్నో నేర్చుకోవచ్చు. ఆయా రంగాల్లో నిపుణులను ఒక దగ్గరకు చేర్చి చర్చించి పరిష్కారాలు కనుక్కునే ప్రయత్నం చేస్తా’.

(కొత్త ఏడాది సందర్భంగా జుకర్‌బర్గ్ ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేసిన సందేశ సారాంశం)

కాస్త కష్టమే..!

ప్రపంచ దేశాలకు విస్తరించిన ఫేస్‌బుక్ వినియోగదారుల సంఖ్య వందల కోట్లలో ఉంటుంది. మెషీన్ లెర్నింగ్ టెక్నాలజీలు ఉపయోగిస్తున్నప్పటికీ ఫేక్‌అకౌంట్లను గుర్తించడం కష్టమే. గతేడాది కొన్ని డూప్లికేట్ అకౌంట్లను తొలగించినా.. ఈ పని అన్నిసార్లు, అన్ని సందర్భాల్లో సాధ్యమయ్యే పని కాదనేది నిపుణుల అభిప్రాయం. వేర్వేరు దేశాల్లోని పరస్పర వ్యతిరేక చట్టాలను అమలు చేయడం ఇంకో సవాలు. కొన్ని దేశాలపై అమెరికా విధించిన నిషేధాన్ని అమలు చేయడంలో ఫేస్‌బుక్ ఇప్పుడు సందిగ్ధ పరిస్థితులు ఎదుర్కొంటోంది. ఫేస్‌బుక్‌ను అన్ని రకాల పెదధోరణుల నుంచి రక్షించాలన్న జుకర్‌బర్గ్ సంకల్పం గొప్పదే అయినా ఆచరణ మాత్రం కష్టమేనని భావిస్తున్నారు.

– సాక్షి నాలెడ్జ్ సెంటర్



ఓ బంగరు రంగుల...

నిజామాబాద్ జిల్లా నవీపేటలో అరుదైన కీటకం కనిపించింది. సుభాష్‌నగర్ కాలనీకి చెందిన పుష్పలత ఇంట్లో బుధవారం తులసి మొక్కకు పూజ చేస్తుండగా, ఆకులపై ఈ కీటకం కనిపించింది. అందంగా బంగారు వర్ణంలో ఉండటంతో ఆమె భద్రంగా తీసి డబ్బాలో ఉంచింది. మండల విద్యా వనరుల కేంద్రంలో ఆపరేటర్‌గా పని చేసే పుష్పలత ఇంటర్‌నెట్‌లో ఇలాంటి కీటకం పేరు అమెరికన్ గోల్డ్ టార్‌టాయిస్‌గా ఉన్నట్లు చెప్పారు.

– నవీపేట (బోధన్)

బీజేపీ ఓటమికి మహాసంకీర్ణం

సీపీఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి వెల్లడి



అంతా ఏకతాటిపైకి రావాలని పిలుపు

సాక్షి, అమరావతి: బీజేపీ సర్కారు ఓటమి కోసం మహాసంకీర్ణాన్ని ఏర్పాటు చేస్తామని సీపీఐ ప్రకటించింది. మోదీ ప్రభుత్వాన్ని చెత్తబుట్టలోకి నెట్టేయాల్సిన సమయం వచ్చిందని మండిపడింది. లాల్– నీల్ (కమ్యూనిస్టులు– దళితులు) కలసి ప్రజాస్వామ్య వ్యతిరేక శక్తులను పారదోలాలని పిలుపినిచ్చింది. బీజేపీ పాలనను తుదముట్టించేందుకు కాంగ్రెస్ సహా అన్ని వర్గాల ప్రజలు, ప్రాంతీయ పార్టీలతో మహాసంకీర్ణాన్ని ఏర్పాటు చేయాలని సీపీఐ జాతీయ సమితి సమావేశాల్లో నిర్ణయించినట్టు పార్టీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి ప్రకటించారు. విజయవాడలో జరుగుతున్న సీపీఐ జాతీయ సమితి సమావేశాల ముగింపు సందర్భంగా బుధవారం జింఖానా గ్రౌండ్స్‌లో బహిరంగ సభ నిర్వహించారు. పార్టీ ఏపీ కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ అధ్యక్షతన జరిగిన సభలో సురవరం సుధాకర్‌రెడ్డి ప్రసంగిస్తూ ఎన్డీఏ ప్రభుత్వ విధానాలను తూర్పారబట్టారు. బీజేపీ ప్రభుత్వాన్ని తొలగించేందుకు వామపక్ష, ప్రజాతంత్ర, లౌకిక శక్తులు, మేధావులు, విద్యార్థులు అంతా ఏకతాటిపైకి రావాలన్నారు. మోదీ అధికారాన్ని చేపట్టాక ముస్లిం మైనారిటీలు, దళితులు, మేధావులు, జర్నలిస్టులపై దాడులు జరుగుతున్నాయని సురవరం అన్నారు. బీజేపీ పాలన అబద్ధాలు, తప్పుడు ప్రచారంతో సాగుతోందన్నారు.

అభివృద్ధి ఎక్కడ బాబూ: కె.రామకృష్ణ

చంద్రబాబు చెబుతున్న అభివృద్ధి ఎక్కడో చూపించాలని పార్టీ ఏపీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ సవాల్ చేశారు. రాష్ట్రంలో అవినీతి, లంచగొండితనం పెరిగిందే కానీ అభివృద్ధి చుక్కానీకి కూడా కనిపించడం లేదన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు కె.నారాయణ, అతుల్ కుమార్ అంజన్ తదితరులు పాల్గొన్నారు.

మోదీ ఆసక్తి చూపట్లేదు: డి. రాజా

పోలవరం ప్రాజెక్టు సహా రాష్ట్రాభివృద్ధికి నిధులు ఇవ్వని బీజేపీతో చంద్రబాబుకు దోస్తీ ఎందుకని సీపీఐ కేంద్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డి.రాజా ప్రశ్నించారు. చంద్రబాబును కలిసేందుకు కూడా మోదీ ఆసక్తి చూపడం లేదని ఎద్దేవా చేశారు. భావసారూప్యం కలిగిన ప్రాంతీయ పార్టీలతో కలసి పనిచేస్తామన్నారు.





Published and Printed by K.Ramachandra Murthy, Editorial Director, on behalf of Jagati Publications Limited, Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Survey No. 127, Plot No. 12, Mallapur Village, Nacharam, Medchal District. Editor: V. Murali, Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.